నేటికీ శ్రీపాద

సుబ్రహ్మణ్యశాస్త్రి సాహితీ కృషిపై సమాలోచన

సంపాదకులు

నాగసూరి వేణుగోపాల్

విశాఖ ఆకాశవాణి ప్రసారమాలిక

స్థాపన : 1972

ఆంధ్రకేసరి సెంటినరీ జూనియర్ కాలేజి

జవహర్‌లాల్ నెహ్రూ రోడ్, రాజమహేంద్రి - 533 103

ఫోన్ : 0883 - 2467418

(ఆంధ్రకేసరి యువజన సమితి యాజమాన్యం)

వ్యవస్థాపకులు

శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు

ఆనరరీ చైర్మన్
శ్రీ దాట్ల బుచ్చివేంకటపతిరాజు

చైర్మన్
శ్రీ రౌతు సూర్యప్రకాశరావు M.L.A.,

ట్రెజరర్
శ్రీ జమ్మి రామారావు

వైస్ - చైర్మన్
డా॥ కర్రి రామారెడ్డి



సెక్రటరీ & కరస్పాండెంట్
శ్రీ నందిపల్లి జోగేశ్వరరావు

జాయింట్ సెక్రటరీ
శ్రీ పి. యస్. వెంకటరావు

ఎక్స్ అఫీషియో మెంబర్స్
సమితి ఫౌండర్, సమితి ప్రెసిడెంట్, సమితి జనరల్ సెక్రటరీ
ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ - శ్రీ ఎస్. కె. మోహిద్దీన్

నేటికీ శ్రీపాద

సుబ్రహ్మణ్యశాస్త్రి సాహిత్య కృషిపై సమాలోచన

విశాఖ ఆకాశవాణి ప్రసార మాలిక

సంపాదకులు

నాగసూరి వేణుగోపాల్

ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి, విశాఖపట్నం

ప్రచురణ

ఆంధ్రకేసరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్

రాజమహేంద్రి

Neetiki SRIPADA

Analytical articles on life and work of Sripada Subrahmanya Sastry, Great Writer in Telugu

By :

Dr. Koduri Sreerama Murthy, Dr. Chaganti Sarath Babu, Dr. T. Pathanjali Sastry, Sri Rasa Raju, Sri Indraganti Srikantha Sarma, Dr. Nandula Suseela Devi, Dr. Vadrevu Veera Lakshmi Devi, Sri Punnamaraju Nageswara Rao, Sri Ichapurapu Ramachandram, Sri Y.S. Narasimha Rao, Sri Sannidhanam Narasimha Sarma, Dr. Poranki Dakshinamurthy, Sri Pothukuchi Suryanarayana Murthy, Dr. Kalipatnam Rama Rao, Dr. Chamarthi Kanakayya & Sri Nagasuri Venugopal.

Editor : Nagasuri Venu Gopal, M.Sc., M.Phil., M.A.,
Programme Executive , AIR, Visakhapatnam

2007 APRIL

Copyright : AIR

Broadcast : All India Radio, Visakhapatnam
during January - May, 2006

Sponsered by : Andhra Kesari Yuvajana Samithi
Rajamahendri

Price : Rs. 60-00 (Copies at Publishers)

Publishers : for copies

Andhra Kesari Eductional Trust
Sri Venu Gopala Swami Temple Street,
Rajamahendri - 533 001
Phone : (0883) 2471341, Cell : 9985719916

Printed by :

Kishore Offset Printers
M.G.Road, VIZIANAGARAM-535 001
Phone : 08922 - 225826, Cell : 94401 43145

ప్రచురణకర్త మాట

నేటికీ శ్రీపాద

ఎంతచక్కటి శీర్షిక? ఈ పేరును సూచించిన సహృదయులు శ్రీ నాగసూరి వేణుగోపాల్ కు శుభాభినందనములు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'రూపం' నాకెప్పుడూ కళ్ళకు కట్టినట్టుంటుంది. మహాకవి శ్రీమధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారింట్లో, 'హాస్యబ్రహ్మ' శ్రీభమిడిపాటి కామేశ్వరరావు, 'కథకచక్రవర్తి' శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారలు తఱచు కలుసుకుంటూండేవారు. మొదటి యిద్దరూ నాకు గురువులే. రాజమహేంద్రిలోని ఏనుగ్గువ్మాల వీధిలో అప్పట్లో (1955 ప్రాంతం) మధునాపంతులవా రుండేవారు. అక్కడే తొలిసారి శ్రీపాదవారి దర్శనం చేసుకున్నాను. తర్వాత కాలంలో చాలా సార్లు వారితో మాట్లాడడం జరిగేది.

వారి సాహితీ కృషి అపారం. అది సరే. ఆయనొక గొప్ప 'ఆర్గనైజరు ' ప్రతీ మూడు నెలలకు విధిగా సాహిత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేవారు. వక్తను తానే ఎన్నుకునేవారు. పొరుగూరి వారైతే ముందు రోజు సాయంత్రానికే 'అతిథి' తన యింటికి చేరాలి. మర్నాటి ఉదయాన్నే అభ్యంగస్నానం చేయించి, నూతన వస్త్రాలను ధరింపజేసేవారు - అల్లుణ్ణి చూసినట్లే - షడ్రసోపేతమైన భోజనం. సాయంత్రం మేళతాళాలతో సభావేదిక వద్దకు తోడ్కొని వెళ్ళడం, వేదోక్తంగా ఆశీర్వచనాలు. అనంతరం సభను చక్కగా నిర్వహించేవారు. ఆ విధమైన సభలను అంతకు ముందు ఎవ్వరూ నిర్వహించలేదని చరిత్ర చెబుతోంది. ఆ తర్వాతా జరుగలేదు. ఇందుకు ఎంతో సంస్కారం, సంయమనం, సన్నిహితుల సహకారం - ఇవి ఆయనకు లభించాయి. నిర్మొహమాటంగామాట్లాడ్డం ఆయన నైజం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరిదాకా అమలు చేసుకోగల్గిన ధన్యజీవి.

ఆంధ్రకేసరి ఎడ్యుకేషనల్ ట్రస్టుకు యీ గ్రంథరాజాన్ని ప్రచురించే అవకాశం రావడం ట్రస్టు ఛైర్మన్‌గా నాకు, కార్యదర్శి శ్రీ వి.వి. రమణారావుకు, సభ్యులకు సంతోషాన్నిచ్చింది.

రాజమహేంద్రి, -వై.ఎస్. నరసింహారావు
8-3-2007

మరింత పరిశోధనకు దారి తీయాలి

ఆయుర్వేద గ్రంథాలతో పాటు చారిత్రక గ్రంథాలూ, పిల్లల రచనలతో పాటు దేశీయ అపరాధ పరిశోధక నవలా, పురాణాల అనువాదాలతో పాటు సామాజిక విశ్లేషణగల నవలలు- రాసిన రచయిత ఆయన.

పద్యాన్ని ద్వేషించకుండా, వచనాన్ని ప్రేమించి, గౌరవించినవాడు ఆయన.

వేదం, జ్యోతిష్యం నేర్చుకుని అనంతృప్తికి లోనై - సంస్కృత కావ్యాలు చదివి, పద్యాలు రాసి- చివరకు వచనంలో ఆనంద ముందని స్పష్టం చేసినవాడు ఆయన.

ప్రత్యక్షంగా ' ప్రబుద్ధాంధ్ర' పత్రికనూ, పరోక్షంగా మరికొన్ని పత్రికలనూ నిర్వహించిన సంపాదకు డాయన.

నలుగురు స్త్రీమూర్తులు మాట్లాడిన మాటలే తనకు బీజాక్షరాలు అని చెప్పగలిగిన వినయశీలి ఆయన.

విజ్ఞాన చంద్రికా గ్రంథమాల వారి చారిత్రక గంథ్రాలు అధ్యయనం చేసి 'వీరపూజ' వంటి విశిష్ట రచన చేసిన అధ్యయనశీలి ఆయన.

మేధోపరిశ్రమతో పాటు శారీరక శ్రమ కూడా చేసి గజం ఎత్తు పుస్తకాలు ప్రచురించిన రచయిత ఆయన.

పాతికేళ్ళ వయసులో అప్పటి కప్పుడు కేవలం గంట వ్యవధిలో తన తొలి కథను రాయడమేకాదు, యాభయ్యవ ఏట వయొలిన్ నేర్చుకున్న వ్యక్తి ఆయన.

వ్యక్తీకరణ - మౌఖికప్రధానమేకాదు, విజువల్ కమ్యూనికేషన్‌ను సైతం తేలికగా సాధించిన సృజన శీలి ఆయన.

ప్రతీరంగంలో తెలుగువాడు అగ్రేసరుడై వుండాలని కోరుకున్న 'తెలుగువాడు' ఆయన.

ఇంత విస్తృతి గల సాహితీవేత్తను ఎంత లోతుగా పరిశీలించాం ? అసలయిన తెలుగు కథ రాసిన వాడి గానూ, సిసలైన తెలుగు వాక్యాన్ని తయారు చేసిన వాక్యశిల్పి గానూ, 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' గొప్పగా రాసిన స్వీయ చరిత్ర కారుడిగాను - శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి బహుళ ప్రచారం పొందాడు. కొందరిలోని కొన్ని పార్శ్వాలు ఎక్కువ ప్రచారానికి నోచుకుని, మిగతా అంశాలు పూర్తిగా మరుగున పడటం తెలుగు సాహిత్యంలో కొత్తకాదు. ఈ వెలితిని యిప్పుడయినా గమనించాలి.

అటువంటి ప్రయత్నం సమగ్రంగా చేశామని, మేము యిక్కడ చేశామని చెప్పలేము కానీ, ప్రయత్నించామని మాత్రం చెప్పగలం. అయితే ఈ ప్రయోగం మరిన్ని ప్రయత్నాలకు స్వాగతం పలుకగలదని మేము నమ్ముతున్నాం.

* * *

నేటికీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి - అనే ప్రాజెక్టు ఆలోచన రాగానే అంగీకరించి, ప్రోత్సహించిన వారు అప్పటి ఆకాశవాణి విశాఖ నిర్దేశకులు కీ॥శే॥ కే.వి.హనుమంతరావు.

అదే సమయంలో కార్యక్రమాన్ని ప్రయోజితం చేయడమే కాక, ప్రసంగ ప్రతులను పుస్తకంగా వెలువరిస్తామని అంగీకరించిన వారు ఆంధ్రకేసరి యువజన సమితి (రాజమహేంద్రి) శ్రీ వై.యస్. నరసింహారావు.

తర్వాత, పరిశోధనలో సహకరించినవారు డా. పోరంకి దక్షిణామూర్తి, డా. చామర్తి కనకయ్య, డా. కాళీపట్నం రామారావు గార్లు. విలువయిన సలహాలు యిచ్చిన వారు శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

పరిశోధన స్థాయిలో - చక్కటి ప్రసంగాలు అందజేసిన వారు డా॥ కోడూరి శ్రీరామమూర్తి, డా॥ చాగంటి శరత్‌బాబు, డా॥ టి. పతంజలి శాస్త్రి, శ్రీ రసరాజు, శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, డా॥ నందుల సుశీలాదేవి, డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, శ్రీ పున్నమరాజు నాగేశ్వర రావు, శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం, శ్రీ వై.ఎస్. నరసింహారావు, శ్రీ సన్నిధానం నరసింహశర్మ, డా॥ పోరంకి దక్షిణామూర్తి, శ్రీ పోతుకూచి సూర్యనారాయణమూర్తి, డా॥ కాళీపట్నం రామారావు.

ఇక పుస్తకం రావడంలో మొత్తం బాధ్యతను స్వీకరించి, ఆనందంగా నిర్వహించిన పున్నమరాజు గారికీ, సుబ్రహ్మణ్యశాస్త్రి గారి అపురూపమైన ఛాయా చిత్రాన్ని అందజేసిన కనకయ్యగారి కుమార్తె డా. చామర్తి అన్నపూర్ణ గారికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చేప్పుకోవాలి.

పుస్తకం వెలుగుచూస్తున్న సమయంలో, ఎంతగానో ప్రోత్సహించిన విశాఖ ఆకాశవాణి కేంద్రం నిర్దేశకులు శ్రీమతి ప్రయాగ వేదవతి గారికీ, 'అభినందన'తో మమ్మలను ప్రోత్సహించిన తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి డా. ఆవుల మంజులత గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

* * *

వర్తమాన సమాజానికి అవసరమైన రీతిలో ఎంపిక చేసిన 'ప్రబుద్ధాంధ్ర' వ్యాసాల సంకలనం రావాలి. అలాగే కాళీపట్నం వారు అభిలషించినట్టు సమయం మించిపోక ముందే తెలుగు జాతి జాగ్రత్తపడి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి యిచ్చిన భాషా, సాహితీ సంపత్తిని పరిశోధించి పరిరక్షించుకోవాలి. మరింత సమగ్రమైన, పరిశోధన జరగాలి. ఇది మా ఆకాంక్ష.

తాజాకలం : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. ఆవుల మంజులతగారు డా. కాళీపట్నం రామారావు గారి సూచనను గమనించి, తెలుగు విశ్వవిద్యాలయం తరఫున ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించడం చాలా ఆనందం కల్గిస్తోంది.

- నాగసూరి వేణుగోపాల్

Grams : " TELVERS "

Phone : Off : 040 - 23234815
Tele Fax : 040 - 23236911
E-mail : info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

DR. A. MANJULATA
VICE-CHANCELLOR

Lalitha Kala Kshetram
Public Gardens
Hyderabad - 500 004. (A.P)

అభినందన

సామాన్య రచయితలను ప్రక్కన పెట్టి - రచయితలను మంచి రచయితలు, గొప్ప రచయితలుగా విభజన చేసినట్లయితే శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు తెలుగు సాహిత్యంలో గొప్ప రచయితగా నిలుస్తారు. వీరి సాహిత్యాన్ని ఆనందం కోసమే గాక సమాజ ప్రయోజనం కోసం కూడా చదవాలి.

శ్రీపాదవారు ఆంగ్ల సాహిత్యాన్ని చదవకుండానే ఆ ప్రభావం ఏమీ లేకుండానే తెలుగులో గొప్ప సాహిత్యాన్ని సృష్టించారు. తెలుగు సాహిత్యంలో ఆధునికత అంతా పాశ్చాత్య ప్రభావం వల్ల వచ్చినందనే మాటని శ్రీపాదవారి సాహిత్యం కాదని నిరూపిస్తోంది.

శ్రీపాదవారి సాహిత్యంలో చాలా వాటిలో వస్తువు. ఇతివృత్తం, పాత్రచిత్రణ ఈనాటికి అత్యాధునికంగా ఉండి నేటి సమాజాన్ని కూడా అబ్బుర పరిచేవిగా ఉంటాయి. అందుకే శ్రీపాద సాహిత్యం ఇప్పటికి సమాజ ఔచిత్యం కలిగినవిగా ఉంటాయి. ఆయన భాషాశైలి, శిల్ప వైచిత్రి, రచనా నైపుణ్యం ఎంతటివంటే - ఎన్నిసార్లు చదివినా సాహిత్యప్రియులను ఇష్టంగా మళ్ళీ చదివిస్తున్నాయి. అందుకే శ్రీపాద రచనలు ప్రయోజనం కోసమే గాక ఆనందం కోసం కూడా చదవాలి. ఈ లక్షణాలే ఆయన సాహిత్యాన్ని నేటికి ఎప్పటికి తెలుగు సాహిత్యంలో నిలిపి ఉంచుతాయి.

ప్రపంచీకరణ ప్రభావం అన్ని రంగాలలో దూసుకువస్తున్న ఈ పరిస్థితులలో తెలుగు భాషా సాహిత్య మాధుర్యాలను. గొప్పతనాన్ని నిలుపుకోవలసిన అవశ్యకత

తెలియజేస్తూ నాగసూరి వేణుగోపాల్‌గారు శ్రీపాదవారి రచనల మీద విశాఖ ఆకాశవాణిలో ప్రసారం చేయించిన వ్యాసమాలికను ఈ విధంగా 'నేటికీ శ్రీపాద' అంటూ గుర్తు చేయడం అభినందనీయం. ముందుతరాల వాళ్ళకి శ్రీపాద రచనల సారాంశం కానుకగా ఈ విధంగా అందిస్తున్నారు. వాటిని చదవవలసిన అవశ్యకాన్ని ఈ విధంగా చెప్తున్నారు.

ఈ వ్యాసాలలో కారా మాష్టారు ఒక విలువైన సూచన చేసారు. శ్రీపాదవారు వారి కుటుంబ ప్రభావం వల్ల సంస్కృతంలో గొప్ప పండితులు. సాహిత్యమంటే సంస్కృత రచనలే, తెలుగు సాహిత్యం చదవకూడదు, తెలుగు రచనలలో గొప్పదనం లేదనే సంప్రదాయంలో పెరిగిన శ్రీపాదవారు తెలుగు చదవడం, అందునా ఆయన అవధాని అయివుండి, ఛందోవ్యాకరణబద్ధంగా రచనలు చేసిన కవి అయివుండి తెలుగు వచనాన్ని అంతగా ప్రేమించడం విశేషం. భాషాశైలి విషయంలో, శిల్పం విషయంలో రచనను కొత్త ఎత్తులకు తీసుకెళ్ళిన శ్రీపాద వారి రచనలలో సంస్కృతం ప్రభావం చాలా చోట్ల కనబడుతుంది. శ్రీపాద వారిని అర్థం చేసుకోవడానికి సంస్కృతంతో పరిచయం, తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలతో సన్నిహిత పరిచయం అవసరం కనుక ఆయన రచనలన్నింటికీ వ్యాఖ్యానాలు ఉండాలన్నారు. ఈ వ్యాఖ్యలు త్వరలోనే సమకూర్చుకోవాలని కూడా అన్నారు. ఆ విధంగా తెలుగుభాష భవిష్యత్తు గురించి వినిపిస్తున్న హెచ్చరికలు, భయాలు తొలగించుకోవడానికి మనం సన్నద్ధమవాలని అన్నారు. వారు చెప్పినట్లుగా తెలుగు విశ్వవిద్యాలయం తరఫున ఆ ఏర్పాట్లు వెంటనే చేపడుతున్నాం. ఈ సూచన చేసినందుకు కారా మాష్టారుకి, సూచన అందించినందుకు నాగసూరి వేణుగోపాల్ గారికి కృతజ్ఞతలు.

13.6.2007

(ఎ. మంజులత)

నేటికీ శ్రీపాద

పట్టిక

ఈ విశాల విశ్వంలో తెలుగువాడు	శ్రీ నాగసూరి వేణుగోపాల్	XI
ఆంధ్రత్వమే ఊపిరి	డా॥ కోదూరి శ్రీరామమూర్తి	1
కళ్ళతో వింటాం	డా॥ చాగంటి శరత్‌బాబు	7
గోదావరిగానే సంభావించుకోవాలి	డా॥ టి. పతంజలి శాస్త్రి	13
ముగింపులో బిగింపు	శ్రీ రసరాజు	18
సంస్థానాల కథలు	శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ	32
వ్యక్తిత్వంతో తొణికిసలాడే వనిత	డా॥ నందుల సుశీలాదేవి	39
మానవీయ శక్తి చేసిన తిరుగుబాటు	డా॥ వాడ్రేవు వీర లక్ష్మీదేవి	47
దేశీయమైన అపరాధ పరిశోధక నవల	శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ	58
నా తెలుగు మీద నాకు నిషేధం ఏమిటి ?	శ్రీ పున్నమరాజు నాగేశ్వరరావు	65
పురాణాల అనువాదాలు	శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం	81
అనుభవాలూ-జ్ఞాపకాలూను	శ్రీ వై.ఎస్.నరసింహారావు	85
ప్రబుద్ధాంధ్ర సంపాదకత్వం	శ్రీ సన్నిధానం నరసింహశర్మ	93
విశిష్ట రచన - వీరపూజ	డా॥ పోరంకి దక్షిణామూర్తి	99
శ్రీమహాభక్త విజయం	డా॥ పోరంకి దక్షిణామూర్తి	108
నాకు తెలిసిన శ్రీపాద	శ్రీ పోతుకూచి సూర్యనారాయణమూర్తి	116
వ్యాఖ్యానం అవసరం	డా॥ కాళీపట్నం రామారావు	120
అనుబంధం		
జీవితం - సాహిత్యం	డా॥ చామర్తి కనకయ్య	125

ఈ విశాల విశ్వంలో తెలుగువాడు

- శ్రీ నాగసూరి వేణుగోపాల్

" యావద్భారత దేశంలోనూ, యీ విశాల విశ్వంలో కూడా తెనుగు వాణ్ణిగా, నేనే నిర్వహించవలసిన కార్యక్రమం కొంతవుంది, - నా ధృఢ విశ్వాసం యిది..."

(467, అనుభవాలూ - జ్ఞాపకాలూను, 1999)

ఇక్కడ పేర్కొన్నది ఒక్క వాక్యమే కావచ్చు. కానీ నాకు మాత్రం యిందులో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి విరాట్రూపం గోచరిస్తోంది. నేడు ప్రపంచ పోకడ ఎలావుంది? అమెరికా వైపు చూపు, డాలర్ మోజు, ఆంగ్లవ్యామోహం, వినిమయతత్వం, అనుకరణ, స్వదేశీ ఆలోచనల నిరాకరణ - అనేవి గీటురాళ్ళుగా చలామణి అవుతున్నాయి. వెరసి - యిదే 'ప్రపంచీకరణ' గా ప్రాచుర్యం పొందుతోంది. ప్రపంచీకరణకు విరుగుడుగా నేడు స్థానికతను పరిగణిస్తూ, పరిష్కారాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో - పేర్కొన్న వాక్యాన్ని పరిశీలిస్తే - అందులోని ఆకర్షణ అవగతమవుతుంది. ' నేనే' అనడంలో స్థానికతతో పాటు ఆత్మవిశ్వాసం బోధపడుతుంది. 'కొంత' అనడంలో హేతుబద్ధతతోపాటు నమ్రత కనబడుతుంది, 'దృఢవిశ్వాసం' అనడంలో స్పష్టతతో పాటు సంకల్పం గోచరమవుతుంది. సమస్యలకు పరిష్కారాలు స్థానికంగా పరిశోధించుకోవాలని పర్యావరణ శాస్త్రమే కాదు, ప్రపంచీకరణ అధ్యయనం కూడా సూచిస్తోంది. అందుకే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఆలోచనా చిత్రాల విశ్వరూపం ఈ వాక్యం ద్వారా పరిశీలించాలని ప్రయత్నించడం. ఆయన వ్యూహం నేడు ఎలా ఆలోచించదగ్గదో గమనించవచ్చు.

* * *

" ఒక్కొక్కసీమ వొక్కొక్క జీవకణంవుంది తెనుగు రక్తంలో. అన్నీ వొక్కచోటికి చేర్చగల - అన్నీ వొక్క తెలుగు వాడి రక్తంలో నిక్షేపించగల మొనగాడు పుట్టుకురావాలి, అంతే.

మొదటి మాటు విశాఖపట్నం వెళ్ళాన్నేను. అప్పటికి నాకున్నది వొక్కటే ప్రాణం. వారం రోజులున్నా నా మొదటిమా టక్కడ. రెండోప్రాణం సంక్రమించి నట్టనిపించింది, దాంతో నాకు. తరువాత నెల్లూరు వెళ్ళాను, మూడో ప్రాణం సంక్రమించిం దక్కడ. అదయిన తర్వాత కడపా, అనంతపురమూ, నంద్యాలా వెళ్ళాను, నాలుగో ప్రాణం సంక్రమించిన ట్టనిపించింది. చివరికి హనుమకొండ వెళ్ళాను, అయిదో ప్రాణం కూడా నాకు సంక్రమించినట్టు - నా ఆంధ్ర రక్తం పరిపూర్ణం అయిన ట్టనుభూతం అయింది నాకు. ఇవాళ చూసుకుంటే, అయిదు ప్రాణాల నిండు జీవితమే నాది. అందుకు తగ్గ దార్ఢ్యం మాత్రం కూడలేదనే చెప్పాలింకా. నా స్వప్రాంతపు పలుకుబడిలో యెంత జీవ శక్తివుందో, అక్కడక్కడి పలుకుబళ్ళలోనూ అంతంత జీవ శక్తీవుంది. వారాల్లో నూ, మాసాల్లోనూ పట్టుబడేది కాదది .... "

- అని చాలా విస్పష్టంగా, వినమ్రంగా, విశ్వాసంతో అంటారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి స్థానికత, ప్రాంతీయత అని వేరుగా చెప్పనవసరం లేదు. వివక్షచూపకుండా సమాన గౌరవం యిస్తూ ఆయన ఆదరించిన తీరు చాలా అర్థవంతంగావుంది. తెలంగాణా ప్రాంతపు రచనలు తక్కువగా వస్తున్నాయని, సురవరం ప్రతాపరెడ్డి గారి నుంచి రచనలు అడిగి తెప్పించుకుని తన 'ప్రబుద్ధాంధ్ర'లో ప్రచురించారు. ఇంతటి తార్కికత నాయకులకు వుండి వుంటే తర్వాత, తర్వాత ఆత్మగౌరవ ఉద్యమాలు రూపు దిద్దుకునే ఆస్కారం వుండేదికాదు. నేడు తెలంగాణాలో, రాయలసీమలో, ఉత్తరాంధ్రలో - వారి ప్రాంతీయత గురించి, పలుకుబడి గురించి, సంస్కృతి గురించి లోచూపు మొదలైంది. ఒకే సంస్కృతి ఆధిపత్యం, ఒకేదేశం ఆధిపత్యం, ఒకే ప్రాంతం ఆధిపత్యం ఎప్పుడూ ఆరోగ్యం కాదు. జీవశక్తి, జీవకణం - అనడంలో నేడు యిదే అర్థం స్ఫురిస్తోంది.

* * *

"గ్రంథాలు చదివే నేను భాష తెలుసుకున్నాను. స్త్రీల నాశ్రయించిన్నీ నేర్చుకున్నా న్నేను తెనుగుభాష. ప్రయోగ విజ్ఞానం కూడా స్త్రీలవల్లనే

అలవడింది నాకు..., నా చెవిలో ఆ మాతృదేవతలు బీజాక్షరాలు కుమ్మరించారు. ఇవాళ నేను రాస్తున్న భాష వా రనుగ్రహించిన దాన్లో సహస్రాంశమయినా కాదు, యింతా చేస్తే.

....జాతీయమైన తెలుగుభాష కావాలంటే స్త్రీల దగ్గిరే నేర్చుకోవాలి.'

ఈ మాటలు పరిశీలిస్తే ఏమనిపిస్తుంది? భాష ఎక్కడ పరిరక్షించబడుతుందో చాలా స్పష్టంగా చెప్పారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. అంతేకాదు నేర్చుకోవడానికి ప్రయత్నించినా, నేర్చుకొన్నది సహస్రాంశ మని వినయంగా అంటా రాయన. ఈ ఆలోచన తీరులోని అంతరార్థాన్ని అవగతం చేసుకుంటే, అందుకుంటే ఎన్ని అనర్థాలు అదృశ్యమవుతాయో !

* * *

'...నా తెనుగు భాష శాస్త్రీయం - తాటా బూటం కాదు.

నా తెనుగు భాష యుగయుగాలుగా ప్రవాహిని అయివుండినది గాని, యివాళ, ఆ భాషలో నుంచి వొక మాటా, యీ భాషలోనుంచి వొక మాటా యెరువు తెచ్చుకుని భారత విద్య ప్రదర్శిస్తున్నది కాదు.

నా తెనుగుభాష సరస్వతికే తేనె చినుకు లందించింది గాని నిరుచప్పనిది కాదు.

నా తెనుగు భాష ఎక్కడ పట్టినా చక్రవర్తుల రాజ్యాంగాలు నడిపింది గాని, పరాన్న భుక్కు కాదు.

నా తెనుగుభాష స్వతంత్రంగా బతగ్గలది గాని కృత్రిమ సాధనాలతో ప్రాణ వాయువు కూర్చుకోవలసిందీ కాదు, అక్రమదోహదాలతో పోషించబడవలసిందీ కాదు."

- అని గంట కొట్టినట్టు తెలుగు గురించి చెబుతారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. ప్రపంచ వ్యాప్తంగా స్థానిక భాషలు అంతర్థాన మవుతున్నాయనే అందోళన సర్వత్రావుంది. మన భాషమీద మనకు గౌరవం, నమ్మకం, ప్రేమ లేకపోతే - అది రక్షింపబడదు. అదేసమయంలో హేతుబద్ధతతో బలాలను, పరిమితులను గుర్తించుకోవాలి. ఇటువంటి స్ఫూర్తివుంటే భాషాపరిరక్షణ సాధ్యమే !

ప్రాంతం, సంస్కృతి, భాష పట్ల మమకారం వుంటే, వాటిని అవగతం చేసుకుంటే, వాటిని కాపాడుకుంటే అదే స్థానికత అవుతుంది. అందుకే ఆయన వ్యవసాయ సమాజం పట్ల, గ్రామీణ సంస్కృతి పట్ల గొప్ప ప్రేమను చూపారు. ఇవన్నీ కలిస్తే ప్రపంచీకరణకు విరుగుడు కూడా అవుతాయి. ప్రపంచీకరణపై విజయం సాధించిన 'స్థానికతా' విజయగాథలు పరిశీలిస్తే యిది బోధపడుతుంది. పరిష్కారాలు స్థానికంగానే లభ్యమవుతాయనే దృష్టి పర్యావరణంలోనే కాదు, సాహిత్యంలో సైతం అవసరం. సాహిత్యాన్ని ఆదృష్టితో అవలోకించాల్సివుంది కూడా !

అయితే చూపుకు అంత దారుఢ్యం ఎలా వస్తుంది? ఈ పెను ఉద్యమస్థాయిలో ప్రచారంలో వున్నవాటిని ఎదురునిలిచి ఖండించడం అంటే చిన్నవిషయం కాదు. ఇక్కడకూడా అంతస్థాయిలో వెన్నెముక వుంటేనే సాధ్యం ! అపుడే స్థానికంగా, ప్రాంతీయంగా వుండే ఆలోచనలు, అలవాట్లు, విధానాలు, పంటలు, సంస్కృతి, భాషా, సంపద నాశనంకావు. ఇది ప్రపంచీకరణకు పరిష్కారం కాదా ?

* * *

ఈ విశ్లేషణ ప్రారంభంలో పేర్కొన్న వాక్యం తర్వాతి వాక్యం ఏమిటో తెలుసా?

"...అందుకోసం, అన్ని సీమల పలుకుబళ్ళు బోధపరుచుకుని అన్ని సీమల జీవశక్తి కూడ్చుకుని స్వ స్వరూప జ్ఞానంతో ధృఢంగా నిలువగలగాలి నేను "

ఈ రెండు వాక్యాల మధ్యన వుండే అంతరార్థాన్ని తీసుకోవడానికి చేసిన ప్రయత్నం యీ విశ్లేషణ !

చివరగా యిందులో 'స్వస్వరూప జ్ఞానం ', 'దృఢంగా ' అనే అంశాలు కీలకమని గుర్తుచేస్తున్నా! వీటి గురించి అలోచిస్తే మరలా నాకు ప్రపంచీకరణ ఉధృతి గుర్తుకు వస్తోంది. మన బాధ్యత ఏమిటో అవగత మవుతోంది.

అందుకే ప్రాంతం, లింగం, భాష, పర్యావరణం కేంద్రంగా పని చేస్తున్నవారు అందుకోదగ్గ సాధన సంపత్తి ఈయనలో వున్నాయేమో పరిశీలించుకోవాలి నేడు.

(' సాహిత్య ప్రస్థానం ' మాస పత్రిక - జూన్ 2007)



ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్
ఆకాశవాణి,
విశాఖపట్నం -530 003
సెల్ : 94407 32392

ఆంధ్రత్వమే ఊపిరి

- డాక్టర్ కోడూరి శ్రీరామమూర్తి

" - దేశ భాషలందు తెలుగు లెస్స " అనే మాటలో స్వోత్కర్ష వుందో లేదో గాని, తెలుగు భాష వ్యావహారిక పలుకుబడిలోని సొగసు, మాధుర్యం, శక్తీ తెలియాలంటే మాత్రం శ్రీపాదవారి రచనలే శరణ్యం. మల్లాది రామకృష్ణ శాస్త్రి గారన్నట్టు " జాను తెనుగు నేర్చిన వారికే శాస్త్రి గారి రచనలు చదివి ఆనందించే అదృష్టం." మరొక భాషలో అనువాదానికి లొంగని శైలి అయనిది.

1891 వ సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లాలోని సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు - తన 13వ ఏట కలంపట్టే నాటికి - గురజాడ, వీరేశలింగం, గిడుగు వంటి మహనీయులు సామూహికంగా, భాషాపరంగా, సాహిత్య పరంగా కొత్తపుంతలు తొక్కి కొత్త వెలుగులకు శ్రీకారం చుట్టారు. అయితే - కొత్త భావాలకు, బూజుపట్టిన సంప్రదాయ భావాలకు మధ్య సంఘర్షణ ఆరోజులలో విస్తృతంగా జరుగుతూ వుండేది. ఒక విధంగా చెప్పాలంటే - ఒక సంధి యుగ మది. సంప్రదాయ వాతావరణంలో పుట్టి పెరిగిన శ్రీపాదవారు ఈ యుగ ప్రభావం కారణంగా పరస్పర విరుద్ధ ప్రభావాలకు లోనయినా, చివరకు తాను అనుసరించాల్సిన మార్గమేదో గ్రహించి తనను తాను నిరూపించుకోగలిగారు. తన సాహిత్య జీవన యాత్రలో శ్రీపాదవారు పద్యకావ్యాలు రాసినా, అవధానాలు చేసినా, జ్యోతిష్యం చెప్పినా, తిరుపతి వెంకట కవుల రచనను దుయ్య బడుతూ విమర్శ రాసినా, నటుడుగా నాటక ప్రయోక్తగా ప్రతిభను ప్రదర్శించినా, కొన్నాళ్ళు గ్రాంధిక భాషను అభిమానించినా - అదంతా ఆయన జీవితంలోని ఒక పార్శ్వం మాత్రమే అయింది.

ఇక, - మరొక జీవిత పార్శ్వంలో ఆయన తన గ్రాంధిక భాషాభిమానం వదులుకొని వ్యావహారిక భాషావాదిగా మారారు. కలకండ లాంటి వ్యావహారికంలో

కథలు, నవలలు, నాటకాలు రాశారు. పత్రికా సంపాదకుడుగా వినుతికెక్కారు. స్వీయ చరిత్ర రచనలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్నారు. రసం అన్నది వాక్య నిర్మాణంలో పొటమరిస్తుంది గాని, శబ్ద రూపాల్లోనూ క్రియా రూపాల్లోనూ కాదుమరి. వ్యావహారికం అయితే నీరసం అలవడుతుందను కోవడమూ, గ్రాంధికం అయినంత మాత్రాన రససహితం అయిపోతుందనుకోవడమూ అజ్ఞానానికి నిదర్శనాలు " అనే గ్రహింపు శాస్త్రిగారికి కలగడమూ, - " వచన రచనలో అనుభవం అవుతున్న ఆనందం పద్య రచనలో నాకెప్పుడూ కలగ లేదు " అంటూ ఆయన ఆతర్వాతి కాలంలో వచన రచనకు మాత్రమే పరిమితం కావడమూ - తెలుగువారి అదృష్టం. తెలుగు వచన సాహిత్యపు మహద్భాగ్యం.

శాస్త్రి గారి పేరు చెప్పేసరికి " వడ్లగింజలు" " కలుపు మొక్కలు " "అరికాల్ల కింద మంటలు " " ఇలాంటి తవ్వాయి వస్తే " - వంటి మరపురాని కథలు- " ఆత్మబలి " " క్షీర సాగర మధనం " వంటి నవలలు - " రాజరాజు " " కలంపోటు" వంటి నాటకాలు, రూపకాలు - ఒక దశాబ్ది పాటు తెలుగు సాహితీలోకంలో కదలికను తెచ్చిన " ప్రబుద్ధాంధ్ర " పత్రిక, తెలుగు వారికి ఒక గొప్ప వరప్రసాదమనదగ్గ "అనుభవాలూ - జ్ఞాపకాలూను" అనే స్వీయ చరిత్ర - సాహిత్యాభిమానుల మనోవీధిలో కదులుతాయి.

ఆయన రచనలు చదివితే వెనుకటి తరంలో గోదావరి జిల్లాల్లోని బ్రాహ్మణ కుటుంబాల ఆచారాలు, సంప్రదాయాలు, వారి వెనుకబడిన భావాలు, స్పర్ధలు, ఆప్యాయతలు యివన్నీ రమణీయంగా కలబోసి దర్శన మిస్తాయి. మల్లాది వారన్నట్టు "-బ్రాహ్మణీకమే ఆయన రచన " అనేది వాస్తవము అయినప్పటికీ - విస్తృత నేపథ్యంలోంచి అవలోకించ గలిగితే అందరికీ, అన్ని కాలాలకు వర్తించే చేదు నిజాలు, గుర్తుంచుకోదగ్గ సందేశాలు ఆయన రచనల్లో మనల్ని పలుకరిస్తాయి. ఈనాటికీ అవి పాతబడిన రచనలుగా అనిపించవు.

శ్రీపాదవారి " కలుపు మొక్కలు " కథ వెలువడి దశాబ్దాలు గడిచి వుండవచ్చు. కానీ లంచాలు మేసే అధికారులు ఈ వ్యవస్థలో వున్నంతకాలం - ఇలాంటి కలుపు మొక్కలను అధికార యంత్రాంగం నుండి ఏరిపారేసే రోజు రానంతవరకూ - ఈ కథ పాతబడే అవకాశం లేదు.

ఇక, ఉన్నత విద్యలు అభ్యసించి, " వైట్ కాలర్ " ఉద్యోగాల కోసం ఎగబడి, ఒక్కటీ రాక, యివాళ నిరాశతో క్రుంగిపోతున్న యువతీ యువకులు శాస్త్రి గారి తాపీమేస్త్రి రామస్వామి శాస్త్రులు బి.ఏ ", " మార్గదర్శి " వంటి కథలు చదివి ఈనాటికీ నేర్చుకోవలసింది ఎంతయినా ఉంది. దాస్యవృత్తి రాలేదని పరితపించడం కంటే, చేయగలిగిన ఏ చిన్న వృత్తినయినా చేపట్టి మనిషి తన కాళ్ళ మీద తాను నిలబడాలనీ, నలుగురికి ఆధారం చూపాలనీ - ఈ కథల్లో శ్రీపాదవారు యిచ్చిన సందేశం చిరస్మరణీయమైంది.

" క్షీర సాగర మధనం " అనే శ్రీపాదవారి నవలలో కూడా బాల వితంతువు అయిన ఒక ధనవంతురాలు స్వయంవరాన్ని ప్రకటించి చేసిన వర నిర్ణయం వెనుక కూడా పాఠకులకు యిలాంటి సందేశమే వినవస్తుంది.

వీరేశలింగంగారిలా శ్రీపాద వారికి సమకాలీన సమాజంలోని మూఢా చారాలను నిరసించే విషయంలో ఆవేశ పూరితమైన వైఖరి లేకపోవచ్చు. కొంత మితవాద ధోరణి వున్నట్టు కూడా అనిపించవచ్చు. కానీ, ఆనాటి సంఘ సంస్కరణ కార్యక్రమాలన్నింటికీ కేంద్ర బిందువు అయిన స్త్రీ జనాభ్యుదయం పట్ల శ్రీపాదవారికి గల శ్రద్ధ ఎవరికీ తీసిపోయింది కాదు. మూఢాచారాలతో నిండిన సమకాలీన సమాజంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయం పట్ల ఆవేదన ఆయన రచనల్లో సర్వత్రా కనబడుతుంది. " స్త్రీలను ఆశ్రయించే తెలుసు కున్నాను తెలుగు భాష " అంటూ తన రచనల్లోని వ్యవహారిక పలుకుబడికి గల ఘనత నంతటినీ స్త్రీలకు యిచ్చిన శ్రీపాదవారికి స్త్రీ జన సమస్యల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ ఉండడంలో ఆశ్చర్యం లేదు.

శ్రీపాదవారి " అరికాళ్ళ క్రింద మంటలు " " కొత్త చూపు " వంటి కథలనూ " కొనుక్కున్న మొగుడు " " టీ-పార్టీ " వంటి రూపకాలనూ ఈ సందర్భంలో గుర్తుచేసుకోవలసివుంది. వేదవేదాంగాలు ఔపోషం పట్టామని గొప్పలు చెప్పుకునే కుటుంబాల్లోని ప్రబుద్ధులు - నిస్సహాయురాలైన బాల వితంతువును శారీరకంగా, మానసికంగా హింసించిన వైనం " అరికాళ్ళ క్రింద మంటలు" కథలో ఉంటే - " కొనుక్కున్న మొగుడు " " టీ-పార్టీ " రూపకాలకు స్త్రీలను చిరకాలంగా వేధిస్తున్న

వరకట్న సమస్య కేంద్రబిందువు. ఈ రూపకాల్లో శ్రీపాదవారు వరకట్నం కోసం వెంపర్లాడే యువకులను ఆటపట్టించిన తీరు పాఠకులకు ముసిముసి నవ్వులు తెప్పిస్తుంది.

ఇక - " కొత్తచూపు " కథ వరకట్నం ఆశించే యువకులను పెళ్లాడానికి యువతులు అంగీకరించ కూడదనీ, స్త్రీలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదనే విషయాన్ని గ్రహించాలనే సందేశాన్ని యిస్తుంది. అంతేకాదు - స్త్రీలు కూడా వ్యాయామం చేసి, శారీరక బలాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకతను చెబుతుంది. ఈ కథలో శ్రీపాదవారు ఒక యువతి, యువకుడు కుస్తీ పోటీల్లో పాల్గొని బలాబలాలను తేల్చుకొనే విషయానికి సంబంధించిన ఉదంతాన్ని కూడా చెబుతారు. ఇవాల్టికీ అంతగా మింగుడు పడని యిలాంటి ఉదంతం గల కథను శాస్త్రి గారు ఎప్పుడో 40లలోనే రాశారంటే, ఆయనకు గల కొత్త చూపు, ముందుచూపు ఎలాంటివో తెలుస్తాయి.

సమాజాన్ని ముక్కలు చేస్తున్న దళిత సమస్యను కూడా శ్రీపాదవారు ఇతి వృత్తంగా స్వీకరించి " ఇలాంటి తవ్వాయి వస్తే " అనే కథను రాశారు. " - అంటరాని తనం అనేది హిందూ మతానికి పట్టిన స్లో పోయిజన్ వంటిది " అని గాంధీజీ తరచూ అనేవారు. ఈ ' స్లో పోయిజన్ ' కారణంగా సమాజం విషపూరితమై చివరకు మత మార్పిడులకు ఎలా కారణభూతమవుతున్నదో ఈ కథలో శాస్త్రి గారు చాలా ఆసక్తి కరంగా చెబుతారు. కుటిల వర్ణ వ్యవస్థ కారణంగా ఏర్పడిన అహంకారం మనసు లోలోపలి పొరల నుండి పోనంతకాలం విముక్తిలేదు అని - మనలను ఈనాటికీ హెచ్చరించే కథ యిది.

శ్రీపాదవారి గురించి ప్రస్తావించేటప్పుడు తప్పక ప్రస్తావనకు వచ్చే మరో విషయం " ప్రబుద్ధాంధ్ర" పత్రికా నిర్వహణ. స్థిరమైన అభిప్రాయాలు, రాజీపడని ధోరణి వున్న వ్యక్తికి పత్రికా నిర్వహణ అనేది ఎప్పుడూ కత్తిమీద సాము చెయ్యడం లాంటిదే అవుతుంది. ఇది " ప్రబుద్ధాంధ్ర " పత్రిక విషయంలో కూడా సత్యం. సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఈ పత్రికను నిర్వహిస్తుండే రోజులలో దేశంలోను, ప్రత్యేకించి ఆంధ్ర దేశంలోనూ, గాంధేయ ఉద్యమం ముమ్మరంగా సాగుతూ ఉండేది. దీని ప్రభావంగా జాతీయవాదులందరికీ ఖద్దరు ఉద్యమమూ, హిందీ ప్రచారమూ, ఆత్మీయమైన విషయాలుగా ఉండేవి.

యిలాంటి రోజులలో శాస్త్రి గారు తన పత్రికలో ఈ రెండింటినీ ఘాటుగా విమర్శిస్తూ, వ్యాసాలు ప్రచురిస్తూ వుండేవారు. ఇది జాతీయ వాదులందరికీ ఆగ్రహాన్ని తెప్పించినా - పత్రిక నడిచిన పదేళ్ళలోనూ చివరిదాకా ఆయన ఈ ధోరణి వదులుకోలేదు.

ఇక, - పండిత ప్రకాండులు వ్యావహారిక భాషాఉద్యమాన్ని దుమ్మెత్తి పోస్తూ వుండే రోజులలో - గ్రాంధికవాదాన్ని ఖండించేందుకు శ్రీపాదవారు తన పత్రికను ఒక వేదికగా చేసారు. అదేవిధంగా - పద్యానికి తప్ప గద్యానికి ఆదరణ లేని రోజులలో శాస్త్రి గారు తన పత్రికలో వచనానికి పెద్ద పీట వేయడం మాత్రమే కాకుండా - తన పత్రికలో గద్యమే తప్ప పద్యాలు ప్రకటించ కూడదు అనే నియమాన్ని కూడా పెట్టుకున్నారు.

వీటిల్లో ఏది మంచిదీ, ఏది మంచిది కాదు అనే చర్చ ప్రస్తుతం ముఖ్యం కాదు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఒక పత్రికా సంపాదకుడు తాను నమ్ముకున్న విలువలకు కట్టుబడి వుండగలిగాడా? లేదా ? అనే ఆలోచన మాత్రమే గీటురాయి అవుతుంది.

- పత్రికా నిర్వహణ విషయంలోనే కాదు. గ్రంధ రచయితగా కూడా శ్రీపాదవారు యిలాంటి ఆదర్శాన్నే చూపారు. ఆర్ధిక అవసరం దృష్ట్యా గ్రంధ ప్రచురణ కోసం ఆయన శ్రీమంతులను ఆశ్రయించవలసిన పరిస్థితుల్లో కూడా తన నమ్మకాలను వదులుకోలేదు. దాతల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తన అభిప్రాయాలను మార్చుకోలేదు. అలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు - వారి సహాయాన్ని వదులుకోడానికి కూడా ఆయన వెనుకాడేవారు కాదు. " రాజరాజు " నాటకానికి కృతి భర్త అయిన శ్రీరాజా విక్రమదేవవర్మ వంటి రసిక ప్రభువుల విషయంలో కూడా యిది మినహాయింపు కాకపోవడం విశేషం.

ఇక చెప్పాలంటే - శ్రీపాదవారి జీవితంలోను, సాహిత్య జీవితంలోను, రచనల్లోను ఈనాటికీ మనకు స్ఫూర్తి నివ్వగల ఎన్నో విషయాలు కనబడతాయి.

" కో హమ్ " (నేనెవరిని ?) అని తనకు తాను ప్రశ్నించుకొని " ఆంధ్రోహమ్" (నేను ఆంధ్రుణ్ణి) అని సమాధానం చెప్పుకున్న సిసలైన తెలుగు బిడ్డ శ్రీపాదవారు.

ఆయన జాతీయతా భావనకు ఆంధ్రత్వమే ఊపిరి. ఎంగిలి కూడు అనేది లేకుండా నిండైన తెలుగుదనంతో తొణికిసలాడే రచనలాయనవి. " - (ఆంధ్రదేశంలో) ఒక్కొక్క సీమలో ఒక్కొక్క జీవకణం ఉంటుంది. (కాబట్టి) పల్లెల్లో, పట్టణాలలో తిరగాలి. అష్టాదశ వర్ణాల్లోనూ, పరభాషా వ్యామోహం లేనివారిని కలుసుకుని ఆ పలుకుబడులు చెవులారా వినాలి - " అని తన స్వీయచరిత్రలో రాసుకున్న శ్రీపాదవారు ఆంధ్రదేశపు వివిధ ప్రాంతాల్లో ఉండే మాండలిక పలుకుబడులను చెవులారా విని ఆనందించారు. యిలాంటి ఆనందాన్ని పొందినప్పుడే తెలుగువాడికి ' నిండైన ప్రాణం వున్నట్టు లెక్క ' అని భావించారు. తెలుగు సాహిత్యంలో కూడా యిలాంటి ' నిండైన ప్రాణం ' వుండాలని ఆయన కోరుకున్నారు. సమాజంలోను, సాహిత్యంలోను అన్నింటా మార్పును కోరుకున్న శ్రీపాదవారి రచనలు చదివితే ఆయనకు గల కొత్తచూపు సర్వత్రా దర్శనమిస్తుంది. దీనిని సరియైన రీతిలో ఆకళింపు చేసుకుని తమను తాము సంస్కరించుకోవలసిన ఆవశ్యకత తెలుగువారందరిపైనా ఉంది.

- శ్రీ కోడూరి శ్రీరామమూర్తి

కోడూరి నివాస్, డి-5, అఖిల్ అపార్ట్‌మెంట్స్,
దానవాయిపేట, మెయిన్‌రోడ్,
రాజమహేంద్రి-533 003
ఫోన్ : (0883) 2430754, సెల్ : 93469 68961

రేఖా చిత్రాలకు ఆద్యుడు

- శ్రీ శాస్త్రి గారి చిన్నకథలలో ఒక వాక్యం, ఒక్క పేరాగ్రాపు ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉంటుంది. ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క పేరా వలె వ్రాయబడి ఉంటుంది. అమెరికా రచయిత విలియం సారోయన్ ఈ సంవిధానాన్ని అనుసరిస్తాడు. పాశ్చాత్య సాహిత్య సంసర్గం లేని శ్రీ శాస్త్రి గారి కిదేమీ తెలియదు. వారి ప్రతిభ విశ్వరచయితల తరంగ ధైర్యం లోది కనుక, ఇట్టి టెక్నిక్ ఆయనకు లభ్యించింది. అల్పాక్షరముల అనల్పార్థ రచన అని ప్రాచీనుడైన పాల్కురికి సోమన చెప్పినాడు. ఆ సూత్రానికి శ్రీ శాస్త్రిగారి చిన్నకథలు నిదర్శనాలు. గురజాడ " ఆణిముత్యాలు " అనే అయిదు కథలు తప్పించి శ్రీ శాస్త్రిగారి చిన్నకథలను మించిన కథలు లేవు. రేఖాచిత్రాలు అని నేడు మనం వేని నంటామో, ఆ ప్రక్రియా రచనలకు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రే ఆద్యుడు. ఒక పదంచేత, రెండు వాక్యాలచేత ఒక మహోత్తర మూర్తినీ, ఒక రోమాంచకారి సన్నివేశాన్ని కండ్లకు కట్టినట్లు చిత్రించే సమాసశక్తి శ్రీ శాస్త్రి గారిది.

- సర్దేశాయి తిరుమల రావు

(ఆంధ్రప్రభ వార పత్రిక - ఉత్తరాలు శీర్షిక : 25-5-1977)

కళ్ళతో వింటాం ...

-డాక్టర్ చాగంటి శరత్‌బాబు

కథలు వ్రాయగలవారు చాలామంది ఉంటారు. తెలుగులో కొన్ని వందలమంది వ్రాశారు కథలు, వ్యాసాలు.

తెలుగులో వ్రాయబడిన ప్రతికథ తెలుగు కథ కాదు. ఆమాటకొస్తే, చాలా చక్కటి కథలు తెలుగులో ఎన్నో వచ్చాయి. అవన్నీ నిజంగానే తెలుగు కథలా అంటే ఔనని చెప్పలేం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి విషయంలో మాత్రం ఆయన చేసిన ప్రతీఒక్క రచనా నూటికి నూరు పాళ్ళు తెలుగుదేనని చెప్పటానికి సందేహించ నక్కర్లేదు.

శ్రీపాదవారు రచించిన చిన్నకథలు, అనువదించిన భారత రామాయణాలు, ఇతరత్రా అనేక వ్యాసాలు అన్నీ, తియ్యని తెలుగుదనం నిండిన రసగుళికలు.

కథలు వ్రాసే వారు చాలా మందే ఉంటారు. కథలు చెప్పగలిగిన వారు మాత్రం అరుదుగా ఉంటారు. కథ చదివేటప్పుడు ఆ కథ చదువుతున్నట్లు కాక, వింటున్నట్లుగా అనిపించేలా వ్రాయగల వారు మరీ అరుదుగా ఉంటారు. అటువంటి అరుదైన ప్రతిభాశాలి శ్రీపాద.

ఒక్క మాటలో చెప్పాలంటే -

చాలా రచనలు కళ్ళతో చదువుతాం -
చాలా మాటలు చెవులతో వింటాం -
శ్రీపాదవారి రచనలు కళ్ళతో వింటాం.

తెలుగు సాహితీ ప్రపంచంలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి ఒక ప్రత్యేకస్థానం ఉందని అందరూ అంగీకరిస్తారు. అయితే ఎవరికోణం వారిది. ఆయన వాడిన తెలుగు భాషని కొందరు మెచ్చుకొంటే, వారి 'కథనం' లో ఉండే వడిని

మరికొందరు ప్రశంసిస్తే, భావాల్లో గల ఆధునికత ఇంకొందర్ని ఆకర్షిస్తే, చదివించగల నేర్పుని ఎందరో ఇష్టపడుతుంటారు. ఎవరి ధోరణి వారిది.

అయితే అత్యధికులు గమనించనిదీ, గమనించినా పట్టించుకోనిదీ ఒక అంశం ఇప్పుడు ప్రస్తావించుకొందాం. ఇది నేడు అత్యవసరం కూడా.

ఒక ఏభై అరవై సంవత్సరాల క్రితం తెలుగు కవులు, కథకులు ఒక వెలుగు వెలిగారు. ఆరోజుల్లో అదొక ఉన్నతస్థానం. రచయితగా, కవిగా పేరుతెచ్చుకున్నవారికి చాలా గ్లామర్ ఉండేది. కవిదిగ్గజాలు, కథక చక్రవర్తులు ఎందరికో కలల హీరోలుగా కూడా చెలామణీ అయ్యారు.

కవుల్నీ, కథకుల్ని హీరోలుగా పెట్టి, సినిమాలు సైతం వచ్చాయంటే అప్పటి పరిస్థితులు తేలికగానే అర్థం చేసుకోవచ్చు.

మహాకవులుగా, కథకులుగా, ప్రసిద్ధి కెక్కిన వారు కొన్ని భావాలకు, కొన్ని రాజకీయసిద్ధాంతాలకు కట్టుబడి తమ రచనలు సాగించటం జరిగింది. వారికి ఆయా భావాల పట్ల, రాజకీయ సిద్ధాంతాల పట్ల అభిమానం గలవారు బ్రహ్మరథం పట్టి అమితమైన ప్రచారం కల్పించారు. క్రమంగా ఆయా రచయితల పేర్లు వారి రచనల కంటే పెద్దగా పెరిగిపోయాయి. వారు వ్రాసింది చదివి, వారి గురించి తెలుసుకున్న వారి కంటే - వారి గురించి వ్రాసిందీ, చెప్పిందీ, తెలుసుకుని, వారి అభిమానులైన వారు ఎక్కువయ్యారు.

వారి రచనల కంటే, వాటిల్లో గల సాహితీ విలువలు కంటే వారి భావాలకు ఎక్కువ ప్రచారం వచ్చింది.

ఈ సమయంలో వారి అభిమానులు స్వతహాగా సాహితీ ప్రియులు అతికొద్ది మంది ఉంటే పార్టీల కార్యకర్తలు, వ్యవస్థ పట్ల వ్యతిరేకత గలవారు ఎక్కువయ్యారు.

ఏం వ్రాస్తున్నారు ? అన్నది ముఖ్యమై, ఎలా వ్రాస్తున్నారు అన్నది చర్చనీయాంశమే కాకుండా పోయింది. దాంతో ఒక వింత పరిమాణం -

రచయితలు రూపం గురించి, వ్రాసే భావాల గురించీ మాత్రమే పట్టించుకుంటూ, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న భావజాలం. విదేశీరచనలకి, స్వదేశీ భాషను తగిలించటం... పరస్పర దూషణలు, ... క్రమంగా పాఠకులకి సాహితీ ప్రపంచం దూరమైంది. పుస్తకం అట్టమీదే ఒక 'పాఠ్యపుస్తకం' అట్టమీద వేసినట్లు

ఫలనా విషయం గురించే దీంట్లో వ్రాయబడి ఉంటుంది. అని ప్రకటించటం మొదలై అది చదివే ముందే పాఠకులు ఓ అభిప్రాయానికి వచ్చేయటమూ జరిగింది. చాలావరకు ప్రజాదరణ పొందిన రచనలు నిజానికి తెలుగులో పుట్టినవే కావు. ఆ రకం పాత్రలు తెలుగు వారికి పరిచయమైనవి కావు. అన్నిటికీ మించి రాజకీయ కరపత్రాలకి, అశ్లీలమైన రచనలకీ - ఇతరమైన రచనలకీ మధ్య అంతరం తగ్గిపోయింది.

ఇది ఒక పెద్ద దుమారంలా చెలరేగిన కాలం - చాలామంది సాహితీ వేత్తలకి గుర్తుండే ఉంటుంది. ఏదోఒక వర్గానికో, రాజకీయ సిద్ధాంతానికో లేక ఫ్రాయిడ్, రస్సెల్ వంటి మేధావులకో తమను తాము అంకితం చేసుకోని రచయితలు చాలా కొద్దిమంది ఉండేవారు అప్పట్లో. దాని పర్యవసానమే నేడు మనం చూస్తున్న క్షీణదశ.

ఇదిగో - ఈ దుమారం ఏమాత్రం సోకని అద్భుతమైన రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు.

చిత్రం ఏమంటే చాలా మంది పేర్లు మనకి తెలుసు - అయితే వారు వ్రాసినవి ఏమిటో తెలీదు. శ్రీపాదవారు వ్రాసినవి చాలామందికి తెలుసు. అయితే వ్రాసిన రచయిత ఎవరో మాత్రం తెలీకపోవచ్చు.

ప్రజాకవులు, మహాకవులు, మేటి రచయితలు ఎందరో ఉన్నారు. " వారు రచించినవి మీరేమైనా చదివారా ? " అని అడిగితే తల అడ్డంగా ఊపేవారే కదా అత్యధికులు - అక్కడ కవులు, రచయితలు ప్రచారం పొందారు. వారి రచనలు కాదు. ఇక్కడ 'రచనలు' ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. రచయిత కాదు.

వడ్లగింజలు, ఇల్లు పట్టిన విధవాడపడుచు, అరికాళ్ళక్రింద మంటలు, వంటి కథలు ఎందరో ఎరుగుదురు. అయితే వాటిని రచించిన 'శ్రీపాద' వారి పేరు మాత్రం ఎరుగరు. ఇదేమీ అంత వింతకాదు. ఎన్నెన్నో కథలు, పాటలు ప్రజల్లో నానుతుంటాయి. ఎవరు వ్రాశారో, ఏగ్రంథంలోదో చాలామందికి తెలీదు. తెలీకపోయినా పర్వాలేదు. నిజం చెప్పాలంటే రచయిత, కవి సాధించిన ఘనత ఇది. వ్యక్తి కంటే ఆవ్యక్తి చేసిన పనికి ఎక్కువ ప్రచారం రావటం - దాని ప్రయోజనం ఎక్కువ కావటం ఎప్పుడూ ఆవ్యక్తి ఘనతకే నిదర్శనం.

ఒక రాజకీయ ఉద్యమానికో, దాని వర్గానికో, మరేదైనా సిద్ధాంతానికో కట్టుబడిన రచయిత ఆయా కార్యకర్తల వల్ల ప్రచారంలోకి వస్తాడు. వారిలో అత్యధికులు సాహితీ విలువతో ఏమాత్రం సంబంధం లేనివారే. ముఖ్యంగా వారికి

చదివేటంత తీరిక, అభీష్టం ఉండవు. పాఠకులు వేరు - కార్యకర్తలు వేరూను. కార్యకర్తల ద్వారా పేరు తెచ్చుకున్న వారి సంఖ్య ఎక్కువకావటం - పత్రికాధిపతులు, సంపాదకులు కూడా కాస్త అటూ, ఇటూ గా అదే ధోరణితో ప్రవర్తించటం వంటి వాటివల్ల 'సాహిత్యం' దాని బాగోగులు వెనుకబడి - రచయిత ఆశయాలు, విశ్వాసాలు ముందుకొస్తాయి.

వరకట్నదురాచారం వల్ల ఎందరో బలైపోతున్న కాలంలో కూడా 'కన్యాశుల్కం' నాటకం - దానిలో గల సాహితీ విలువల కారణంగా నిలిచి ఉంటుంది. ఉద్యమాలతో, విధానాలతో సంబంధం లేకుండా 'ఓ మహాప్రస్థానం' సంకలనం కొందరినైనా ఉత్తేజపరుస్తూ ఉంటుంది. ఇలా దేశకాలపరిస్థితులకి అతీతంగా కొన్ని రచనలు బ్రతకగలుగుతాయి. మిగిలినవి కాలగర్భంలో కల్సిపోతాయి. మహా అయితే ఎవ్వరైనా ఒకరిద్దరు వాటిపై యూనివర్సిటీ డిగ్రీల కోసం పరిశోధనలు చేయవచ్చు. అది అప్రస్తుతం - అనవసరం. ఈ కోణంలో చూస్తే శ్రీపాదవారి రచనలు చాలా కాలంపాటు అంటే 'తెలుగు' భాష ఉన్నంతకాలం నిలిచి ఉండే విలువలతో ఉన్నాయన్నది వాస్తవం. అందుకు కారణం విశ్లేషిద్దాం.

ఒక కాలం తెచ్చిన కొన్ని మార్పులు సమాజంపై ప్రభావం చూపిస్తుంటాయి. ఇలాంటప్పుడు ' నిన్నటి పెద్దల భుజాలపై నిలిచి మరింత దూరం చూడగలుగుతున్నాం, అన్న ఇంగితజ్ఞానం కలవారు కొంద రుంటారు. నిన్నని నిందించటమే కర్తవ్యంగా భావించే వారు కొంద రుంటారు. మొదటి రకం రచయితలు ప్రేమ పునాదిగా తమ రచనల్ని సాగిస్తారు. - రెండో రకం వారు ద్వేషం పునాదిగా తమ కలాల్ని ఝుళిపిస్తారు.

శ్రీపాద మొదటి రకం రచయిత -

బాల్య వివాహవ్యవస్థని కానీ, మరి దేన్ని కానీ ఆయన నిందించలేదు. దూషించలేదు. కారణం ప్రతి విషయంలోనూ కార్యకారణ సంబంధం అంటూ ఒకటి ఉంటుంది. ఈ బాల్య వివాహాలు అనేవి రావటం వెనక అప్పటి సాంఘిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది. నేటి కాలంలో దాని అవసరం లేదు. పైపెచ్చు మనుష్యుల దుర్మార్గం వల్ల అది నష్టదాయకమైంది. నిజానికి బాల్య వివాహాల వల్ల కాదు కదా వితంతువులు అందరు తయారైంది. పసిపిల్లల్ని కన్యాశుల్కానికి ఆశపడి ముసలివారికిచ్చి పెళ్ళి చేయటం అసలు కారణం. అది వ్యక్తుల తాలూకు నీచత్వమే

తప్ప వ్యవస్థలో ఉన్న తప్పుకాదు. కానీ వ్యవస్థ అందుకు అవకాశం కల్పించింది.

కనకనే శ్రీపాదవారు ఎవరినీ నిందించలేదు.

పసితనంలో వైధవ్యం ప్రాప్తించిన అమ్మాయిని పంతులు గారి తోటకి పంపటంతో కథముగించారు. ఇతరుల్ని నిందిస్తూ కూచునే కంటే - కష్టాల్లో ఉన్నవారికి దారి చూపించటం వెనక అసలైన ప్రేమ కనిపిస్తుంది. ఈనాటి రచయితలు దీనిని ఎంత గ్రహిస్తే అంతమంచిది.

ఇలా పరిశీలిస్తే శ్రీ శాస్త్రిగారి రచనల్లో విలన్‌లు అంటూ ఎవరూ ఉండరు. సమాజాన్ని సరిగా చూడగలిగితే కాలం, పరిస్థితులు, అజ్ఞానం - ఇవే అసలైన విలన్‌లు. మళ్ళీకాలం, పరిస్థితులు, జ్ఞానం - ఇవే అసలైన హీరోలూను. కనకనే శ్రీ శాస్త్రిగారు ఓపక్క వితంతువుల పట్ల సానుభూతి చూపే 'అరికాళ్ళ కింద మంటలు' వంటి అద్భుతమైన కథ వ్రాశారు. మరోప్రక్క 'ఇల్లు పట్టిన విధవాడపడుచు' వంటి కథ వ్రాయగలిగారు.

సమాజాన్ని వర్గాలుగా విభజించి - వీరంతా దుర్మార్గులు, వీరంతా మంచివాళ్ళు, వీళ్ళు పీడకులు, వీళ్ళు పీడితులు, వీళ్ళు మోసం చేసేవాళ్ళు, వీళ్ళు మోసపోయి వాళ్ళు అంటూ స్టాంపులు కొట్టే సెకండ్‌రేట్ సాహితీ వేత్తలతో కలుషితమైన కాలంలో ఇటువంటి రచయితను చదివినవారు గొప్ప అదృష్టవంతులు.

శ్రీపాదవారు తెలుగులో కథలు, పద్యాలు రచించటం వారి తండ్రిగారికి, అన్నగారికి సుతరాము ఇష్టముండేది కాదు. తమ కుటుంబవృత్తికి సంబంధించిన విద్యలు నేర్చుకోమనే నిర్బంధించేవారు. ఇది ఒక అసహజమైన దుర్మార్గంగా ఆయన చిత్రించలేదు. ఏతల్లిదండ్రులైనా తమ సంతానం కష్టాలు పడకుండా సుఖంగా జీవితం గడపాలని కోరుకుంటారు. ఇది అసహజం కాదు - విలన్ అంతకంటే కాదు. పిల్లలు కొన్ని వృత్తుల్ని ఎంచుకొన్నప్పుడు, లేదా ప్రేమ వ్యవహారాలు గట్రా సాగించినప్పుడు అడ్డుపడటానికి కారణం తమ సంతానం తెలిసీ తెలీని తనం వల్ల దెబ్బతింటారేమో నన్న భయంచేత తప్ప వాళ్ళు ఘనకార్యాలు సాదించకూడదన్న దుర్బుద్ధితోనూ కాదు. - ప్రేమ అనేదాని పట్ల గల ద్వేషం తోనూ కాదు. ఆమాటకొస్తే ఒక భగత్‌సింగ్ వంటి వ్యక్తి కూడా తన కుమారుడు తనలా విప్లవకారుడు కావాలని కోరుకుంటాడని చెప్పలేం కదా !

ఇక సామాజిక రుగ్మతల విషయానికొస్తే అత్యధికులు అందరూ నడిచిన బాటలో నడుస్తారు. దానికి కారణం వారిలో గల కుత్సితబుద్ధీకాదు - కుట్రదారు మనస్తత్వమూ కాదు. ఒకప్పుడు వీరేశలింగం పంతులు గారిపై కొందరు రాళ్ళురువ్వే వారట - వారికి ఆయన పట్ల ద్వేషం ఏమీలేదు. బాల వితంతువులు అలాగేఉండాలనీ కాదు. కేవలం ఆయన ఏదో కూడని పని చేస్తున్నాడన్న అభిప్రాయం. తాము సంప్రదాయాల్ని కాపాడుతున్నామన్న భ్రమ. అంతే. వారెవరూ విలన్‌లు కారు. 'కాలం' తో పాటు నడిచి పోయే సగటు మనుషులు మాత్రమే. వారిని దుష్టులుగా, సమాజ శత్రువులుగా చూపించే కుటిలమైన రాజకీయపు బుద్ధులు గల రచయితల్ని మనం నేటికీ చూస్తున్నాం కదా ! శ్రీపాద వారెప్పుడూ అటువంటి పని చెయ్యలేదు.

శ్రీపాద వారి కలానికి అంతబలం రావటానికి కారణమే ఇది. అంత అద్భుతంగా ఏమామూలు కథనైనా చెప్పగలగటం, భాష అంత చక్కగా అమరటం - ఇవిరెండూ ఆయన విధానం వల్ల సహజంగానే అబ్బిన అందాలు.

కథా రచయిత సమాజాన్ని వ్యక్తులుగా, వ్యక్తుల కూటమిగా చూస్తాడే తప్ప వర్గాలుగా చూడడు. అలా చూడగలిగినవారు నిజమైన మంచి రచనలు చేయగలరు. 'వ్యక్తి'ని 'వ్యక్తి'గా చూడగలగటం వల్ల ఎవరికైనా ఒక విషయం స్పష్టంగా బోధపడుతుంది. ప్రతి మనిషిలోనూ మంచీ, చెడు కూడా ఉంటాయి. వాటిని గమనించగలిగితే ఒక కథలో హీరో అయిన వాడే మరో కథలో విలన్ అయిపోతాడు - మరోదాంట్లో మామూలు పాత్రల్లో ఒకటిగా మారతాడు. ఇది స్పష్టమైనప్పుడు వ్యక్తిని ద్వేషించే తత్వం పోతుంది. కేవలం ఆ 'వ్యక్తి' చేసిన చెడ్డ పనుల్ని మాత్రమే విమర్శించే స్థాయికి మనిషి చేరుకుంటాడు. అప్పటి పాత్ర చిత్రణ సమగ్రమవ్వటమే కాక మనుషులకి దగ్గరగా కనిపిస్తుంది. అటువంటి 'రచన' పాఠకుల మనుషుల్ని ఆకట్టు కొంటుంది. సమాజానికి హితము చేకూర్చగలుగుతుంది.

చాగంటి శరత్‌బాబు
(ఫిజిక్స్ లెక్చరర్, వి.టి. డిగ్రీ కాలేజి)
74-5-45 జి-2-ఆర్.ఎమ్.
సత్యసాయి టవర్స్ ప్రకాశం నగర్,
రాజమహేంద్రి - 533 103
ఫోన్ : 0883 - 3290705

గోదావరిగానే సంభావించుకోవాలి

- డాక్టర్ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1891లో తూర్పుగోదావరి జిల్లా మహేంద్రవాడలో జన్మించారు. వైదిక బ్రాహ్మణకుటుంబం వారిది. శాస్త్రిగారు తప్ప వారి పూర్వీకులందరూ వైదిక వృత్తిలోనే ఉండేవారు. ఆయన కథాసాహిత్యాన్ని పరామర్శించే ముందు సమకాలీన నేపథ్యం గురించి కొంత తెలుసుకోవడం అవసరం. ఆంధ్రదేశానికి, ముఖ్యంగా తీరాంధ్రానికి చారిత్రకంగా ఎప్పుడూ " తమిళకం " వంటి ప్రాంతీయ ప్రత్యేకత ఉండేదిగాదు. దీనికి కొనసాగింపే ఆంగ్లేయుల పాలనాకాలంలోనూ జరిగింది. అందుచేత 19, 20 శతాబ్దాలకి చెందిన అనేక మంది తెలుగు రచయితలకి, పరిశోధకులకి తెలుగువారికొక ప్రత్యేక రాష్ట్రం, తెలుగు భాషకి ప్రత్యేకమైన గుర్తింపూ లేకపోవడం బాధాకరంగా ఉండేది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉంటూ తమిళుల పెత్తందారీ తనాన్ని భరిస్తున్న రోజులవి. తెలుగుతనం గురించి పలవరించిన తెలుగు రచయితలలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఒకరు. ఆ తరానికి చెందిన కథకుల్లో మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు, శ్రీపాదవారూ ఒక విలక్షణమైన కథన రీతిని మలచుకున్నారు. ఒకరు కృష్ణాతీరం, మరొకరు గోదావరి తీరానికి చెందిన వారు కావడం ఆసక్తికరం. ఇద్దరి రచనల్లో రుచికరమైన తెలుగుతనం పరిమళిస్తూంటుంది. అందువల్లనే కథాప్రియులకి ఈ ఇద్దరూ అంటే ఇప్పటికీ ఇష్టం.

తెలుగుదనం సంస్కృతికి సంబంధించినది. భాషకి సంబంధించినంతవరకూ రాసేది తెలుగే అయినా మాండలికమైన బేధాలు వైవిధ్యం సజీవంగా ఉంటుంది. మాండలికంలో రచించడం ఇప్పుడూ ఉన్నదే. తెలుగు నుడికారం అని మనం మామూలుగా అనుకుంటున్నది నిజానికి మాండలికాలకు చెందినది. స్పష్టమైన స్థానీయత, మాండలికమైన నుడికారం స్థూలంగా తెలుగుదనంలో భాగాలే.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సమకాలీనులైన అనేకమంది కథకులు ఈ పరిమితులను అధిగమించి రచనలు చేశారు. అటువంటి రచనలు సార్వజనీనమౌతాయని మనకు తెలుసు. భాష మాండలికాల సమాహారం. స్థానీయతలో వేరూని నుడికారం పరిణామ దశల్లో అంతరిస్తుంది.

అందుకే ఈనాటి కథకు లెవరూ తెలుగునుడికారంలో రాయడం లేదు. ఇది అనివార్యమైన పరిణామం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథల్లో విలక్షణత గాఢమైన స్థానీయత, వారు వాడిన మాండలికం. ఇది చాలా శాతం రామకృష్ణశాస్త్రి గారికి కూడా వర్తిస్తుంది. శ్రీపాదవారి కథలు బహుశా ఆయన రచించిన కాలంలో కంటే తరువాతనే బహుళ ప్రాచుర్యాన్ని ప్రశంసనీ పొందాయనుకుంటాను. ఈనాటికీ ఆయన, తెలుగు కథ అంటే ప్రతినిధులుగా గుర్తించిన వారిలో పెద్దపీట వేయించు కుంటున్నారు. ఇప్పుడు శాస్త్రిగారి కథాసాహిత్యాన్ని స్థాలీపులాక న్యాయంగా చవిచూస్తూ, ఆయన వ్యక్తిగత జీవితం గురించి కూడా కొంత తెలుసుకోవడం అవసరం.

శుద్ధశ్రోత్రియ వంశంలో జన్మించడం వల్ల శాస్త్రిగారు తండ్రి దగ్గర వేదం, జ్యోతిష్యం నేర్చుకున్నారు. కానీ ఎందుకో ఆయనకి శాస్త్రాధ్యయనం రుచించినట్టు కనిపించదు. కష్టపడి తరువాత గురువుల దగ్గర సంస్కృత కావ్యాల్ని చదివారాయన. కొద్ది కాలానికే వేద విద్యగానీ, జ్యోతిష్యం గాని చివరికి తెలుగు ప్రబంధ కావ్యధోరణి సైతం సమకాలీన జీవనానికి పనికిరావని గ్రహించారాయన. అంటే సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ఆధునికుడిగా రెండో జన్మఎత్తి నిజంగానే ద్విజుడైనారు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. నేర్చుకున్న శాస్త్రాల్ని వదిలేసి, ఆయుర్వేదం అభ్యసించి దాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. 'గంధర్వఫార్మసీ' అనే ఆయుర్వేదాలయం ప్రారంభించారు. జీవితాంతం నడిపినా ఆర్థికంగా పెద్ద లాభించలేదు. స్వగ్రామంలో కొద్దిపాటి పొలం ఉండేది. తన పదమూడోయేట శాస్త్రిగారు మేనరికం చేసుకున్నారు. అందుకే ఆయన కథలనిండా మేనరికాలు కనిపిస్తాయి. 1920 ప్రాంతంలో రాజమహేంద్రవరం మకాం మార్చడంతో శాస్త్రిగారి సాహిత్య జీవితం ఆరంభమైంది. 'ప్రబుద్ధాంధ్ర' అనే సాహిత్య పత్రికను నానాకష్టాలు పడి రెండు దఫాలుగా నడిపారాయన. మధ్యలో 'అభ్యుదయ' అనే మరో పత్రిక కూడా నిర్వహించారు. 'ప్రబుద్ధాంధ్ర' ఆధునిక వచన రచనకి ప్రముఖస్థానం కల్పించింది. మొదట పద్యాల్ని, గ్రాంధిక భాషనీ ప్రోత్సహించినా తరువాత వాడుక భాషకీ, వచనానికీ పత్రిక వేదికగా మారింది.

సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి ఆర్థికమైన ఇబ్బందులూ, అనారోగ్యంతోపాటు కలిగిన ఒక్క కూతురు చిన్నతనంలోనే పోవడంతో చాలా దు:ఖాన్ని మూటకట్టుకోవాల్సి వచ్చింది. చిన్నతల్లి జ్ఞాపకం వస్తే రాస్తున్న కలం అలాగే ఆగిపోయేదని చెప్పుకున్నారాయన. తొలిరోజుల్లో సాహిత్యాభిలాషతో ఆయన పిఠాపురంలో ఉండే వెంకటరామకృష్ణ కవుల దగ్గర విద్యాభ్యాసం చేసి కొన్ని అవధానాలు చేశారు. చాలా రచనలు గ్రాంధికంలో చేశారు. భాష విషయంలోనూ, జీవితంలోనూ కూడా ఛాందసం విడచి శుద్ధ కథకుడిగా మారిన శాస్త్రిగారి రచనల్లో ఆధునిక ప్రభావం కనిపిస్తుంది. ఆయన కథల్ని ఈనాటికీ చర్చించడానికి కారణం వాటిలో ఉన్న మనం అనుకునే ఆధునిక భావజాలం. లేదా ఆనాటి సంస్కరణాభిలాష.

రాజమహేంద్రవరం వచ్చిన తరువాత సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి ప్రసిద్ధ సాహితీ మిత్రుల సహచర్యం దొరికింది. భమిడిపాటి కామేశ్వరరావు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు ఆయన ప్రముఖమిత్రులు. భమిడిపాటి వారు 'త్యాగరాజు ఆత్మవిచారం' రాయడానికి స్ఫూర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు.

ప్రారంభంలో అన్నట్టుగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి తెలుగు వాళ్ళకి న్యాయం జరగలేదనే బాధ ఉండేది. ప్రతీ రంగంలో తెలుగువాడు అగ్రేసరుడై ఉండాలని కోరుకునేవా రాయన. ఈ తెలుగుతనం, ఔద్ధత్యం మీద మమకారం వల్లనో లేదా భాషాపరమైన ఆధిపత్యం చలాయిస్తోందనో - శాస్త్రిగారికి హిందీ అంటే గిట్టేది కాదు. రాజమహేంద్రవరంలో, సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి హిందీ, ఖాదీ, గాంధీ పడవనేవారు. రాజకీయంగా తమిళులు, భాషాపరంగా ఉత్తరాది వారు తెలుగువాళ్ళ అభివృద్ధికి అవరోధం అని భావించి ఉంటారాయన. హిందీ రాజభాష అవుతుందనే భయం ఉండేదాయనకి. హిందీ వల్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరిస్తూ, మనదేశంలో వాడుక భాష సంస్కృతం కావాలని ఒకసారి కృష్ణాపత్రికలో వ్యాసం రాశారాయన. సాహిత్యాభిలాషతో పాటు సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి సంగీతం అంటే చాలా ఇష్టంగా ఉండేది. యాభయ్యోవడిలో వయోలిన్ నేర్చుకున్నారాయన. 1961లో రాజమహేంద్రిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు స్వర్గస్తులయ్యేరు.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథనం విలక్షణమైంది. చిన్నకథల పేరుతో రాసినా నిజానికవి పెద్ద కథలు. ఆయన కథనంలో ఉండే రుచి అంతా గోదావరి మాండలికం వల్లనూ, శిల్పం వల్లనూ ఏర్పడింది. శాస్త్రిగారు వాడిన మాండలికం గోదావరి జిల్లా వైదిక బ్రాహ్మణ కుటుంబాల్లో మాట్లాడిన భాష. యాగ్నికుల పలుకుబడులు. దీన్నే

కుల మాండలికం అంటున్నారు. ఈ వైదిక కుటుంబాల నుడికారం కచ్చితంగా ఆయన కథలకి కొన్ని పరిమితులు తెచ్చిపెట్టేయి. వాస్తవానికి శాస్త్రిగారి అనేక పలుకుబడులకి గోదావరి ప్రాంతీయులు కూడా ఇప్పుడర్థం చెప్పలేరేమో. వృత్తికులాలు మారిపోవడం, కులవృత్తులు అంతరించిడం వల్ల భాష సహజమైన మార్పులకి లోనైంది. సుబ్రహ్మణ్య శాస్త్రిగారు స్త్రీల దగ్గర్నించి భాష నేర్చుకున్నాననేవారు. చారిత్రకంగా, భాషా సంస్కృతులకి స్త్రీలే నిజమైన వారసులు. రెండోది శాస్త్రిగారి కథనం మౌఖిక సాంప్రదాయానికి చెందినది. అందువల్లనే ఆయన కథలు పొడుగ్గా ఉంటాయి. కథ చెప్పడం అనేక ప్రాచీన సంస్కృతుల్లో ఉన్నట్టే తెలుగుదేశంలో కూడా ఆసాది వంటి ప్రత్యేక కుల వర్గాలు కథలు చెప్పేవారు. ఇటువంటి మౌఖిక కథనానికి శ్రోతలుంటారు - పాఠకులు కాదు. మాటలలోనే బొమ్మకట్టాలి. ఇది అసంకల్పితంగానే జరిగినా సృజనశీలి వాక్కులో ఒక ప్రత్యేకమైన అందం సంతరించుకుంటుంది. సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథల్లో సంఘటనలకు ప్రాధాన్యం ఉండదు. మఠం వేసుక్కూచుని ఆయనే కథ చెప్తున్నట్టుంటుంది. ఈ మౌఖికత కారణంగానే వాక్యనిర్మాణంలో, కథనంలో కూడా సారళ్యం కనిపిస్తుంది. ధ్వని, వ్యంగ్యం వంటి ఆలంకారిక మర్మాలకు స్థానం ఉండదు. కథలకు పొరలుండవు.

శాస్త్రి గారు అంగీకరించినట్టు కేవలం భాషవరకే కాదు. ఆయన కథల్లో ఎక్కువగా స్త్రీలు సంచరిస్తుంటారు. నాటి మధ్యతరగతి బ్రాహ్మణకుటుంబాల్లో స్త్రీల ఛాందసం, మాత్సర్యం, లౌక్యం, ఆదరణ, ప్రేమాభిమానాలు, బాధ్యతలు సమస్తం ఓ చిన్న ప్రపంచంలా కనిపిస్తాయి. సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సంస్కరణాభిలాష, గురజాడ, వీరేశలింగం గార్ల ప్రభావం. అందుకే ఆయన కథల్లో బాల్య వితంతువుల పట్ల కుటుంబ సభ్యులు - తల్లిదండ్రులతో సహా ఎంత అన్యాయంగా ప్రవర్తించేవారో కనిపిస్తుంది. వితంతు వివాహాల్ని ప్రోత్సహించారని వేరే చెప్పనవసరం లేదు. ఈ సంస్కరణాభిలాషే శాస్త్రి గార్ని ఆధునిక రచయితలకు ఆప్తుణ్ని చేసింది. " ఇలాంటి తవ్వాయి వస్తే " బహుళ ప్రచారం పొందిన కథ. కుల వైషమ్యాల్ని శక్తివంతంగా ఎగతాళి చేసిన కథ అది. వారి మరో అద్భుతమైన కథ కథనం "అరికాలికింద మంటలు"

ఈకథ అంతా చివరి కొన్ని వాక్యాలు, మినహాయిస్తే సంభాషణారూపంలో నడిపించారు. గుండె కలుక్కుమంటుంది. బ్రాహ్మణుల్లో ఉండే శాఖావైషమ్యాల్ని కూడా నిరసించేరాయన. ఒక కథలో కృష్ణవేణమ్మ అనే పాత్ర ఉంటుంది. " పెళ్లాం

చచ్చిపోతే మొగుళ్ళు మళ్ళీ పెళ్లాడేప్పుడు, మొగుడు చచ్చిపోతే ఆడాళ్లు మళ్లీ ఎందుకు పెళ్లాడకూడదు ? " మౌఖికత వల్ల అబ్బే మరొక అందం Pictorial Quality. 'వడ్లగింజలు' కథలో శంకరప్ప, దివాన్జీల మొదటి పరిచయం వర్ణిస్తూ రాసిన వాక్యాలు మంచి ఉదాహరణలు. అయితే అనవసరంగా విస్తృతం అయిన సందర్భాలూ లేకపోలేదు. 'మార్గదర్శి' కథలాగ. ఆయన వచనానికి చాలా అందమైన ఉదాహరణ ' అనుభవాలూ-జ్ఞాపకాలూను ' స్వీయచరిత్రల్లో అంత నిజాయితీ అరుదుగా కనిపిస్తుంది. స్వీయానుభవాన్ని దాటి శాస్త్రిగారు ఏవీ రాయలేదు. సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి ఇంగ్లీషు రాదు. అది తెలుగువాళ్ళ అదృష్టం. ఇంగ్లీషు రాకపోయినా కొన్ని అనువాదాల్ని చూశారాయన. ఆయన కథలేవీ మహేంద్రవాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురం, బిక్కవోలు దాటలేదు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పలుకుబడుల గురించి పెద్దవ్యాసం తయారవుతుంది. 'గూడుమారిన కొత్తరికం' కథ "అదే నర్సమ్మ తొలిమాటు కాపరానికి వెళ్ళడం " అన్న వాక్యంతో మొదలవుతుంది. ఒక కథలో " పిల్ల రజస్వల అయింది. కొంపమునిగింది" అంటారాయన. మరోకథలో " స్త్రీ గానీ పురుషుడు గానీ ఏకచారత్వాన్ని విడిచిపెడితే వారి వివాహం భ్రష్టమైపోయిందన్నమాట." అనిపించారు. " అనాచారస్పీనుగ " " ఎనిమిదో అట్ఠం ప్రారంభించడం " " అగ్ని హోత్రాలవేళ " వోఘాయిత్యం " " దుంపశుద్ధి అయిపోవడం " " వపనం చేయించడం " - ఇట్లా అనేక పదాలు. ఈనాడు చాలామంది ఎరగని మూర్ధన్యాలు అనేకం. " అరికాళ్లకింద మంటలు" కథలో అత్తగారు అల్లుడితో అంటుంది. అమెకి ఎట్లాగైనా పిల్లదానికి వితంతువు గనక జుట్టు తీయించాలని దుర్మార్గమైన పట్టుదల. పైగా దానిచేత చాకిరీ చేయించుకోవాలి. " తలచెడ్డవా ళ్లింట్లో ఉండగా పునిస్త్రీ మడికట్టుకోవడం ఏమిషోయ్! " జుట్టు తీయించలేదని ఎత్తిపొడుస్తుంది.

" అది చేసిన వంట నన్ను తినమంటావా యేమిషోయ్ "

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గార్ని మనం గోదావరి గానే సంభావించుకోవాలి.

- తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి



86-4-16/1, వాడ్రేవునగర్,
రాజమహేంద్రి - 533 103.
ఫోన్ : (0883) - 2429425.
సెల్ : 94407 03440

ముగింపులో బిగింపు

- రసరాజు

ఎప్పుడైనా సరే -

ఎక్కడైనా సరే -

సమకాలీన స్పృహ చాలినంత ఉండాలి. అందులోనూ - రచయిత అనే వాడికి మరీను. అంతేకాదు. అతని " స్పృహ" ప్రజల భాషలో ప్రసరించాలి. ఈ రెండూ కలిస్తే ఇంకేముంది ! బంగారానికి తావి అబ్బినట్లే. ఇది ముఖ్యంగా కథకు మరీ అవసరం. ఎందుకంటే " కథ" పాఠకుడికి మరీ చేరువుగా ఉండే వాహిక కాబట్టి.

ఈ విషయంలో మనం కొంచెం మననుపెట్టి చూస్తే - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథలు పై రెండింటికీ ప్రాతినిధ్యం వహిస్తూ కనిపిస్తాయి. వాటితో పాటు ఆయన ప్రదర్శించిన నాటకీయత, వినిపించిన ప్రబోధం, కథలకు మరింత వన్నెతెస్తూ " వారెవ్వా " అనిపించుకొంటాయి. వీటన్నింటినీ మించి పై స్థాయిలో ఉండేది కథనం. ఎంత గొప్ప విషయమున్నా - చదివించే గుణం కొరవడితే - మధ్యలోనే చాప చుట్టేసే ఇబ్బంది ఉంది. ముందు పాఠకుణ్ణి అలవోకగా తనకూడా తీసికొనిపోవాలి కథ. ఆ ధార పంచదారలా ఉండాలి. అప్పుడే కథ తాలూకు పూర్తి రూపాన్ని మనం చదవగలుగుతాం. ఆ తరువాత దాని అంతస్సౌందర్యం, మిగతావిషయాలూ, క్రమంగా బయట పడతాయి. ఈ కోణంలో కూడా - అంటే కథను నడిపించే విషయంలో సైతం - శాస్త్రిగారు ముందు వరుసలోనే కూర్చున్నారని చెప్పాలి. అదేవిటో కాని ఆయన కథలో అంత అయస్కాంత శక్తి ఉంటుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే - కథను ప్రారంభించడంలో కూడా తగినంత మెలుకువ చూపించాలి.

అక్కడే పాఠకుడు కథతో ముందుగా కరచాలనం చేసేది. ఆ తరువాత ముగింపు దగ్గరికి వచ్చేసరికి రచయిత ఎంతో జాగ్రత్త వహించాలి. ప్రత్యేక శ్రద్ధ పాటించాలి. పకడ్బందీగా ఉండాలి. ఇక్కడే కథకు ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. ముగింపులో ఎంత బిగింపు ఉంటే కథ అంతగా హత్తుకొంటుంది. కథ చదవటం పూర్తి అయ్యాక పాఠకుడు కాసేపు తనకు తెలీకుండానే అందులో చిక్కుకుపోవాలి. కథను మూసేసినా ఆ ప్రభావంలోనే ఈదులాడాలి. ఇటువంటి విద్యలో శాస్త్రిగారిది అందెవేసిన చెయ్యి అనిపిస్తుంది.

మొదట శాస్త్రిగారు పద్యకవిగా సాహితీరంగంలో ప్రవేశించి అవధానాలు చేసినప్పటికీ - ఆ తరువాత గద్యంపై కూడా బలమైన పట్టుసాధించి మహారచయిత అనిపించుకొన్నారు. కథారచయితగా ఆయన స్పృశించని వస్తువంటూ లేదు. తనకాలంలో ఏ సమస్యలైతే విషనాగులై బుసలు కొడుతున్నాయో వాటన్నింటినీ తనకథల్లో చిత్రీకరించారు. చిత్రీకరిస్తూనే తగు రీతిగా వాటిముందు నాగస్వరం ఊదారు. బుట్టల్లో బంధించారు. కోరల్ని పెకలించటానికి కలాన్ని సూదిగా చెక్కారు. నిజానికి ఆయన కలంపట్టుకొన్న కాలంలో సమస్యలు ఒకటా ! రెండా ! ... అనేకం! వీరేశలింగం గారిని సమర్థిస్తూ వితంతు వివాహాన్ని ప్రోత్సహించటం ద్వారా - మానవత్వానికి కథకునిగా ఆయన మారాకు తొడిగారు. కులమతాల కుమ్ములాటల్లో కూలిపోతున్న ఒకానొక వ్యవస్థను బయటికి లాగాలని ముందు కురికారు. పరాధీనంలో ఉన్న కొన్నికొన్ని బ్రతుకులకు స్వయం ఉపాధి సందేశాన్ని అందించారు. కలిమిలేములు చూడకుండా - విలువ లెక్కడున్నా - వాటికి రాజాధిరాజులచేత హారతులు పట్టించారు. ఒక్క మాటలో చెప్పాలంటే కలాన్నే హలంగా చేసికొని, ఎన్నో పంటల్ని పండించారు. అనురాగాలు ఎలా ఉదయ సంధ్యల్ని పలకరిస్తాయో - ఆవేదనలు ఎలా సాయం సంధ్యల్లో కాలుతూ ఉంటాయో - అవన్నీ కథకుడిగా ఆయన చెప్పారు. తెలుగు వెలుగులు, గోదావరి గలగలలూ ఆయన కలంలోంచి జాలువారాయి.

* * *

ప్రధానంగా ఆయన కథల్లో కొసమెరుపు ఎంతగా తళుక్కుమంటుందో ఓసారి గమనిద్దాం.

" జోడు " అనే కథనే తీసికొందాం.

అనేకానేక పరాక్రమాల్లో భోజనాన్ని కూడా భేషుగ్గా చేర్చుకోవచ్చు. సంక్షిప్తీకరించి " భోజన పరాక్రమం " అంటే సరిపోతుందేమో ! ఎవడి'మేత' వాడు ఎంత మేసినా ఫర్వాలేదు. కాని దొరికింది కదా అని అదేపనిగా పరాయిమేత హద్దు పద్దూ లేకుండా లాగించినప్పుడే దాన్ని గురించి విశేషంగా చెప్పుకోవలసి ఉంటుంది. అక్కడ కొంత సంయమనం తప్పనిసరిగా అవసరమేమో అనిపిస్తుంది. అది ఏమాత్రం పాటించని తిండిపోతుల విషయంలో ఒక సంస్థానాధీశుడు ఎలా స్పందించాడన్నదే ఈ కథలోని కొసమెరుపు.

ఆ ప్రభువు పేరు కొచ్చెర్లకోట వేంకట రాయణింగారు. పెద్దపులి ముఖం కప్పుకొన్న గోవులాంటి వారాయన. చండ శాసనుడూ ఆయనే ! పరమదయా స్వభావుడూ ఆయనే ! సామాన్యునిలా కనిపించటానికి సందేహించని ఆదర్శ చక్రవర్తి ఆయన.

అటువంటి ప్రభువు ఏటేటా శివరాత్రికి పట్టిసంలో భారీ స్థాయిలో అన్న సంతర్పణం చేయిస్తుండటం ఆనవాయితీ. అందులో పదివేలమంది వరకు బ్రాహ్మణులే ఉంటారు. మరో పదివేలమంది ఇతరజాతులవారుంటారు. ఆసంతర్పణ భద్రకాళి సన్నిధిలో జరిగేది కాబట్టి బ్రాహ్మణోత్తముల జఠరాగ్ని చాలా ఉగ్రంగా విజృంభిస్తుందట. వడ్డించేవారు సైనికుల్లా ఉరకటానికి సిద్ధంగా ఉంటారట. వీటన్నిటికి తోడుగా అక్కడో విశేషముంది. భోంచేసేవాళ్ళని అడిగేదాకా తరమడం, అడిగిందే తడువుగా వొంచెయ్యడం - ఇదీ అక్కడి వ్యవహారం. చూడటానికి అదొక సంకుల సమరంలా ఉంటుంది.

అలాంటి సంతర్పణలో చూపులకు బక్కగా కనిపించే ఒక బ్రాహ్మణుడు కూర్చున్నాడు. పైకి ఈనెపుల్లలా ఉంటేనేం - రాశిపోసినా - ఇంకా రానిమ్మనే జఠరదీప్తి బాగా ఉన్నవాడు.

పంక్తిలోకి బూరెలు వచ్చాయి. అవి అలాటిలాటి బూరెలు కావు. ఒకోటి ఒకో ఫిరంగి గుండులా ఉంటుంది. అసలు వాటిపేరే వీసె బూరెలు. తూకంలో ఒకోటి వీసెకు తగ్గదంటే తగ్గదు.

ఆ బ్రాహ్మణుడు బూరెలు చిదపడం మొదలుపెట్టాడు.

దడదడ నాలుగు బూరెలు పడ్డాయి.

" చూసుకో ! పడాలి ... "

మరో రెండు దుమికాయి

" ఏమంటావ్ ? .... "

ఇదంతా ఆ బ్రాహ్మణుడికి పితలాటకంగా కనపడింది. పడవలసిన బూరెలలో ఇంకా సగమేనా పడలేదు. ఈ కొసరడం అతనికి విసుగెత్తించింది.

" ఆ మహారాజు భరద్వాజ విందు చేస్తూవుంటే వీళ్ళ సొమ్మేంపోయింది " అనిపించింది.

ఆగలేకపోయాడు ...

మొగం పైకెత్తి ఒక్క క్షణం ఎర్రగా చూసాడు.

ఉత్తరక్షణంలో " చాల్లేవోయ్ ! నేర్చుకుపోయావు .... " అంటూ గదుముతూ ఎడమ చేత్తో బుట్ట వొడిసి పట్టుకొని వొంచేసుకొన్నాడు.

అది చూసి కొందరు తెల్లపోయారు. ఇద్దరూ కలియబడతారని కొందరు జడిసి పోయారు.

ఇంతవరకు బాగానే ఉంది.

ఇక్కడే ఓ ప్రమాదకరమైన మలుపు నల్లత్రాచులా వంపు తిరిగింది. పాపం! ఆ బక్కమనిషి చెయ్యి కడుక్కొని తాంబూలం కోసం వెతుక్కుంటూ వస్తుండగా - తోడి బ్రాహ్మణుడు ఎదురుపడి - కొంపలు మునిగాయన్నంత భంగిమలో అతని రెక్కపట్టుకొని అక్కడే నిలదీశాడు.

" ఓరి నీబతుక్కాలా ! అంత మోటపని చేశావేమిరా ? ఆయనే రాయణింగారు. ఇక నీ పనికైతే ...." అంటూ అతని నెత్తి పై పిడుగులు కురిపించి చక్కా పోయాడు.

ఇక దానితో - ఆ బక్కమనిషి గుండెల్లో రైళ్ళు పరిగెత్తటం మొదలు పెట్టాయి. భుక్తాయాసం ఒక ప్రక్క పీడిస్తుంటే - భయంతో వచ్చిన ఆయాసం మరోప్రక్క అతన్ని బెంగలో పడేసింది.

" ఇదేం కర్మరా బాబూ .... " అనుకొంటూ పదేపదే వాపోయాడు. " ఏదో ఒకటి జరుగుతుంది ... ఇంటికి పోదాం ... " అనుకుంటే, ఆతరువాతే అసలైన వ్యవహారమంతా ఉంది.

అది - దొడ్డి సంభావన.

" భగవంతుడా నీవేదిక్కు .... " అనుకుంటూ ఆ బక్కమనిషి అందరిలోనూ కలిసిపోయి మెల్లగా అడుగులు వేయటం మొదలుపెట్టాడు.

" ఓపక్క రాయణింగారికి నేరుగా దొరికిపోతానేమో " అని ఆ బక్క మనిషి భయం.

వేరొక ప్రక్క రాయణింగారు - ఆవరసలో - అతనికోసమే ఎదురు చూడడం విశేషం.

ఎలాగైతేనేం ఆ భోజన పరాక్రమవంతుడు రాయణింగారి కళ్ళల్లో పడిపోయాడు. అది కూడా ఎలా ? ముఖం చూపించకూడదని లావుగా వున్న మరోబ్రాహ్మణుడి వెనకాలే నిలబడి సన్నగావున్న ఈ బక్క మనిషి చేయి మాత్రమే చాపాడు.

ఈస్థితిలో రాయణింగారు ఆ బక్కమనిషి చెయ్యి వొడిసి పట్టుకొని "నువ్వేకదూ బుట్ట వొంచేసుకున్నావూ ? ..." అని మొగం మీద మొగం పెట్టి వెనకా ముందు చూడకుండా అడిగేశారు. అంతటితో సరిపెట్టారా అంటే అదేమీలేదు. ప్రక్కనే ఉన్న గుమస్తాని " జోడు తేవోయి.... " అని ఆజ్ఞ జారీ చేసి కలకలం సృష్టించారు.

ఇది చెవిలో పడిందో లేదో ఆ బక్కమనిషి క్షణంలో తోట కూరకాడలా వాడిపోయాడు.

" చెప్పుల జోడా .... సంకెళ్ళజోడా...." అక్కడున్న వాళ్ళలో కంగారు పట్టుకొంది.

"బాబుగారి కాళ్ళమీద పడిపోరా ...." వెనుక నుంచి అన్నారెవరో...

"కడుపాత్రం కొద్దీ గడ్డి తిన్నాడు బాబయ్యా ... పిల్లలు కలవాడు ... రక్షించండి" అంటూ ఒక బ్రాహ్మణుడు ముందుకొచ్చాడు.

" బతిమాలుకోరా ... నోరు విప్పవేమిరా .... " అంటూ మరో బ్రాహ్మణుడు రుంజుకొన్నాడు.

ఎవరెన్ని అంటున్నా - ఆ బక్కమనిషి ఎలా వణికిపోతున్నా - రాయణింగారి ముఖ కవళికల్లో మాత్రం విధించబోయే శిక్షతాలూకు రూపం ఎలా ఉంటుందో లేశమైనా అవగతం కావటంలేదు.

గుమస్తా జోడు తెచ్చాడు.

రాయణింగారు కుడిచేయి చూపారు

జేబులోంచి గుమస్తా జోడు తీసాడు.

అందరికళ్ళూ జిగేల్ మన్నాయి.

చూడగా అది రత్నాలు తాపిన తొడుగు మురుగులజోడు.

చూసేవాళ్లకి - గుండె ఓ నిమిషం ఆగి - మళ్ళీ కొట్టుకొంటుందేమో అన్నంత కొసమెరుపు.

కథ ఇంతటితో అయిపోయింది.

దీని తరువాత మరోవాక్యం ఏది వ్రాసినా ఇంత పట్టు ఉండదు.

ఏవాక్యం వ్రాసి ముగిస్తే పాఠకుణ్ణి నిలబెట్టేయవచ్చో సరిగా అదేవ్రాసి కలం మూసేశారు శాస్త్రి గారు. పుస్తకాన్ని మూసేసినా ఆ ప్రభావం పాఠకుణ్ణి వదిలి పెట్టదు. పాఠకునికి మధ్యలో ఎక్కడా దొరక్కుండా - చివర్లో తనే ముడి విప్పటంతో - కథకుని గెలుపు ఎలా ఉండాలో శాస్త్రిగారు చెప్పకనే చెప్పినట్లయింది.

ఎవడిది వాడు తింటుంటే సహించలేని రోజుల్లో - పరాయివాడు ఎంతతింటే అంతగా మెచ్చుకొని సన్మానించే ఉదారచరితు లెక్కడుంటారు ? ఎక్కువగా ఉదర చరిత్రులేకదా ఈ లోకంలో !

* * *

ఒక పేదబ్రాహ్మణుని కక్కుర్తి కడుపు విషయంలో ఒక మహారాజుగారి ఔదార్యం అలా ఉంటే - మరొక మహారాజు గారి ఔదార్యాన్ని సవినయంగా చాతుర్యంగా తిరస్కరిస్తూ - తనక్కావల్సినంత మాత్రమే కోరుకున్న అంగవస్త్రధారుడైన ఒక బీద బ్రాహ్మణుడు ఈ కథలో కనిపిస్తాడు. అక్కడ రాజుగారు నాయకుడైతే, ఈకథలో ఈ బీద బ్రాహ్మణుడే నాయకుడు.

ఈకథలో " శ్రీపాదం" ఎలా సాగిందో పరిశీలిద్దాం -

ఒక అంగా(స్త్రపుగుడ్డ కట్టుకోవడానికి - మరొకటి కప్పుకోవటానికి, ఇదీ ఆ బీద (బ్రాహ్మణుని ఆహార్యం - ఆయనపేరు తంగిరాల శంకరప్ప. చదరంగంలో నిష్ణాతుడు. రాజుగారితో ఆడటానికి వచ్చాడు. ఓడిపోతే తలతీసికోటానికి కూడా ఏమీ ఆక్షేపణలేదని తెగేసి చెప్పిన రకం. అయితే రాజుగారు కూడా ఆ ఆటలో అగ్రతాంబూలం అందుకున్న సమర్థులే ! ఎంత సామర్థ్యం ఉందంటే - ఇక చదరంగం జోలికే పోకూడదని నిశ్చయించుకొన్నంత పాండిత్యం వారిలో ఉంది. దానికి కారణం - తగిన ఉజ్జీ దొరక్కపోవటమే. దీన్ని బట్టి రాజుగారి వైదుష్యం ఏపాటిదో ఎవరైనా అంచనా వేయవచ్చును. అయితే శంకరప్ప వేషాన్ని చూసి, రాజోద్యోగులు ఆయన్ని అమర్యాదగా, అనాదరంగా వెనక్కి పంపించేశారు.

ఆ అర్ధదిగంబరేశ్వరుని (జాషువాగారన్నట్టు) ప్రతిభ ఆనోటా ఆనోటా రాజుగారి చెవిని సోకింది. దానితో ఆ ప్రభువు తన దర్శనానికి రమ్మని శంకరప్పకు కబురు పంపిస్తారు. అప్పటికే శంకరప్పను గాఢంగా అభిమానిస్తున్న తత్త్వజ్ఞులు కొందరు " దర్శనం ఇప్పించమనక, దర్శనానికి రమ్మనడమేమిటోయ్ ... " అనుకొన్నారు. శంకరప్ప కూడ అంత పొగరుగా " నేను రాను ... నాకవసరం లేదు " అని పెంకితనంగా జవాబు చెప్పి ఊరుకున్నాడు.

ఆ తరువాత ఏమయిందో ఏమిటో తెలీదు. " మహారాజు గారు తమ దర్శనం కోరుతున్నారు ... " అంటూ ఒక సేనాధిపతి శంకరప్ప ఇంటి కొచ్చాడు.

" ఈ వేషంతో దేవిడిలో అడుగు పెట్టనిస్తారా " ! శంకరప్ప గత అనుభవాన్ని తవ్వితీస్తూ వ్యంగ్యంగా అన్నాడు.

" అందరూ తమ అడుగులికి మడుగులొత్తుతారు... " అంటాడు సవినయంగా ఆ సేనాధిపతి.

అలా కొన్నిరోజులుగా శంకరప్ప రాజుగారి సన్నిధికి వెళ్ళి వస్తూనే ఉన్నాడు. రాజుగారు మాత్రం ఆటలో ఎత్తు తోచక దిగాలు పడే పరిస్థితికి చేరుకొన్నారు. ప్రతి పర్యాయం శంకరప్పే గెలుస్తూ వచ్చాడు. ఓటమి రాజుగారి వంతయింది. అలాటి చదరంగ క్రీడా కారుని రాజుగారు మున్నెన్నడూ - చూడలేదేమో - ఆ ఆనందంలో - పెద్దాపురం సంస్థానంలో ఉన్న దేదైనా కోరుకొమ్మన్నారు. శంకరప్ప ఏ బహుమతీ అక్కర్లేదన్నాడు. "దేవేంద్రుని అధఃకరించే ఏలినవారితో ఆడటమే గొప్ప బహుమానం"

అన్నాడు. రాజుగారు కాదూకూడదన్నారు. శంకరప్ప చాలా చతురుడు. ఆటలోనే కాదు. ఆచితూచి మాట్లాడటంలో కూడా అపరబృహస్పతి.

" చదరంగానికి అరవై నాలుగు గదులు. మొదట గదిలో ఒక వడ్లగింజ, రెండో గదిలో దానికి రెట్టింపు. మూడో గదిలో దానికి రెట్టింపు. అనగా నాలుగు వడ్లగింజలు. ఇలాగ గదులు వెళ్ళిన కొద్దీ రెట్టింపు చేస్తూ వడ్లగింజలు దయచేస్తే నాకంతే చాలు ప్రభూ ! " అంటూ తన కోరికను విన్నవిస్తాడు శంకరప్ప. " చిత్తం ... మనం మళ్ళీ మధ్యాహ్నం కలుసుకుందాం. ... " అంటారు రాజుగారు. " చిత్తం జగత్ప్రభూ ! " అంటూ సెలవు తీసికొంటాడు శంకరప్ప.

రాజుగారు " దానికేముందిలే " అనుకొని దివాంజీని లెక్క పెట్టించుమని చెప్పి రాజగృహానికి వెళ్ళిపోతారు.

ఇక జాము పొద్దుంది అనగా - సభాభవనమంతా కిక్కిరిసిపోయి ఉంటుంది. అలంకరింపబడ్డ శంకరప్పను స్వయంగా రాజుగారే చెయ్యి పట్టుకొని సభలోకి తీసికొచ్చి సింహాసనం పై కూర్చుంటారు.

" వడ్లగింజలు లెక్కకట్టాను మహాప్రభూ ! వారు కోరిన కోర్కె తీర్చాలంటే పెద్దాపుర రాజ్యం చాలదు. జగత్ప్రభూ ! " అంటూ దివాంజీ ఉన్నవాస్తవాన్ని రాజుగారికి నివేదిస్తాడు.

ఈ విషయంలో కూడా ఓడిపోయిన రాజు గారు ఆశ్చర్యపోతూ "వత్సవాయి వారిలో ఎవరూ మాటతప్పి ఎరగం. మేము పెద్దాపుర రాజ్యమంతా తమకు దఖలు చేసికొంటున్నాము..." అంటూ తమ విశాల హృదయాన్ని ప్రకటిస్తారు రాజుగారు.

దానితో ఒక్కసారి సభలో అలజడి బయలుదేరుతుంది. ఎటు తిరిగి ఎలావస్తుందో అని అందరూ తలలుపట్టుకొని కూర్చుండిపోయారు.

ఇక్కడ - అంతవరకు జరిగిన కథలో ఉన్నట్లుండి ఓముక్తాయింపు వినిపిస్తుంది (జనశ్రుతిలో ఉన్న ఈ కథకు కల్పన, రచన మాత్రం నాది అంటారు రచయిత)

ఈ కొసమెరుపులో శంకరప్ప ఉదాత్తత ఏమిటో వ్యక్తమవుతుంది. చతురతలోనే సంస్కారాన్ని కూడా పండిస్తాడాయన. ఇక్కడ కూడ రాజుగారే ఓడిపోవాలి. అదీ అతని బుద్ధికుశలత.

" ఏలినవారు పెద్దాపుర రాజ్యంలో ఉన్నదేది కావలసినా నాకు దయచేయిస్తామన్నారు. కాని పెద్దాపుర రాజ్యమే దఖలు పరుస్తామని సెలవ్వివ్వలేదు..."

అంటూ శంకరప్ప తిరిగి గొల్లెం పెడతాడు.

దానితో సభలో మౌనం తాండవిస్తుంది.

" కనుక జగత్ప్రభువులవారు ఒక బ్రాహ్మణుడు నిర్విచారంగా జీవించడానికి తగినంత వృత్తి దయచేయిస్తే అదే నాకు మహామేరువు ... " అంటారు మళ్ళీ శంకరప్ప.

నిజానికి ఈ కథకు సంబంధించిన గొప్ప ముగింపు ఇదే ! ఇక్కడ పాత్రపరంగా ఉన్న గొప్పతన మేమిటంటే - అంతగా గెలిచిన శంకరప్ప - అత్యాశకు పోయి ఆరాజ్యాన్ని దఖలు పరుచుకోకుండా ఉండటం ఒక "ఎత్తు" అయితే తన ఆత్మాభిమానం పై ఏ చిన్ని నీలి నీడా పడకుండా జాగ్రత్త పడటం మరో ఎత్తు. ఈ వాక్యంలో ఒక్క పదాన్ని మాత్రం మనం గుర్తించాలి. శంకరప్ప తను బ్రతకటానికి తగ్గట్లుగా ఏదో 'వృత్తి ' అనుగ్రహించమన్నాడే తప్ప - ఉచితంగా దేన్నీ ఆశించలేదు. దీనితో శంకరప్ప నిజంగా మహామేరువై మరీ ఎదిగిపోయాడేమో అనిపిస్తుంది. ఆత్మాభిమానానికి ఆవలి ఒడ్డును చూపించాడేమో అనిపిస్తుంది - " వృత్తి " అనే పదప్రయోగం ద్వారా.

* * *

రాజు తరువాత రాజు అంతటివాడు దివాన్. రాజు పేరుకే కాని మంత్రాంగాలు, యంత్రాంగాలూ, అన్నీ దివాంజీ చూసుకోవలసిందే. దివాన్‌ని "దివాంజీ" అని పిలిచేవారు ఆరోజుల్లో. రాయణింగారి దగ్గర ఎందరో దివాన్‌గిరీ వెలగబెట్టినవారే. ఆ దివాన్ క్రింద మరో కీలకమైన ఉద్యోగి ఉంటాడు. దివాన్‌కి ఎప్పుడు ఎసరుపెడదామా అనే అతను చూస్తుండేవాడు. ఆ దివాన్ గురించి ఉన్నవో లేనివో చెప్పి ఆ తాళం చెవి తమ చేతికి వచ్చేవరకు నిద్రపోయే వారు కాదు ఆ బాపతు ఉద్యోగులలో కొంతమంది. ఇవ్వేళ్టికీ కొన్ని కొన్ని ప్రభుత్వాలలో అదే జరుగుతోంది.

ఈ ఇతివృత్తాన్ని తీసికొని శాస్త్రి గారు " లీగల్ ఎడ్వయిజ్ " అనే కథను వ్రాశారు. కథనంలో ఎంత నేర్పు చూపించారో - అంతగానూ కథను ఎత్తుకోవటంలో గాని, ముగించటంలో కాని దీటైన పనితనం ప్రదర్శించారు.

ఇదీ రాయణింగారి చుట్టూ తిరిగిన కథే ! ...

రాయణింగారి ఆస్థానంలోనూ దివాన్లు చాలామంది మారుతూ వచ్చారు. అందరూ ఘటికులే. దివాను క్రింది ఉద్యోగులు అవసరాల్ని బట్టి అడుగులకు

మడుగులొత్తుతూ నటించే వాళ్ళు కొందరైతే - అసూయతో కళ్ళల్లో నిప్పులు పోసికొని ఏకంగా దివాన్‌గిరికే అంతం పాడిన వాళ్ళు కొందరున్నారు. ఈ పరంపరలో "కామన్న" అనే దివాన్ రాయణింగారికి నమ్మినబంటులా ఉండేవాడు. ధైర్యం కలవాడే కాదు, ఎంతటి వాడికైనా చురక అంటించటంలో దిట్ట. అదేమిటో కథలో మీకే తెలుస్తుంది.

ఓసారి రాయణింగారు - ఉద్యోగులమాటలు విని కామన్న కార్యాలయానికి వస్తారు. కొండెములు చెప్పేవాళ్ళ గురించి దివాన్ దగ్గర ప్రస్తావించాలన్నది రాజుగారి ఉద్దేశ్యం.

" కామన్నా! ..... "

" ఏమి సెలవు మహాప్రభూ ! ...... "

" కాసికలు చెప్పేవాళ్ల నేమిచెయ్యాలోయ్ ? .... " రాయణింగారు దివాంజీని ప్రశ్నిస్తారు. దివాంజీ సమాధానం ఎలా ఉందో చూడండి. అదే ఇక్కడ ముక్తాయింపు. రాయణింగారు చెప్పుడుమాటలు వింటున్నారని కామన్నకు ఎప్పుడో తెలుసు. ఎక్కడా దొరక్కుండా ఎవరికి తగలాలో వారికే తగిలేలా ఆ కామన్న చెప్పిన జవాబులో ఎంత చాకచక్యం ఉందో మనం ఇక్కడ గ్రహించాలి.

కామన్న చెప్పిన సమాధానం ఇది " ఆ! ఏముంది బాబూ ! వినేవాడి చెవులు తెగ్గోస్తే సరి ... "

దీనితో అక్కడ క్రింది ఉద్యోగి అప్పలనరసయ్య తుళ్లిపడి చూశాడు.

ఇక రాయణింగారు బిగపట్టుకొన్న ఊపిరి విడిచి బుర్రవంచుకొని వచ్చిన దారినే చక్కాపోవటం తప్ప మరేమీ చేయలేకపోయారు.

ఇక్కడున్న ముగింపులో బిగింపు - ఎంతగా చురుక్కుమని తగిలిందో మనకూ అనుభవంలోకి వస్తుంది. ఇక్కడ సమయస్ఫూర్తి ఒక్కటే కాదు. మందలింపు కూడా కనిపిస్తుంది.

* * *

సుబ్రహ్మణ్య శాస్త్రిగారు సంస్కరణశీలి. మానవత్వాన్ని మంటల్లో విసిరేసే ఏ సంప్రదాయాన్నయినా కథకునిగా ఆయన తూర్పారబట్టారు. ఆదిశగా ఎన్నో సమస్యలపై ఆయన కథలు వ్రాశారు. " అస్పృశ్యత " కూడా శాస్త్రి గారిని బాగా ఇబ్బంది పెట్టిన సమస్యలలో ఒకటి. ఆయన జీవించిన కాలంలో మనుష్యుల్లో సైతం

నిప్పు కడిగే రకాన్ని చూశారు. శూద్రుల ఇళ్ళల్లో " చల్ల " కొనుక్కొని దానిపై పసుపు నీళ్ళు " చల్ల " కుండా వాడుకోని ధోరణుల్ని ఆయన చూశారు. సహించలేక పోయారు. ఆ నేపథ్యంలోంచి పుట్టిందే " మాదిగపల్లె " కథ. మాదిగలను మనుషుల్లా ఎందుకు చూడటం లేదన్నదే ఆయన ఆవేదన. ఆ ప్రయత్నంలో సరాసరి మాదిగల మధ్యనే కాపురం చేయటానికి కథకునిగా ఆయనో పాత్రను పంపిస్తారు. ఎవరికన్నా చెప్పేముందు తను ఆచరించి చూపించినప్పుడే కదా అది మార్గదర్శకమవుతుంది. ఆ ఆశయం నెరవేరాలంటే ఆ ప్రయాణంలో - ఎవరెదురుపడ్డా - ఎవరేమనుకొన్నా త్రోసి రాజనాలి, అంతే.

ఒకానొక సందర్భంలో ఒక సంస్కరణ శీలి - గర్భవతిగా ఉన్న తన భార్యను తీసుకొని రెండెడ్ల బండిపై రాజమండ్రి బయలుదేరతాడు.

రోడ్డు సరిగా లేదు.

సరిగా లేదనటం కంటే - అసలు ఆబాట ఇంతవరకు కంకర మొగమే చూడలేదని చెపితే సబబుగా ఉంటుంది. ఇక ఆదారి ఎలా ఉంటుందో అర్థం చేసికోవచ్చు. పైగా పర్వతాల్లాటి ఎడ్లు వైతరణిలో ఈదులాడుతున్నట్లు కష్టంగా బండిని లాగుతున్నాయి.

ఆ పరిస్థితిలో - అతని కంటిలో ఓ దృశ్యం పడింది.

పాతిక సంవత్సరాల మాదిగ స్త్రీ - ఎనిమిదో నెల గర్భంతో - జ్వరంగా ఉన్న నాలుగేళ్ళ పిల్లను వెంటపెట్టుకొని అతికష్టం మీద నడుస్తోంది. మధ్య మధ్య నడవలేని దైన్యంతో ఆ చంటిపిల్లను ఎత్తుకోవటం ఒకటి...

ఈ దుర్భర దృశ్యాన్ని ఆ దంపతులిద్దరూ చూడలేకపోయారు. స్వయంగా గర్భవతిగా ఉన్న సంస్కరణశీలి భార్య మరీ బాధపడసాగింది. భర్త హృదయం దూసుకుపోయేటట్లుగా అతనికేసి తీవ్రంగా ఓసారి చూసింది. ఆ వెంటనే ఆమాదిగ స్త్రీ ని బండెక్కమంటుంది. ఆ సంస్కరణశీలి చెయ్యి పట్టుకొని ఆమెను ఎక్కించి పిల్లను కూడ అందిస్తాడు. ఇదీ కథకు కొసమెరుపు. ఇంతటితో కథ అయిపోతే అయిపోవచ్చు. కానీ, ఆవ్యక్తి తన చోటును ఆ తల్లికీ పిల్లకీ ఇవ్వటంతో (ఎడ్లు మరింత బాధపడతాయేమోనని) కాలినడకన వారిని అనుసరిస్తాడు. ఇది ముగింపులో మరీ బిగింపును సమకూర్చి పెట్టింది.

ఆ మాదిగస్త్రీ ఎంతో సంతోషించింది. ప్రాణం లేచి వచ్చినంతగా కుదుట పడింది. ఆ సంతోషంలోంచి - ఆ సంస్కరణశీలి భగవంతుణ్ణే చూసి ఉండవచ్చు.

తనకు కలిగిన దానిలో ఏదో ఇంతపడేసి ఊరుకోవటమో లేక అస్పృశ్యుల్ని వెళ్ళి తాకటమో - ఇవేకావు సంస్కరణ సూత్రాలు. దాని పైస్థాయిలో ఆచరణాత్మకంగా స్పందించి మానవీయ మూల్యాలతో దీపాల్ని వెలిగించాలి. ఇదీ ఇక్కడ ముగింపును అంటి పెట్టుకొని వచ్చిన ప్రబోధం.

* * *

చివరిగా

" వట్టి పట్టుదల తప్ప ఏమీలేదు " అనే కథ దగ్గర ఆగిపోదాం.

ఈ కథలో - మూడు చెరువుల నీళ్ళు త్రాగించే ముక్తాయింపు ఉంది.

రామశాస్త్రి గ్రాంధిక భాషావాది. గ్రామ్య భాషపేరు చెపితే చాలు - అతనికి ఒంటిపై తేళ్ళూ జెర్రెలూ ప్రాకినట్లుంది. సత్యవతి పేరుతో అప్పటికే ఒకామె గ్రామ్య భాషలో కథలని వ్రాస్తూ చాలామందిచేత 'శహబాష్' అనిపించుకుంటోంది. అసంఖ్యాక పాఠకులు ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. పైగా రామశాస్త్రి చేసిన విమర్శలకు ఆమె దీటుగా సమాధానాలు పత్రికలలో ప్రకటిస్తూ వచ్చింది. కొందరు పాఠకులు శాస్త్రిని తప్పుపట్టే విషయంలో కూడా వెనుకాడలేదు. ఇదంతా రామశాస్త్రికి తల కొట్టేసినట్లుగా ఉంది. అప్పటికే తను ఎన్నో సభల్లో ప్రముఖంగా పాల్గొన్న అనుభవం ఉంది. ఉపన్యాసాలతో ఊరూవాడా ఊదరకొట్టేసిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. భార్య రుక్మిణి ఈ విషయంలో ఏదో అంటే " ఆడాళ్ళకేం తెలుస్తాయి ఇలాంటి శాస్త్రీయ విషయాలు " అంటూ ఒక్కమాటలో కొట్టిపారేశాడు. మరోసారి "ఆభాషని కూడా చాలామంది అంగీకరిస్తున్నారు కదా ! మీరు కూడా అంగీకరించరాదా!" అంది ఆమె. దానిమీద రామశాస్త్రి విశృంఖలంగా విరుచుకుపడ్డాడు. " నీ ముఖం నీకేం తెలుసు" అంటూ ఎడా పెడా వాయించేశాడు.

చివరికి ఆ సత్యవతికీ, ఈయనికీ పెద్దలు ఓ సభ ఏర్పాటు చేస్తారు. రామశాస్త్రి తను ఓడిపోతే ఇచ్చిన ఉపన్యాసాలూ, వ్రాసిన వ్యాసాలు వెనక్కి తీసేసుకొని వ్యావహారిక భాషలోకి దిగుతానంటాడు.

అక్కడికీ ఉండ బట్టలేక " ఆడపిల్లతో మీకు వాదం ఏమిటండీ ... ఓడినా కష్టమే ... నెగ్గినా కష్టమే ... మానెయ్యి రాదటండీ " అంటుంది భార్య.

" నీకేం తెలుసు నా సంగతులు. నిమిషంలో నేనే గెలుస్తాను. చూడు..." అంటాడు రామశాస్త్రి .

"అయితే నేనూ వస్తాను. సభకి. ఈ వీధి వాళ్ళంతా వెడతారట ఆడాళ్లు. " అని ఆమె ఎంతో ఉత్కంఠతో, ఆశతో భర్తను ప్రాధేయపడుతుంది.

" సభలోకి రాదగ్గ పెళ్ళానివా యేమిటి నువ్వు ... " అని కించపరుస్తాడు. చివరికి " సరే " అని ఒప్పుకొంటాడు.

సభ మరి కాస్సేపట్లో మొదలుపెడతారనగా రామశాస్త్రికి ఎదురుతిరిగిన ఆ సత్యవతిని చూడాలంటూ అదే పనిగా పదిమంది కేకలు పెడతారు.

" ఆమె కులస్త్రీ ... ఇక్కడికి వచ్చేవుంది. సమయం వచ్చినపుడు మీకందరికీ కనపడుతుంది. అంతవరకు శాంతించాలి ... " అని నిర్వాహకులు సర్ది చెప్పారు.

రామశాస్త్రి అనుకున్న ప్రకారం తన వ్యాసాన్ని చదివి వినిపిస్తాడు. స్వపక్షం మెచ్చుకోగా విపక్షం పెదవి విరిచేసింది. సత్యవతి వ్రాసిన వ్యాసాన్ని మాత్రం సభకు సంబంధించిన సెక్రటరీ చదివాడు. దీనికి వ్యవహార భాషావాదులు " బలే " అని మెచ్చుకొంటే, రామశాస్త్రి వర్గం వాళ్ళు మాత్రం తమకు " అపజయం తప్పదేమో" అని శంకించారు.

నిబంధన ప్రకారం రామశాస్త్రి రెండో అంశంగా ఆశువుగా వాదం ప్రారంభించాడు. గంటసేపు గుక్కతిప్పుకోకుండా వాదించాలనుకున్న శాస్త్రి - కేవలం పదే పది నిమిషాల్లో ముగించి భరతవాక్యం పలికేశాడు. దానితో సత్యవతిని ఇకనైనా వేదికమీదకు రమ్మని సభ గగ్గోలు పెడుతుంది. తప్పేది లేక ఆమె శిరసువంచి శాస్త్రి ముందు నిలబడి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తుంది.

శాస్త్రి తలయెత్తి చూశాడు.

ఆశ్చర్యం !

ఎవరోకాదు ! ఆమె తనభార్యే ... రుక్మిణి ...

సత్యవతి కలంపేరుతో పాఠకులను ఆకట్టుకున్న రుక్మిణి ...

(ఆతరువాత - వ్యావహారికాన్ని ఆదరిస్తున్నానని చెపుతూ - ఓటమిని అంగీకరిస్తాడు శాస్త్రి)

ఈ ముగింపు రామాశాస్త్రిలోనే కాదు ! పాఠకునిలో కూడా తట్టుకోలేనంత ఒత్తిడిని కలిగిస్తుంది. ఒక్కసారిగా చదువరి " ఏం రాశాడురా " అనుకోకుండా ఉండలేడు.

ఇలాగే ఈ కోణంలో " ముగింపులో బిగింపు " చూపించిన ప్రత్యే"కథలు" ఇంకా ఉన్నాయి. పాఠకుడు పట్టుకోకుండా ముగింపు ఇవ్వటంలో కథకునికి ఎంతో నేర్పు ఉండాలి. పనితనం పల్లకీ ఎక్కాలి. ఇవన్నీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిలో పుష్కలంగా నూటికి నూరుపాళ్ళు ఉన్నాయి. ఉండటమే కాదు ! ఆలక్షణాలన్నింటికీ ఆయనే అలంకారంగా ఉన్నారు. అందుకే ఇప్పటికీ శ్రీపాదాన్ని పాఠకనేత్రాలు కనులకద్దుకొంటూనే ఉన్నాయి. (ఈ వ్యాసం అదనంగా చేర్చబడింది)

(- పి. రాజేశ్వరరావు గారు ఎంతో కష్టపడి సంకలనం చేసిన " పుల్లంపేట జరీచీర కథల సంపుటంలో కొన్ని కథలు వరకు మాత్రమే ఈ వ్యాసం పరిమితం)

- రసరాజు
ఎల్.ఐ.జి. 177, హౌసింగ్ బోర్డు కోలనీ,
తణుకు - 534 211.
ఫోన్ : (08819) - 224252,
సెల్ : 94403 88659

అనిర్వచనీయమైన మాధుర్యం

కథా వస్తువు ఏదైనా కానీండి. అది బరువైనదీ క్లిష్టమైనదీ మాత్రం అయివుండదు. హఠాత్సంభవమైన అపూర్వ సన్నివేశాలు లేవు. మొదటి నుండి తుది వరకు వారి కథాగమన మార్గము పరిపుల్ల భావమృదుసుమ విరాజితము. ఈ పూలబాటను మనము నడుస్తాము. ఎక్కడికి పోతున్నామో తెలియదు. అందుకని ఉత్సాహముగాని, చదవాలనే ఆసక్తిగాని తగ్గదు. ఏదో అనిర్వచనీయమైన మాధుర్యము మనలను సంతృప్తి పరుస్తూ ఉంటుంది. ఏదో ఆనందంలో మునిగి తేలుతూ ఉంటాము. ఏదో మధురధ్వని మనలను ముందుకు ఆకర్షిస్తూ ఉంటుంది. కథాంతం వరకూ మన అనుభూతి ఇల్లాగే ఉంటుంది. వీరి చిన్న కథలన్నీ, పెద్దకథలే. కాని ఎంత పెద్దకథ అయినా చదివిన తరువాత అదిమనకు చిన్నకథే అనిపిస్తుంది.

- మునిమాణిక్యం నరసింహారావు

(శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి షష్టి పూర్తి కృష్ణా పత్రిక, 24-3-1956.)

సంస్థానాల కథలు

-ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు భౌతికంగానే కాదు; తెలుగు కథా రచయితల సమాజంలో కూడా చెయ్యెత్తు మనిషి

చాలామంది దృష్టిలో ఆయన వితంతువివాహసమస్యను చిత్రిస్తూ, ఎక్కువగా కథలు వ్రాసిన రచయితగా ముద్రపడ్డారు. శాస్త్రిగారి రచనా సర్వస్వాన్ని పరిశీలిస్తే ఇది పాక్షిక అభిప్రాయంగా తేలిపోయింది.

' ఇలాంటి తవ్వాయి వస్తే ' 'షట్కర్మయుక్త' 'గూడు మారిన కొత్తరికం' - 'శుభికే, శిర, ఆరోహ' 'తాపీ మేస్త్రి రామదీక్షితులు బి.ఏ' - వంటి కథల్లో విభిన్న సాంఘికేతివృత్తాల్ని తీసుకొని కథలు వ్రాయడం ఒకవైపు చేస్తూ - మరొక వైపు ఆంధ్ర దేశంలోని వివిధ సంస్థానాల పరిధిలో జరిగి - దంత కథలుగా జనం మధ్య ప్రచారంలో వున్న ఇతివృత్తాలు తీసుకుని, శాస్త్రిగారు జీవవంతమైన కథన చాతుర్యంతో రచనలు చేశారు. వీటిలో వాతావరణ కల్పన, ఆయా పాత్రల స్ఫుటమైన వ్యక్తిత్వచిత్రణ, సంభాషణల అల్లిక. వాటిలో దర్పాలు, ఆత్మాభిమానాలు, ఎత్తిపొడువులు, రాచమర్యాదలు, 'ప్రోటోకాల్' అనబడే ప్రవర్తనాసరళి, భాషలో చురుకు - చదువరుల్ని ముగ్ధుల్ని చేస్తాయి. వీటన్నిటిని ఆవరిస్తూ శాస్త్రి గారి విశిష్టకథనశైలి, ఒక కాంతి పరివేషాన్ని వహిస్తోంది.

శ్రీపాదవారి చారిత్రక కథల్లో ప్రసిద్ధమైన కొన్నింటిని పరిశీలించడమే ఈ ప్రసంగం ముచ్చట.

పెద్దాపురం సంస్థానం నేపథ్యంలో నడిచిన కథలు - 'వడ్లగింజలు' 'గులాబీ అత్తరు' 'ప్రత్యక్షశయ్య'

'రాచపీనుగు తోడులేకుండా వెళ్లదు' అనే రచన, ఆంధ్ర రాజుల్లో ప్రస్తుతం నాలుగు గోత్రాల వారే ఉండడానికి కారణం చిత్రించే కథ.

బధిరాంధకం జమీందారీలో నడిచిన కథగా చిత్రించిన 'చలి చీమలు ' అన్యాపదేశంగా సామాన్య ఉద్యోగుల బలం చెప్పిన రచన - కల్పితం.

'జోడు' అనేది, కొచ్చెర్ల కోట జమీందారుల పోలవరం సంస్థానం పరిధిలో జరిగిన ఒక చమత్కార ఘటన ఆధారంగా నడుస్తుంది.

'విమానం ఎక్కబోతూనూ' - అనేకథ, బొబ్బిలి యుద్ధ సంరంభం నేపథ్యంలో వెలమవీరుల మానసాన్ని ఆవిష్కరిస్తుంది.

దుప్పలపూడి సామ్రాజ్యాధినేతగా పుల్లంరాజుగారు ఎదుర్కొన్న రెండు సామాజిక సమస్యల్ని చిత్రించేవి. పుల్లంరాజు-1, పుల్లం రాజు - 2. ఈ రెండూ అన్యాపదేశంగా, బ్రిటీష్ ఇండియాకాలం నేపథ్యంగా చేసిన కల్పనలు.

మా రామచంద్రపురం సంస్థానం పరిధిలో జరిగినదంటూ వ్రాసిన 'శ్మశానవాటిక' నవల గనక, ఈ ప్రసంగంలో స్పృశించడంలేదు.

శాస్త్రిగారి చారిత్రక కథలు - లేదా సంస్థానాలకథలలో మకుటాయమాన మైనది "వడ్లగింజలు".

తంగిరాల శంకరప్ప అనే చతురంగ క్రీడా చతురుడు పెద్దాపురం శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మగజపతి మహారాజులుం గారితో చదరంగమాడి, గెలిచి, ప్రశంసలందుకోవాలని వచ్చి పూటకూళ్లమ్మ ఇంట్లో మకాం చేస్తాడు. ఉత్సాహంగా కోటకు వెళ్లిన అతనికి ఠాణేదారు నుంచి, దివాన్జీ నుంచి అవమానాలే చేదు అనుభవాలుగా మిగులుతాయి. నిస్పృహకు గురైన శంకరప్పని పూటకూళ్ళమ్మ ఉత్సాహపరిచి ఉపాయం చెప్పింది. ముందుగా ఉళ్ళోపడి తిరిగి, కొమ్మలు తిరిగాయని పేరుపడిన వారిని 'ఆటకట్టు' చేయించమంది. పెద్దాపురంలో ప్రతీ ఇంట సాగే చదరంగం వంటి ఆటల వ్యసనాన్ని వివరించింది. ఉన్న పాటునే ఒక్క ఉరుకు ఉరికి శంకరప్ప పనిలో పడ్డాడు. తొలినాడే శాస్త్రి, యాజులు అనే ఇద్దరు పరిచితులై ఆప్తమిత్రులైపోయారు.

క్రమంగా శంకరప్ప దూర్వాసుల ఆదివరాహమూర్తి వంటి అగ్రగణ్యుల్ని తలవొంపించాడు. శంకరప్ప జైత్రయాత్రా పరంపర వార్త మహారాజు చెవినిపడింది. నడుమ నడిచిన రాజకీయం కూడా ఎరుకపడింది. దాట్ల అప్పలనరసింహరాజు లోగిట్లో శంకరప్ప సామర్ధ్యానికొక అగ్నిపరీక్షకూడా జరిగింది.

మాసాలకు మాసాలు ఒకరిగురించి ఒకరు వింటున్న శంకరప్ప - మహారాజు ఎదురెదురుపడి చదరంగం ఆడిన దశల చిత్రీకరణ, పతాక సందర్భం - శాస్త్రిగారి అపురూప మనస్తత్వ విశ్లేషణశక్తి, రాచమర్యాదలు, పరీక్షా సమయాలు ఈ కథలో చదివి మాత్రమే పరవశించదగిన సందర్భాలు.

శాస్త్రి, యాజులుతో పాటు మనం సమ్మోహపడే మరి రెండుపాత్రలు రంగనాయకి, అలివేణి అనే వేశ్యలు.

రాజు ఓటమికి దారితీసిన ఘట్టాన్ని శాస్త్రిగారు చిత్రించిన తీరు అమోఘం.

రాజుగారు శంకరప్పని హుటాహుటి తీసుకురమ్మని జగ్గప్పని పంపారు. ఆ పంపడం పల్లకినికాక గుఱ్ఱం ఇచ్చి పంపారు. శంకరప్ప ఆలోచించి, చిరునవ్వునవ్వుకుని - 'జగ్గప్పా , శంకరప్ప ఏనుగెక్కేకాని గుఱ్ఱమెక్కి వెళ్లడోయ్ " అని తిరస్కరించాడు.

అసలుకిటుకు అక్కడే వున్న రంగనాయిక కనిపెట్టింది. " గుఱ్ఱం కదిపితే, ఏనుగుతో తెరచి రాజవుతుందని - ప్రభువ్వారు కనిపెట్టలేకపోయారని .... "

వడ్లగింజల కిటుకు ఇది : చదరంగం 64 గళ్ళలో మొదటి గదిలో ఒక వడ్లగింజ రెండులో రెండు; మూడులో నాలుగు; నాలుగోగదిలో ఎనిమిది - ఇలాగ వెళ్ళేకొద్దీ రెట్టించుకుంటూ గింజలు పెట్టాలి.

ఇలా పెడితే, శంకరప్పకు మహారాజు ఇవ్వదేలిన ధాన్యం - త్రిలింగదేశం అంతా నూరు సంవత్సరాలు పండించిన పంటకు మించినది. ఈ లెక్క ఎంత ఆశ్చర్యావహమో, శాస్త్రిగారు చిత్రించిన శంకరప్పపాత్ర అంత సమ్మోహకరం - తెలుగు సాహిత్యంలో ఒక గంభీర కావ్యాని కుండే గౌరవం ఈ కథకు ఉంది. ఈ కథనశిల్పం అటువంటిది.

'వడ్లగింజలు'తో పోలిస్తే మిగిలిన కథలు చిన్నవి.

'గులాబీ అత్తరు' కథలో దివాన్జీ మహామొరకు - ఠాణే దారే కాస్త మెత్తన,

షకురల్లీఖాన్ అనే అత్తరు వర్తకుడు పెద్దాపురం మహారాజుగారికి గులాబీ అత్తరు మిక్కిలి ప్రీతిపాత్రమని తెలిసి కాశ్మీర జాతి గులాబీలను వాడి, ఒకే ఒక్కతులం పరిమాణంలో - రెండేళ్లపాటు కష్టపడి తయారుచేసి తెచ్చాడు. ఎంత ప్రయత్నించినా, రాజదర్శనం కాకుండా దివాన్జీ గోడలాగ అడ్డునిలబడ్డాడు. ఖాను విసిగిపోయాడు.

చివరకు ఠాణేదారు సలహా ప్రకారం - నాలుఘ్ఘడియలవేళ - మహారాజు పంచకళ్యాణి మీద కొండల్లోకి షికారు వెంచేసేవేళ కోట ప్రాకారం దగ్గర - వారి కళ్ళబడడానికి నిశ్చయించాడు.

మళ్లీ కోటలో ప్రవేశించాలనే ప్రయత్నం భగ్నమైంది. ఖాను కళ్లెర్రబడ్డాయి. గులాబీ అత్తరుసీసా పైకి తీసి - కోటగోడకు విసిరికొట్టాడు. సీసా భళ్ళుమంది - గాలినిండా అత్తరు పరిమిళం. సరిగ్గా అదే సమయంలో రాజు పంచకళ్యాణిమీద అరకంట సొక్కివున్నాడు.

ఖాన్‌కి రాజదర్శనమైంది.

గులాబీ అత్తరు పరిమళం గాలి పాలైంది. ఈకథ మొత్తం ఒక రసిక కళాశీలి ఉద్విగ్న హృదయావిష్కారం. ఇది పరిమళభరితమైన విషాదకథ. అరసికులైన కార్యనిర్వహణ దక్షుల కారణంగా సున్నితమైన కళాశీలుర హృదయా లెలా గాయపడతాయో మనం గ్రహించవచ్చు.

పెద్దాపురం రాజాస్థాన కథల పరంపరలో మూడవది - ప్రత్యక్షయ్య.

బులుసు రామగోవిందశాస్త్రి అనే పౌరాణికుడు, మహారాజావారి దర్శనం చేసి, తన విద్య ప్రదర్శించాలని చేసిన ప్రయత్నాలకు దివాన్జీ తొలి అవరోధకుడు కావడం సూత్రప్రాయంగా ఇతివృత్తం. అయితే ఇతగాడి అదృష్టవశాత్తు దివాన్జీ కచేరీ సావడికి పక్కగదిలోనే మహారాజు, ఆ రోజు మిత్రులతో దశావతారీ ఆడుతున్నాడు. కనుక రామగోవిందశాస్త్రి దివాన్జీ సాగించే సంభాషణ ఆయన పూర్తిగా విన్నాడు.

ఈ కథలో దివాన్జీని ఎదుర్కోవడంలో రామగోవిందశాస్త్రి చూపించిన కొంటెతనం, లౌక్యం, మాటనేర్పరితనం, పాండిత్య ప్రగల్భత శ్రీపాదవారు మహాఘటికులై చిత్రించారు. మాటకిమాట, ఎత్తుకు పైఎత్తు... వినయం కనబరుస్తూనే, ఎలా నడపవచ్చో శాస్త్రిగారి వద్ద ఎవరైనా నేర్చుకోవాలి.

ఈ కథలో మనల్ని ఉర్రూతలూగించే సన్నివేశం - రామగోవిందశాస్త్రి, ఇటు అక్షరజ్ఞానంగాని, అటు సంగీతశ్రుతి జ్ఞానం గాని ఏమాత్రం లేని పిల్ల చామరగ్రాహిణి చేత శ్రావ్యంగా రేగుప్తి రాగం పాడించడం; ఆమె చేత, మహాభారతంలో ఊరుభంగం - దుర్యోధన గదాయుద్ధఘట్టం - చదివిస్తూ తాను వివరిస్తూ - రామగోవిందశాస్త్రి పురాణప్రవచనం చేస్తూ - ఇంద్రజాల విద్యలోలాగా అక్కడి రాచవారినందరినీ యుద్ధోన్ముఖులను చేసివేసిన సందర్భం.

రాజు ఆశ్చర్యచకితుడైపోయి, శాస్త్రితో అన్న చివరిమాట. " మహానుభావా! తమరు మానవమాత్రులుకారు. ఆ సమయంలో తమ రక్కడే ఉండి వుంటే సుయోధనుడు భీముణ్ణే కాదు, కృష్ణుణ్ని కూడా చితకబొడిచేసి ఉండును "అని. అదీ - నిజంగా జరిగిన సంఘటన అని శ్రీపాదవారు నొక్కి వక్కాణించారు.

' రాచపీనుగు తోడు లేకుండా వెళ్లదు' అనేకథ వీటికి భిన్నమైనది. కుతూహలకరమైన కారణా న్నొకదాన్ని విశదంచేసేది.

పుట్టిపెరిగిన చోట 'లొగసాను'రాగా డబ్బూ, పదవులూ, సంపాదించుకోవడం కోసం గోత్రానికొక కుటుంబం చొప్పున అయిదు గోత్రాల క్షత్రియులు దేశం విడిచి బయలుదేరారు. ప్రయాణాలు సాగించి, సాగించి కడకొక నవాబు రాజ్యం చేరారు. అది భోగభాగ్యాలరాజ్యం. యోధాగ్రేసరులరాజ్యం.

వారు నవాబు దర్శనం చేసి తమ ప్రతాపాలు వల్లెవేశారు. అందులో ముఖ్యమైన ప్రకటన - రాచపీనుగు తోడు లేకుండా వెళ్ళదని - అంటే, రాచబిడ్డ ద్వంద్వ యుద్ధమే సంభవిస్తే, ఎదిరివీరుణ్ణి నేలకూల్చిన తరువాతనే ప్రాణం విడుస్తాడని.

నవాబు ఈ ప్రతిజ్ఞకు చకితుడై పరీక్ష పెట్టాడు. ఒక గోత్రానికి చెందిన క్షత్రియుడు తన ఇద్దరు కొడుకులలో పెద్దవాడిని పణం పెట్టాడు. ప్రతివీరుడైన సర్దారు కంటె అతడు ముందే నేలకొరిగి ఆ తండ్రికి తలవంపు తెచ్చాడు. క్షత్రియుడు తన భార్యను నిలదీశాడు. ఆ బిడ్డ కొంతకాలం దాది పాలతో పెరిగాడని చెప్పింది. రాచ తండ్రికి పౌరుషం వెల్లువై రాజసభకు వచ్చి, వంశాంకురమైన రెండవ బిడ్డను పణంపెట్టి ప్రతిజ్ఞ నెరవేర్చు కున్నాడు. అతని వంశం అంతరించింది.

అయితే ! ఆ రాచవారిలో మిగిలిన అందరికీ జాగీర్లూ, పదవులూ, సంపదలూ వచ్చాయి. ఆమీదట ఆంధ్ర క్షత్రియులలో నాలుగు గోత్రాలవారే మిగిలారట.

ఈ రచన రాచపౌరుషం మూర్తీభవించిన కథ. నవాబు దర్బారుకు రాచవారు చేరిన దృశ్యం శ్రీపాదవారు ఉద్రిక్తంగా వర్ణిస్తారు.

'చలిచీమలు' కథ ఒక విధంగా, పాలకుడి ఉనికికి ఉద్యోగుల సామరస్యం ఎంత అవసరమో తెలియ చెపుతుంది. బలవంతమైన సర్పం కూడా చలిచీమల సామూహిక బలం ముందు బలాదూరు అనే సూక్తి మనకి పరిచితమైనదే. ఇది శ్రీపాదవారు వ్రాసిన చిట్టచివరి కథ. ఆయన మరణించిన కొద్ది నెలలకు 1961 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో అచ్చయింది. ఈ కథ పెద్దది.

బధిరాంధకం జమీందారీ నిర్వహణలో దివాన్జీ చూపించిన ధాష్టీకానికి ప్రతిగా లచ్చుబ్బాయి పన్నిన పన్నుగడ, దివాన్జీని తుపాకి గుండుకు ఎలా బలిచేసిందో పాఠకులు విశదంగా, స్తిమితంగా చదవదగిన కథ.

జమీందారుల విలాస, వికారాలు, చిన్న ఉద్యోగుల ఆశ్రయింపులు, భయాలు, ఉంపుడుకత్తెల స్వాతంత్ర్య విన్యాసాలు శాస్త్రిగారు విశదంగా చూపిన కథ చలిచీమలు. 'బధిరాంధక రాజ్యం' అనడంలోనే ఇదేదో ఒక సంస్థానం కథ కాదనీ, వ్యంగ్యంగా సంస్థానాలలో లోపాలను చిత్రించదలిచిన రచన అనీ, మనకు తెలుస్తుంది.

'జోడు' అనేకథ. పోలవరం జమీందారు కొచ్చర్లకోట వేంకటరాయణింగారి హయాంలో జరిగినది. ఒక భాద్రపదమాసంలో రాయణింగారు భద్రకాళీపూజ జరిపించి, పదివేల మంది బ్రాహ్మణ్యానికి సంతర్పణ ఏర్పాటు చేశారు. పంక్తిమీద ఒక బ్రాహ్మణుడు - వడ్డన మనుషుల్లో కలిసివున్న రాయణింగారి చేతిలో బూరెల బుట్ట లాక్కుని, మొత్తం వడ్డించుకున్నాడు. రాయణింగారు ముచ్చటపడి అక్కడే చదికిలబడి కొసరికొసరి వడ్డించి, తినిపించారు.

ఆ బ్రాహ్మడి అవినయానికి శిక్షతప్పదని రాయణింగారి ప్రవృత్తి ఎరిగిన అందరూ భయపడుతుండగా - భోజనానంతరం రత్నాలు తాపిన మురుగులజోడు అబ్రాహ్మడికి సమర్పించారు.

ఈ కథలో, జోడంటే, చెప్పులజోడని, చివరికంటా అనుకుంటాం. కానీ, ఈ జోడు శిక్షించే జోడు కాదు. సత్కారపు జోడు.

విమానం ఎక్కబోతూను అనేకథ బొబ్బిలి యుద్ధబీభత్స సందర్భంలో రాణివాసపు అగ్నిప్రవేశ సందర్భాన్ని విషాదంగాకాకుండా వెలమ పౌరుషసూచకంగా పూర్వరంగం సిద్ధం చేయడం చెపుతుంది.

పుల్లంరాజు -1; పుల్లం రాజు -2; శీర్షికల కథలు ఆధునిక కాలానికి సంబంధించినవి. బ్రిటిష్ ఇండియాలో జాతీయ కాంగ్రెస్ అవతరించి, సంస్కరణలకు ప్రయత్నిస్తున్న నాటివి.

పుల్లం రాజువారి దుప్పలపూడి రాజ్యంలో దళితులలో వైరం వహించే రెండు కులాల మధ్య సామరస్యం కుదిర్చే ప్రయత్నం ' పుల్లం రాజు - 2'' లో ఇతివృత్తసారాంశం.

అలాగే పుల్లం రాజు-1 లో - వేశ్యల వ్యభిచార నిర్మూలనం ఇతివృత్తం. ఇది నాటినుంచి, నేటి వరకు వివాదాస్పదమైన ఇతివృత్తం. శ్రీపాదవారు, మల్లాదివారు కూడా, సమర్ధులైన కథకులుగా, కళాపిపాసులుగా, కళావంతులలో నృత్యకళ నశించి పోవడాన్ని సమర్థించలేదు. సున్నితంగా, స్పష్టంగా వారి 'నిజమైన' వృత్తిని గౌరవించారు. అలా గౌరవించడమే ఈకథ సారాంశం.

శాస్త్రిగారు ఏతరహాకథలో ఏమి చెప్పదలిచినా నసుగుడు, డొంక తిరుగుడు లేకుండానే చెప్పారు. మరీ ముఖ్యంగా, శ్రీపాద వారి కథనశైలి, ఈ "సంస్థానాలకథల" నిర్వహణలో చిలికిచేసిన చంద్రహాసంలాగ వుంటుంది. ఆస్వాదించగలిగిన పాఠకులకు ఈ కథలు, ఇమాంపసందు మామిడిపళ్ళు.

- ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

102, శుభోదయ అపార్ట్‌మెంట్స్,
ఆఫీసర్స్ కోలనీ, ఆర్.కె.పురం.
సికింద్రాబాద్ - 500 056
ఫోన్ : (040) - 27794073

కథలుగా ఎన్నో కబుర్లు చెప్పారు

" ... ఈ శతాబ్దంలో వచన రచనకు పెట్టినది పేరు... ఒక్కరిద్దరే - శ్రీ చెల్లపిళ్ల వేంకటశాస్త్రిగారూ, శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. వేంకటశాస్త్రిగారు కబుర్లతో ఎన్నో కథలు చెప్పారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కథలుగా ఎన్నో కబుర్లు చెప్పారు. ఇద్దరూ విన నేర్చున్నవారు. చెప్పేతీరు వారికే చేతనౌ". " వారి వచనము తెలుగువారికి తెలుగుతనానికి నారాయణకవచము. వేంకటశాస్త్రిగారి వచనము చదవకపోతే తెలుగువారికి తెలుగు రాదు. శ్రీపాదవారి కథలు విని ఉండకపోతే తెలుగుల ఉనికి అయోమయం. " " చదువరులకు చదువు చెప్పగలిగినది ఆయన (శ్రీపాద) రచన. విద్యాబుద్ధులున్న అహంకారులకు కనువిప్పు చేసినది ఆయన వచనము. తీయందనపు తీయందనము చవులిచ్చిన దాయనశైలి." " ఆయన రచనలు మరోభాషకు లొంగవు. జానుతెనుగు నేర్చిన వారికే, తెలుగు వారైనవారికే శ్రీపాదవారి కథలు చదివి ఆనందించే అదృష్టము.

- మల్లాది రామకృష్ణ శాస్త్రి

(ఆనందవాణి సంచిక)

వ్యక్తిత్వంతో తొణికిసలాడే వనిత

- నందుల సుశీలాదేవి

స్త్రీలు వ్యక్తిత్వంతో ప్రకాశిస్తూ చైతన్యమూర్తులై పరిస్థితులను ఎదిరించి ముందుకు సాగిపోనిదే స్త్రీల సమస్యలు పరిష్కారం కావు - అనే దృక్పథంతోనే శాస్త్రి గారి నాయికలు స్వయంసిద్ధలుగా భాసిస్తారు.

చాలా కథలలో పురుషుల కంటె స్త్రీ పాత్ర చిత్రీకరణను ఆధునికంగా, కాలానికి అతీతంగా అడుగులు కదిపే విధంగా చిత్రీకరించేరు.

శ్రీపాద వారి స్త్రీపాత్రలలో కనిపించే చొరవ, తెగింపూ పురుషపాత్రలలో కనిపించవు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి కాలంలో బాల్యవితంతువుల సమస్య సంఘానికి అగ్నిపరీక్షలా మారింది.

కందుకూరి వీరేశలింగం గారి సంకల్పసిద్ధికి శాస్త్రిగారి స్త్రీ పాత్రలు తమ వంతు సహాయం చేస్తాయి.

శాస్త్రిగారి కథలలో స్త్రీ పాత్రల వ్యక్తిత్వ రూపకల్పన శక్తివంతంగా ఉంటుంది.

- ఆడది దీక్షపట్టి సాహసంగా సంఘసంస్కరణా కార్యాలు చేపట్టితే, తప్పక విజయవంతం అవుతాయని ఎన్నో పాత్రల ద్వారా నిరూపించేరు శ్రీపాదవారు.

ఒకప్పుడు సమాజంలో అనునిత్యం అవమానాలతో దుర్భర దయనీయా వస్థను అనుభవించిన బాల్యవితంతువుల ఆక్రోశానికి తన పాత్రల ద్వారా అద్దంపట్టేరు శాస్త్రిగారు. స్త్రీ పాత్రల ద్వారానే తోటి స్త్రీలలో ధైర్యాన్ని నింపే చిత్రీకరణ ద్వారా, శాస్త్రిగారు స్త్రీ వ్యక్తిత్వంతో తొణికిసలాడే వనితగా తయారు చేయటంలో అందెవేసిన చేయి.

విశాఖ ఆకాశవాణి ప్రసారమాలిక

స్త్రీల వ్యక్తిత్వ చిత్రీకరణలో శాస్త్రిగారి కలం నుండి జాలువారిన ఆణిముత్యం వంటి కథ " విమానం ఎక్కబోతూనూ ". ఈకథలో బొబ్బిలి మల్లమ్మలోని వో విశిష్ఠ గుణాన్ని ఆమె వ్యక్తిత్వ చిత్రీకరణలోని విశిష్టతనూ రచయిత అతి నేర్పరితనంతో ఆ పాత్రను మలచి మనముందు నిలిపారు.

బొబ్బిలి వెలమ ప్రభువు రావుగోపాలకృష్ణ రంగారావుకీ విజయనగర సంస్థాన ప్రభువులైన పూసపాటి విజయరామరాజుకి జరిగిన బొబ్బిలి యుద్ధంలో పరాజయం తప్పదని తెలిసి, చెలికాని వెంకయ్య అనే సర్దారుకి కటారి యిచ్చి అంతఃపుర కాంతలందరినీ అవమానాలకు గురికాకుండా హతమార్చిరమ్మనమని ఆజ్ఞ యిస్తాడు రంగారావు ప్రభువు.

రాజాజ్ఞను రాణిమల్లమదేవికి నివేదిస్తాడు వెంకయ్య. వీరనారి మల్లమదేవి హుంకరిస్తుంది శౌర్యంతో. బొబ్బిలి వీరుల శౌర్యం నిస్తేజమయినప్పుడు స్త్రీలు కూడా కత్తిపట్టి కదనరంగానికి తరలివెళ్ళాలి. స్త్రీలసాయం తీసుకొనడం వెలమ ప్రభువులకు లజ్జాకారణం కాదని తెలుసుకోవాలి - రాజు బ్రతికుండగా తాను ఆత్మహత్య చేసుకొనడం మానభంగం కాదా - అని ప్రశ్నిస్తుంది మల్లమదేవి. - తమ స్త్రీ జనం అంతా యుద్ధరంగంలో కదన విహారం చేస్తామని, శత్రువులను చీల్చి చెండాడే శౌర్యం తమ వద్ద వుందని రంగారావు ప్రభువుకి విన్నవించమంటుంది.

సర్దారుని నిలదీస్తూ అంటుంది మల్లమ. "ఏమీ ? మాకు అంతఃపుర వాసమెందుకు ? మా వెలమస్త్రీలు శౌర్యానికి, పౌరుషానికి పుట్టినిళ్ళవంటి వారు. కదన రంగానికి మమ్మల్ని అనుమతించమని రాజాజ్ఞను తీసుకొని వచ్చి శౌర్య ప్రతాపాలతో శతృవులను చీల్చి చెండాడడానికి అనుజ్ఞ కావాలి " అంటుంది మల్లమ. - రాజు ఆజ్ఞను రాణికి అందించడం వరకే తన కర్తవ్యం. అంతకు మించి మరో సమాచారం ప్రభువుకి అందించే అధికారం తనకు లేదని చెప్పి సర్దారు తలవంచుకొంటాడు. పగ తీర్చుకోలేక పోతున్నామనే తపనా, స్త్రీల శౌర్య పరాక్రమాలను చాటి చెప్పగలిగే అవకాశం తమకు కలగ లేదనే ఆవేదన తోనూ సర్దారు అందించిన కటారితో తనని తాను పొడుచుకొని ఆత్మార్పణం గావిస్తుంది మల్లమదేవి.

- మల్లమదేవి లోని పతిభక్తి, కర్తవ్యపరిపాలనతో పాటు, ఆమెలోని శౌర్యాన్ని, ఘోషావదలి, కదన రంగంలో కాలుమోపి శతృవుని చెండాడి వీర స్వర్గం అలంకరించాలనే

తపనతోనూ, స్త్రీల శౌర్యాన్ని తక్కువ అంచనా వేయవద్దని సూచిస్తూ అచ్చెరువు పొందే తన వ్యక్తిత్వంతో పాఠకులను ఆశ్చర్యపరుస్తుంది.

దివికేగే ముందు కూడా బొబ్బిలి రోషానికి ప్రతీకగా మల్లమ్మను మలచేరు శ్రీపాదవారు.

- స్త్రీ రాణి వాసంలో పుత్తడి బొమ్మ కాదు - ధైర్య సాహసాలలో స్త్రీ పురుషుడికి ఎంత మాత్రము తీసిపోదు - అని మల్లమ్మ వ్యక్తిత్వ చిత్రీకరణను అజరామరంగా మలచేరు శ్రీపాదవారు.

అవసరం వున్నంత వరకే పరదాకాని, తమ రాజ్యం శత్రువుల వశమైన నాడు ఆత్మార్పణం కంటె, కదనరంగంలో తమ ప్రతిభను చాటుకోవడానికే మల్లమ్మ తహతహలాడింది.

శ్రీపాద వారి రచనలలో స్త్రీ వ్యక్తిత్వానికి నీరాజనం పట్టే కథలలో యిదో కలికితురాయి.

కొన్ని కథలను పరిశీలిస్తే స్త్రీ వ్యక్తిత్వానికి ఆయన ఎంత పెద్దపీట వేశారో గోచరిస్తుంది.

కొత్తచూపుకథలో అన్నపూర్ణ కథానాయిక - ఆమె తండ్రి సాము గారడీలు నేర్పిస్తాడు.

తన జీవన సహచరునికి వుండవలసిన లక్షణాలు - శౌర్యం, బల పరాక్రమాలని ధైర్యంగా వెల్లడిస్తుంది. కట్నాలు, కానుకల గురించే చర్చిస్తున్న వరునికి ఎదురుగా నిలచి - ఆపదలోవున్న భార్యను రక్షించుకొనే జవసత్వాలు వున్నాయా ? అని ప్రశ్నిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చింది. కాని అది నిలుపుకోవడానికి యువతీ యువకులకు శౌర్యప్రతాపాలు ముఖ్యమని 1948లో యీ కథలో శ్రీపాదవారు సూచిస్తారు.

ఇది ఏ శతాబ్దానికైనా అన్వయించు కోవలసిన రచన. అన్నపూర్ణలా స్త్రీలంతా శౌర్యబల సంపన్నులైతే జాతి అంతా శౌర్య ప్రతాపాలతో ప్రకాశవంతమవుతుందని యీ రచన ద్వారా తెలియ చెప్పారు రచయిత.

అన్నపూర్ణ సూరిశాస్త్రితో కుస్తీ గోదాలోనికి దిగుతుంది. తనను నిలువరించే వ్యక్తి అన్నపూర్ణకు కావాలి. సూరిశాస్త్రి చేతిలో ఓటమి చెందుతుంది. అతని శౌర్యానికి

ఆమె పరవశిస్తుంది. ఆమె స్థైర్యానికి అతను అచ్చెరు వందుతాడు. అతని మెడలో వరమాల వేస్తుంది అన్నపూర్ణ. ఈ కొత్తచూపు కథలోని అన్నపూర్ణ వ్యక్తిత్వ చిత్రీకరణ ఏతరానికైనా గమ్యాన్ని చూపే చక్కటి కరదీపిక వంటిది.

ఈ నవీన కాలంలోనూ వూహించలేనంత ఉన్నతంగా వీరు అన్నపూర్ణ వ్యక్తిత్వానికి రూపకల్పన చేసేరు.

మరో అద్భుతమైన కథ " కన్యా కాలే యత్నాద్వరితా"

ఇది శ్రీపాద వారి కథామణిహారంలో వో జాతిరత్నం. రంగనాయకికి బాల్యంలో పార్వతీశంతో పెళ్ళిమాటలు జరుగుతాయి. అతనినే తన పతిగా మనస్సులో ప్రతిష్టించు కొంటుంది రంగనాయకి. మాట పట్టింపులతో రంగనాయకికి మరో సంబంధం చేస్తాడు తండ్రి.

కాపురానికి వెళ్ళకుండానే ఆమె వితంతువైపోతుంది. పార్వతీశం మనస్సు రంగనాయకి కోసం పరితపించినా, మనస్సు మరల్చుకొని జానకిని వివాహం చేసుకొంటాడు.

బంగారానికి తావి అబ్బినట్లు సంస్కారం, సౌందర్యం కలబోసిన యువతీ రత్నం జానకి. పార్వతీశం జానకిల కాపురం నిత్యనూతనంగా సాగిపోతూ ఉంటుంది.

బాల వితంతువైన రంగనాయకి, పార్వతీశం జీవితంలో రవంత స్థానం పొందా లనుకొంటుంది.

ఆరోజులలో బహుభార్యాత్వ నిరోధక చట్టంలేదు. వీరేశలింగం పంతులుగారి ప్రభావం ఆంధ్రదేశాన్ని జంఝూ మారుతంలా పెనవేసుకొంటున్న దినాలవి.

పార్వతీశం మనస్సుని గెలుచుకొనే క్రమంలో జానకిని ప్రసన్నం చేసుకొని ఆదిశగా అడుగులు వేస్తుంది రంగనాయకి. చివరకు పార్వతీశం మీద దొమ్మీకేసు బనాయించిన తండ్రి, అన్నగార్లకు వ్యతిరేకంగా మేజిస్ట్రేటు దొరవద్ద తన వాదనను ధైర్యంగా వినిపిస్తుంది రంగనాయకి.

మేజిస్ట్రేటు అనుమతితో పురాతన సాంప్రదాయ సంకెళ్ళను తెంచిపారేసి, జానకితో పాటు పార్వతీశం జీవితంలో భాగం పంచుకొంటుంది రంగనాయకి.

రంగనాయకిలోని ధైర్యం, తన బ్రతుకుని సరిదిద్దుకోవాలనే తెగింపు, సాటి స్త్రీని ఒప్పించి తనజీవితాన్ని ఆనందమయం చేసుకునే యత్నం - ఓ స్త్రీ మూర్తిలోని బలమైన వ్యక్తిత్వాన్ని మనం అభినందించకుండా వుండలేం !

మరో రచనలో యీ కథాశిల్పి చెక్కిన మరోపాత్ర కృష్ణవేణి. 1937లో శ్రీపాద వారి కలం నుండి జాలువారిన వజ్రపుతునక వంటి కథ 'కీలెరిగినవాత'లో కృష్ణవేణి వ్యక్తిత్వం పరిశీలిద్దాం.

కథలో కృష్ణవేణి ప్రధాన పాత్ర.

విద్యావంతురాలైన ఆ యువతి, కట్నకానుక లాశించకుండా తనని తానుగా, తన వ్యక్తిత్వాన్ని గౌరవించే వ్యక్తినే వరునిగా అంగీకరించా లనుకుంటుంది.

యాజులు ఆమె ఆశయాలకు స్పందించి ఆమెను వివాహం చేసుకొంటాడు. కొన్నాళ్ళు కాపురం సక్రమంగా సాగుతుంది. కాని క్రమంగా అక్కగారి ప్రోత్సాహంతో కృష్ణవేణిని పుట్టింటి నుండి ఆస్థిని తెమ్మనమని వేధిస్తాడు యాజులు. కృష్ణవేణి తన భర్తలోని యీ కుటిలత్వాన్ని భరించలేకపోతుంది. భర్తలోని వక్ర మనస్తత్వం ఆమెను గాయపరుస్తుంది.

" ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం లేని నీతో జీవించడం నావలన కాదు. ఓ పురుషుడితో నా జీవితాన్ని పంచుకొన్నాననే భావన నాలో చచ్చిపోయింది. సాటి ఆడదాన్ని పెళ్ళిచేసుకొన్నందుకు సిగ్గుపడుతున్నాను " అంటూ భర్త యిల్లు వదిలి స్వతంత్ర జీవనం గడపాలని బయటకు వచ్చేస్తుంది ఆమె.

ఆత్మగౌరవం, ఆత్మాభిమానం స్త్రీ వ్యక్తిత్వానికి ఎంత ముఖ్యమో, సంసార బంధంలో పటుత్వం లేకపోతే ఆవివాహం ఎంత హాస్యాస్పదమో, ఆ దాంపత్యజీవనం ఎంత నరకప్రాయమో కృష్ణవేణి పాత్ర చిత్రీకరణ ద్వారా శ్రీపాదవారు తెలియ చెప్పారు.

రచయిత కృష్ణవేణి పాత్రను మలచిన తీరు నాడూ, నేడూ, రేపూ కూడా స్త్రీలు ఎంత బలమైన వ్యక్తిత్వంతో జీవనాన్ని సాగించాలో సోదాహరణంగా నిలిచిపోతుంది.

శాస్త్రిగారి రచనలలో మేలిమిబంగారు వంటి మరోకథ. తల్లి ప్రాణం : ఈ కథకి ఆయువు పట్టు భద్రమ్మ పాత్ర చిత్రీకరణ.

రామబ్రహ్మం సంపన్న గృహస్థు - భార్య భద్రమ్మ. వారి ఏకైక పుత్రిక సుందరమ్మ బాల వితంతువు - సుందరమ్మ చదువుకోవాలని పట్టుపడ్తుంది

భద్రమ్మ. సుందరమ్మకు చదువు చెప్పడానికి వచ్చే కృష్ణశాస్త్రి, రామబ్రహ్మం ముసలితల్లి వెంకు సోదమ్మ కంట్లో కంటకంగా మారుతాడు.

మనమరాలి చదువూ, యౌవనంలో వున్న ఆమె గురువూ వెంకుసోదెమ్మ గుండెల్లో మంటలు తెప్పిస్తున్నారు. సుందరమ్మ వితంతువు కనుక విరాగిగా జీవితాన్ని గడపాలని ఆవిడ అభిప్రాయం.

భద్రమ్మ - వయస్సులో వున్న కూతురుని చూసి తల్లడిల్లిపోతూ ఆమె జీవితం బాగుపడాలని పరితపిస్తూ వుంటుంది.

రామబ్రహ్మం తల్లికీ, భార్యకూ మధ్య నలిగిపోతాడు. అతనికీ కూతురు సుఖంగా ఉండాలని ఉంటుంది, కానీ సంఘాన్ని ధిక్కరించే ధైర్యం లేదు.

పరమ ఛాందసురాలైన అత్తగారినీ, నోట్లో నాలికలేని రామబ్రహ్మాన్నీ సంభాళించుకొంటూనే వీరేశలింగం పంతులుగారి సంస్కరణోద్యమానికి బాసటగా నిలిచే తన తల్లిదండ్రుల సహకారంతో సుందరమ్మ, కృష్ణశాస్త్రిల కళ్యాణం జరిగేలా దోహదం చేస్తుంది భద్రమ్మ

స్వాధీన పతికలా రామబ్రహ్మాన్ని కాదనకుండా వుంటూనే, అతని మనస్సుని కూతురి పునర్వివాహానికే సుముఖత చూపేలా తనవోర్పునీ, నేర్పునీ ప్రదర్శిస్తుంది భద్రమ్మ.

ఈరచనలో భద్రమ్మలోని పట్టుదల, కూతురి సుఖం కోసం పరితపించే తల్లివేదన, బలహీనమైన వ్యక్తిత్వంతో వున్న భర్తను నొప్పించకుండా వప్పించే నేర్పూ, ఛాందసురాలైన అత్తగారి బారినుండి సుందరమ్మను కాపాడుకోవాలనే పట్టుదలా - భద్రమ్మలోని వ్యక్తిత్వం ఆధునికతకు అద్దం పడుతుంది.

మరో మేలి ముత్యంవంటి కథ ఘటన.

మగపెళ్ళి వారు కోరే హిరణ్యాక్షక వరాలతో సుభద్ర పెళ్ళి ఆగిపోయే పరిస్థితి వస్తుంది.

అసలా వధువుకి యీ వివాహం సమ్మతే కాదు. ఆమె మనస్సుకి నచ్చిన వాడు కిరీటిరావు. - జానకీదేవి వచ్చి " వరకట్నం యివ్వటం నేరం " అని కన్యాదాతను నిలదీస్తుంది.

జానకి యిచ్చిన ధైర్యంతో సుభద్ర కూడా " భర్తను వెలకు కొనుక్కోవటం తనకు యిష్టం లేద" ని చెప్తుంది.

జానకీదేవి చూపించిన ధైర్యం యీ రోజు కూడా అందరూ అబ్బురపడేలా చేస్తుంది. పెళ్ళి ఆగిపోతుంది.

తరువాత కట్నం లేకుండా, సుభద్ర మనస్సుపడ్డ కిరీటిరావుతో ఆమె వివాహం జరిగిపోతుంది.

1959లో శ్రీ పాదవారి కలం నుండి వెలువడిన యీ ఆణిముత్యం వంటి రచన నేటి సమాజ సమస్యలకు కుడా దర్పణం పడుతూ సజీవంగా మన కనుల ముందు నిలుస్తుంది.

శాస్త్రి గారి స్త్రీ పాత్రలలో ఆధునిక భావాలు, సంఘ సంస్కరణ కలబోసిన పాత్ర జానకీదేవి. ఏ కాలానికైనా నిలబడే యీ రచనలో స్త్రీ పాత్రలోని వ్యక్తిత్వ చిత్రీకరణ సర్వకాలాలకీ సమన్వయం చేసే రచనలా నిలచి వుంటుంది.

వరకట్నం యిచ్చి భర్తను కొనుక్కోవడం న్యూనతగా భావించే కన్యను సుమారు 50 సంవత్సరాల క్రిందటే శ్రీ పాద వారు ఆవిష్కరించేరు.

నేటి యువతికి కూడా ఆదర్శమైన పాత్రగా సుభద్రా, ఆమెకు బాసటగా నిలచి, వరకట్నానికి విరుద్ధంగా వాదించిన జానకి - దరిదాపు అర్ధశతాబ్దం క్రిందట అక్షర శిల్పిలా శ్రీపాదవారు అద్భుతంగా మలచిన పాత్రలవి.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి కథలలో స్త్రీ వ్యక్తిత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించేరు.

దరిదాపు వో శతాబ్దం క్రిందట జన్మించిన యీ కథా శిల్పి స్త్రీ పాత్రలోని వ్యక్తిత్వ పరిశీలన చూస్తుంటే యీ రచయిత మరో శతాబ్దం తరువాత జన్మించవలసిన అక్షర శిల్పి అనిపిస్తుంటుంది.

లేత్రాయపు బాలికలో కూడా సమస్యను చాక చాక్యంగా ఎదుర్కొనే నేర్పుని "శుభికే ! శిర ఆరోహ ! ' మరో అందమైన కథలో శ్రీపాదవారు చూపించేరు.

ఈ కథలో జానకి కరగ్రహణం చేయటానికి యిద్దరు వరులు పోటీపడతారు.

రామేష్ ఒక మేన బావ. ఉత్తర హిందుస్థానపు సంస్కారమే గొప్పదనీ, హిందీ భాష కంటె వుత్తమమైన భాష లేదనీ, త్యాగరాజు పాటలను పడవ పాటలుగా వర్ణిస్తూ తెలుగుని నిరసిస్తూ హిందుస్థానీ సంగీతం అన్నింటి కంటే వుత్తమమనీ పరాయి సంస్కృతి అనుకరిస్తూ, పుట్టి పెరిగిన తన జీవన విధానాన్ని నిరసిస్తూ రామేశం అనే తాతగారి పేరును కూడా రొమేష్ అని మార్చుకున్న వరుడు ఒకరు.

రామేశం మరొక మేన బావ. కాలమాన పరిస్థితులతో సంప్రదాయాన్ని మన్నిస్తూ, పెద్దలను గౌరవిస్తూ వుండే యువకుడు రామేశం.

జానకి మనస్సు రామేశం వైపు మొగ్గు చూపినా, ముగ్ధ కనుక, నాయనమ్మ కోరుకొంటున్న రొమేష్ ముందు తలవంచుకొని పెళ్ళి చూపులకు కూర్చొంటుంది.

ఈ కథలో చమత్కారం అంతా జానకి చెల్లెలు అన్నపూర్ణది. నాయనమ్మ మూర్ఖత్వానికి తలవంచిన అక్కనూ, రొమేష్ ని అల్లుడిగా వూహించు కోలేక మధన పడుతున్న తల్లి దండ్రుల క్షోభనూ గ్రహిస్తుంది అన్నపూర్ణ.

రొమేష్, జానకి వీనుల విందుగా పాడిన త్యాగరాజ కృతిని నిరసిస్తూ అదే సమయంలో వీధిలో బిచ్చం ఎత్తుకొంటూ పాటలు పాడే ఓ హిందుస్థానీ పిల్లను మెచ్చుకొంటాడు.

రొమేష్ ఆ హిందుస్థానీ పిల్లను లోనకు పిలిపించుకొని, ఆ పాటకు తన్మయత్వం చెందుతూవుంటే అతనికీ, ఆ వీధి గాయనికి కలిపి వధూవరుల కివ్వాల్సిన నివాళి నిచ్చేస్తుంది అన్నపూర్ణ. సమయస్ఫూర్తి తో చేసిన యీ చర్య అక్కడి సభికుల్నే కాదు, పాఠకులనీ చకితుల్ని చేస్తుంది.

ఆడది దీక్ష పట్టి సాహసిస్తే సంఘ సంస్కరణ కార్యాలు తప్పక విజయ వంతమవుతాయని పూలదండ కథలోని కృష్ణవేణమ్మ వదిన పాత్ర నిరూపిస్తుంది.

శ్రీ పాదవారి స్త్రీ పాత్రలు బలమైన వ్యక్తిత్వంతో శోభిస్తూ కాలానికి ఎదురు యీదుతాయి. కాని చాలా పాత్రలు ఆనాటి కాల మాన పరిస్థితులకూ, ఓ వర్గంలోని సమస్యలకు దర్పణం పడతాయి.

కొంతమంది స్త్రీ పాత్రలలో సంకుచిత్వం కనిపించినా, వారిలోని విద్యా హీనత వారినట్లా తయారు చేసిందని మరో స్త్రీ పాత్ర ద్వారా మనకు తెలియ చెపుతారు.

ఏ కాలానికైనా సరిపోయేవిధంగా వ్యక్తిత్వంతో తొణికిసలాడే స్త్రీ పాత్రల రూపకల్పనలో కథా సార్వభౌముడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి సాటి మరొకరు లేరు, ఇప్పట్లో రాబోరు.

సందుల సుశీలాదేవి



రిటైర్డ్ ప్రిన్సిపాల్
7-8-5-బి1, సుధా రెసిడెన్సీ, వేలమూరి వారి వీధి
రామారావుపేట, కాకినాడ - 533 004
ఫోన్ : (0884) 2372551
సెల్ : 98482 41701.

మానవీయ శక్తి చేసిన తిరుగుబాటు

- డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి

ఈవేళ మనం ప్రపంచీకరణ నేపథ్యంలో, ఇంగ్లీషు భాషలో మాట్లాడలేకపోతే శ్వాసక్రియ ఆగిపోతుంది సుమా ! అని ఉధృతంగా కంగారు పెడుతున్న వ్యాపార విద్యాప్రణాళికల మధ్య ఉన్నాం. ఈ సందర్భంలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని తలుచు కోవడం ఎంతయినా అవసరం. అంతరించి పోతున్న తెలుగు భాషనూ, తెలుగు సంస్కృతినీ కాపాడు కోవడంలో ప్రధాన భాగంగా, తిరిగి ఆయన జీవితాన్ని, రచనలనూ స్మరించుకోవడం అత్యంత ఆవశ్యకం.

అందులో భాగమే సుబ్రహ్మణ్య శాస్త్రిగారి నవలల పరిచయం. శాస్త్రి గారు తమ రచనకు సాహిత్య ప్రక్రియలు వేటినీ వదిలిపెట్టలేదు. మొదట పద్యం, నవల, చిన్నకథ, చారిత్రక నవల, సాంఘిక నవల, జీవితకథ, అనువాదాలూ ఇంకా మరెన్నో రూపాలలో తమ ప్రతిభను వ్యక్తపరిచారు. ఇందులో భాగమయిన ఏడు నవలలను 1914-1961 మధ్యకాలంలో రాసారు. అవి మిధునానురాగం (1914), శ్మశాన వాటిక (విషభుజంగం) (1917), అనాధ బాలిక (1924), రక్షాబంధనము (1925), ఆత్మబలి (1951), నీలా సుందరి (1959), క్షీర సాగరమధనం (1961) అన్నవి.

సుమారు 47 సంవత్సరాల కాలంలో మధ్య మధ్య రాసిన నవలలు ఇవి. మొదటి నాలుగు నవలలకీ తర్వాతి మూడు నవలలకీ మధ్య దాదాపు 25 సంవత్సరాల వ్యవధానం ఉంది. అయితే కాలం తాలుకు ఈ వ్యవధి ప్రభావం నవలల మీద మరీ అంత ఎక్కువ కనిపించదు. నవలల ఇతి వృత్తాలు వేటికనే భిన్నమయినవీ, ప్రత్యేకమయినవీ కూడా.

ఇందులో మిధునానురాగం అన్న నవల వీరి మొదటి నవల. కథ కంటె ముందు రాసిన నవల. ఈ నవలా రచనకు ప్రేరణగా ఉన్న కారణాన్ని గురించి

శాస్త్రిగారే ఆ నవల తాలూకు ముందు మాటలో రాసుకున్నారు. కాకినాడ నుంచి 'సావిత్రి' అనే ఒక పత్రిక వచ్చేదట. దాంట్లో 1910లో కొమర్రాజు లక్ష్మణరావు గారి 'ఫుల్ జానీబేగం' అనే ఒక మహారాష్ట్ర ప్రాంతపు కథ ఈ నవలకు మూలం అనీ దానికే తెలుగు జాతీయత నిచ్చి నవలగా రాసుకున్నానని చెప్పుకున్నారు. 'ఇరువుర మొక్కచోటికే పోవుదము' అన్న పేరుతో అదే కథను మళ్ళీ చిన్నకథగా కూడా రాశారు. అదే ఆయన మొదటి కథ కూడా. భారతీయ దాంపత్య జీవనంలోని అన్యోన్యతను తెలిపే కథ ఇందులోని ఇతివృత్తం. ఎన్ని జాతులు ఎన్నివిధాల దండయాత్రలు చేసి ఈ సంస్కృతిని నశింప చెయ్యాలని చూసినా, ఇక్కడి మమతానురాగాలు ఆ సంస్కృతిని కాపాడుకుంటూనే ఉంటాయని, దానికోసం ప్రాణాలనేనా వదులుకుంటాయని ఇక్కడి దాంపత్య ధర్మం అంత గొప్పదని చెప్పడం కోసమే ఈ నవల రాసినట్టు అనిపిస్తుంది.

రెండవ నవల శ్మశాన వాటిక. ఈ పేరు పెట్టడం వల్ల ఆయన కొందరు పెద్దలతో పడిన ఇబ్బందులన్నీ తన ' అనుభవాలూ, జ్ఞాపకాలూ' లో రాస్తారు. 'మీ' 'శ్మశాన వాటిక' చూసామండీ అని ఎవరేనా చెప్తే అది మనందరిదీనూ అన ఆయన చమత్కరించడం లాంటి విశేషాలు అవి. తర్వాత చాల ఏళ్ళకి ఆ నవలను బి.ఎ. విద్యార్థులకు ఉపవాచకంగా పెట్టడంతో మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి సూచన మేరకు దానికి విషభుజంగం అని పేరు మార్చేమని శాస్త్రి గారు చెప్తారు. పై రెండు నవలలూ గ్రాంధిక భాషలో రాసినవే.

శాస్త్రి గారు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం సమీపంలో ఉన్న పొలమూరు వాస్తవ్యులు. విష్ణుకుండిన వంశజుడయిన మాధవ వర్మ కాలంలో రాసిన తామ్రశాసనంలో ఉన్న పులిబూరు తమ పొలమూరేనని ఆయన ఉద్దేశం. ఆ శాసనంలో కూడా ఆ ఊరు తుల్యభాగానదీ తీరంలో ఉందనే ఉంటుంది. అఖండ గోదావరికి ఒక పాయ అయిన తుల్యభాగ తీరంలో పొలమూరుకు సంబంధించిన మూడు వందల ఏభయి సంవత్సరాల కిందటి కథ ఈ నవలలోని ఇతివృత్తం.

కథంతా అపరాధ పరిశోధనాత్మకం. భుజంగరాయుడనే ఒక రాజద్రోహిని పట్టుకోవడంలో ప్రజాప్రతినిధులయిన బ్రాహ్మణ యువకులూ, వారి అనుయాయులు చూపిన యుక్తి, చాతుర్యం, పరాక్రమ శౌర్యాలే ఇందులో ప్రధాన విషయాలు.

మూడవ నవల అనాధ బాలిక. ఈ నవల 1915లో మొదలు పెట్టి 1922 లోనే దానిని పూర్తిచేసినట్టు తెలుస్తోంది. బ్రహ్మసమాజం ఆంధ్రదేశంలో రాజమండ్రిలో అడుగుపెట్టి ఎందరో యువకుల్ని ప్రభావితం చేసింది. దాని ప్రభావంతో నడిచిన కథ ఇది. ఒక అనాధ బాలికను చేరదీసి ఒక బ్రహ్మసమాజ యువకుడు ఆమెకు ఆశ్రయమిచ్చి ఆమె కోరికపై ఆమెను వివాహం చేసుకోవడం ఇందులోని కథ. వధూవరుల కులగోత్రాల ప్రమేయం లేకుండా, ధనం తాలూకు అవరోధం లేకుండా కేవలం కరుణ, దయ అనే మానవతా గుణాల కారణంగా ఏర్పడిన ప్రేమతో జరిగిన వివాహం అది. అటువంటి వివాహం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఉందని భావించడమే ఈ నవలా రచన యొక్క ఉద్దేశం. వ్యావహారికంలో రాసినా కొంత గ్రాంధిక భాషారూపాల కలయిక కూడా ఇందులో కనిపిస్తుంది.

నాల్గవ నవల రక్షాబంధనం. దీన్ని 1925లో రాశారు. ఇది కూడా ఒక అపరాధ పరిశోధక నవలే. పూర్తి వాడుక భాషలో రాసిన మొదటి నవలగా దీనిని చెప్పుకోవచ్చు. నవల అంతటా ఎక్కువ భాగం సంభాషణల రూపంలోనే ఉంటుంది.

అయిదవ నవల ఆత్మబలి. ఇది 1925లో ఆంధ్రపత్రికలో ధారావాహికంగా వచ్చింది. ఒక నడివయసు వితంతువు తన పిల్లవాడిని కాన్వెంట్‌కు పంపుతుండగా చూసిన శాస్త్రి గారి మనసులో ఈ కథ రూపు దిద్దుకుందని ఆయనే సన్నిహితులతో చెప్పేరట. ఆ వితంతువు తన కొడుకును యుద్ధంలోకి పంపి తాను ఒంటరిగా జీవిస్తూ ఉండగా ఆమె మనసులో జరిగే అంతస్సంఘర్షణే ఈ నవలలోని కథ.

నీలాసుందరి ఆరవ నవల. కృష్ణుడు నాయకుడు. యశోదకు అన్నగారూ తనకు మేనమామ అయిన కుంభకుడు కుమార్తె నీలాసుందరిని పెళ్లి చేసుకోడానికి రెచ్చిపోయి ఏడుపోట్ల గిత్తలను లొంగదీసుకునే పందెంలో నెగ్గడమే ఇందులోని కథ. ఇది 1959లో వచ్చిన నవల.

చివరిది క్షీరసాగర మధనం. 1961లో రాసిన నవల, అరవైల నాటి ఆధునిక జీవనరీతి అంతా ఇందులో కనిపిస్తుంది. ధనవంతురాలయిన, విద్యావంతురాలయిన - ఒక బ్రాహ్మణ యువతి, వితంతువు స్వయంవరం కోసం చేసిన పరీక్షా, ఎంపికా ఈ నవలలోని ఇతివృత్తం.

ఇలా ఏడునవలల ఇతివృత్తాలూ దేనికవే విడివిడి అంశాలకి చెందిన కథలు. ఇందులో మిథునానురాగం, అనాథబాలిక అన్న రెండు నవలలూ ప్రస్తుతం ముద్రణలో లేవు. పరిశోధకుల దగ్గర, గ్రంథాలయాల్లోనూ ఉన్న ఒకటీ, అరా కాపీలు కూడా శల్యావశిష్టంగా ఉన్నాయి.

నవలలు రాస్తున్న కాలంలోనే ఆయన విశేషంగా కథలు, వీరగాథలు చారిత్రక నవలలు, రూపకాలు, రూపికలు రాస్తూ వచ్చారు. వాటితో పాటు మధ్యమధ్య ఈ నవలా ప్రక్రియను కూడా కొనసాగించారు. దానికి కారణం ఏమయి ఉంటుందని ఆలోచిస్తే కాల మహిమ అనే చెప్పాలి. ఆ కాలంలో ఎందరో రచయితలు ఎన్నో మంచి నవలలు, గొప్ప నవలలు కూడా రాసారు. అందువల్ల శాస్త్రిగారు ఒక కథ రాసిన తరువాత దాన్నే మళ్ళీ పొడిగించి నవలగా రాయడం లాంటి పనికూడా చేశారు. క్షీర సాగర మథనం అన్న కథే అనంతర కాలంలో నవలగా రూపుదిద్దుకుంది.

కుల విద్యలయిన వైదిక విలువలను ఆమూలాగ్రంగా అభ్యసించి, సంస్కృతాంధ్రాలను క్షుణ్ణంగా చదువుకుని, ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యాలను కూడా ఎంతో గాఢంగా చదువుకున్నవారు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. అయితే ఇంత బాగా చదువుకున్న తర్వాతనే ఆ వైదిక విద్యలను నిరసించి వాటి మీద తిరుగుబాటు చేశారు. ఇది ఆయన యొక్క దృఢమయిన వ్యక్తిత్వానికి గుర్తు. ఆయన లోపల ఉన్న సృజన శీలి. ఆపని చేయించాడు. ఆ సృజన శీలే శాస్త్రిగారి సృజనాత్మకతను ఇన్ని రకాలయిన ప్రక్రియలలో పొంగిపొరలే విధంగా బయటకి తెచ్చాడు.

నవలా రచయితగా సుబ్రహ్మణ్య శాస్త్రిగారి గురించి చెప్పుకోవలసిన ప్రధానమయిన అంశాలలో భాష ఒకటి. భాష విషయంలో ఆయనలో క్రమక్రమంగా వచ్చిన మార్పుకు ఈ నవలలు దర్పణాలు. మొదటి రెండు నవలలోను పండిత లోకం శిరసున ధరించే పరమ ప్రామాణిక మైన గ్రాంధిక భాష. అది కూడా అలంకార శోభితమైన, వర్ణనాత్మక మయిన శైలీ విన్యాసంతో అలరారిన భాష. నవల మొదలు పెడితే ఆపకుండా చదివించగల ధారా ప్రవాహంలాంటి సారళ్యతను ఆ గ్రాంధిక రచనలో కూడా సాధించగలగడం శాస్త్రి గారి విశేష ప్రజ్ఞ. " పల్లవితమై, కోరికితమై, కుసుమితమై, ఫలితమై ఆమె హృదయము ఆనంద పరవశమయ్యెను" వంటి వాక్యాలు

" లఘు చపేటిక నొక దానిని బహూకరించెను''. వంటి శబ్ద ప్రయోగాలూ ఆయనకు గల పూర్వ కావ్య విశేష పరిచయాన్ని చెప్తాయి. "ప్రధమోద బిందువులు ఆమె పై పడెను''. అనే వాక్యం కుమార సంభవంలో కాళిదాసు ఎంతో అపురూపంగా ప్రయోగించిన 'ప్రధమోద బిందువులు' అన్న ప్రయోగాన్ని గుర్తు తెస్తుంది. అలా ప్రాచీన కావ్య భాషమీద శాస్త్రి గారి ఆధిపత్యాన్ని ఈ నవలలోని భాష పట్టి ఇస్తుంది. తర్వాత ఆయన దృష్టి మారింది. గిడుగు, గురజాడల వాడుక భాషా ప్రచారం తాలూకు అవసరమేమిటో అర్థమయింది. అందువల్లనే, 'రక్షాబంధనం' నవలను మొదట గ్రాంధికంలో రాసి తర్వాత నవలంతటినీ తిరిగి వాడుక భాషలోకి మార్చారట. అంతకు ముందు రాసిన, 'అనాధబాలిక' నవలలో వాడుక భాష ప్రయోగించినా గ్రాంధిక వాసనలు పోలేదు. కాని తర్వాతదయిన 'రక్షాబంధనం' నవలలో మాత్రం చక్కటి వ్యవహారంలో ఉన్న తెలుగే ఉంది.

ఇక పాతికేళ్ల వ్యవధానంలో వచ్చిన మిగిలిన నవలల్లో ఎక్కువ భాగం కథ. సంభాషణలలోనే నడుస్తుంది. వర్ణన గానీ, రచయిత యొక్క కథాకథనం గానీ, తక్కువచోట్లు కనిపిస్తుంది. ఎంతో అర్థవంతంగాను, చమత్కార భూయిష్టంగానూ, సాకూతంగానూ జరిగే సంభాషణల ద్వారా కుటుంబంలోని, ముఖ్యంగా స్త్రీల సంభాషణల మధ్య పలకబడుతున్న ఎంతో రమ్యమయిన తెలుగు వినిపిస్తుంది. యథాతధంగా ఇళ్లల్లో సంభాషణలే రచనకు ఎక్కించడం ద్వారా అంత అందమయిన తెలుగు పలుకుబడులను నవలల్లోకి పట్టుకు రాగలిగేనని అయనే చెప్తారు. ఎంత వెతికినా ఒక్క ఆంగ్ల పదం కూడా దొరకని అంత స్వచ్ఛమయిన వాడుక తెలుగు ఇవాళ మనకి ఎంతో అరుదు.

కథా పరంగా ఈ నవలలన్నింటినీ పరిశీలించినపుడు ఒక విభిన్నత కనిపిస్తూ ఉన్నా ఆనాటి ఆంధ్రదేశపు సాంఘిక పరిస్థితి స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఇంచు మించుగా ఆ అరవయి సంవత్సరాల కాలమూ (1910-1970) ఆంధ్ర దేశమంతా రకరకాల సంస్కరణల ప్రభావంతో ప్రజ్వరిల్లుతూ ఉంది. బ్రహ్మ సమాజం ద్వారా వెల్లివిరుస్తున్న మానవీయ దృక్పథం సామాన్యమైన దేమీ కాదు. కానీ, అటువంటి సంస్కరణ భావాలను దరిచేరనివ్వని ఛాందస భావాల పుట్టిల్లు పొలమూరూ, తదితర

పాత్రలూను. ఇక్కడే శాస్త్రిగారి లోని మానవీయ శక్తి ఆయన్ని తిరుగుబాటు దారుగా చెయ్యడం కనిపిస్తుంది.

1917లో రాసిన విషభుజంగం నవలలోని ఇతివృత్తం మూడు శతాబ్దాల కిందటి కథ అని ఆయనే చెప్తారు. కాని, అప్పటికి ఇంకా ఆయనలోని విప్లవవాది, తిరుగుబాటుదారు బయటికి రాలేదని అనిపిస్తుంది. కథలో ప్రతినాయక చిత్రణ అర్ధవంతంగా ఉండదు. అతను ప్రజలమీద, ప్రజాప్రతినిధుల మీద తీర్చుకుంటున్న ప్రతీకారానికి పెద్ద కారణం కనిపించదు. పైగా కొంతకాలం గడిచేసరికి పశ్చాత్తాపపడుతూనే ప్రతీకార హింస చెయ్యడం కనిపిస్తుంది. కథలో ఇటువంటి శైధిల్యం ఉంటుంది. ఇదికాక కథాంతానికి నాయకుడు మరణిస్తాడు. ఇది కొంత పాశ్చాత్య నవలాధోరణికి అనుకరణంలా అనిపిస్తుంది. ఇటువంటి విషాదాంత పద్ధతి మొదటి నవల మిధునానురాగంలో కూడా ఉంది. నాయకుడి మరణంతో అతనితో అతని భార్య సహగమనం చేస్తుంది. విషభుజంగం నవలలో ఇది శాస్త్రి గారు రాయడం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. అప్పటికే దేశంలో సహగమన నిషేధ చట్టం కోసం ఎంతో గొడవ జరుగుతోంది. అలాంటప్పుడు రచయిత సహగమనాన్ని సమర్ధిస్తూ రాయడం ఎంతో వింతగా ఉంటుంది. పైగా దాని గురించి చెప్తూ భారతీయ దాంపత్య జీవనంలో ఉండే అన్యోన్యతను ప్రశంసించడం కనిపిస్తుంది. " స్త్రీలెల్లరు రాధాదేవి గుణములను కీర్తించు కొనుచు ఇండ్లకు పోయిరి" అని ఆమె చితిలో భస్మమయిన తర్వాత రాస్తారు.

ఈ నవల రాసేటప్పటికి ఆయనకు 26 ఏళ్లు. అప్పటికి సంస్కరణ వాదాల ప్రభావాలు ఆయన మీద పడినట్లు లేవు. అయితే 1961లో రాసిన ఆయన చివరి నవలలోని కథ ఒక వితంతు స్త్రీ రెండవ పెళ్లికి స్వయంవరాన్ని ప్రకటించుకోవడం. దీన్నిబట్టి ఈ మధ్యకాలంలో ఆయన చేసిన ప్రయాణం ఎంత గొప్పదో అర్ధమవుతుంది. అంతే కాకుండా, ఆనాటి సంస్కరణోద్యమాల సారాన్ని ఆయన తన రక్తంలో ఇంకించుకున్న వైనం కూడా తర్వాతి నవలల్లో కనిపిస్తుంది.

కులానికీ, మతానికీ అత్యంత ప్రాధాన్యత నిచ్చే అగ్రవర్ణాల ఆధిపత్యంలో ఉన్న గోదావరి జిల్లా పల్లెటూళ్లలో బ్రహ్మ సమాజ మతమూ, దాని ఆదర్శాలు

ప్రవేశించడం కష్టం. కానీ, ప్రవేశపెట్టవలసిన అవసరం ఉంది కనకనే ఆయన 'అనాధబాలిక' అనే నవల రాసారు.

కులమూ, గోత్రమూ తెలియని పేద అనాధ బాలికను వివాహం చేసుకుని, ఆమెకు జీవితాన్ని ఇవ్వగల సంస్కారం బ్రహ్మ సమాజమతం ఇస్తోంది సుమా ! అని ఆ నవల ద్వారా చెప్పేరు.

రక్షాబంధనం నవల రాసేటప్పటికి ఆ అవగాహన మరింత పెరిగింది. తనచుట్టూ ఉన్న సమాజంలో వస్తున్న మార్పులను ఎంతో జాగ్రత్తగా పసిగట్టేరు. వాటన్నింటినీ ఒక చోట చూసిస్తూ వాటి ప్రభావం గురించి చర్చించడానికే ఆ నవల రాసినట్టు అనిపిస్తుంది. పైకి మాత్రం ఇందులోని కథ కేవలం అపరాధ పరిశోధక కథగా మాత్రమే కనిపిస్తుంది. కానీ అది అంత మాత్రమే ఎంతమాత్రమూ కాదు.

మొదటి నుంచీ శాస్త్రి గారికి తెలుగు జాతిమీద, తెలుగుభాష మీద అభిమాన మున్నట్టే - భారత దేశంలోని వ్యావసాయక సమాజం మీద, ఆ సంస్కృతి మీద గాఢమయిన అభిమానమూ, ఆపేక్షా ఉన్నాయి. అందువల్లనే, భూస్వామ్య సంస్కృతిలోని మంచినంతటినీ తన రచనల్లో చూపెడుతూ వచ్చారు. అప్పటి ఆచారాలూ, అలవాట్లు, రుచులూ, అభిరుచులూ ప్రతీ పుస్తకంలోనూ కనిపిస్తాయి. మూఢనమ్మకాలనీ, అంధవిశ్వాసాలనూ ఎక్కడికక్కడ పరిహరించుకుంటూ రావడం. కూడా మానలేదు.

గోదావరి జిల్లాల పాడిపంటల సమృద్ధి అంతా ఆయన నవలల్లో కనిపిస్తూ ఉంటాయి. ఆనాటి కుటుంబాలలోని వ్యక్తుల మధ్య ఉన్న సత్సంబంధాలూ, మమతానురాగాలూ కూడా ఈ రచనల్లో వెల్లివిరుస్తోంటాయి.

కానీ, అప్పటికే పారిశ్రామిక నాగరికత భారతదేశంలోనూ, ఆంధ్ర దేశంలోనూ ప్రవేశించడం, అది భూస్వామ్య సంస్కృతిలో ఉన్న మంచిని దెబ్బ తియ్యటం ఆయన దృష్టికి వచ్చింది. సరిగ్గా ఈ అంశాన్ని రక్షాబంధనం నవలలో ఆయన చాలా విధాలుగా చూపెట్టారు.

" నిజానికి రాయవరం శుద్ధ పల్లెటూరు. కానీ ఇరవయ్యోశతాబ్ది నాగరికత అక్కడ సమృద్ధిగా ఉంది. అచ్చుకూటం, పక్షపత్రిక, గ్రంధమాల, ఔషధశాలలు,

ఆసుపత్రి, బియ్యంమర, సైకిల్‌షాపు, వాచీల మరమ్మత్తు దుకాణం, జట్కాలు, అన్నింటికీ జీవం పోస్తూ కాఫీ హోటల్ కూడా ఉంది అక్కడ "

పై వర్ణన ఈ మార్పును చూపెట్టడానికి చేసినదే. శ్రమపడే లక్షణం వ్యావసాయిక సమాజపు లక్షణంగా గుర్తించిన ఆయన ఈ సుఖాలను అందించే పారిశ్రామికీకరణ తాలూకు మార్పును అంగీకరించలేదు. దానికి కారణం కూడా ఇలా చెప్పారు.

" కొత్త నాగరికత అబ్బుతోంది కాదూ జాతికి ! వేషాలు ప్రబలాయి. పనిచెయ్యడం దర్జాకి లోటు అన్న భావం పెరుగుతోంది. సోమరితనం హెచ్చిపోతోంది. పోనీ అంటే కాఫీ హోటల్లు, సినిమాలు, సిగరెట్లు, బీడీలు ఇవి తప్పనిసరి అవుతున్నాయి. మరి డబ్బు ... " అని ఒక పాత్రచేత అనిపిస్తారు. ఆ పాత్ర కృష్ణారావు అనే పేరుతో చలామణీ అవుతుంటాడు. అతనే ఈ నవలలో ప్రతినాయకుడు. దొంగ, హంతకుడు కూడా. చురుకయిన, తెలివయిన యువకులకు డబ్బుతో కొనుక్కోగల సుఖాలను అందించే ఈ నాగరికత వారిని సోమరులుగానూ, చివరకు దోపిడీ దొంగలను ఇంకా దూరం పోతే హంతకులను కూడా చేస్తోందన్నది చెప్పడానికే ఈ నవల వ్రాసినట్టు కనిపిస్తుంది.

ఈ నవల ద్వారా ఆయన ఎంచి చూపిన మరొక సాంఘిక జాడ్యం అవినీతిమయమయిన రక్షక వ్యవస్థ. సమాజాన్ని రక్షించవలసిన పోలీసు ఉద్యోగుల కారణంగా సాధారణ పౌరులు దొంగలుగానూ, హంతకులు గానూ ఎలామారుతారో ఇందులో ఉంటుంది.

ప్రతి గ్రామంలోనూ క్రమశిక్షణ కలిగిన కుటుంబాలలోని యువకులే ఆయా గ్రామాల సంరక్షణ చెయ్యగలరని, వారితో సమానంగా కొత్తగా ఏర్పడిన ఈ పోలీసు శాఖ పనిచెయ్యలేదని ఆయన ఈనవలలో చూపెడతారు. ప్రయివేటు డిటెక్టివ్‌లలాగ పనిచెయ్యగల కుర్రవాళ్లను ఇందులో చూపెడతారు. ఈ అంశంలో కూడా వ్యావసాయక సమాజం తాలూకు మంచిని పైకి ఎత్తిచూపే ప్రయత్నమే ఉంది.

నవల అంతటా కనిపించే మరొక ప్రధాన అంశం వేశ్యావృత్తి. వీరిపట్ల సమాజంలో రెండు వైఖరులున్నాయి. ఒకటి, వారిని తమ ఇళ్లల్లో జరిపే వివాహ వేడుకలకు ఆహ్వానించి వాళ్లచేత నృత్యప్రదర్శనలు, గాన కార్యక్రమాలు జరిపించి

సత్కరించి పంపించే వర్గం. రెండోది వారిని భోగ వస్తువులుగా చూస్తూ శరీర సుఖాన్ని కొనుక్కొనే వర్గం. ఈ రెండో వర్గంలో పోలీసులు కూడా ఉన్నారు. కానీ వేశ్యలు మాత్రం అలా లేరు. అంగడిలో వస్తువులుగా బతికే ఈ జీవితాలను అసహ్యించుకుంటూ అంతకంటె ఉన్నతమయిన జీవితం కోరుకునే వేశ్యలను మనకు చూపించడమే శాస్త్రి గారి ఆశయం. అందుకే నీలాచలం అనే వేశ్య చేత ఇలా అనిపిస్తారు.

" మీకు ఆకలి ఉంది. మాకు దప్పిక ఉంది. మాకూ కొంపా, గోడు కావాలి. జీవితానికి ధనతృష్ణా, కళకి రూపతృష్ణా - ఇవి మాకూ తప్పవు. అప్పటికప్పుడు పశువులై వచ్చి పోతారు కొందరు మా దగ్గరికి. అంతరాత్మని చంపుకుని, కళ్లుమూసుకుని చెయ్యి చాపుతాము మేము. సానులు నీతిగా ఉండాలనుకుంటారు మీరు. నీతిగా ఉన్న పురుషులే మమ్మల్ని చేపట్టాలనుకుంటాము మేము. "

ఈ మాటలు విని ఎంతో నీతిమంతుడయిన నరసింహం ఇలా అంటాడు " జీవితం ఒక వైపే చూస్తున్నాము మేము. రెండో వైపు చూపించావు నువ్విప్పుడు. నాడులు కుంగిపోతున్నాయి" అని. అమాయకులయిన ఇలాంటి వేశ్యలను మోసగించే దొంగ విటులను గురించి చెప్పడమే ఈ నవల అంతటా ఉంటుంది.

సంఘంలో పరువు ప్రతిష్ఠలతో పాటు భద్రత కూడా లేక అణిగిమణిగిపడి ఉన్నవారి మీద సానుభూతి కలిగించే ప్రయత్నం కూడా శాస్త్రి గారు ఈ నవలలో చేసారు.

ఆనాటి సంఘంలో వేశ్యల కంటె కూడా పరమ నికృష్టమయిన పరిస్థితిలో ఉన్నవారు వితంతువులు. అందులోనూ బ్రాహ్మణ కుటుంబాలలోని వితంతువుల పరిస్థితి మరీ దారుణం. అయితే బ్రాహ్మణ వితంతువుల పరిస్థితి గురించి అప్పటికి చాలామంది రచయితలు రాసి ఉన్నారు. బహుశా ఆ కారణం చేతనేనేమో శాస్త్రి గారు 'ఆత్మబలి' నవలలో బ్రాహ్మణేతర వితంతువు గురించి రాసారు. దీన్ని మనోవైజ్ఞానిక నవల అని కూడా అన్నారు.

ఈ ఆత్మబలి నవల అంతా ఇంచుమించు సంభాషణల రూపంలోనూ స్వగతాల రూపంలోనూ ఉంటుంది. చిన్నవయసులోనే భర్తను కోల్పోయిన ప్రౌఢ వితంతువు గోవిందమ్మ. కొడుకు మిలట్రీలో ఉన్నాడు. అనురాగాన్ని అందించే

తోడు కోసం తహతహలాడే వయసుతో ఉంది ఆమె. అదే ఊళ్లో ఉన్న భార్యపోయిన తిమ్మన్న అనే చురుకయిన యువకుడు ఆమె మీద మోజుతో ఉంటాడు. నారమ్మ అనే ఒక జాణద్వారా రాయబారం పంపుతాడు. గోవిందమ్మకీ అతనంటే ఇష్టమే. అతని మీద ఉన్న తన ఇష్టాన్ని పైకి చెప్పడానికీ, అతన్ని అంగీకరించడానికీ గోవిందమ్మ పడిన సంఘర్షణే ఇంచుమించు నవల అంతటా ఉన్నది.

తీరా అతన్ని అంగీకరించి అతనికి రహస్యంగా తనని అర్పించుకునే లోపు తన కొడుకు సంగతులు తెలుస్తాయి. అతను యుద్ధంలో చూపిన సాహసం, పొందిన పేరు ప్రతిష్టలు అందరినోటా వింటుంది. దాంతో పాటు అతను తల్లి కోసం పడే తపన ఆమె పట్ల చూపించే ప్రేమకూడా ఆమె మధ్యవర్తుల ద్వారా వింటుంది. అలా వినగానే ఆమెలోని తల్లి హృదయం బయటికి వచ్చి అప్పటి దాకా తోడు కోసం పరితపిస్తున్న స్త్రీ హృదయాన్ని అణచివేస్తుంది - ఇదీ నవల లోని కథ.

ఒక వితంతువు లోని స్త్రీ చెడుదారిని పట్టకుండా ఆమె తల్లి ఆమెను రక్షించి నట్టుగా పైకి కనిపిస్తుంది గానీ, అందుకోసమే అయితే సుబ్రహ్మణ్యశాస్త్రి గారు పేజీలకు పేజీలు ఇంత సంఘర్షణే రాయనక్కర లేదు. పైగా నవలకు ఆత్మబలి అన్నపేరు కాక మరే పేరయినా పెట్టుకోవచ్చు. కాబట్టి ఇందులో ఆయన ఉద్దేశం వేరు. ఆమెకు సంఘం మరొక వివాహాన్నీ, భర్తనూ అనుమతిస్తే ఆమె ఈ విధంగా తనను తాను బలిచేసు కోవలసిన పరిస్థితి రాదు కదా ! అన్న విషయం మనకు తోపించడమే ఆయన ఉద్దేశం.

'క్షీరసారగమధనం' నవల రాసే నాటికి సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి స్త్రీల సమస్యల పట్ల వచ్చిన అవగాహన ఆశ్చర్య కలిగిస్తుంది. ఈ సహస్రాబ్ది ఆరంభాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా సాధికార సంవత్సరంగా ప్రకటించింది. మహిళలు అన్ని రంగాలలోనూ స్వయంగా శక్తి సంపాదించుకున్నప్పుడే వారి సమస్యలు తీరుతాయనే అవగాహన ఈ ప్రకటనలో ఉంది. ఇదే అవగాహన 1961లో రాసిన ' క్షీరసాగర మధనం' నవలలో కనిపిస్తుంది.

ఒక బ్రాహ్మణ వితంతువు యువతి రెండో పెళ్లి చేసుకోడనికి వరుని స్వయం వరంలో ఎంపిక చేసుకోడానికి ఒక పత్రికా ప్రకటన ఇస్తుంది. ఆవిధంగా ఇవ్వగలగడానికి ఆమె అన్ని రకాల సాధికారతలు సంపాదించుకున్న స్త్రీ అని ఆ ప్రకటన చూస్తే తెలుస్తుంది.

స్త్రీలు తమ సమస్యల పరిష్కారానికయినా, విముక్తి కోసం అయినా, స్వేచ్ఛకోసం అయినా పోరాడాలంటే ముందు వారు సాధికారత సంపాదించాలని ఆనాడే ఆయన గ్రహించారు.

విద్య, ఆరోగ్యం, ఐశ్వర్యం కలిగి ఉండి, మగవారితో సమానంగా అన్ని వాహనాలు నడపడం, ఆటలాడడం, ఈతకొట్టడం లాంటి పనులన్నీ నేర్చుకున్న ఒక నాయికను ఈ నవలలో ఆయన చిత్రించారు. ఇన్ని చేతనయన స్త్రీ ఏ కోరిక కోరినా సమాజం ఆమోదిస్తుందని కూడా చెప్పకనే చెప్పారు.

ఈ నవలల్లో ' నీలాసుందరి' కొంత విభిన్నమయిన నవల. శాస్త్రిగారు సరదా కోసం రాసిన నవలలా ఉంటుంది తప్ప సామాజిక పరమయిన స్పృహ ఏదీ దానిలో ఉండదు. కానీ, ఆద్యంతమూ చదివింపచేసే శక్తి ఉన్న నవల.

చివరిగా వీటి గురించి ఒకమాట చెప్పాలి. ఇవన్నీ సుదీర్ఘంగా పొడిగించిన కథలే తప్ప నవలా లక్షణాలకు ఒదగవు. కాబట్టి వీటిని నవలలు అనే కంటె పెద్ద కథలు అనడమే బావుంటుందేమో !

డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి
(లీడర్, తెలుగు శాఖ - పి.వి.ఆర్.టి. డిగ్రీ కాలేజ్)
సెఫాలిక - 70-1/సి2 ఎన్.ఎఫ్.సి.ఎల్ రోడ్,
కాకినాడ - 533 003 ఫోన్ : 0884-2341642.
సెల్ : 9848061642.

సహజ ప్రతిభ నుండి పొటమరించినది

" నేటి తెనుగు కథా రచయితలలో మునుముందుగా జ్ఞప్తికందు కొందరిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారొకరు. ఒకరనుట కంటె మొదటివారనుటయు నతిశయోక్తము కారాదు. కారణం ఆయన వ్రాసిన ప్రత్యక్షరము సహజ ప్రతిభ నుండి పొటమరించినది. ఆయన చేసిన ప్రతికల్పనము ప్రత్యక్షమున కవిరుద్ధమైనది. ఆయన పాత్రలచే బలికించిన ప్రతి పదము ఇరుగు పొరుగుల మనము వినుచున్నది. ఆయన ప్రదర్శించిన ప్రతి సంవిధానము మన యనుభూతులకు దవ్వుగానిది. ఆయన కట్టిన కథలెల్ల తెలుగు దేశపు టిల్లిలు గడిచిపోనివి. ఈ తీరున సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అచ్చమైన తెలుగుదనమును వలచి వచ్చిన రచయిత.

- మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి

(ఆంధ్ర రచయితలు ప్రథమ భాగము : పుటలు 513-519)

దేశీయమైన అపరాధ పరిశోధక నవల

-ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

తెలుగు సాహిత్యంలో నవలా రచన కూడా కవిత్వంలాగే, తెనుగు సేతలతో లేదా ఇతర భాషారచనల ప్రేరణతో ప్రారంభమైంది. అందునా విశేషించి బెంగాలీ నవలల ప్రభావంతో వెలువడినవి.

1920 ప్రాంతాల నాటికి బెంగాలీ డిటెక్టివ్ నవలల అనువాదాలు జోరుగా తెలుగు వారికి పరిచయమైన వచనరచనలు. భాష సరళ గ్రాంధికంగా వుంటూ, ఆ రచనలు ఉత్కంఠ భరితంగా వుండేవి. అప్పట్లో డిటెక్టివ్‌ని 'పత్తేదారు' అని వ్యవహరించేవారు. బెంగాలీ 'కాలూరాయ్' బాగా ప్రచారం పొందిన పత్తేదారు.

తెలుగు పాఠకుల్లో వచన రచనలపట్ల మోజు పెంచినవి ఈ'అపరాధ పరిశోధక' నవలలే. తొలి రచయితల్లో వేంకటపార్వతీశ్వర కవులు, ఈవిభాగంలో ప్రసిద్ధులు.

పరువైన రచయితలు, డిటెక్టివ్ నవలల రచనను తక్కువగా చూసే రోజులింకా అప్పటికి రాలేదు. 1950లు 1960ల మధ్యకాలంలో విద్యార్థులు, చిరుద్యోగులు, చిరువ్యాపారులు, డిటెక్టివ్ సాహిత్యం ఎక్కువగా చదివేవారు. ఈ చిన్ననవలలు ఎక్కువగా మద్రాసు నుంచి ఉత్పత్తి అయి - బజారులో దొరకడంతో పాటు కిళ్లీ షాపుల్లో అణాకి, బేడకు, అద్దెకు దొరికేవి. బహుశా, వాటి ముద్రణలో వైఖరి, ప్రచారపు తీరు, డిటెక్టివ్ రచనల పట్ల - 'చవకబారు' చిన్నచూపు కలిగించి వుంటాయి.

ఇంగ్లీషులో సర్ ఆర్థర్ కానన్ డాయల్, స్టాన్లీ గార్డెనర్, జేమ్స్ హాడ్లీ ఛేజ్, వంటి పురుష రచయితలు, అగాథాక్రిస్ట్ వంటి ఏకైక రచయిత్రి, అపరాధ పరిశోధక రచయితలుగా ప్రసిద్ధులు. ఒక సమస్యాత్మక ఘటన జరగడం. ఆ ఘటనకు దారితీసిన పూర్వాపరాలను, పరిశోధించి, ఒక ప్రధాన పాత్ర - పాఠకులు ఊహించని విధంగా పరిష్కరించడం డిటెక్టివ్ రచనల సాధారణ సూత్రం.

తెలుగు వచన రచయితల్లో ఒకరు కావడమే కాదు; ఆధునిక వ్యవహారిక వచన శైలీ నిర్మాతల్లో ఒకరైన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు 70కి పైగా పెద్ద కథలు, చిన్న కథలు, వ్రాయడమేకాక - 'శ్మశాన వాటిక' 'ఆత్మబలి' నీలాసుందరి, క్షీరసాగర మధనం, 'రక్షా బంధనం' అనే నవలు కూడా వ్రాశారు.

'రక్షా బంధనం' అపరాధ పరిశోధక నవల. ఈ తరహా నవల రాయాలని శ్రీపాదవారు ఉత్సాహ పడ్డారంటే నవలా రచనలో ఏ విధమైన అరమరికలు లేకుండా విస్తృతమైన ఇతివృత్తాలు రావాలని ఆయన కోరుతున్నారన్నమాట. రక్షాబంధనం నవల తొలిసారిగా 1925లో అచ్చయినా ఇందులో కథాకాలం మాత్రం 1919 - 1920. ఇందులో ఘటనలు జరిగిన ప్రాంతాలు. తెనాలి, ఏలూరు, రాజమండ్రి, కుమారదేవం, రాయవరం, పులుగుర్త, చోడవరం, రామచంద్రపురం, అనపర్తి... వంటి వూళ్ళు. వీటిలో తెనాలి, ఏలూరు, రాజమండ్రీ మాత్రమే అప్పటికి ఒక తరహా పట్టణాలు. మిగతావన్నీ పల్లెటూళ్లే. రామచంద్రపురం, తాలూకా కేంద్రం.

రక్షాబంధనం నవలకు కీలక మనదగిన ఘటనలు జరిగిన ఊరు. రాయవరం. ఈ ఊరు గురించి శ్రీపాద వారి వర్ణన ఇది : " రాయవరం శుద్ధ పల్లెటూరు. కానీ, ఇరవయ్యో శతాబ్ది నాగరికత అక్కడ సమృద్ధిగానే ఉంది. అచ్చుకూటం, పక్షపత్రిక, గ్రంధమాల, ఔషధశాలలు, ఆసుపత్రి, బియ్యంమర, సైకిలు షాపు, వాచీలు మరమ్మతు దుకాణం, జట్కాలు (గుఱ్ఱపుబళ్లు), అన్నిటికీ జీవం పోస్తూ కాఫీ హోటలు కూడా ఉందక్కడ'.

సాధారణంగా అపరాధ పరిశోధక ఇతివృత్తాలకు కేంద్రాలు, మహానగరాలో పెద్ద పట్టణాలలో, అవుతూండడం పరిపాటి. మనుషుల్లో స్వార్థం, లోభత్వం, కక్షలు, కార్పణ్యాలకు ప్రధాన కారణా లనదగిన వ్యాపారపు లావాదేవీలు, దొంగరవాణా, స్త్రీ సంబంధాలు, బ్లాక్‌మనీ (దొంగడబ్బు) ఇతర ఆస్తుల తగాదాలు, అక్కడే ఎక్కువ. వేగవంతమైన నాగరకజీవనంలో జరిగే కొన్ని తరహాల నేరాలను నిశితంగా పసికట్టడానికి - పోలీసు వ్యవస్థకు ప్రత్యామ్నాయంకాదుగాని, పొడిగింపుగా డిటెక్టివ్ వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ వృత్తిలో వ్యక్తులూ, సంస్థలూ కూడా పేరు సంపాదించు కుంటాయి.

అయితే, శ్రీపాదవారు పల్లెటూళ్ల నేపథ్యం మధ్యకు తన ఇతివృత్తాన్ని తెచ్చి నిలిపి ప్రశస్తంగా ప్రశంసనీయంగా, ఈ 'రక్షాబంధనం' నవలను వ్రాశారు.

నవల గురించి ప్రస్తావించేటప్పుడు దానిలోని కథనంతా ఏకరువుపెట్టడం ప్రసంగ మర్యాద కాదు. అందునా, అపరాధ పరిశోధక కథను అసలే చెప్పరాదు. కానీ ఎంత అవసరమో, ఆ మాత్రం చెప్పడం కూడా మర్యాద.

రక్షాబంధనమంటే, తెలుగులో 'తావీదు' 'రక్షరేకు' అని చెప్పవచ్చు. అంటే, ఈ నవలలో ఒకరికి కట్టిన 'రక్షరేకు' లో ఒక కిటుకు ఉందన్నమాట.

ఒక సాయంకాలం వేళ, పోలవరం అనే ఊళ్లో గోదావరి గట్టున పోలీసులు హఠాత్తుగా, ఒక యువకునిమీదపడి బంధించి రాత్రికి రాత్రి ప్రయాణికుల పడవలో రాజమండ్రికి తరలించుకు పోతున్నారు. అర్ధరాత్రివేళ ఆ ఖైదీ, ఒకటికి వెళ్లాలని కోరి, పడవ అంచున కూర్చుని నిండు గోదావరిలోకి ఉరికేశాడు. పోలీసులు గంతులు వేశారు. ఇది ఒక సంఘటన.

మరికొద్దిరోజులకు రాయవరం గ్రామంలో ఒక కిళ్లీకొట్టు నడుపుకొనే బూబమ్మను ఒక సాహెబుగారూ; నీలాచలం అనే వేశ్యను ఒకరాజుగారూ మోసగించి బంగారు నగలు ఒలుచుకుపోయారు.

ఈ ఘటనల్లో మొదటిది జరిగిన కొద్ది కాలానికి వీధినిబడి ముష్టిఎత్తుకు బతికే వారణాసి శ్రీరాములు అనే ఒక పౌరాణికుడూ, అతని కుమార్తె అన్నపూర్ణా రాయవరంలో ప్రవేశించి రేకపల్లి జగ్గారాయుడు కళ్లలో పడి ఆదరానికి పాత్రులయ్యారు. శ్రీరాములు వృద్ధు గ్రుడ్డివాడు. అన్నపూర్ణ తొలియౌవనంలో అడుగుపెడుతూవుంది.

ఆ తండ్రీ కూతుళ్లను రేకపల్లి వారి కుటుంబంలో అంతా, సొంతబంధువుల మాదిరి ఆదరించి ప్రతీరోజు ఆఊళ్లో వారందరినీ ఆహ్వానించి శ్రీరాములు చేత పురాణకాలక్షేపం జరిపించడం మొదలు పెట్టారు.

రేకపల్లి వారి కుటుంబంలో జగ్గారాయుడు పెద్దకుమారుడు ఇంటిపెద్ద. అతని తమ్ముడు నరసింహం. మద్రాసు 'లా' కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. వెంకటరావు చిన్నపిల్లవాడు, ఈ సోదరుల్లో ఆఖరువాడు. జానకమ్మ వారి వితంతు సోదరి, వీరి తల్లి నరసమ్మ జగ్గారాయుడి భార్య కామేశ్వరి. నరసింహం భార్య ఇంకా కాపరానికి రాలేదు.

సంపద వుండడమే కాదు; ఎప్పుడూ ఆనందంగా, సంపద సద్వినియోగం చేస్తూ, గ్రామంలో మంచిపేరు సంపాదించుకున్న కుటుంబం అది. శ్రీరాములు, అన్నపూర్ణ వదలలేనంత దగ్గర మనుషులుగా ఆ ఇంట కలిసిపోవడం విశేషం.

కృష్ణారావుకి డబ్బుంది. విలాసాలు ఇష్టం. వేశ్యలతో పరిచయాలిష్టం. తాను నెల్లూరు వాడినంటాడు. ఆఊళ్లో ఎప్పుడూ ఉండడు. రాజమండ్రీలో రంగనాయిక అనే వేశ్య చెప్పగా, రాయవరంలో వేశ్యల గురించి మొదటిసారి విన్నాడు. చూడాలను కున్నాడు. వెంటనే ప్రయాణం కట్టి రాయవరం అయ్యరు హొటల్లో మకాం వేశాడు. మాధవస్వామి ద్వారా, అయ్యరు ద్వారా, బండి నీలాచలం అనే వేశ్యతో - రాయబారాలు నడిపాడు. ఒకసారి అపరిచితవ్యక్తితో మోసపోయివుండడం ఒక కారణం; అప్పటికీ తాను చోడవరానికి చెందిన ఒక రాజుగారి 'ఆడా'లో వుండడం మరొక కారణంగా ముందు ఒప్పుకోలేదు. తరువాత కృష్ణారావును చూసి రాజుగారి అనుమతి కూడా తీసుకుని కృష్ణారావును తన ఇంట్లోనే అట్టే పెట్టుకోవడానికి అంగీకరించింది. ఆ తరువాత అతనిలోని సంస్కారం, మంచితనం క్రమంగా గమనించి ప్రేమించింది కూడా.

రేకపల్లి జగ్గారాయుడుగారింట్లో ఆ యేడాది సంక్రాంతి పండుగ మహా వైభవంగా జరిగింది. ఒక్కటే అపశ్రుతి. రేకపల్లి వారి కుటుంబం, శ్రీరాములుమీద ఆదరంతో అతని పెద్దకూతురిని అల్లుణ్ణి పండక్కి పిలిస్తే - ఆ కూతురు చెల్లమ్మ - అన్నపూర్ణ అక్క పెద్దపేచీ పెట్టి అన్నపూర్ణకు ఆమె దివంగత భర్త చేయించి పెట్టిన నూరుకాసుల నగలు తనకిచ్చెయ్యమని, లేదా కొంత బంగారమైనా ఇమ్మనీ, అల్లరి పెట్టింది. ఆ గొడవల పూర్వాపరాలన్నీ నరసమ్మకీ, జానకమ్మకీ, అన్నపూర్ణ విశదంగా చెప్పింది. ఈ అక్క ఒక్కర్తే కాదు, తన మరిది - తన భర్త ఒకే ఒక్క తమ్ముడు కూడా ఈ నగల మీద కన్నువేశాడని చెప్పింది.

శ్రీరాములు అన్నపూర్ణ ఎన్నికష్టా లనుభవించినా స్త్రీ ధనంగా దక్కిన నూరుకాసుల బంగారాన్ని జాగ్రత్తగా కాపాడుకువస్తున్నారు. రేకపల్లి వారింటికి చేరాక, దాచిపెట్టమని జగ్గారాయుణ్ణి శ్రీరాములు కోరాడు కూడా. తాను అందు కంగీకరించక, తమ ఇంటి వెనక భాగంలో వున్న 'అవుట్ హౌస్' ఆ తండ్రీ కూతుళ్ల నివాసానికి

ఇచ్చాడు. వారికి నిత్యకృత్యంగా కావలసిన సామాన్లు బట్టలు కూడా ఏర్పాటు చేశాడు. రోజులు సాఫీగా గడిచిపోతుండగా...

ఒక సాయంకాలం వేళ, తాను దాచేపల్లిలో వుంటూండే వెంకటస్వామి అల్లుణ్ణనీ, పేరు వీరాస్వామి అనీ, పరిచయం చేసుకుంటూ ఒక అపరిచిత వ్యక్తి వచ్చాడు. భోజనాలు, కబుర్లు అయ్యాయి. వీరాస్వామి - శ్రీరాములు, అన్నపూర్ణ, వుండే అవుట్ హౌస్ లోనే ఆరాత్రి పడుకున్నాడు.

ఓ రాత్రివేళ-

శ్రీరాములు, అన్నపూర్ణ హత్యకు గురయ్యారు. వీరాస్వామి పరారైపోయాడు, అన్నపూర్ణ నగలు మాత్రం ఒక్కటి కూడా పోలేదు.

రేకపల్లి వారి కుటుంబమే కాదు ; ఈ దుర్ఘటనకు, ఊరు మొత్తం విలవిల లాడింది.

పోలీసులు కేసు నమోదు చేశారు. జగ్గారాయుడి తమ్ముడు నరసింహం-తానూ, తన మిత్రుడు నరసారెడ్డి ఈ కేసు పరిశోధిస్తానని సూపరింటెండెంట్ అనుమతి కోరాడు. ఆయన అందుకు ప్రోత్సహించి అనుమతించాడు.

నరసింహం, నరసారెడ్డి తీవ్రంగా కృషిచేసి, ఆధారాలు దొరకబుచ్చుకొని, కేసు నమోదు చేయించి, జగ్గారాయుడింట పోలీసు సూపరింటెండెంట్ నిర్వహించిన కచేరీలో హంతకుణ్ణి ఆశ్చర్యకరంగా బయటపెట్టారు. ఆ కథకోసం, పాఠకులు నవలను సంపాదించి చదవాల్సినదే!

రక్షాబంధనం నవలలో ఘటనలను కూర్చిన తీరు ఉత్కంఠ కలిగిస్తుంది. నవల ప్రారంభమే, అర్ధరాత్రి, గోదావరిలో గూటాలప్రాంతాన, దీపాలులేని ఒక పడవలో.

శ్రీపాదవారు ఎక్కడికక్కడ తగిన వాతావరణం కల్పించడంలో నేర్పరులు. ఇందుకుతోడు ఆయన మనుషులమధ్య సంభాషణలు నడిపించడంలో చూపే సహజత్వం, నేర్పు విశేషంగా ఆకర్షిస్తాయి. ఈ నవలలో రేకపల్లి వారింటికి సంక్రాంతి పండుగ కోసం బంధువులు వచ్చిన సందర్భం, వారింట్లో నిత్యకృత్యంగా నడిచే దైనిక

ఘటనల సందర్భం, నీలాచలం ఇంటికి నరసింహం సంగీతం వినడానికి వచ్చిన సందర్భం, రహస్యంగా దొంగల ముఠాను నడిపే హెడ్ కానిస్టేబుల్‌తో, పోలీసు వేషంలో పరిశోధన సందర్భంలో ఆ పరిశోధక వ్యక్తి మాటలు నడిపిన సందర్భం, వీరాస్వామి ఇంటికి వచ్చినప్పుడు ఆరాత్రి రేకపల్లి వారింట స్త్రీలమధ్య నడిచిన భావి సూచక ప్రసంగ సందర్భం, పోలీసు సూపరింటెండెంట్ రేకపల్లి వారింట చివరి సారిగా కచేరీ నిర్వహించినప్పుడు నరసింహం హత్యలు దోపిడీలు వ్యవహారాల చిక్కుముడివిప్పిన సందర్భం, కృష్ణారావుకి ఒక రాత్రి అంటే 20-మే-1920 తేదీ రాత్రి సాయిలవాడు జోస్యం చెప్పిన తరుణంలో నీలాచలానికీ, కృష్ణారావుకీ నడిచిన మాటల సందర్భం కథకి బలమివ్వడంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తాయి.

పాత్ర చిత్రణ విషయానికి వస్తే జగ్గారాయుడి పెద్దమనిషి తరహా, నరసింహం చురుకుదనం, జానకమ్మ మాటనేర్పరితనం, చిన్న కుర్రవాడు వెంకట్రావు 'అల్లరిమాటల' సందడి, లక్ష్మీనరసమ్మ హుషారు, బండినీలాచలమనే వేశ్యలోని నిజాయితీ, మాటలో ప్రవర్తనలో చూపే సున్నితమైన సంస్కారం, మాధవస్వామి పనివాడితనం, హెడ్డుగారి పొగరు, రెడ్డిగారి పెంకితనం - శ్రీపాదవారు ఎంత సజీవంగా చూపించారంటే, పుస్తకం చదవడం మొదలు పెట్టిన కొద్దిసేపటికే, మనం వారిని ప్రత్యక్షంగా చూస్తాం. ఇంకొక విశేషమేమిటంటే; ఈ కథ ఎక్కడినుంచో దిగుమతి చేసుకుని, పాత్రలకు తెలుగు వేషాలు తొడిగినదికాదు.

ఈ రక్షాబంధనం నవలలో గుర్తించదగిన అంశం మరొకటుంది. నేరస్థుడు చేసినవన్నీ బంగారు నగల దొంగతనాలే - అది, కుమారదేవంలో కావచ్చు, రాయవరంలో కావచ్చు, చోడవరం తూము దగ్గర కావచ్చు, కడకు శ్రీరాములు కూతురు అన్నపూర్ణ నుంచి రాబట్టుకోదలచి విఫలమైన సందర్భం కూడా బంగారు నగలకు సంబంధించినదే.

ఏలూరులో పోలీసు ఇన్-స్పెక్టర్ ఇంట్లో ప్రారంభించిన నగల దోపిడీ - రేకపల్లి వారింట హత్యోదంతంతో పూర్తయింది.

దీనికంతకీ కారణం నేరస్థుడి 'రిజాలా' జీవన విధానం - కక్ష స్వభావం. సర్వసాధారణంగా, నేరాన్నంగీకరించే ప్రతీ నేరస్థుడు, తనకు గల కారణాలకు

న్యాయబద్ధత సాధించే సమర్ధన చేసుకుంటాడు, ఇందులోనూ, చివరి కదే జరుగుతుంది.

రక్షాబంధనం, అక్షరాలా దేశీయమైన అపరాధ పరిశోధక రచన.

శ్రీపాదవారి ఇతర నవలలలోలాగే, ఇది ఆయన నిశిత లోక పరిశీలనకు నిదర్శనంగా నిలుస్తుంది.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

102, శుభోదయ అపార్ట్‌మెంట్స్
ఆఫీసర్స్ కోలనీ, ఆర్.కె.పురం.
సికింద్రాబాద్ - 500 056
ఫోన్ : (040) - 27794073

తల - తిక్క

హృదయం - అమృతం

శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారితో చాలా ఆత్మీయమైన పరిచయం ఉండేది నాకు. వారికి ఆంగ్ల సంస్కృతి మీద అపారమైన అభిమానం ఉండేది. అందువల్లనే గాంధీగారి ఉద్యమాలమీద వారికి అభిమానం ఉండేదికాదు.

ఆరోజుల్లో వారి హిందీ వ్యతిరేకత - ఇటీవల హిందేతర రాష్ట్రాలవారి హిందీ వ్యతిరేకత పరిశీలిస్తే బాగా అర్థమౌతుందను కొంటాను. కొంత అర్థం చేసుకొంటే చాలా అమృత హృదయుడాయన. అయితే చాలా తిక్క, గట్టి పట్టుదల గల వారు శ్రీపాదవారు. అచ్చమైన వ్యావహారికాంధ్రం వ్రాసిన వారిలో ప్రథమ గణ్యుడు శ్రీపాదవారు.

- పిలకా గణపతి శాస్త్రి

(గణపతిశాస్త్రి గారి లేఖ నుంచి)

'నా తెలుగు మీద నాకు నిషేధం ఏమిటీ ?'

- పున్నమరాజు నాగేశ్వరరావు

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కేవలం కథారచయితా, కావ్యకర్తే కాదు. ప్రబుద్ధాంధ్ర సాహితీ పత్రిక సంపాదకులూ, తెలుగు భాషారక్షణ కోసం కృషిచేసిన ఉద్యమ కర్తాను, అంతేకాదు కళాభివర్ధినీ పరిషత్ స్థాపించి, సాహితీ సమావేశాలూ, కళాప్రదర్శనలు, సన్మానాలు నిర్వహించిన కార్యకర్త కూడాను.

తెలుక్కి హిందీ వల్ల అన్యాయం జరిగిపోతోందని 1920ల్లోనే ఎలుగెత్తి చాటి ప్రబుద్ధాంధ్ర ద్వారా ప్రచారం చేసి ఉద్యమం నిర్వహించారు. 'వ్యాసాలు పకడ్బందీగాను ఉజ్వలంగాను ఉండడం వల్ల వాటిని విస్మరించడానికి వీలులేకపోయేది'' అని మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు ఓ సందర్భంలో పేర్కొన్నారు.

కేవలం భాషా విషయంలోనే కాదు -

స్వీయ సంస్కృతిని విస్మరిస్తే కలిగే వైపరీత్యాన్ని, వరకట్నం వల్ల కలిగే అనర్థాలను, బాల వితంతువులను ఉసూరుమనిపిస్తే వచ్చే నష్టాలను, అస్పృశ్యత వల్ల సంభవించే ప్రమాదాలను గురించి స్వాతంత్ర్యానికి ముందే తమ రచనల ద్వారా హెచ్చరించిన సామాజిక వాది శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి. 'నా తెలుగు మీద నాకు నిషేధం ఏమిటీ ?' అనే ఆవేదనే వారిని తెలుగుకి అంకితం చేసింది.

శ్రీపాదవారి శైలే కాదు - ఆయన ప్రవర్తనా తీరుసైతం ప్రత్యేకమైనదే ! స్వచ్ఛమైన తెలుగు సంస్కృతి ఆయన రచనల్లో సాక్షాత్కరిస్తుంది. ఆయన వాక్యనిర్మాణమూ, పదాల పొందికా, పాత్రల చిత్రణా, కథాకథనం, తెలుగు నుడికారానికి గుడి కడతాయి.

సుబ్రహ్మణ్యశాస్త్రి గారి రచనల శ్రేణి విస్తృతమైనది. 12 సంపుటాల చిన్నకథలు ఆయన్ని కథక చక్రవర్తిని చేశాయి. మిధునానురాగం, అనాధ బాలిక, రక్షాబంధనం, విషభుజంగం, ఆత్మబలి, నీలాసుందరి, క్షీరసాగర మధనం అనే నవలలు రాశారు. రాజరాజు, నిగళబంధనం, స్వప్నవాసవదత్తం అనే నాటకాలూ, కొనుక్కొన్న మొగుడు, అఫిదళతి వజ్రస్యహృదయం, వర్కింగ్ కమిటీ, కలంపోటూ, పునాది రాయి, లక్ష్య సిద్ధి, టీపార్టీ అనే రూపికలూ రాసి సంభాషణలు పకడ్బందీగా నడపడంలో తమ చాతుర్యాన్ని చాటారు.

వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా తెలుగుచేశారు. వ్యాస భారతాన్ని రెండున్నర పర్వాలు అనువదించారు.

అంతేకాదు, ఆయుర్వేద యోగ ముక్తావళి, వైద్యక పరిభాష - అనే వైద్యగ్రంధాలూ వెలయించారు. సంపూర్ణ భక్త విజయం పేరుతో భక్తుల చరిత్రను అక్షరబద్ధం చేశారు. చంద్రగుప్త చక్రవర్తి, వీరపూజ అనే చారిత్రక గ్రంధాల్ని రాశారు. అన్నిటినీమించి 'అనుభవాలు - జ్ఞాపకాలూను' పేరుతో ఆయన రాసిన తన ఆత్మ కథ 3 సంపుటాలూ ఆనాటి సాహిత్య, సామాజిక విన్యాసాలకు అద్దం పడతాయి. ఇవేగాక, బాలరామాయణం, చాణక్యనీతి, పంచతంత్రం వంటి కొన్ని చిన్నపుస్తకాలు కూడా రాశారు. ప్రేమపాశం అనే నాటకాన్ని రాసినట్టు తెలుస్తోంది. కానీ అది ఎక్కడా కనిపించడం లేదు. 1920లో ముమ్మరంగా సాగిన సాహితీ సమరంలో పుంఖాను పుంఖంగా వ్యాసాలు సంధించి ప్రముఖంగా పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఎంతమందిలో ఉన్నా - మాట బాణీలోను, ప్రవర్తన తీరులోను ప్రత్యేకతను సంతరించుకునేవారు. పరోపకారం వారి నిబిడీకృత లక్షణం. ఎందరి అభ్యుదయాలకో ఆయన కారకులన్న వాస్తవం ఆయన సన్నిహితులకు మాత్రమే తెలుసు.

ఆయనది గట్టిపట్టుదల. తను విశ్వసించిన విషయంలో ఏమాత్రమూ రాజీపడేవారు కాదు. గాలివాటుతనం ఆయన జీవితంలో ఎక్కడా కనిపించదు. ఈ లక్షణమే ఆయనకు అంతగా మిత్రులు లేకుండా చేసింది.

ఆయనతో చివరికంటా ఆప్త స్నేహితులుగా, సన్నిహితులుగా కొనసాగినవారు పురిపండా అప్పలస్వామి గారు ఒక్కరే. శ్రీపాద వారు అనువదించలేకపోయిన వ్యాసభారతం మిగతా పర్వాలను, 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' 4వ సంపుటాన్ని పురిపండావారు పూర్తి చేశారు.

1891 ఏప్రిల్ 23న జన్మించిన సుబ్రహ్మణ్యశాస్త్రి గారు 5 దశాబ్దాల పాటు తెలుగుసౌరభం గుబాళించేలా రచనలు గుప్పించి, తమ 70వ ఏట 1961 ఫిబ్రవరి 25న కన్నుమూశారు.

శ్రీపాదవారి నాటకాలు - రూపికలు ఇంచుమించు 1945కు పూర్వం వెలువడినవే. పాత్రచిత్రణలోనూ, కథాకల్పనలోనూ, సంభాషణలు నడపడంలోనూ సుబ్రహ్మణ్యశాస్త్రి గారు సిద్ధహస్తులు. స్త్రీ పాత్రలు తీర్చిదిద్దడంలోనూ, వారి సమస్యలను సున్నితంగా వివరించడంలోనూ, వారికి వారే సాటి.

శ్రీపాదవారి నాటకాల్లో రాజరాజు - ప్రత్యేక తరహాకు చెందినది. పుక్కిటిగాథను, చారిత్రక వాస్తవంతో ముడిపెట్టి శభాష్ అనిపించుకున్నారు. ధర్మానికి ప్రతీకగా నన్నయను రంగస్థలంపై నిలబెట్టాలన్నది ఆయన ధ్యేయం. శ్రీపాదవారు అభిమానించే తెలుగు కవులలో నన్నయది ఉన్నతాసనం. శాస్త్రిగారు చదివిన తొలితెలుగు గ్రంథం నన్నయ భారతమే. " నన్నయ భారతాన్ని చదువుతుంటే బ్రహ్మాత్వం స్ఫురిస్తుంది. నిసర్గమాధుర్యం అనుభూతమై కొత్త ప్రపంచంలో పడ్డట్టున్నా అవుతుంది'. అని రాజరాజు నాటకం పీఠికలో అన్నారు. నన్నయ భారతంలో ఆంధ్రభాష తియ్యదనమూ, ఆంధ్ర వాఙ్మయం విలక్షణతా ఆయన్ని ముగ్ధుణ్ని చేశాయట. వాల్మీకి రామాయణంలో లాగ నన్నయ భారతంలో మాత్రమే ఆయనకు భాషలోనూ, భావనల్లోనూ, పోకళ్ళలోనూ ఆర్ష సంప్రదాయాలు కనబడతాయట.

నన్నయ మీది ఈ ప్రత్యేక అభిమానమే రాజరాజు నాటకానికి ప్రోత్సాహం ఇచ్చింది. దాంతో నాటకరచన ఒక ఎత్తూ - నన్నయ పాత్రచిత్రణ ఒక ఎత్తు అయింది ఆయనకి.

నన్నయ భారతరచన అర్ధంతరంగా ఆగిపోవడానికి కారణాన్ని చిత్రాంగి సారంగధరుల కథతో ముడిపెట్టి రాజరాజు నాటకాన్ని నడిపించారు.

ఏమాత్రమూ చారిత్రక ఆధారాలు లేని పుక్కిటిగాథను ఉదాత్తంగా మలిచి నాటకాన్ని రక్తి కట్టించారు. ధర్మనిరతుడైన నన్నయ తన భారత రచనను హఠాత్తుగా ఆపేయడానికి కారణం ధర్మగ్లానేనని శ్రీపాదవారి విశ్వాసం-అదే ఈ నాటకానికి ప్రాణం.

ఈ నాటకం 1943 భారతిలో వెలుగు చూసింది. సాహితీ లోకం ఎలా స్వీకరిస్తుందోనని భయపడిపోతున్న శ్రీపాదవారికి విశ్వనాధ సత్యనారాయణగారి ప్రశంస బలాన్ని ఇచ్చింది.

కోడలు కావలసిన చిత్రాంగిని భార్యగా చేసుకున్న రాజరాజు ప్రవర్తనకు ఏమాత్రం దోషం అంటకుండా కథను చక్కని మలుపుతో, చిక్కని సంభాషణలతో రాజరాజు నాటకాన్ని రూపొందించిన తీరు అనుపమానం. నన్నయ పాత్రచిత్రణ శ్రీపాదవారి నైపుణ్యానికి మచ్చుతునక. 'ధర్మజ్యోతిగా ధగధగలాడేట్టు నన్నయను చిత్రించా'రని విశ్వనాధ వారు ఎంతగానో మెచ్చుకున్నారు. " ఇప్పటివరకు నా రచనలు అన్నింటిలోకీ రాజరాజు నాటకం తలమానికం " అని 1944లో శ్రీపాదవారే స్వయంగా ప్రకటించున్నారు అంటే అది విశ్వనాధవారు ఇచ్చిన బలమే.

రాజరాజు నాటకాన్ని జయపురం మహారాజు విక్రమదేవ వర్మ గారికి అంకితం ఇచ్చారు. ఇందులో ముందు కొంత వివాదం నడిచింది. అయితే అది సుఖాంతం అయింది.

అంకితం తీసుకోవడం కోసం నాటకాన్ని పరిశీలిస్తూ సారంగధరుడు చిత్త భ్రమకు లోనైన 'స్వగతం' విషయంలో అభ్యంతరం తెలుపుతూ దానిని సవరించ వలసిందిగా విక్రమ దేవవర్మగారు స్పష్టంగా సూచించారు.

అయితే శాస్త్రి గారు ఆ సవరణకు ఏమాత్రమూ అంగీకరించలేదు. అంకితం తీసుకోకపోయినా పరవాలేదు అని నిర్ణయించుకుని తన ఉద్దేశంలో ఆ స్వగతం ఎంత ప్రాధాన్యమైనదో వివరిస్తూ సవరణ కుదరదని అంత స్పష్టంగాను సమాధానం ఇచ్చారు. మొత్తంమీద విక్రమ దేవవర్మ గారే సమాధానపడి నాటకాన్ని యథాతథంగా అంకితం తీసుకోవడానికి పెద్దమనసుతో అంగీకరించారు.

రాజీపడని శ్రీపాదవారి ప్రవృత్తికి ఇది చక్కని ఉదాహరణ. విక్రమదేవ వర్మ గారి సంస్కారానికీ నిదర్శనమే - ప్రవృత్తికి నిర్వచనం ఇస్తూ - శాస్త్రి గారు 'ఒకరి నిగ్రహాలను బట్టీ, సామర్థ్యాన్ని బట్టి మారిపోయేదయితే అది ప్రవృత్తి అనిపించుకోదు.' అని నన్నయ చేతే అనిపిస్తారు ఒకచోట.

చిత్రాంగి రూప లావణ్యాలు అపురూపమైనవే, అయితే వాటి వెనుక అవలక్షణాలు ద్యోతకం అవుతాయి నన్నయకు. చిత్రాంగి చిత్రపటంలో నన్నయకు

అశుభలక్షణాలు కనిపిస్తాయి. ఆమె వల్ల రక్తపాతం జరుగుతుందని, వంశం నాశనం అవుతుందని కూడా నన్నయ గ్రహించారు. యువరాజైన సారంగధరుడికి పట్టమహిషిగా ఏమాత్రం తగదని నిర్ణయం చేసేస్తారు నన్నయ.

అయితే రాజకీయ కారణాల దృష్ట్యా చిత్రాంగిని నిరాకరించడానికి వీలులేని పరిస్థితి. మరోమార్గం లేక చిత్రాంగిని కోడలిగా కాకుండా తన రెండో భార్యగా చేసుకుంటాడు రాజరాజు. ధర్మానికి - రాజకీయానికి ఘర్షణ. నన్నయది ధార్మిక దృష్టి - సూక్ష్మధర్మం ప్రకారం తన నిర్ణయమూ అంగీకారయోగ్యమే అంటాడు రాజరాజు. రాజరాజు నిర్ణయం నన్నయకు ఏమాత్రమూ అంగీకారయోగ్యం కాలేకపోయింది. రాజరాజు నిర్ణయం ధర్మానికి గ్లాని గానే భావించాడు నన్నయ. దానితో మాటామాటా పెరిగి భారత రచనను కొనసాగించకుండా ఆపేస్తాడు నన్నయ. ఆ బెంగతో మంచం పట్టి నన్నయ తనువు చాలిస్తాడు. మిగతాకథ ప్రచారంలో ఉన్నదే. సారంగధరుడు - చిత్రాంగి పాత్రలను కూడా హుందాగా తీర్చి దిద్దారు. ఇలాగే జరిగి ఉంటుందేమో అని గట్టిగా నమ్మేటంత బలంగా ఈనాటకాన్ని రచించారు శాస్త్రిగారు.

నిగళబంధనం : నాటకం 1935 ప్రబుద్ధాంధ్రలో తొలిసారిగా వెలువడింది. శ్రీకృష్ణదేవరాయల్ని మట్టుపెట్టడానికి ఆయన సవతితల్లి పన్నిన రాజకీయకుట్రను తిమ్మరుసు భగ్నం చేసిన విషయం దీని కథావస్తువు. రాజకీయ సన్నివేశాలు రూపొందించడంలోనూ, రాచరిక మర్యాదలతో సంభాషణాలు నడపడంలోనూ శాస్త్రిగారి కలం కదం తొక్కుతుంది.

స్వామిభక్తులకు, రాజద్రోహులకు మధ్య సంఘర్షణ, ఎత్తుకు పై ఎత్తులు నాటకాన్ని రసమయం చేశాయి. సవతితల్లికి విధేయత నటిస్తూనే ఏమాత్రం అనుమానం రాకుండా రహస్య రాజకీయం నడిపి శ్రీకృష్ణదేవరాయల్ని రక్షించిన తీరును చక్కగా చిత్రించారు. ఆఖరికి ద్రోహానికి సంకెళ్ళు పడ్డమే నిగళబంధనం.

సంభాషణల్లో రాజనీతితో పాటు చమక్కులు కూడా ఉంటాయి. ప్రవర్తనకు సంబంధించి జ్ఞాపకం ఉండే అంశాలు ఎన్నో ఉంటాయి. స్త్రీ మనస్సును నిర్వచిస్తూ - "మనస్సులో నాటుకోవడమే వస్తే - ఆడది ఇక మరిచిపోలేదు" అంటారు. మగవారు దీనిని గమనించి పాటిస్తే సగానికి సగం గొడవలు మటుమాయం అవుతాయి.

పదవి పెద్దది కావాలి - బాధ్యత మాత్రం ఎక్కువ ఉండకూడదు అంటే సొగదుమరి' - సదా గుర్తుంచు కోవలసిన సూత్రం.

'కొడుకు చేతిలో తండ్రి - భార్య చేతిలో భర్త ఓడిపోవడం కంటె అందం ఏమిటి?' ...... అనుభూతికి చెందిన చక్కనిమాట.

స్వప్నవాసవదత్తం సంస్కృత నాటకానికి అనువాదం. ఇతివృత్తం ప్రముఖమైనదే. అనువాదనాటకం కావడం వల్లనేమో - ఇందులో శ్రీపాదవారి శైలి అంతగా కనిపించదు. 'తెలియనిచోట దేవతలైనాసరే సామాన్యులే'. 'ద్వేషం అయినా అభిమానం అయినా సంకల్ప వల్లనే కలుగుతాయి'. వంటివి అక్కడక్కడ ఉన్నా శ్రీపాదవారి రచనలా ఉండదు. కొన్ని కొన్ని చోట్ల అయితే ఇది ఆయన రచన కాదేమో అనిపించేటంతగా ఉంటుంది.

ఇక రూపికలు. మహిళాభ్యుదయం, దురాచారాల నిరసన - ఇవి శ్రీపాదవారి రచనల్లో ప్రధానంగా కనిపించే లక్షణాలు - రూపికల్లో కూడా అంతే.

కొనుక్కొన్న మొగుడు అనే రూపిక 1925 ప్రబుద్ధాంధ్ర జనవరి సంచికలో ప్రచురితం అయింది. 1948 జూన్ 28న మద్రాసు రేడియోలో ప్రసారం అయింది. కన్యాశుల్కంతో కొనుకున్న భార్యపై భర్త అధికారం చెలాయించినప్పుడు వరకట్నంతో కొనుక్కున్న మొగుడిపై భార్య అధికారం చెలాయించవద్దా! - ఇదే ఈ రూపికకు ఊపిరి. కన్యాశుల్కం ఇచ్చి తెచ్చుకున్న భార్యను లోకువగా చూస్తూ నానాహింసలు పెడతాడు భర్త. అయితే దశ తిరిగి భార్య అన్నగారు సంపాదనా పరుడు కావడంతో బావగారికి కట్నం దండిగా ముట్టచెపుతాడు. దాంతో పరిస్థితులు తిరగబడతాయి. ఆ భార్యే భర్తపై పెత్తనం చేయడం ప్రారంభిస్తుంది. శాస్త్రి గారి తొలివరసలోని రచనే అయినప్పటికీ సంభాషణలు పసందుగా, పదునుగా ఉంటాయి.

అపిదళతి వజ్రస్య హృదయం రూపిక ప్రబుద్ధాంధ్ర 1934 మార్చి సంచికలో ప్రచురితం అయింది. పంతాలకు పట్టింపులకు పోయిన తల్లి హృదయం ఎంతటి కఠినమైనదైనా కూతురు దూరమైతే అంతటి వజ్రమూ లేచిగురాకు అయిపోయి విలవిల్లాడిపోతుందని రుజువు చేస్తుంది. ఈ రూపికను 1948 జనవరి 7న మద్రాసు రేడియో ప్రసారం చేసింది. ఇవ్వవలసిన లాంఛనాలు ఇస్తేగాని కోడల్ని కాపురానికి

తీసుకెళ్ళను అని వరుని తల్లీ, ససేమిరా ఇవ్వనని వధువు తల్లీ ఏళ్ళతరబడి భీష్మించుకుని కూర్చుంటే - యువదంపతు లిద్దరూ కూడబలుక్కుని మద్రాసులో మకాం పెట్టేస్తారు. దాంతో ఉభయపక్షాలవారూ దిగివచ్చి కొత్తజంట అచ్చటా - ముచ్చటా తీరుస్తారు. సన్నివేశాలను తీర్చిదిద్దడంలో శ్రీపాదవారి ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది.

వర్కింగ్ కమిటీ అనే రూపిక 1934 జూన్‌లో 'కౌశికుడు' అనే కలం పేరుతో ప్రచురితం అయింది. ఒక ఆశ్రమానికి చెందిన స్వామీజీ సిద్ధి పొందిన తరువాత ఆయనకు చేయవలసిన ఉత్తర క్రియలను గురించి ఆశ్రమ వర్కింగ్ కమిటీ పడిన లుకలుకలు ఈ రూపిక కళ్ళకు కడుతుంది. ఉత్తర క్రియలకు వెంటనే ఏర్పాట్లు చేయవలసిన అవసరాన్ని వర్కింగ్ కమిటీ విస్మరించి నిర్ణయాలు, తీర్మానాలు అంటూ కాలయాపన చేయడం, ఈలోగా చేయవలసిన పనిని మరొకరు పూర్తిచేయడం ఇందులోని కథావస్తువు. వర్కింగ్ కమిటీల్లో తెరవెనుక భాగోతాలు తూర్పార బెడుతుంది ఈ రూపిక. స్వామీజీ సిద్ధి తరువాత కమిటీ సభ్యుల్లో చోటుచేసుకున్న స్వార్థపర ఆలోచనలు ముక్కుమీద వేలు వేసుకునేలా ఉంటాయి.

కలంపోటు సాహితీ సౌరభాలు వెదజల్లే రూపిక. 1936 భారతి జనవరి సంచికలో తొలిసారిగా వెలుగు చూసింది. శ్రీకృష్ణదేవరాయలకు, ఆయన చిన్న రాణీకి ఏర్పడిన ప్రణయ కలహాన్ని ముక్కు తిమ్మన్న తన కలంపోటుతో విరహంగా మార్చిన తీరును చిత్రించిన రూపిక ఇది. ముక్కు తిమ్మన్న తన పారిజాతపహరణం కావ్యంలో సత్యభామ కోప ఘట్టాన్ని శ్రీకృష్ణదేవరాయలు మనసు మార్చడానికే స్ఫూర్తివంతంగా తీర్చిదిద్దాడన్న విషయం ఆధారంగా ఈ రూపికను రూపొందించారు. కృష్ణదేవరాయలు కొలువులో కావ్యపఠన ఘట్టం హృదయంగమంగా ఉంటుంది. కావ్యరచనపై జరిగిన చర్చ కావ్యసౌరభాలను వెదజల్లుతుంది. 'కలంపోటుతో ఎలాంటి గంభీర హృదయాలూ కూడా జర్జితా లయిపోతాయి' అని నిరూపించారు. 'శృంగార కవిత్వం చెరకాకు బల్లెంగా,' మారిన తీరును చిత్రించారు. పారిజాతాపహరణం తొలిరోజు కావ్యపఠనం అనంతరం ముక్కు తిమ్మనకు రాయలు వారు చిన్నరాణిపై కినుక వహించారన్న విషయమూ, దానికి శయన మందిరంలోని సంఘటనే కారణమన్న

సంగతీ తెలిసింది. దానితో రాత్రికి రాత్రే సత్యభామ కోపఘట్టాన్ని మార్చి రాయలవారి హృదయం కుతకుతలాడేలా రచిస్తాడు.

పునాది రాయి రూపిక 1937 భారతి మార్చి సంచికలో ప్రచురితం అయింది. హస్తినవీధుల్లో మసులుతున్న బాలకర్ణుణ్ణి కుంతీదేవి తన మందిరానికి పిలిపించుకుని ఆప్యాయంతో పలకరిస్తుంది. ఇది అర్జునుడికి నచ్చదు. కర్ణునిపై అసూయకు ఇదేకారణం అవుతుంది. ఇదిలా ఉండగా ఒక సంఘటనలో కర్ణుని ధైర్యం, సమయోచిత ప్రవర్తనా దుర్యోధనుణ్ణి ముగ్ధుణ్ణి చేస్తాయి. దుర్యోధనుని మనస్సులో కర్ణునిపై అభిమానం మొలకెత్తడానికీ, అది ప్రగాఢం కావడానికీ, ఆ తరువాత కర్ణుడు సన్నిహితం కావడానికి ఈ ఘట్టం పునాది రాయి అవుతుంది. సామాన్యుడైన కర్ణునిపట్ల రాజకుమారుడైన దుర్యోధనునికి అంత అభిమానం ఎలాఏర్పడింది? అంత స్నేహానికి కారణం ఏమిటి ? అనే ప్రశ్నలకు సమాధానం ఈ రూపిక.

లక్ష్యసిద్ధి రూపిక కూడా కర్ణుడికి సంబంధించినదే... అస్త్ర విద్యా ప్రదర్శనలో అర్జునుడికి పోటీగా కర్ణుడు ముందుకు రావటం - అయితే పోటీచేయడానికి కర్ణుణ్ణి అనర్హునిగా చేయడం - దానిపై దుర్యోధనుడు కర్ణుణ్ణి అంగరాజుగా చేసి అర్హుణ్ణి చేయడం కథావస్తువు. కర్ణుణ్ణి అనర్హుడుగా ప్రకటించినపుడు కంతీదేవి మానసిక స్థితీ, కురువీరుల్లో చర్చా చిత్రీకరణ హుందాగా ఉంటుంది. కులంపేరుతో నైపుణ్యాన్ని నిరసించడం తగదు. అనే సందేశాన్ని ఇస్తుంది ఈ రూపిక. నిజాయితీ, మానవతా, నైపుణ్యమూ ఉంటే అవి ఎప్పటికైనా ఆదరణకు నోచుకోగలవని కూడా నిరూపిస్తుంది.

టీ - పార్టీ రూపిక కట్నకానుకలను నిరశిస్తుంది. అత్తవారి నుండి సొమ్ము గుంజాలనుకునే వారికి గుణపాఠం చెపుతుంది. సొమ్ము కోసం భర్త పన్నిన కుట్రను భార్య భగ్నం చేసిన తీరు కమనీయం. ఈ రూపిక 1946 ఆంధ్రశిల్పి ఆగష్టు సంచికలో వెలువడింది. సొమ్ము గుంజడం కోసం తను సైన్యంలో చేరిపోతానని, బెదిరిస్తూ ఒక భర్త ఉత్తరం వ్రాస్తాడు. అందులోని కుట్రను పసికట్టిన ఆయన భార్య టీపార్టీ ఏర్పాటు చేసి, తన భర్త ధైర్య సాహసాల్నీ, సైన్యంలో చేరడానికి తీసుకున్న నిర్ణయాన్నీ ప్రశంసిస్తుంది. తను వీరపత్ని అవుతున్నందుకు గర్విస్తున్నానంటూ ప్రకటిస్తుంది. దాంతో తన పన్నాగం ఫలించనందుకు భర్త ఖంగు తింటాడు. టీపార్టీలో భార్య ప్రసంగమూ, దానిపై భర్త స్పందనా రసమయంగా ఉంటాయి.

శ్రీపాద వారి నాటకాల్లో అయితేనేమి, రూపికల్లో అయితేనేమి కథాకల్పనలో చిక్కతనం, పాత్ర చిత్రణలో ఒడుపు, సంభాషణలో చాతుర్యమూ ఎక్కడికక్కడే ఆనందాన్ని కలిగిస్తాయి. సందర్భం వచ్చినప్పుడల్లా సూక్తులు, సిద్ధాంతాలు, సందేశాలు గుప్పిస్తారు. సంభాషణల్లో విరుపులు, మెరుపులు, చమత్కారాలు, చెణకులు ఉంటాయి.

ఈ రచనల్లో సందర్భోచితంగా నిక్షిప్తం చేసిన సందేశాలను, నిర్వచనాలను ఓపిక ఉండాలే తప్ప ఎన్నైనా సేకరించుకోనూవచ్చు - సమయం వచ్చినప్పుడల్లా నెమరు వేసుకోనూవచ్చు

మచ్చుకు కొన్ని -

'ఎటువంటి వారికీ ఒక్కొక్కప్పుడు మనస్సు చెదిరిపోకుండా ఉండదు. అది అనివార్యం. అయితే సత్తా ఉన్నవారు నిగ్రహించుకో గలుగుతాయి. చలనమే లేకపోవడం శిలాప్రతిమలకే' - అంటారు మనోవిశ్వాసాన్ని విశ్లేషిస్తూ.

'బలీయమైన రెండు ప్రతికూల శక్తులకు సంఘర్షణ తటస్థ పడితే అక్కడ పర్యవసానం దారుణంగా ఉంటుంది. వాటిలో ఏ ఒకటీ రెండోదానికి లొంగిపోవడం ఉండదు' - అంటూ సామాజిక ప్రవర్తనాసరళిని సిద్ధాంతీకరిస్తారు.

'సున్నితమైన హృదయానికి ఓ పట్టాన కాఠిన్యం అలవడదు. అలవడితే మాత్రం అంత భయంకరమైనది మరోటి ఉండదు' - అని చెప్పడం శాస్త్రిగారి సున్నితమైన సామాజిక పరిశీలనకు నిదర్శనం.

'చింతలోంచి జాలీ, జాలిలోంచి కరుణా, కరుణలోంచి ప్రేమా పుట్టుకు వస్తాయిట. ప్రేమ పరిణామ ప్రక్రియను నిర్వచిస్తారు. దీన్ని బట్టి ప్రేమ అనేది క్రమంగా ఏర్పడుతుందే తప్ప ఎగుపులాగ ఒక సారి రాదు. అలా వచ్చిందంటే అది ప్రేమ కానేకాదు. మరోటి ఏదో అవుతుంది.

'ధర్మనిబద్ధత అయి ఉన్నంతవరకే ప్రభుతకు చెల్లుబడి. ధర్మం ఉన్నదా వజ్రాయుధం కూడా దాన్ని ఏమీచేయలేదు. లేదూ గడ్డి పరక కూడా చాలు దాన్ని కూల్చడానికి' - అంటారు. పాలకులు, అధికారులు నిత్యమూ గుర్తుంచుకోవలసిన ఆణిముత్యమిది.

వాఙ్మయం హృదయంగమంగా ఉండాలంటే అది స్వభావ సిద్ధంగా ఉండాలిట.

'కవితావేశం ఉంటే మనిషి అంతర్ముఖు డౌతాడు. అప్పుడు మాయవృతమైన చరాచర జగత్తులో అవిచ్ఛిన్నమైన సత్యమే గోచరిస్తుంది. ద్వంద్వం నశిస్తుంది. ధర్మనిర్ణయం చేసేటప్పుడే కనక కవితావేశం వస్తే అంతకంటే కావలసింది ఏముంది' - అంటారు. కవితావేశానికి - సత్యానికి అభేదం అని వారి విశ్వాసం.

'ధైర్యంగా నిలిచి ఆడది ఎదుర్కొనగలిగితే మగాడు ఉక్కిరిబిక్కిరి అవుతాడు''ట.

'తమ పట్ల స్త్రీలు భయభక్తులు చూపించాలనే గాని, స్త్రీల యెడల తాము ఆదరాభిమానాలు కనబరచాలన్న జిజ్ఞాస ఉండదు చాలమంది పురుషులకు' అని విమర్శిస్తారు. ఆదరాభిమానాలు ఉంటే భయభక్తులు ఉంటాయి. - అవి లేకపోతే కోపతాపాలే ! చిరాకులూ - చీదరింపులే !

'సముద్రంలో ఎంత చల్లదనం ఉందో అంత బడబానలం ఉంది. రాకరాక అది పైకి వస్తే ఇక పట్టపగ్గాలు ఉండవు' - అని హెచ్చరిస్తారు.

ఇలా ఎన్నెన్నో .....

ఈ రచనలు గతశతాబ్దం పూర్వార్థంలోనివే అయినా ఈనాటికీ అవి ఏ మాత్రం వసి వాడలేదు.

నిత్యసత్యాలు ఎలా వసివాడతాయి !

శ్రీపాదవారి వ్యక్తిత్వం :

శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వ్యక్తిత్వం కూడా వారి రచన లాగే హుందాగా ఉంటుంది. ధృఢమైన విగ్రహం - ముఖంలోనూ, నడకలోనూ ఠీవి, కొట్టవచ్చినట్టు కనిపించే ముక్కుసూటితనం - ఎంతమందిలో ఉన్నా ఇట్టే తెలిసిపోతారు.

శ్రీపాదవారిది నియమనిష్ఠలు గల వైదిక కుటుంబం. తెలుగుగ్రంథాలు చదవడమే అపరాధం కింద లెక్క ఆ కుటుంబంలో.

అయితే శాస్త్రి గారికి చిన్నప్పటి నుండి తెలుగు కావ్యాలు చదవాలని ఉబలాటం - క్రాపింగు దిద్దుకుని, కాలర్ చొక్కా తొడుకుని తిరగాలన్న కోరిక బలంగా ఉండేది. అన్నగారి ప్రోత్సాహంతో ఓం అంటూ తెలుగు కావ్యాన్ని చేపట్టారు. అది నన్నయ భారతం - రెండున్నర సంవత్సరాల పాటు దాన్నే చదువుకుంటూ ఉన్నారు.

ఆ తరువాత్తరువాత మిగతా కావ్యాలూ చదివారు, భాషా మెలుకువలూ పట్టించుకున్నారు.

తెలుగు పలుకుబళ్ళను, నుడికారాన్ని ఆయన మహిళల నుండే గ్రహించ గలిగారట. తెలుగు సంస్కృతి , నుడికారం - ఆడవారి వద్దనే ఉంది అంటారు శాస్త్రి గారు. వారి సంభాషణలు శ్రద్ధగా వినేవారు ఆయన.

1920 నుండే ఆయన రచన ప్రారంభించారు. ఆ ప్రాంతంలోనే ప్రబుద్ధాంధ్ర అనే తెలుగు మాస పత్రికను ప్రారంభించి వ్యావహారిక భాషలో వ్యాసాలకు అవకాశం కల్పించారు. హిందీకి వ్యతిరేకంగా ఆ పత్రిక ద్వారా ఉద్యమం నడిపారు. అప్పట్లో ప్రబుద్ధాంధ్ర గొప్ప చైతన్యం తీసుకొచ్చింది.

'హిందీ వల్ల తెలుక్కి జరుగుతున్న అపకారం' అనే శీర్షికతో ఎన్నో వ్యాసాలు రాశారు.

అయితే అప్పట్లో జాతీయ ఉద్యమం ముమ్మరంగా ఉండడమూ, హిందీ ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్మాణ కార్యక్రమం క్రింద చేపట్టడం వల్ల తెలుగు వారిలో హిందీ భాషాభిమానులు ఎక్కువగానే ఉన్నారు. పైగా శాస్త్రి గారి భావాలు అప్పట్లో తీవ్రంగా కనిపించేవి. దానివల్ల చాలామంది హిందీ వ్యతిరేక ఉద్యమం పట్ల తగినంతగా ఆకర్షితులు కాలేక పోయారు. తెలుక్కి జరుగుతున్న అన్యాయాన్ని కానుకో లేక పోయారు.

అప్పట్లో బెంగాలీ నుండి, హిందీ నుండి అనువాద సాహిత్యం ఎక్కువగా వచ్చేది. పోనీ రచనలు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేవా అంటే - అవేమీ లేకుండా ఉత్తరాది సంస్కృతిని, సన్నివేశాల్ని, పేర్లతో సహా యధాతధంగా తెలుగులోకి దిగుమతి చేసేవారు. తెలుగు నుడికారంతో తెలుగు సన్నివేశాలతో తెలుగు కధలే కరువైపోయాయి. సృజనాత్మకత లోపించినట్టు కనిపించేది- చాలా వాటిల్లో

ఇదిగో ఈ పరిస్థితే శ్రీపాదవారి ఉద్యమానికి కారణం. తెలుగు మీద హిందీ పెత్తనాన్ని భరించలేకపోయారు శాస్త్రిగారు. తెలుక్కి అపకారం హిందీ వల్లనే జరుగుతోందని ఆయన గట్టిగా నమ్మారు. హిందీ మీద ద్వేషం - గాంధీగారి మీదకీ

- ఆయన ప్రచారం చేసే ఖద్దరు మీదకీ కూడా మళ్ళింది. దీన్ని చాలామంది స్వీకరించలేక పోయేవారు - శ్రీపాదవారికి ఎక్కువగా మిత్రులు లేకపోడానికి ఇదీ కారణమే.

తను నమ్మినదానిపట్ల రాజీపడని మనస్తత్వం గల శాస్త్రి గారు గట్టి పట్టుదలతోనే నిలబడ్డారు. హిందీ సంస్కృతిని వెక్కిరిస్తూ కథలు కూడా రాశారు.

పురిపండా అప్పలస్వామి గారు గాంధేయవాది - హిందీ భాష బాగా నేర్చుకున్నవారు. పైగా ఆయన ఎప్పుడూ ఖద్దరే ధరించేవారు. చిత్రం ఏమిటంటే శ్రీపాద వారికి చివరికంటా పురిపండా వారు ఆత్మీయులు గానే ఉండిపోయారు. ఇద్దరికీ కూడా రచన తప్ప మరో వ్యాపకం లేదు. పురిపండా వారు బహు భాషాకోవిదులు - శ్రీపాద వారికి సంస్కృతం తప్ప మరో ఇతర భాషలో ప్రవేశం లేదు. ఆంగ్ల ప్రభావంగాని, హిందీప్రభావం గాని శ్రీపాదవారి మీద పడలేదు. కాబట్టే ఆయన రచనలో స్వచ్ఛమైన తెలుగుతనం ఉట్టిపడుతుంది. 'కాఫీ తాగుతారా' అనకూడదట. 'కాఫీ పుచ్చుకుంటారా', అనో 'కాఫీ తీసుకుంటారా' అనో అనాలిట. తాగడం మరోదానికి సంబంధించినది అంటారు. ఇది తెలుగు నుడికారం.

శ్రీపాదవారి రచనా పద్ధతి, వ్యవహార సరళి-అంతా నియమబద్ధంగానూ, ప్రణాళికా బద్ధంగానూ ఉంటాయి.

రాతప్రతి తయారు చేయడం దగ్గిరి నుంచే ప్రత్యేకత కనిపిస్తుంది. పదానికి పదానికి మధ్య ఎక్కడ జాగా ఇవ్వాలో సూచించడం కోసం నిలువు గీతలు గీసుకుంటూ రాయడం ఆయనకి అలవాటు - చిన్నచిన్న వాక్యాలు, చిన్నచిన్న పేరాలు వీరి రచనలో ఓ ప్రత్యేకత. పేరాలో రెండు మూడు వాక్యాలు మించి ఉండవు. ఒక్కొక్కప్పుడు ఒక్కవాక్యమే ! ఒక్కపదమే కూడాను.

ప్రింటింగు ప్రెస్సులో కంపోజు చేసేటప్పుడు ఆయన గీతలు గీసిన చోటే జాగా (స్పేసు) వదలాలి. దానికి భిన్నం ఉండకూడదు. ప్రింటింగుకి ఇచ్చేటప్పుడే ఇన్ని పేజీలు (అర పేజీతో సహా) వస్తుందని. చెప్పేవారు. ఒక్క లైను కూడా తేడా లేకుండా కచ్చితంగా అంతే వచ్చేది - అది ఆయన ప్రత్యేకత. ఎంత జాగ్రత్తగా కంపోజు చేసినా కొన్ని తేడాలు వచ్చేవి. ఆయన 'మిక్కిలీ' అని చివరన దీర్ఘం పెడతారు. ' అయినప్పటికిన్నీ - ఇలా చివరన దీర్ఘాన్ని కంపోజిటర్లు గమనించేవారు కాదు.

రాజమహేంద్రిలో నేను అద్దేపల్లి నాగేశ్వరరావు గారి సరస్వతీ ప్రవర్ ప్రెస్‌లో వర్క్స్ ఎగ్జిక్యూటివ్ గా ఉండేవాణ్ణి. శ్రీపాదవారి పుస్తకాలు చాలావరకు ఆ ప్రెస్‌లోనే అచ్చు అయ్యేవి. ఆకారణంగా నాకు శ్రీపాదవారితో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది. సరస్వతీ గ్రంథమండలి అనే ప్రచురణ సంస్థ కూడా ప్రెస్సుకి అనుబంధంగా ఉండడంవల్ల ఎంతో మంది రచయితలతో కలిసి మెలిసి తిరిగే అదృష్టం కలిగింది.

శ్రీపాదవారి శైలి తెలిసిన కంపోజిటర్లు ఒకరో, ఇద్దరో మాత్రమే ఉండేవారు. వారు మాత్రమే ఆయన గ్రంథాల్ని కంపోజు చేయవలసి వచ్చేది. మరొకరు పనికిరారు. ప్రింటింగేనా ఆపుజేస్తారు గాని మార్పు అంగీకరించరు. ఇటువంటి చిన్న విషయంలో కూడా అంతటి పట్టుదల. అది మనకి చిన్న విషయం కావచ్చు. ఆయనకు మాత్రం పెద్దవిషయమే. ఆఖరికి శాస్త్రి గారు చెప్పిన వ్యక్తి చేతనే ప్రింటింగు చేయించవలసి వచ్చేది. ఇది ప్రెస్సు యొక్క ఆంతరంగిక విషయంలో తలదూర్చడం వంటిదే అయినా, ఆయన పట్ల గౌరవం వల్ల నేనుగాని, మా అధినేత అద్దేపల్లి వారు గాని ఎదురు చెప్పేవారం కాదు. అంతా పద్ధతి ప్రకారం జరిగిపోవలసిందే. ఎక్కడా తేడా రావడానికి వీల్లేదు. మేము కూడా అంత జాగ్రత్తగానూ మసులు కునేవారం. తరచు నా మీద ఆయన కోపతాపాలు ప్రదర్శించేవారు. ఎంత జాగ్రత్తగా చేసినా ఏదో తేడా లేకుండా ఉండేదికాదు. తప్పు ఎవరిదైనా చివాట్లు నాకే ! అయినా వాటిని ఆశీస్సులుగానే భావించేవాణ్ణి. అప్పుడప్పుడు శాస్త్రి గారు అనేవారు - ' నీ మీద నాకు కోపం లేదు. తేడా మీదనే ! ద్వేషం గాని, అసంతృప్తి గాని మనుషుల మీద కాదు, విషయం మీదనే ' అనేవారు.

ప్రూపుల స్థాయిలో రచయితలు కొత్తగా మార్పులు, చేర్పులు చేస్తుంటారు. శ్రీపాదవారు మాత్రం రాత ప్రతికి మించి ఒక్క అక్షరం కూడా మార్చేవారు కాదు. చేర్చేవారు కాదు.

అప్పట్లో సరస్వతీ పవర్ ప్రెస్సు పండితులకు ఆస్థానంగా ఉండేది. శ్రీపాదవారి తోను, పురిపండావారితోను, మధునాపంతుల వారితోను, నేదునూరి గంగాధరం గారితోనూ ఎక్కువ చనువుగా ఉండేవాణ్ణి . వారి నుండి ఎన్నో సంగతులు నేర్చుకొనే వాణ్ణి. సరస్వతీ పవర్ ప్రెస్ ఆచార్య పీఠంగా సాహితీ అధ్యయనం జరిగింది.

శ్రీపాదవారు ఏపని చేసినా అంతా క్రమ పద్ధతిగా ఉంటుంది. పైకి ఇది చాదస్తంగా కనిపించినా ఆ పద్ధతివల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

కలాభివర్ధనీ పరిషత్ స్థాపించి ఎన్నో కార్యక్రమాలు, సన్మానాలు చేసేవారు. సభానిర్వహణ గాని, సన్మానం గాని అంతా పద్ధతి ప్రకారమే జరిగేది. సన్మానితులు అప్పటికప్పుడు సభాస్థలికి రావడం కాదు - సన్మానితుడు ముందు రోజు రాత్రికే శ్రీపాదవారి ఇంటికి రావాలి. ఉదయం వారింట అభ్యంగనమూ, అనంతరం భోజనమూను. వంటకాల విషయంలో కూడా సన్మానితునికి ఏది ఇష్టమో, ఏది అయిష్టమో తెలుసుకొని ఆ ప్రకారం చేయించేవారు. ఆఖరికి సన్మాన సభలో ఇవ్వబోయే శాలువా ఏ రంగులో ఉండాలో కూడా ముందే అడిగి తెలుసుకునేవారు. సభకు గాని, సన్మానానికి గాని పిలిచినప్పుడు - తాము వారికి ఏమేమి ఇవ్వగలరో అతి స్పష్టంగా రాశేవారు. ఎంత ఖరీదు శాలువా కొనదలచుకున్నారో కూడా తెలియజేసేవారు. ఎప్పుడు రావాలో, తిరిగి ఎప్పుడు వెళ్ళాలో కూడా స్పష్టంగా చెప్పేవారు. ఇది కొంతమందికి విపరీతంగా తోచినా, ఈ పద్ధతివల్ల అపార్థాలకు ఏ మాత్రం తావు ఉండేది కాదు - ఇటువంటి సందర్భాలో 'యథాశక్తి' అనే మాట వాడే వారు కాదు ఆయన. సభకు కావలసిన వస్తువులను అగ్గిపెట్టెతో సహా జాబితా రాసుకునేవారు. సభ ఎజండా అతి వివరంగా రాసుకునేవారు. ఆ ప్రకారమే జరిగేది.

"వ్యాపారంవల్ల మనిషి పాడవడం ఉండదు. మనిషి వల్లనే వ్యాపారం పాడవుతుంది' వంటి సామాజిక సిద్ధాంతాలు శ్రీపాదవారి రచనల్లో కోకొల్లలు.

శ్రీపాదవారి మాట కరకుగా ఉన్నా మనస్సు మాత్రం చెరకు. ఎంతో మందికి ఆయన గుప్తదానాలు చేశారు. సహకారం అందించారు. ఆయన మాట మంద్ర స్వరంలో ఉండి వినడానికి ఇంపుగా ఉండేది. సాధారణ సంభాషణలు కూడా రచనల్లో సంభాషణల్లాగే ఉండేవి.

ఒకసారి ప్రింటింగు పని అనుకున్నట్టు కాకపోవడం వల్ల - ముందే నేను క్షమాపణ చెప్పుకున్నాను. దానికి కారణం సవిస్తరంగా వివరించాను. ' మరోలా అనుకోకండి ' అని ప్రాధేయపడ్డాను. దానికి ఆయన ' అనుకోవడానికి మాత్రం ఏం మిగిల్చావు - వెనుదిరిగి వెళ్ళడం తప్ప ...' అన్నారు. ఇది నాకు ఇప్పటికీ అక్షరాక్షరం

జ్ఞాపకం. ఎందుకంటే ఆయన సంభాషణ కూడా రచనాశైలిలోనే ఉంటుందని చెప్పడానికి అనువైన సంభాషణల్లో ఇదొకటి కాబట్టి.

శ్రీపాదవారు వాల్మీకి రామాయణాన్ని పూర్తిచేసిన తరువాత - వ్యాస భారతాన్ని చేపట్టారు. ఆదిపర్వంతో ప్రారంభించిన నన్నయ పూర్తిగా రచించలేక పోయారు కదా ! తిక్కన విరాట పర్వంతో ప్రారంభించి నిర్విఘ్నంగా పూర్తి చేశారు. శ్రీపాదవారు తిక్కనలాగ విరాట పర్వంతో ప్రారంభించారు. ఉద్యోగ పర్వం పూర్తి చేసినవారు అలా చివర దాకా వెళ్ళినా బాగుండేది. అలా కాకుండా ఉద్యోగ పర్వం తరువాత వెనక్కి ఆదిపర్వానికి వచ్చారు. దానిని సగం రాసేసరికి ఇక ముందుకు సాగలేదు. రెండున్నర పర్వాలే రాయగలిగారు.

శ్రీపాదవారు గజం ఎత్తు పుస్తకాలు రాయాలని అనుకునేవారు. అంటే ముద్రణ పొందిన ఆయన రచనలు ఒక్కొక్క ప్రతిని ఒకదానిపై ఒకటి పేరిస్తే గజం ఎత్తు రావాలని అనుకునేవారు. ఆయన అనుకున్నట్టు భారతం పూర్తిచేసి, భాగవతం కూడా రాసి ఉంటే గజం ఎత్తూ అయ్యేవి.

సుబ్రహ్మణ్యశాస్త్రి గారు 'శ్మశానవాటిక' నవల రాశారు. ఈ నవల మీద పుంఖానుపుంఖంగా అభినందనలు వచ్చాయి. అయితే ఆ ప్రశంసలలో కొంత కొంటెతనం కూడా ఉండేది... ' మీశ్మశాన వాటిక చూశాము. చాలా రమణీయంగా ఉంది.' అని రాసేవారు. 'మీ' అనే పదాన్ని పదేపదే వాడేవారు. అయితే ఆరకం ప్రశంసల్ని శ్రీపాదవారు భరించలేకపోయేవారు. శ్మశాన వాటిక నవల అని ఉంటే కొంత ఇబ్బంది తగ్గేది. అలా కాకుండా కావాలనే కొందరు కొంటితనం చూపేవారు. పోనీ ' శ్మశాన వాటిక' అనకూడదూ ! 'మీ' అని కూడా ఎందుకు మళ్ళీ ...? అందులోనే ఉంది కొంటెతనం - అనేవారు. తరువాతి ముద్రణలో శ్మశానవాటిక పేరును 'విషభుజంగం' గా మార్చడానికి కారణం ఇదే !

శ్రీపాదవారు 'గంధర్వఫార్మసీ'ని నడిపారు. వారు ఆయుర్వేదంలోనే కాకుండా సంగీతంలో కూడా దిట్టే. ఒక్కరూ ఉన్నప్పుడు ఇంట్లో సంగీత సాధన చేసేవారు.

'అనుభవాలూ జ్ఞాపకాలూను' మూడు సంపుటాల్లోను నిర్మొహమాటంగా స్వీయ విషయాలూ, ఆనాటి సాహిత్య, సాంఘిక విషయాలను యథాతథంగా వివరించారు.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని జాతీయస్థాయిలో మళ్ళీ ఎలుగెత్తి చాటుకోవలసిన అవసరం కలిగిన ఈ సమయంలో శ్రీపాదవారిని స్మరించుకోవడం, ఆయన రచనలను సమీక్షించు కోవడం ఎంతైనా అవసరం.

తెలుగుతల్లికి అవి మేలిమి బంగారు ఆభరణాలు వంటివి.

తెలుగు తోటలో పూచిన బంతి చేమంతులు.

శ్రీపాదవారి సంస్మరణ తెలుగుతల్లికి శ్రీచందనమే !

(రేడియో ప్రసంగం విస్తరించబడినది)

- పున్నమరాజు నాగేశ్వరరావు

శ్రీనివాస ప్రశాంత నిలయం, ప్రసాద్‌నగర్
వి.టి. (వంటి తాడి) అగ్రహారం,
విజయనగరం - 535 004
సెల్: 9290184814

వారిలా ఎవరూ రాయలేరు

" .. తెలుగు బ్రాహ్మణ కుటుంబాల జీవితాన్ని గురజాడ ఒక రకంగా చిత్రిస్తే, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఒకలా, రామకృష్ణ శాస్త్రిగారు మరోరకలా చిత్రించారు. గురజాడకు వారసులున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, రామకృష్ణ శాస్త్రి గార్లకు అభిమానులే గాని వారసులు లేరు. గురజాడ పాతకొత్తల మేలు కలయిక. ఇద్దరు శాస్త్రి గార్లూ ప్లస్ రావి శాస్త్రి గారితో సహా ముగ్గురూ పాతకొత్తల మేలు కలయికే. సుబ్రహ్మణ్య శాస్త్రిగారిలా, రామకృష్ణ శాస్త్రిగారిలా ఎవరూ రాయలేరు. రాయనవసరం కూడా లేదు.. ఆ గ్రామీణ జీవితం, ఆ మనుషులు, ఆ సంబంధాలు ఇప్పుడు లేవు.

- పురాణం సుబ్రహ్మణ్య శర్మ

(ఆంధ్ర జ్యోతి వారపత్రిక 5-4-1974)

పురాణాల అనువాదాలు

- ఇచ్ఛాపురపు రామచంద్రం

కీర్తిశేషులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు - పుల్లంపేట జరీచీర, రాచపీనుగు తోడులేకుండా వెళ్ళదు, వడ్లగింజలు, గులాబీ అత్తరు వంటి ఎన్నో అద్భుతమైన కథలు రాసిన కథక చక్రవర్తి. విషభుజంగం, ఆత్మబలి, నీలాసుందరి వంటి నవలలు ; రాజరాజు, స్వప్న వాసవ ధత్త మొదలైన నాటకాలు ; కలంపోటు కొనుక్కున్న మొగుడు, వర్కింగ్ కమిటీ, ఇలాటి రూపికలు ; అనుభవాలూ జ్ఞాపకాలూనూ, వైద్యనిఘంటువు, బాలల బొమ్మల రామాయణం, దేవవాణి సుభాషితాలు, బేతాళ కథలు వ్రాసిన బహుముఖ సాహితీ ప్రజ్ఞాశీలి. తెలుగు కథకు జవమూ - జీవమూ. నీతీ నిజాయితీలతో పాటు అద్భుత గుణాన్నద్దిన అపర ఆస్కార్ వైల్డ్. సహజమూ సజీవమూ అయిన భాషతో పాత్రలకు ప్రాణం పోసిన పరమేష్ఠి. సర్వస్వతంత్ర రచయిత.

స్వతంత్ర రచయితకి అనువాదం అతి తరచుగా అసిధారావ్రతమే. అందులోనూ తెలుగు భాషకి తల్లైన సంస్కృతంలోంచి అనేక పదాలు తెచ్చుకున్న తెలుగులోకి అనువాదం చేయడమంటే కొంచెం యిరుకుగానే అనిపిస్తుంది. పైగా 1947 ప్రాంతాలలో శ్రీపాదవారు వాల్మీకి రామాయణం అనువదించే నాటికే - మొల్ల, కంబ, రంగనాధ రామాయణాల వంటివి ఉన్నాయి. పురిపండా - విశ్వనాధ సత్యనారాయణ వంటి మరెందరివో. రామాయణ రచనలు ఇప్పుడు పాఠకుల ముందున్నాయి. మరి - వీటన్నిటి మధ్య తన రామాయణం ప్రత్యేకంగా నిలవకుండా కేవలమూ, భాషాంతరీకరణం చేసి ఊరుకోగలరా శ్రీపాద వంటి ప్రతిభా వ్యుత్పత్తులు కలవారు !

రామాయణం - 24వేల శ్లోకాల గ్రంథం. ఆరుకాండల మహాకావ్యం. గాయత్రీ మంత్రాత్మకం కావడంతో వేదమే అయిపోయింది. మహాతపశ్శాలైన వాల్మీకి రచన. అవధులు లేని పాండిత్యం అతనిది.

అటువంటి కావ్యాన్ని తెలుగులో ఘనమైన భాషాపదజాలంతో వ్రాయవచ్చు. అంత భాషావైభవం తన వద్ద ఉన్నా శ్రీపాద - 'వాల్మీకి విరచిత రామాయణాన్ని' అందరికీ సులభంగా అర్థమయ్యే వాడుక భాషలోనే అనువదించారు. 'ఎన్నో మార్లు' అని కూడా వాడకుండా 'ఎన్నోమాట్లు' అనే వాడారు. సుమారు ఏడు వందల పేజీలున్న గ్రంథంలో ఏడుపదాలకి కూడా నిఘంటువుని వెదకవలసిన అవసరం కల్పించలేదు. చిన్న చిన్న వాక్యాలే వ్రాశారు అనువాదకులు. అది - వారికి వ్యావహారిక భాష మీదన్న పట్టునే కాక - సామాన్యులకి కూడా రామాయణం అర్థం కావాలనే ధ్యేయాన్నీ, ప్రజల పట్ల ప్రేమనీ తెలుపుతుంది. శ్రీపాదవారి అనువాదం స్వతంత్ర రచనలా సరళంగా సాగుతుంది. వారు మరేదో సందర్భంలో - 'ఆడవాళ్ల మాటల నుంచి నా భాషనీ శైలినీ, అభివృద్ధి చేసుకున్నాను' అన్నారు. అందుకే వారికంత మధురమూ, మంజులమూ అయిన మాటలు, సుందరమైన శైలీ, ప్రతిభావంతమైన వాక్య నిర్మాణమూ.

మా నిషాద ! ప్రతిష్ఠాంత్వ మగమ శ్శాశ్వతీ సమా:
యత్క్రౌంచ మిధునాదేక మవధీ: కామ మోహితమ్.

శోకార్తుడైన వాల్మీకి నోట పుట్టిన యిది - మొట్ట మొదటి శ్లోకం. రామాయణం... వాల్మీకి - బ్రహ్మ సూచన ప్రకారం - నారదుడి నోట విన్న రామకథ... అంతర్ దృష్టితో చూసిన చరిత్ర సాయంతో రచించిన ఆది కావ్యం.

సహజంగా రచయిత అయిన శ్రీపాద - వాల్మీకి రామాయణం ఎంత గొప్పదైనా ... అనువాదంలో తన ముద్ర వేయకుండా ఉండలేక ... మూలాన్ని ముట్టుకోకుండానే ప్రతీ కాండకి ముందు 'సూచన' ఇస్తూ మూలానికీ తన అనువాదానికి మరింత వన్నే, ప్రాశస్త్యమూ తెచ్చారు.

' బాలకాండ అంతా రాముని బాల్యానికే సంబంధించింది కనుక - అయోధ్యకాండ అంతా అయోధ్యలో జరిగిన ఉదంతానికే సంబంధించి ఉంటుందను కొంటాం మనం. కానీ, 'అలా జరగలేదు' అని పాఠకులకు వివరిస్తూ అయోధ్య కాండకు అన్వర్థత చేకూరిన వైనం వివరిస్తారు అనువాదకులు. ఈ కాండ మొదటి నుంచి రాముని జీవిత రహస్యమూ, వాల్మీకి కవన వైశిష్ట్యము బాగా తెలుసుకొని అనువదించాలంటే పాఠకులు అడుగడుగునా సావధానంగా ఉండాలని, జాగ్రత్త చెప్పి మరీ అయోధ్యకాండను అందిస్తా రనువాదకులు.

అరణ్యావాసం పద్నాలుగేళ్ళలోనూ కొద్ది మాసాలు తప్ప మిగిలిన కాలమంతా రాముడు మనదేశంలోనే ఉన్నాడు... అని చెప్పి 'మనకి మక్కువ ఎక్కువ' అంటూ దండకారణ్యం వెనుక కథా, గోదావరి నది ప్రత్యేకత, భద్రాచలం గొప్పతనం

చూచాయగా చెబుతారు అనువాదకులు - అరణ్య కాండకు ముందు ప్రతీ ఊరిలో రామకోవెల... ప్రతీ బృందము రామ భజన, శ్రీరామ సప్తాహాలు, సామ్రాజ్య పట్టాభిషేకాలు, సీతారామ కళ్యాణాలు... గుర్తు చేస్తూ. 'అన్ని సందర్భాలలోనూ ముఖ్యంగా, ఆపదలో రామా రామా అంటారే తప్ప మరో దేవుణ్ణి తలచుకోరు తెలుగువారు. మనదేశంలో - సీతారామలక్ష్మణుల ముగ్గురి పేర్లూ లేని ఊళ్ళే కాదు ఇళ్లే లేవు' అంటూ తెలుగుతనం గుర్తింప జేస్తారు. 'మన భవభూతి ఉత్తర రామ చరితం రాయడానికి వెనుక హేతువు - తెలుగునాడు సీతారాముల కరుణామయ జీవితానికి రంగస్థలం కావడమే - అని రహస్యాన్ని మనకి చెబుతారు అనువాదకులు. రామాయణాని కంతటికీ ఉత్కృష్ట మయిన అరణ్యకాండ కథ అంతా యిక్కడిదే కావడం తెలుగువారి అదృష్టం అని వివరిస్తారు అనువాదకులు. కిష్కింధాకాండకు వెళ్ళే ముందు - వాలి సుగ్రీవుడి కంటే బలవంతుడైనా రాముడు అతని సాయం కోరక ఎందుకు వధించాడో, ధర్మ సూక్ష్మం అవలంబించి రాముడు అవతారమూ, ఆదర్శపురుషుడూ, వాల్మీకి కీర్తించ దగిన పాత్రా ఎలా కాగలిగాడో చెబుతూ - 'వాల్మీకి మహర్షి -కవి చేయవలసింది కవిత్వం రచించడమూ కథ చెప్పడమూ మాత్రమే కాదు; జాతీయమైన ధర్మాన్ని జనులకు నిర్దేశించాలి' అని సూచిస్తూ 'జాతీయ నిర్మాణ మనేది కవి మాత్రమే చేయగలడని నిరూపించాలి' అని హెచ్చరించాడంటారు అనువాదకులు - కిష్కింధాకాండకు ముందు 'సూచన'లో.

'సుందరకాండ' కి సూచనలో 'తక్కిన కాండల పేర్లులా ఇది కథకి సంబంధించినది కాదు - కథ - ఆగిపోయిం దిక్కడ. కానీ - ఈ సుందరకాండ లేకపోతే వాల్మీకి కవిత్వానికీ, రామాయణ కావ్యానికీ కూడా గొప్పలోటే. ఇది గుర్తించుకొన్నాడతను. రావణుడి ప్రవృత్తి, సీతమ్మ వారి విశిష్టత, హనుమంతుడి ప్రాముఖ్యానికి వెనుక గల అతని ప్రతిభాప్రాగల్భ్యాల గురించీ పాఠకులకు కలిగే సందేహాలకు సమాధానాలు; భారతీయ స్త్రీత్వానికి అవధీ భారతజాతికి ఆదర్శమూ, సీత అని చెప్పడానికి వాల్మీకి ఇక్కడ పూనుకున్నాడంటూ - పాఠకులీకాండను ఎలా అర్థం చేసుకోవాలో అనువాదకుడు సూచించాడు.

'సుందరకాండలో కవిత్వానికి పరమావధి అయిన సత్యం శివం సుందరం అనబడే త్రివర్గమూ సాధించుకుంటూ, తన కవన సౌందర్యమంతా ఈ కాండలో గుట్టలు పెట్టినందు వల్లనే ఇది సుందర కాండ అయిందన్న మర్మం విప్పారు శ్రీపాద.

ద్వంద్వ భూయిష్టమైన ఈ లోకంలో - సత్యమూ, ధర్మమూ మాత్రమే జీవిత సాఫల్యానికి ప్రధానాలని నిర్ధారించి పాఠకులను ఉన్నతోన్నత పథాలకు తీసుకు వెళ్లడానికే ఈ రచన. అదే మనకి వాల్మీకి ఇచ్చిన సందేశం అని విప్పి చెప్పి ...

'నిషాదుడు క్రౌంచ మిధునంలో మగపక్షిని కూల్చిన సన్నివేశానికి వాల్మీకి హృదయం ద్రవించింది. తరువాత ప్రవహించింది. ఆ ప్రవాహమే రామాయణ రూపమై రసధుని అయింది. ఆరసధునే భారతీయతను సంస్కరించి మహోన్నత నాగరికత కాలవాలం చేసిందని మనం బాగా గుర్తుంచుకోవాల'ని హెచ్చరించాకే యుద్ధకాండలో ప్రవేశపెడతారు అనువాదకులు పాఠకులని.

ఉత్తరకాండకు సూచనలు చేస్తూ శ్రీపాద వ్రాసిన వాక్యాలు పాఠకులకు ఎంతో మేలు చేసేవి. 'ఈ ఉత్తరకాండ వాల్మీకి ప్రోక్తం కాదని ఒక మాట ఉంది. అది- సత్యమూ కావచ్చు, అసత్యమూ కావచ్చు. ఆ చర్చలో నాపేరు నలగడం నాకిష్టం లేదు. తక్కిన ఆరుకాండలలోనూ ఉన్న జిగీ, బిగీ ఈ కాండలో లేవు. తెలుగు పద్య బంధంలోని వచనానువాదాలు గ్రాంధికాంధ్రంలో ఉండిపోయాయి. ఆంధ్ర జాతి మేలు కోరి శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారు వ్యావహారిక భాషా సిద్ధాంతం ప్రతిపాదించారు. అది నేను నమ్మాను. కనుక వ్యావహారికాంధ్రానికి పుష్టి కలిగించవలసిన భాధ్యత నాకు చాలా ఉంది. శిష్ట వ్యావహారికానికి 'శిష్టత్వం' సాధించాలంటే రామాయణం వంటి ఉద్గ్రంధాలకు కూడా అది వినియోగించవలసిన అగత్యం చాలా ఉంది. 1946లోనే నేను దీనిని అనువదించాను.' - దీనిని బట్టే తెలుస్తుంది - శ్రీపాదవారిది ప్రజలభాష అని. తెలుగు పదాలు వాడే నేటి రచయితలు వీరి నుండి గ్రహించవలసిన విషయమూ, పెంపొందించుకోవలసిన స్వభాషాభిమానమూ చాలా ఉన్నాయి.

రామాయణ అనువాదం తాలూకు ప్రయోజనాన్ని కేవలమూ ఆ గ్రంధం మేరకు బంధించబడిపోకుండా మరెన్నో విధాలుగా తెలుగుజాతి కుపకరించేలా అనువదించిన శ్రీపాద నాటికీ నేటికీ కాకుండా ఏనాటికీ తెలుగు సాహిత్యంలో నిలిచిపోగలిగే అర్హత సంపాదించుకున్నారు. శ్రీపాద, పురిపండా అప్పలస్వామి గార్ల మహాభారతం అనువాదం పాఠకులు మరింత ఆత్రంగా ఎదురుచూసేలా 'వాల్మీకి మహర్షి విరచితం రామాయణం' - వాడుక భాషలో వచనానువాదం చేసిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ధన్యులు. పురాణాలకి ఇలాటి చక్కని అనువాదాలు ఎంతైనా ఆహ్వానించ తగినవి.



ఇచ్ఛాపురపు రామచంద్రం
బి-1 వైష్ణవీ ఎంక్లేవ్,
వుడ్‌పేట, అనకాపల్లి - 531001
ఫోన్ : (08924) 222017

అనుభవాలూ - జ్ఞాపకాలూను

- యాతగిరి శ్రీరామ నరసింహారావు

తమ అనుభవాన్ని రంగరించి, జీవితపు విలువలను తెలియజేసారు శ్రీపాదవారు. గోదావరి సీమ గ్రామీణ ప్రాంతాలలోని తేటతెలుగు పదాలెన్నింటినో ఉపయోగించారు. ఆయన రచనల్లో నాటి అచ్చమైన గ్రామీణ వాతావరణం మనకు కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. ఎప్పుడు చదివినా, ఇంకా చదవాలనే ఉంటుంది. వారి కథలకు ఎంత పేరుందో ఈ "అనుభవాలూ-జ్ఞాపకాలూను" గ్రంధానికి అంతపేరూ ఉంది. సమకాలీన చరిత్ర తెలుసుకోవాలంటే చిలకమర్తివారి స్వీయచరిత్ర కోవకు చెందుతుంది ఈ గ్రంధం. చిక్కని తెలుగుతనం ఒడుపులో గ్రామీణ భావజాలం కనబడుతుంది. 'భారతీయ భాషల్లో నే నెరిగినంత వరకు ఈ రకం గ్రంధం లే'దని పురిపండావారే అన్నారు. హిందీ, గాంధీ, ఖద్దరు అంటే వారికి పడదన్న విషయం అందరికీ తెలిసిందే. దానికి కారణం మన కీగ్రంధంలో కనబడుతుంది. ఈ గ్రంధాన్ని ఒక్క గుక్కలోనే చదివామన్నారు వేలూరి శివరామశాస్త్రి గారు. తెలుగువచనం శ్రీపాదవారి సొత్తు. ఆనాటి తెనుగు పల్లెటూళ్ల జీవితం, ఆచారాలు, శ్రీమంతుల గృహాలశోభ, ఆ సంస్కృతి సర్వ రమణీయమన్నారు శ్రీ ఏటుకూరి ప్రసాద్. నాటి సభ్యతాచరిత్రకిది నిలువుటద్దం. తెలుగుభాష ఆడవాళ్లలో ఉందని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు కనబడతాయి. ఇంత అందమైనదా తెలుగు అనిపిస్తుంది వారి రచనల్లో. వాడీ, వేడీ సమృద్ధిగా ఉన్న భాష శ్రీపాదవారిది. రాబోయే తరాలవాళ్ళకి కూడా అనుభవాలూ-జ్ఞాపకాలూనూ ఎంతో ఒరవడి పెడుతుంది.

నేటి నాగరికతా లక్షణంగా - స్త్రీ దాహం, పదవీదాహం, ధనదాహం చెప్పారు శ్రీపాదవారు. ఆధునిక నాగరికతకు ఎంత చక్కని అర్థం చెప్పారో చూడండి. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, ఆత్మమర్యాదా వారి రచనల్లో కనబడతాయి.

రాజకీయాలలో సత్యంలేదు, ధర్మం లేదు. స్వార్థం తప్ప మరేమీ కూడా కాదు. అధికారమే వాటికి ప్రాప్యం - ఇదీ అనుభవసారం.

ఆనాడు ఒక అంతస్తు స్త్రీకి రాగిడీ, చంద్రవంకా, సూరీడు, చంద్రుడు, తమలపాకు, మొగలిరేకు, పాపిడిపిందిరీలు, జూకాలు, దండ, తావేజులూ, అడ్డబాసా వగైరా నగలుండేవి. దాదాపు ఈతరంలోని వారెవ్వరూ ఈ ఆభరణాల పేర్లు కూడా విని ఉండరు. కందుకూరి రాజ్యలక్ష్మిగారికి ఈ నగలన్నీ వుండేవి. ఆ నాటి మహిళ సాంప్రదాయకమైన నగలన్నీ శ్రీపాదవారి రచనల్లో దర్శించుకోవచ్చు. జీవిత పరిశీలన అంటే యిదీ.

కవిత్వమూ, పాండిత్యమూ భిన్నశక్తులు. అవి రెండూ కలిసిన స్థలాలుంటాయి. కాని, కలవకపోవడం మాత్రం లోపంకాదు. మనుచరిత్రకవికి స్పష్టంగా ఆ రెండు శక్తులు ఉన్నాయంటారు. రచయిత క్రాంతదర్శి. భావనాశక్తి సర్వజ్ఞత్వం ప్రసాదిస్తుంది రచయితకు. శ్రీపాదవారికి తెలుగుభాషపై మమకారం, ఒక విధంగా 'కసి' పెరగడానికి వారి గురువుగారు ' చచ్చు తెలుగు పోనిస్తూ' అనడం వల్ల. సనాతనుల దృష్టిలో సంస్కృతం నేర్చిన వాళ్ళే చదువుకున్న వాళ్లు. అధునాతనుల దృష్టిలో ఇంగ్లీషు నేర్చినవాళ్లే చదువుకున్నవాళ్లు. ఆ సనాతనులు ఈ అధునాతనులు కూడా అచ్చంగా తెలుగువాళ్ళే మళ్లీ. కానీ వారికుభయులకు కూడా తెలుగు తమ మాతృభాష అన్న అభిమానం లేదు. జ్ఞానమూ లేదు. మళ్ళీ మాట్లాడితే ఇటీవల ఇంకో 'తనులు' బయలుదేరారు. మమ్మే చూసుకోమంటూ హిందీ మానసపుత్రులు. వారికి తెలుగు బతికుండడమే పనికిరాదు. సామాన్యప్రజల నోళ్లల్లో ఉన్నాయి తెలుగుపదాలు.

నన్నయ గారి ఆఖరిపద్యం 'శారదరాత్రు' లన్న పద్యం ఎన్నిసార్లు చదివారో శ్రీపాదవారు. ధీరోదాత్తుడయినవాడు శాశ్వతంగా తెరలోకి పోతూ రంగస్థలాన కడసారంగా కనబరిచిన, జటిలాలైన హావభావాల సంపుటి వంటిదా పద్యమంటారు. దాంతో ఒక నిండు వెలుగు కనుమరుగైపోతుంది.

" ఒక అవతారం అంతర్థానం అయిపోతుంది. ఒక మహాయుగం అంతరించిపోతుంది. నన్నయ మరి గంటం పట్టడు. నన్నయ అవతారిక మాత్రం స్వయంభువు. అద్వితీయము అనన్య సామాన్యము అంటాడు. హరి:ఓమ్మనేటప్పటికి రసానుభవం కలిగించే అవతారిక తెలుగులో నన్నయది ఒక్కటే. దానికి సాటి

అయినా ఆ ధర్మమే అయినా, సంస్కృతంలోనున్న కాళిదాసు రఘువంశావతారిక ఒక్కటే దానికి సాటి. అయినా ఈ రెండు వాఙ్మయాలలోనూ ఆ రెండింటికీ సాటి అయినవి మరిలేవు అని ఖరాఖండిగా చెప్పేశారు.

" తన కుల బ్రాహ్మణు..." అన్న పద్యం చదివేటప్పటికి శ్రీపాదవారి కిలా నన్నయ గారు స్ఫురించారు- ఉభయపింజలతోనూ నీరుకావి ధోవతి కట్టుకొని, అలాంటిదే ఉత్తరీయం కప్పుకొని, ఎడమ భుజాన జలతారు ఆకుపచ్చ శాలువ ఉంటే, మొగాన స్ఫుటంగా గంధాక్షతలు, మొలలో బంగారం గోవతాడు, చేతులకు సింహతలాటం, మురుగులు, కుడిచేతి అనామికకు దర్భముళ్ళ రత్నాంగుళీయకము, చెవులకు కెంపులు పొదిగిన మకరకుండలాలు ధరించి, రాజాధిరాజులను పాదాక్రాంతులను చేసుకొనే చూపులతో చక్కని పలాచని నన్నయ భట్టారకుడు రాజరాజు నిండోలగాన అగ్రాసనం అలంకరించి సాక్షాత్కరిస్తాడు. ఎంత రమణీయమైన వర్ణన ! నన్నయ మన ఎదుట ఉన్నాడా అనిపిస్తుంది. సంప్రదాయాలు మారుతూ జాతికి జాతి అంతా కొత్తదారులు తొక్కుతున్న ఈ దినాల్లో కొంతవరకైనా మన దృక్పథంలో కొన్ని సవరణలు చేసుకోవలసి ఉంది అంటూ మార్పులను ఆహ్వానించారు.

సంగీతానికి కవిత్వానికి తేడా చక్కగా వివరించారు. ఆలోచనామృతం కవిత్వం, ఆపాత మధురం సంగీతం. పద్యం చదివితే ఆలోచించే కొద్దీ చవులూరించే గంభీరభావాలు ఉండవద్దూ అంటారు. కవిత్వం అందరికీ తెలిసేటట్టు ఉండాలి అన్న కొత్త నినాదం అశక్త దుర్జనత్వం అనేశారు. తెలుసుకో గలిగితే సరసతా, రసికతా కూడా విశిష్టమైన నాగరికతకు చిహ్నాలూ, సభా పూజ్యాలూనూ అన్నారు.

వారి నిశితమైన పరిశీలనకు ఒక ఉదాహరణ. కేవలము బ్రహ్మ సమాజం పరంగా చూస్తే అక్కడ బెంగాలీలకు, ఇక్కడ మన వీరేశలింగానికి క్రైస్తవ ధర్మమే పూర్తిగా ఒరవడి. ఆ బ్రహ్మ సమాజ ప్రార్థనాగీతాలు అలాగే ఉంటాయి కదా. బంకించంద్రుడికి వీరేశలింగం గారికి ఈ వ్యత్యాసం ఏమిటో చూడండి. బంకించంద్రుడిది పూర్తిగా సాహిత్య దృష్టి. వీరేశలింగం గారిది పూర్తిగా సంస్కారదృష్టి బంకించంద్రుడికి సాహిత్యం ఆరాధనా దైవం. వీరేశలింగం గారికి సాహిత్యం ఆరాధ్య దైవాన్ని పూజించడానికి ఒక పుష్పం. మహారాష్ట్రకి, మనకి అనుబంధం ఉందంటారు. ఆంధ్రదేశం మహారాష్ట్రదేశానికి 'కాడిగట్టు' అన్న చక్కటి పదాన్ని వాడారు. స్వచ్ఛమైన తెలుగుమాట ఇది సరిహద్దుకు బదులుగా. శివాజీకి మన కృష్ణదేవరాయల వారి రాజ్యాంగమే ఒరవడి అని తిలక్ చెప్పారన్నారు.

డబ్బు భౌతికం. కవిత్వం, ఆధ్యాత్మికత, తదాలంబమైన మహర్షిత్వం లోకాతీతమున్ను, డబ్బు భంగురము, కవిత్వం నశ్వరమున్ను. అవధానం గురించి వ్రాస్తూ అవధానంలో, మస్తిష్కానికెంతో కొంత పొంగు పుట్టించేదేదైనా ఉంటే ఉండవచ్చు గాని హృదయానికి స్పందనం కలిగించేది లేశమూ లేదు. అంచేతనే అది కళకాదన్నారు. అష్టావధాని కుశాగ్రబుద్ధీ మేధావీ అనిపించుకుంటాడే గానీ, కవి అనిపించుకోడు. కవి అయినవాడికి అష్టావధాని కావడమూ, శతావధాని కావడమూ, పతనమంటారు. అవధానాల్లోని పద్యాలను కాగితపువ్వులతో పోల్చారు.

వీరేశలింగంగారంటే శ్రీపాదవారికెంతో గౌరవం. 'వీరేశలింగంగారు - రచన ఎంత సుళువుగా చెయ్యవచ్చునో చూపించారు. ఎంత సులభ భాషలో చెయ్యవచ్చునో చూపించారు. అది ఎన్ని రకాలుగా చెయ్యవచ్చునో చూపించారు. తన్మూలంగా ప్రయోజనాలే గాక ఆనందం కూడా ఎన్ని రకాలుగా కలుగుతుందో చూపించారు. వాఙ్మయం శక్తి ఎంతటిదో, జాతిని అది యెలా నడిపిస్తుందో కూడా చూపించారు. విమర్శ విషయంలో కూడా వారు ఒక మార్గం వెయ్యకపోలేదు - అనడమే కాక వీరేశలింగంగారి తరువాతనైనా సమర్థులు తదేకదీక్షితులు విమర్శకులు బయలుదేరలేదు మనలో అంటూ బాధపడ్డారు. రచయితల్లో పోటీలేర్పడం అగత్యం, కానీ స్పర్థ లేర్పడతాయి సాధారణంగా లోకంలో అని అంటారు. విమర్శకుడైనవాడు మంచి పండితుడై ఉండాలి. ప్రాచీనం, నవీనం కూడా సాహిత్య శాస్త్రం కూడా తెలిసినవాడై ఉండాలి. అసహన పరుడు కాకూడదు. మంచిని బాగా గుర్తించి, ఆ రచన యెవరు చేసినా ఆనందతాండవం చేయగలిగి ఉండాలి. తనకి ప్రమాణికత ప్రధాన ధర్మం అన్నది గుర్తుంచు కోవాలి. ద్వేషం వ్యక్తిపరంగా మాత్రమే చూపించుకోగలిగే సంయమనం కలవాడు కావాలి అని - విమర్శకుడెలా ఉండాలో నిర్దేశించారు.

మనలో ఎక్కువమంది విమర్శకులు బయలుదేరనందుకు బాధపడ్డారు. ' స్వతంత్రులైన రచయితలతో పాటు సమర్థులైన విమర్శకులున్ను బయలుదేరితేనే యే వాఙ్మయానికైనా సరియైన వికాసం అని సూత్రీకరించారు. రచన గొప్పదయితే వికాసం జాతికి, తత్కర్తకు కాదు. రచన చెడ్డదైతే నష్టం జాతికి, అది కర్తకు కాదు. గ్రంధకర్త సహజ గుణాలు, ఆత్మ విశ్వాసం, కీర్తి కాంక్ష, ద్రవ్యాశ, కాని సంయమనము, హుందాతనము చాలా అవసరమంటారు.

తన 'వీరపూజ' గురించి ఎంత విశ్వాసంతో ఉన్నారో శ్రీపాదవారు చూడండి. 'తెలుగులో అపూర్వ రచన నా వీరపూజ. అంతకు ముందే కాదు, తరువాత కూడా అలాంటి రచన మరి పుట్టలేదు మన వచన వాఙ్మయంలో. ఇది గర్వంలో లెక్కవుతుందా? నా శక్తిమీద కంటే, నా వీరపూజ మీద నిశ్చలమైన విశ్వాసం ఉంది నాకు, కనుక సిగ్గుపడను. నేను కచ్చితంగా చెబుతాను, నా వీరపూజ విశిష్ట రచన.' అదిగో అలాంటి ఆత్మ విశ్వాసం మనం విశ్వనాధ వారిలో చూస్తాం.

'జాతీయ నిర్మాత కవి' అని ఓకొత్త నినాదమిచ్చారు. జాతికి సంస్కారం కలిగించ గలవారు. మనకెన్నడూ కనబడనిదొక విషయం చెప్పారు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. 'గాంధీగారిది జైన సంస్కారం. దానిమీదే తమ నమ్మకం అన్నట్టు మాత్రం కనబడరు వారు' అంటారు. సంఘసంస్కారమంటే మతధర్మాలను తిరస్కరించడమే అని మన సంఘ సంస్కర్తల సిద్ధాంతం ఇప్పటికీ అని చురక అంటించారు. సంఘంవేరూ మతం వేరూనూ అన్నారు.

గొప్ప సాహిత్యవేత్త, చరిత్రకారుడు 'శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారి ఎదుట నేను హిమవత్పర్వత సానువుల్లో ఒక చలిచీమ వంటి వాణ్ని' అని వినయంగా చెప్పుకున్నారు. చిలకమర్తి వారు వీరేశలింగం గారికి శిష్యపరమాణువును అని ఎంతో వినయంగా వ్రాసుకున్న విషయం జ్ఞాపకం వస్తుంది.

ఇంగ్లీషు చదివిన వారు కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. గ్రంధకర్త పేరుతో కలిపి పలికితే కొన్ని విపరీతార్ధములు స్ఫురించడం వుందంటూ నేను కూడా ఆ మార్గాన్నే తొక్కాను అన్నారు, శ్రీపాదవారు. కొన్ని ఉదాహరణలు చూడండి.

వీరేశలింగం గారి 'అభాగ్యోపాఖ్యానం'
గురజాడ వారి 'కన్యాశుల్కం'
ఉన్నవ వారి 'మాలపల్లి'
చెళ్ళపిళ్ళ వారి 'శనిగ్రహం'
మంత్రిప్రగడ వారి 'వారకాంత'
పానుగంటి వారి 'వృద్ధ వివాహం'
కట్టమంచి వారి 'ముసలమ్మ మరణం'
భమిడిపాటి వారి 'పెళ్ళి ట్రయినింగు'
కొడవటిగంటి వారి 'కులం లేని పిల్ల'

పిలకా వారి 'గృహదహనం'

శ్రీశ్రీ గారి 'మహాప్రస్థానం'

ఆ కోవలోనిదే అవుతుంది శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి శ్మశాన వాటిక.

సమకాలీన సమాజంలో వచ్చిన పత్రికలను శ్రీపాదవారు తమ అనుభవాలూ - జ్ఞాపకాలూను లో పేర్కొన్నారు. అట్టి పేర్లే చాలామంది వినలేదు. ప్రొద్దుటూరి నుండి వి.యన్.స్వామి గారి 'ఆంధ్ర చంద్రిక' అన్న వారపత్రిక, పునహానుంచి అప్పా శర్మ గారి సంస్కృత వారపత్రిక 'సూనృతవాదిని', కస్తూరి శివశంకర కవిగారి 'సుదర్శిని' పత్రిక, కలకత్తానుండి సురేంద్రనాధ బెనర్జీ గారి ఇంగ్లీషు పత్రిక 'బెంగాలీ', కొమరిపాలెం నుండి అయినాపురపు సుందర రామయ్యగారి మాసపత్రిక 'సుందరి' - వీటి గురించి ఆయన ప్రస్తావించారు.

నాటకాల్లో పద్యాలు ఉండకూడదన్న సిద్ధాంతం శ్రీపాదవారిది. నాటకాల్లో పద్యాలు చదవాలి గాని పాడరాదని 'హాస్యబ్రహ్మ' శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు ఒక ఉద్యమమే చేశారు. సాధారణంగా నాటకాల్లో పద్యాలు పాడేటప్పుడు గుక్క పడతారుగా అందుకని. ప్రతీ విద్యకు లక్ష్య లక్షణాలుంటాయి. లక్షణం విద్వాంసులకీ, లక్ష్యం జనానికి వినియోగం. జనసామాన్యానికి జీవిక మీదే శ్రద్ధ. కళలు వారికి విలాస వస్తువులు. కర్ణాటక సంగీతం రూపుదిద్దిన వారు మన ఆంధ్రులు. పోషించి ఇప్పటికీ బాగా అనుభవిస్తున్న వారు అరవలు అయిపోయారు. ఇక్కడ పుట్టి పెరిగిన క్షేత్రయ్య దక్షిణాదికి వెళ్ళి పోవలసి వచ్చినది అని వాపోయారు. తమకు తెలిసిన మర్మాలు ఇతరులకు తెలియకూడదన్న భావం సంగీత వేత్తల్లో ఎక్కువగా కనబడుతుందన్నారు, లోకాన్ని బాగా చదివిన శ్రీపాదవారు. ముక్కామల వేదశ్రౌతాలకు పుట్టినిల్లయితే, కాకరపర్రు తర్క వ్యాకరణాలంకార శాస్త్రాలకు పీఠమని చరిత్ర చెప్పారు. ఆముక్త మాల్యద, వసుచరిత్ర, శృంగార నైషధం, పాండురంగ మహాత్మ్యం చదివి అవగతం చేసుకొని తన్మూలంగా ఆనందించ గలగడం తెలుగువాడికి చెప్పుకోదగ్గ అదృష్టంగా పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి 'విజయవిలాసం' అంటే నిద్రాహారాలు మరచిపోయేటంతటి ప్రీతి. ఆంధ్ర వాఙ్మయంలో అది ఒక ధృవతార. శ్రీకృష్ణుడు సత్య కాళ్ళ మీద పడ్డ తరువాత 'పారిజాతాపహరణం' చదవక పోయినా పర్వాలేదు. కాని విజయవిలాసం ఆది నుంచి అంతం దాకా చదివి తీరవలసిన గ్రంధమంటారు.

జీవద్భాషకు నియామకుడు కవేగాని, పండితుడు వైయాకరణీకాడని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. కవి అడుగు జాడలే శరణ్యం పండితుడికీ, వయ్యాకరిణికి. కవి స్రష్ట, భాషా సాహిత్యాలకు సమ్రాట్టు. జనులకు శీల సంపద అలవర్చడానికి ధర్మ నిర్ణయం చేస్తాడు కవి. రసికుల కానందం కలిగించడానికి రచనే చేస్తాడు అన్నారు.

గ్రంధ ప్రచురణ విషయం ప్రస్తావిస్తూ 'ఎవరి గ్రంధం వారే అచ్చు వేయించు కోవలసిరావడం కంటే మరో దౌర్భాగ్యం లేదు కవులకు. వనితలకు తమంత తామై వలచి వెళ్లవలసి రావడం వంటిది కవుల కిది.' రోజుకొక ఇంట్లో భోజనం చేసి, చదువుకునే వారు చాలామంది అప్పట్లో. అలాంటి వారు బాగా గొప్పవారయ్యారు. అలాంటి వారిలో సుబ్రహ్మణ్య శాస్త్రి గారున్నారు. 'వారాల భోజనం కష్టసుఖాలతో పెనవేసుకొని ఉంటుం దిలాగ. పాలపొంగు తగ్గించి, విద్యార్థిని మంచి దారికి మళ్లిస్తుందని' అన్నారు తమ అనుభవంతో. సంప్రదాయాలు మారుతూ జాతికి జాతి అంతా కొత్తదారులు తొక్కుతున్న ఈ దినాల్లో కొంతవరకయినా మన దృక్పథంలో కొన్ని సవరణలు చేసుకోవలసి ఉంది అన్నారు అభ్యుదయ కాముకుడైన శ్రీపాదవారు. 'అన్నపూర్ణ' అన్న పదం పుట్టడానికి చక్కగా ఊహించారు. దేశం సుభిక్షంగా ఉంటూ ఉండడమూ, అన్న సత్రాలు అనేకాలు ఏర్పడి ఉండడం కారణము.

తన రచనలో, పాత కొత్తలకు సమన్వయ పద్ధతి ప్రవేశపెట్టి జీవితానికి కొత్తవిలువలు కట్టీ, జాతికి కొత్త తోవలు కనపరచీ, పురుషకారానికి నవశక్తి సంఘటించడానికి పూనుకున్నాడని బంకించంద్రునికి జోహార్లర్పించారు.

సంస్కృత భాష గురించి చెబుతూ 'భిన్న సంప్రదాయవాదుల వారికి, భిన్న జాతుల వారికి ఆదిలో ఏకత కలిగించినదీ, ఎలాంటి ఒడుదుడుకులు వచ్చినా అది చెడకుండా నిలుపు చేసిందీ, ఇప్పటికీ నిలుపుతూనే ఉన్నది సంస్కృత భాషే అన్నారు.' అప్పట్లో రాజమహేంద్రి టౌన్ హాలులో వారానికొక మంచి సాహిత్య సభ జరుగుతూండేదన్నారు. జాతిని పట్టుకొని ఉండే విషయాలకు సంబంధించి వచన వాఙ్మయం లేకపోయింది మనకి ప్రాచీనంలో. - అందుచేత కూడా మనవారికి మనభాషలో జాతీయమైన పలుకుబడి అందని పండై పోయిందని వాపోయారు.

నేటి గ్రంధాలలో గాని పత్రికలలో గాని కనబడని తెలుగు పదాలు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు వాడారు.

సర్వతో ముఖం అనే క్రతువు
పాదుకాంత దీక్షాపరుడు
వేమంత్రాల్లో నౌధసం
కూకట్లు కొలిచా డప్పుడు
ఆటల్లో కుండబంతి, ఉప్పట్టీ,
పూనహాసతారాలు తిరిగే అంశువారీలు
కాలువలో వేసవిలో యేనుగీత నీరుంటుంది.
పొంగిపోతూ, యె-ఫిరిపోయాన్నేను
శ్రోతలు వల్లించి వుండినా ఆర్త్విజం నిర్వహించే అలవాటున్నవారున్నూకారు
అశ్వినం ఋగ్వేదంలో వో రమ్యమైన ఘట్టం.
ఝుడితి శ్రవణం బాగా మనస్సుకి పట్టకపోవచ్చు
టొకాయించాన్నేను, అంతకంటే దర్పం తెచ్చుకొని
విజ్ఞోడు మనుష్యులతో వ్యవహరించవలసి వస్తుంది.

సంస్కృతి విషయంలో మనం అనుభవజ్ఞులం కావాలంటే ఎప్పుడూ జ్ఞాపకం ఉండే వెలుగు రచన చదవాలంటే, నుడికారాల తేటతెలుగు తీపి గుండెకు అందించాలంటే మనం 'అనుభవాలూ-జ్ఞాపకాలూను' చదివి తీరాల్సిందే.



శ్రీ వేణుగోపాలస్వామి గుడివీధి,
రాజమహేంద్రి- 533 101
ఫోన్ : (0883) 2471341
సెల్ : 99857 19916

వ్యావహారిక భాషా విధ్మాత:

నర్వథా తమలినాటి యాంధ్ర వ్యావహారిక భాషా నిర్మాతృ గణ ప్రథమ గణనీయులు."

- విశ్వనాథ సత్యనారాయణ.

(శ్రీపాదవారి అనుభవాలూ - జ్ఞాపకాలూను 'మొదటి భాగం చదివి శాస్త్రిగారికి వ్రాసిన లేఖ నుంచి, చదివిన వారన్న మాటలు ' - రెండవ భాగంలో ప్రకటితం).

ప్రబుద్ధాంధ్ర సంపాదకత్వం

- సన్నిధానం నరసింహ శర్మ

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు అత్యుత్తమ చిన్న కథా రచయిత మాత్రమే కాదు ; అత్యుత్తమ సాహిత్య పత్రికా సంపాదకు డనడానికి వారి ప్రబుద్ధాంధ్ర పత్రిక సంచికలే సాక్ష్యాలు.

నేటికీ శ్రీపాద స్ఫూర్తి పత్రికా సంపాదక పదవినుండి పొందవలసి వుండనే ఉంది.

20 వ శతాబ్ది ప్రారంభంలో - ప్రబుద్ధాంధ్ర వచ్చి వికసిస్తున్న కాలంలో వచ్చిన పత్రికల్లో - భారతి ఢంకా మ్రోగిస్తూ ఉండేది. ఒకవైపు స్థానిక చరిత్ర కథాంశాలు వగైరా ప్రకటిస్తూ, ఆంధ్ర సర్వస్వం సాహితీ రసజ్ఞుల సర్వస్వంగా భాసిస్తోంది. రెడ్డి రాణి దొడ్డ రచనలిస్తూనేవుంది. గ్రంధాలయ సర్వస్వం మరొక వైపున గ్రంధాలయ ఉద్యమ శాస్త్రీయ విషయాలేకాక సాహిత్య పరీమళాలనూ ఇస్తోంది. శారదారాధకులకు శారద దర్శనమిస్తూనేవుంది. వావిళ్ళ వారి త్రిలింగ ప్రామాణిక రచనలకు పెన్నిధిగా ఉంటూ వస్తోంది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు వంటి హేమాహేమీలు చందాదారులుగా పోషిస్తున్న సాహిత్యకళలు వెలయిస్తున్న 'కళ' పత్రిక తన పాత్ర పోషిస్తూనే వుంది. ఇటువంటివి ఇంకా చిన్న పెద్ద పత్రికలు వస్తున్న కాలంలో వచ్చి ఆకర్షించుకొన్న ఒక సూదంటురాయి వంటి పత్రిక ప్రబుద్ధాంధ్ర.

కొన్ని ఉద్యమాల సమాహారంగా ప్రధాన ఆంధ్రోద్యమం ఆలంబనంగా కలిగింది ప్రబుద్ధాంధ్ర పత్రిక.

ఆంధ్ర భాషోద్యమం, ఆంధ్ర రాష్ట్రోద్యమం వచన సాహిత్యోద్యమం - ఇవి అంతర్గతంగా అనలు పెనలు వేసుకొని సాహిత్య మాధుర్యాన్ని పంచిపెట్టడం ఆత్మగా ప్రబుద్ధాంధ్ర నిలబడింది.

శ్రీపాదవారు పెట్టిన ప్రచురణ సంస్థ కలాభివర్ధనీ పరిషత్. అది ఏదో ఏక కళా ప్రాధాన్యంతో పెట్టిందికాదు.

అదేవిధంగా ప్రబుద్ధాంధ్ర - ఆంధ్ర ప్రబుద్ధమవడం అనేక రంగాలలో. ఆంధ్రులు చైతన్యవంతులు కావలసింది బహురంగాలలో అని ఆయన లక్ష్యైక అభిప్రాయం.

1934 డిశంబరు సంచికలో ప్రబుద్ధాంధ్రను ప్రకటిస్తున్నారని అంటూ మామూలు పద్ధతిలో ఆయన ప్రకటించలేదు. పునఃపూజ అనేశీర్షికతో మళ్ళీ ప్రకటిస్తున్నామని చెప్పడం పత్రికారంగాన్ని ఆయన ఎంత పవిత్రంగా భావిస్తున్నారో చెప్పడానికి దాఖలా. అందులో ఆయన ఇలా అంటారు. 'ఆంధ్ర సోదర సోదరీమణులకు ఈ ప్రబుద్ధాంధ్ర పత్రిక చిరపరిచితంగాని, కొత్తది కాదు. నా ఆరోగ్యం చెడిపోవడం వల్ల 1925 లో దీన్ని నిలుపు చేసి నా స్వగ్రామం మహేంద్రవాడ చేరు కున్నాను. ఈ ఎనిమిదేళ్ళలోనూ మళ్ళీ ప్రకటించడాని కెన్నిమాట్లు ప్రయత్నించాను! గాని కొనసాగలేదు. సంవత్సరం క్రిందట రాజమహేంద్రవరం ప్రవేశించాను. ఇప్పుడు దీన్ని మళ్లీ ప్రకటిస్తున్నాను" అన్నారు.

సామాన్యులకు సైతం పత్రిక చేరాలనుకునే తపన వారిది! కనుకనే చందా ఒక్కరూపాయిగా పెట్టారు.

పత్రికను ముద్రించి ఇవ్వడంలో అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారు శ్రీపాదవారికి వెన్నెముక.

పద్యం చచ్చిపోయిందనో లేక మరోవిధంగానో మరో ప్రక్రియను కించపరచకుండా వచన ప్రక్రియను ఉద్యమంగా తీసుకురావడం ఆయన ఉద్దేశం.

ఆయన నిర్ద్వంద్వంగా ఇలా అన్నారు " ఈసారి యీ పత్రికలో పద్యాలు ప్రకటించదలచుకోలేదు. ఇప్పుడు మనకి వచన వాఙ్మయం చాలా అవసరంగా ఉంది. జనసామాన్యంలో విద్య వ్యాపించాలన్నా, విజ్ఞానం వ్యాపించాలన్నా వచన వాఙ్మయమే ఆధారం!' ఈ వాక్యాలు ఆయన వచనోద్యమ శీలత్వాన్ని నొక్కి చెపుతోంది.

గిడుగు రామమూర్తి గారి వాడుక భాషోద్యమంలో గ్రాంధికవాద పండితుల పాత్ర ఎంతోవుంది. వారితో యుద్ధాలు గిడుగు పిడుగుకు తప్పవు.

కానీ శ్రీపాద వారిది ప్రతికక్షులను ఎదిరించడం కంటె తన వచన ఉద్యమ విస్తృతిని ఔపయోగిక దశలో పెట్టడమే ముఖ్యం. వివిధ శాఖల విజ్ఞానం వచనంలో వచ్చి జాతి ప్రగతి పొందాలనేది ఆయన తపన.

ప్రబుద్ధాంధ్ర పునఃప్రారంభంలో ఆశీస్సులను అందించిన సర్వేపల్లి రాధాకృష్ణయ్య గారు ప్రబుద్ధాంధ్ర నాడీతత్వాన్ని గమనించిన వ్యక్తి. అందుకే ఆయన 15-9-1933 గల ఒక లేఖలో 'ఇప్పుడు నేను పని తొందరలో ఉండి మీ పత్రికకు వ్యాసమును వ్రాయజాలకున్నాను. కాని మీరు ప్రకటించదలచుకున్న పత్రిక వంటి పత్రిక ఆంధ్ర జాతీయ పునరుజ్జీవనమునకు తోడ్పడగలదని నే నంగీకరించు చున్నాను" అన్నారు. ఆంధ్ర జాతీయ పునరుజ్జీవనమునకు అంకితమైన పత్రిక ప్రబుద్ధాంధ్ర.

ప్రబుద్ధాంధ్ర తలపెట్టిన పద్య వాఙ్మయ నిషేధాన్ని భారతి సంపాదకులు గన్నవరపు సుబ్బరామయ్య గారు తమ ప్రత్యేకవ్యాసంలో మెచ్చారు. సాటి ప్రామాణిక పత్రిక శ్రీపాదవారి పత్రిక ఆశయాన్ని మెచ్చుకోవడం మెచ్చుకోవలసిన అంశం.

శ్రీపాదవారి ప్రధానమైన కథారచనలు ప్రబుద్ధాంధ్రలోనే ప్రకటింపబడినాయి.

ప్రబుద్ధాంధ్రలో అందమైన వచనం ఇవ్వడం మాత్రమే కాదు. పఠనార్హమైన వచన రచనలు వేసేవారు.

ఇందు కుదాహరణం చింతా దీక్షితులు గారి 'ఈమాట నిజం' రచన. చింతావారు ఇలా ప్రారంభిస్తారు తన రచన.

"మొన్ననే వచ్చాడు. నన్నయ భట్టు రాజమహేంద్రవరం వచ్చాడు. ఎంత మాత్రమూ సందేహము లేదు. ఈనా కళ్ళకి దృష్టి దోషం దోషించలేదు. ఈ నా త్వక్కుకు స్పర్శగుణం నశించలేదు. నా చెవులకు శ్రవణశక్తి మందగించలేదు. మొన్ననే వచ్చాడు, నన్నయభట్టు. రాజమహేంద్రవరం గోదావరి హోరున ప్రవహిస్తోంది. వెన్నెల గోదారి మీద వండు కొన్నది " నన్నయ గారు రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరంలో తిరిగి తిరుగాడడం నేపథ్యంగా ఈ రచన ఆసక్తికరంగా సాగుతుంది. ఇటువంటి రచనలు ప్రబుద్ధాంధ్రలో బోలెడు! తెలుగులో మొట్టమొదటి నవల వీరేశలింగం గారి రాజశేఖర చరిత్ర కాదు. నరహరి గోపాలకృష్ణమ శెట్టి గారి శ్రీరంగరాజ చరిత్రే మొదటి నవల.

వీరేశలింగం గారిని అభిమానిస్తున్నాం కదా! అని అసత్యాన్ని అభిమానించడం సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి సుతరామూ పడదు.

అందుచేత ప్రబుద్ధాంధ్రలో టేకుమళ్ళ కామేశ్వరరావు గారి శ్రీరంగరాజుచరిత్ర వ్యాసంవేశారు. రాజశేఖర చరిత్ర 1878లో ప్రటింపబడగా, శ్రీరంగరాజుచరిత్ర 1872లోనే

ప్రకటింపబడడం వంటి సాహిత్య చారిత్రక విషయాలు గల ఆ ముఖ్య వ్యాసాన్ని ప్రబుద్ధాంధ్రులు గుర్తించవలసివుంది.

పత్రికా గ్రంథాలయ ప్రాధాన్యాన్ని గుర్తించిన సంపాదకులు శ్రీపాదవారు. అందుచేతనే - కవులకూ వ్యాసకర్తలకు వారు చేసిన విన్నపంలో విమర్శకోసం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు పంపాలి. ఒకటి పత్రికా భాండాగారానికి, వొకటి విమర్శ చేసే వారికిన్నీ' అని వ్రాశారు.

ప్రబుద్ధాంధ్రలో రచనలు చేసే వారిలో కొందరు ముఖ్యులను మనం పేర్లు చూసి గమనిస్తే - శ్రీపాదవారి ప్రబుద్ధాంధ్ర స్థాయి, ఉత్తమత్వం గ్రహించవచ్చు.

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు, చింతాదీక్షితులు గారు, కొడవటిగంటి కుటుంబరావు గారు, గిడుగు వెంకట రామమూర్తి గారు, సురవరం ప్రతాపరెడ్డి గారు, భావరాజు వేంకట కృష్ణరావు గారు, మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు, మారేమండ రామారావు గారు, పూడిపెద్ది వేంకటరమణయ్య గారు, కంభం పాటి అక్కన్న శాస్త్రిగారు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు, చలం గారు - ఇటువంటి హేమాహేమీలు ప్రబుద్ధాంధ్ర రచయితలు.

ఒక సందర్భంలో శ్రీపాదవారు సురవరం ప్రతాపరెడ్డి గారి రచన అడిగి తెప్పించుకొని వేశారు. ఆ రచనలో మహానుభావుడు సురవరంవారు ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ ప్రాంతరచయితలను, తెలంగాణ ప్రజలను అంతగా పట్టించు కోవడంలేదనే అర్థంలో వ్రాస్తూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తమను గమనించి రచన అడిగినందుకు ఆనందంతో పొంగిపోయారు. అది శ్రీపాద సంపాదకత్వ వ్యక్తిత్వ ముద్ర!

ప్రబుద్ధాంధ్ర పత్రికల సంచికలు నేడు ఆంధ్రదేశంలో అటనట గ్రంధాలయాలలో, వ్యక్తుల వద్ద చెదురుమదురుగా ఉన్నాయి. కానీ భాగ్యనగరంలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్‌లో చాలా సంచికలు భద్రంగా ఉన్నాయి. ప్రబుద్ధాంధ్ర ఉత్తమ రచనలను సేకరించి ఒక ప్రత్యేక వ్యాస సంపుటిని ప్రచురించవలసిన ఆవశ్యకత వుంది.

శ్రీపాద వారి జీవితమూ, ఆయన రచనలూ పరిశీలించడానికి, వ్యావహారిక భాషోద్యమ చరిత్రాంశాలు గ్రహించడానికి ప్రబుద్ధాంధ్ర సంచికలు అధ్యయనం చేయాలి. ఖద్దరు, హిందీ వంటి ఆ అంశాల్లో ఆయనకు గల వ్యక్తిగత విభేదాలు, అభిప్రాయాలు

తమ ప్రబుద్ధాంధ్రలో కుండ బ్రద్దలు కొట్టినట్టు వివరించారు. సాహిత్యేతర ప్రయోజనకర రచనలు కూడా అప్పుడప్పుడు ప్రబుద్ధాంధ్రలో ప్రకటించేవారు. ఇనాందార్లున్నూ, మెడ్రాసు ఎస్టేట్సు ల్యాండు ఆక్టు సవరణ బిల్లున్నూ- అనే శీర్షికతో శ్రీ గండికోట సత్యనారాయణమూర్తి రచన వేయడం పైవిషయాన్ని బలపరుస్తుంది.

ప్రబుద్ధాంధ్ర రచనల్లో, వ్యాసాల్లో శ్రీపాద వారి అభిప్రాయాలు తెలియడమే కాక, పత్రిక చివరలో ఇచ్చే వ్యాఖ్యానములు అనే శీర్షిక క్రింద వివిధ అంశాలపై వ్రాసేవారు. 1934వ సంవత్సరంలో ఒక సంచికలో ఆంధ్రమహాసభను గురించినది అవిధమైనదే. అందులో ఆంధ్రోద్యమం అనేది మితవాదులకు సవతి బిడ్డగానే ఉంది. అని విమర్శించారు. ఆ వ్యాఖ్యలనుబట్టి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి సూక్తులను కొన్ని మనం పట్టి ఇవ్వవచ్చును. మచ్చుకి కొన్ని ...

" ఆడంబరంలేని జాతీయ సేవ చేయడానికి నడుంకట్టుకునే వారు కావాలి"

" మన వేదాంతం ఆత్మానాత్మ వివేకం కలిగించడంలో అద్వితీయం కావచ్చు. కానీ అది పూర్తిగా మనకొంప తీసింది."

"మనం నిజంగా ఇప్పుడు కడుపునిండా తినలేం. మనసారా ఏమీ అనుభవించలేము. కాలికొద్దీ నడవలేము; చేతికొద్దీ ఏమీ చెయ్యలేము; కళ్ళారా చూడలేము; ఆలోచించలేము; ఎత్తులు వేయలేము; ముందుకి దూకలేము. అలాగని వెనుకకూ రాలేము.

మన జాతిని నిర్వీర్యం చేసింది ఇంగ్లీషు ప్రభువుల ఆయుధం కాదు. మన వైరాగ్యం.'

" ఆంధ్రులకిప్పుడు తల్లిభాష యెడల వారు నిర్వహించవలసిన విధిని హెచ్చరించవలసి వున్నది".

ఇటువంటి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సూక్తులు గ్రహించి ఆచరిస్తే మనము నిజమైన ప్రబుద్ధాంధ్రులం అవగలం.

ఈ సూక్తుల ఆంతరంగిక ప్రబోధ అవసరాలను గమనిస్తే నేటికీ శ్రీపాద అవసరం, నేటికీ ప్రబుద్ధాంధ్ర ప్రబోధం అవసరం తెలుస్తుంది.

కథలో సంభాషణ ప్రాధాన్యం, గమనించి వ్రాసిన వారు శ్రీపాద. కేవల సమాచారం తెలుగులో ఇస్తేనే రచయిత కాని, పత్రికా రచయిత కాని కాలేరు. భాసలో

అందం చందం, మాట సహజత్వంతో రచన; నానుడులు, సామెతలు సమయానుకూలంగా వాడి రచనకు అందం ఎక్కువ చేయడం, పఠితను ఆకర్షింపచేసుకోవడం- వీనికి కూడా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రబుద్ధాంధ్ర చెప్పక చెబుతుంది. ప్రబుద్ధాంధ్ర పత్రిక వహించిన సామాజిక పాత్రను ఆనాడే శ్లాఘించారు.

ప్రఖ్యాత కవి కవికొండల వేంకటరావు 'తెనుగు జాతీయతను పెంపొందించు అంశాలను ప్రబోధించు ప్రబుద్ధాంధ్ర పత్రిక ఆచంద్రతారార్కము వెలయు గాక' అన్నారు. ప్రబుద్ధాంధ్రలో నిజాము రాజ్యములోని తెలుగువారి స్థితి అనే వ్యాసం సురవరం ప్రతాపరెడ్డి గారిది - తెలంగాణా ప్రాంతాన్ని మరింతగా అర్థంచేసుకోవడానికి దోహద పడుతుంది.

ఒకవైపు భాషోద్యమం, మరొకవైపు కథారచనలు, ఇంకొక వైపు ఆంధ్రత్వ ఉద్దీపనం- ముఖ్యంగా వాడుక భాష ద్వారా జ్ఞాన వినిమయం, ప్రత్యేక రాష్ట్ర అవసర ప్రబోధం, చక్కని వచన రచన పత్రికలో ఒక ఒరవడిగా ఏర్పాటు చేయడం.

వీటి అన్నిటిద్వారా శ్రీపాదవారు నేడే కాదు, భవిష్యకాలంలో కూడా స్ఫూర్తికి అవసరమయ్యే మూర్తిగానే ఉంటారు. వారి మూర్తిమత్వానికి ప్రబుద్ధాంధ్ర పత్రిక ఒక స్వచ్ఛమైన దర్పణం.

సన్నిధానం నరసింహ శర్మ
బ్రౌన్ మందిర్ - 20-16-24,
సాంబశివరావుపేట
రాజమహేంద్రి - 533101
ఫోన్ (0883) 2471464

వెన్నెల్లో పడవ షికారు

" శాస్త్రి గారికి కథలలో మెలికలు తీసుకురాకుండా సులువుగా నడిపించడం చేతనౌను. ఒడిదుడుకుల త్రోవలో బండి కుదింపులతో ప్రయాణం చేసి చేసి, సవసిపోయిన మీదట వెన్నెలలో పడవ షికారు వెళితే ఒళ్ళు ఎంత కుదుట పడుతుందో, తనివి తీరే సుఖం కలుగుతుందో అలాంటి గుణ ప్రసాదం ఆయన కథలకు ఉంది.

- ప్రజామిత్ర

(1938 జూన్ 5 సంచిక)

విశిష్ట రచన -వీరపూజ

- డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి

ఉత్సాహం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం అన్నవి ఆరూ ఎక్కడ ఉంటే అక్కడ దైవముంటాడని పెద్దలు చెబుతారు. ఈ లక్షణాలు వీరుల్లో మనకు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ వీరులు ప్రజల గౌరవాభిమానాలకు పాత్రు లవుతారు. ఎందరికో స్ఫూర్తినిస్తారు. ఆదర్శప్రాయులై, దీపస్తంభాల్లా చరిత్రలో నిలిచిపోతారు.

ఒకజాతి నిస్తేజమయినప్పుడు, నిర్వీర్యమయినప్పుడు, నిస్తబ్దమయినప్పుడు, నీరసస్థితిలో ఉన్నప్పుడు - అటువంటి మహామహుల జీవితవృత్తాంతాలను, శౌర్యసాహసాలను, దీక్షాదక్షతలను మననం చేసుకున్నప్పుడు హృదయం ఉప్పొంగుతుంది. ఉత్సాహం పెల్లుబుకుతుంది. జాతికి పునర్ యౌవనం ప్రాప్తిస్తుంది. అప్పుడు అనేక కార్యరంగాల్లో అద్భుత కర్మవీరులు తయారవుతారు. జాతి జనుల ఆకాంక్షలను సఫలం చేస్తారు. అందువల్ల అటువంటి వీరాగ్రేసరుల సంస్మరణం జాతిజనులకు ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు విజ్ఞాన చంద్రికాగ్రంథమాల వారి 'హిందూదేశ కథాసంగ్రహము, మహమ్మదీయ మహాయుగము, చంద్రగుప్త చక్రవర్తి, ముద్రారాక్షస మనే నాటకం చదివిన మీదట 'వీరపూజ' గ్రంధ రచనకు పూనుకున్నారు. ఇందులో ఆరుగురు భారతీయ మహావీరుల జీవిత వృత్తాంతాలను మనసును అలరించేటట్లుగాను, ఆలోచింపజేసేటట్లుగాను రచించారు. ఆ మహావీరులు; చంద్రగుప్తుడు, పృథివీరాజు, భీమసింహుడు, హమీరసింహుడు, సంగరాణా, ప్రతాపసింహుడు.

ఈ గ్రంధానికి 'ప్రస్తావన' పేరుతో పీఠిక కూర్చినవారు కాశీనాధుని నాగేశ్వరరావుగారు. "వీరపూజ మానవులకు జాతీయ ధర్మములలో నుత్తమధర్మము.

వీరులు లోక పరిణామ ప్రాప్తికై యవతరించెడి మహానుభావులు ...' అంటూ వారు, వీరుల చరిత్రం ఉన్నతమైన కైలాస శిఖరంలాగ గంభీరమనీ దివ్యమయిన గంగాజలంలాగ ఆప్యాయకరమనీ, గొప్ప దీపప్రభలాగ ప్రకాశిస్తూ ఉంటుందనీ, మలయానిలంలాగ సువాసనాసంకలితమనీ చెప్పారు. ఆంధ్రలోకం వీరపూజాధర్మాన్ని గ్రహించి, వీరభావాన్ని వ్యక్తంచేస్తూ, దేశాన్నీ జాతినీ భాషనూ ఉద్ధరించడానికి వీరపూజానిమగ్నం కావాలని ఆకాంక్ష తెలిపారు. ఈ గ్రంథ ప్రచురణకు అయిన ఖర్చంతా ముందుగా తామే భరించి, అమ్మకాల మీద వచ్చిన రాబడితో బాకీ మెల్లగా తీర్చే సదుపాయం కల్పించి - రచయితను ప్రోత్సహించారు. ప్రచురణ జరిగింది 1915లో. భాష సరళ గ్రాంథికం.

గ్రంథంలో మొదటి అధ్యాయం చంద్రగుప్తుడి చరిత్ర. ఇతడు క్రీస్తు పూర్వం రెండో శతాబ్దినాటివాడు. ఇతని తల్లి ముర. ఈమె మగధరాజ్యాన్ని ఏలిన మహాపద్మనందుడి ఉపపత్ని. చంద్రగుప్తుడు సహజంగా మంచి తెలివయినవాడు. తేజోవంతుడు, శౌర్యసంపన్నుడు. రాజోచితమయిన అనేక విద్యల్లో ఆరితేరినవాడు. తండ్రి అభిమానాన్ని చూరగొన్నవాడు.

రాజ్యపాలనలో మహాపద్మనందుడు చాలా సమర్థుడే. మంచి కార్యదక్షుడూ, ప్రభుభక్తి పరాయణుడూ అతనికి ప్రధానమంత్రిగా ఉండడం విశేషం. ఆ మంత్రి పేరు రాక్షసుడు. రాజ్యపాలన కొంతకాలం బాగానే సాగింది. ఆ తరువాత మహాపద్మనందుడిలో ఎందుకో మార్పు వచ్చింది. ప్రజా శ్రేయస్సునూ, వాళ్ళ అభీష్టాలనూ అతడు విస్మరించాడు. వాళ్ళలో అసంతృప్తి, ద్వేషం, తిరుగుబాటు ధోరణులు ప్రబలడానికి - అతనితోబాటు ఎనిమిది మంది కొడుకులు కూడా -కారకులయారు.

రాజ్యపరిస్థితి ఇలా ఉండగా, నందపుత్రులు చంద్రగుప్తుడిమీద అసూయ పెంచుకున్నారు. అతని మీద చాడీలు చెప్పి రాజ్య బహిష్కారం చేయించారు. అయినా చంద్రగుప్తుడు కోటవిడిచి, తల్లితో బయటికి వచ్చాడే కాని, పాటలీపుత్రంలోనే మారువేషంలో ఉన్నాడు. నందులను సంహరించాలనీ, మగధ సింహాసనాన్ని అధిష్ఠించాలనీ గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఒకనాడు చాణక్యుడనే విద్వాంసుణ్ణి నందపుత్రులు అవమానించారు. వాళ్ళ భటులు దురుసుగా ప్రవర్తించారు. వాళ్ళతో పెనుగులాటలో ఆయన జుట్టుముడి

వీడిపోయింది. ఆయన కళ్ళలో క్రోధాగ్ని జ్వాలలు రగిలాయి. " నందాధముల్లారా! నన్నిలా అవమానించినందుకు, మిమ్మల్ని సింహాసనం మీంచి కిందకి లాగే వరకు ఈ జుట్టు ముడివేయను!" అంటూ శపథం చేసి విసవిసా నడిచిపోయాడు. చాణక్యుడు సామాన్యుడు కాదు. నాలుగు వేదాలూ నేర్చినవాడు; ఆరు శాస్త్రాల్లో మహాపండితుడు, దండనీతిలో సాటిలేనివాడు. ఉపాయాలు పన్నడంలో గొప్ప నేర్పరి. పట్టిన పట్టు విడవని శూరశిఖామణి. మహా పరాక్రమశాలి. మంచి సమయస్ఫూర్తి గలవాడే కాని, ముక్కోపి. ఆయన తొలిపేరు విష్ణుగుప్తుడు. తండ్రి పేరు చణకుడు కావడం వల్ల ఆయన చాణక్యుడిగా ప్రసిద్ధి పొందాడు.

నందపుత్రులు చాణక్యుణ్ణి అవమానించిన తీరు చంద్రగుప్తుడు కళ్ళారా చూశాడు. ఆయన చేసిన శపథాన్ని విన్నాడు. మగధ సింహాసనాన్ని అధిష్టించాలన్న తన కోరిక నెరవేరడానికి ఆయన దీవనలు పొందాలని నిశ్చయించు కున్నాడు. ఆయనకు వెనక వెనకే చాలా దూరం వెళ్ళాడు. ఆయన కాళ్ళకు మొక్కి తనను పరిచయం చేసుకున్నాడు. తాను నందద్వేషిననీ చెప్పాడు, అంతా విన్నాడు చాణక్యుడు. "మగధరాజ్యాన్ని నీకు పట్టంగడతాను" అని మాట ఇచ్చి, అతన్ని తనతో వెంటబెట్టుకు వెళ్ళాడు. ఆ తరువాత జరిగిన కథంతా మనకు చరిత్ర ద్వారా తెలిసిందే. చివరికి చెప్పుకోవలసింది ఏమంటే, చాణక్యుడు తాను చేసిన శపథం నెరవేర్చుకున్నాడు. మౌర్య సామ్రాజ్యస్థాపనకు మూలకారకు డయ్యాడు.

రచయిత సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఈ అధ్యాయంలో చంద్రగుప్తుడి కథను చెప్పడంతో సరిపెట్టుకోకుండా ఆనాటి రాజకీయ స్థితిగతులను చారిత్రక వ్యక్తుల పాత్రలను సవిమర్శకంగా విశ్లేషించారు. ముఖ్యంగా, చాణక్యుడి జీవితంలో కౌటిల్యం ఏమయినా ఉన్నదా అన్న ప్రశ్న లేవనెత్తి, లేదని ఆయనే సమాధాన మిచ్చారు.. 'మహాత్ముల జీవిత పరమావధి ధర్మ సంస్థాపనం. లోకంలో అధర్మం విజృంభించి ఉన్నప్పుడే మహాత్ములు అవతరిస్తారు. మాయ మాయైక సాధ్యం. అధర్మం అధర్మైక సాధ్యం. అందువల్ల ధర్మ సంస్థాపనం కోసం మహాత్ములు అప్పుడప్పుడు అధర్మాన్ని ఆశ్రయిస్తారు. కాని, వారి జీవితానికది కళంకాన్ని ఆపాదింప జాలదు అంటారు. చాణక్యుడు దుర్మార్గుడన్న అభిప్రాయం కొందరికి ఉందని చెబుతూ రచయిత, 'తనపట్ల అన్యాయంగా ప్రవర్తించిన వారికి ప్రతిక్రియ చేయడమే దుర్మార్గ మయేటట్లయితే లోకంలో ధర్మమనేది ఇక లేనేలేదు' అంటారు.

వీరపూజలో రెండో అధ్యాయం 'పృథివీరాజు' వృత్తాంతం. ఢిల్లీ రాజ్య పాలకుడయిన అనంగపాలుడికి పుత్ర సంతానం లేదు. ఇద్దరు కూతుళ్ళున్నారు. పెద్దకూతురు కమలాదేవి, అజ్మీరు సంస్థానాధీశుడి భార్య. రెండో కూతురు కన్యాకుబ్జ ప్రభువు భార్య. పెద్దకూతురి కొడుకు పృథివీరాజు. రెండో కూతురి కొడుకు జయచంద్రుడు. అనంగపాలుడి రాజ్యానికి వాళ్ళిద్దరే ఉత్తరాధికారులు. ఆయన వృద్ధుడయ్యాడు. తన రాజ్యానికి పృథివీరాజును పట్టాభిషిక్తుణ్ణి చేసి, విశ్రాంతికోసం ఆయన బదరికావనానికి వెళ్ళిపోయాడు.

తాతగారు ఢిల్లీ రాజ్యాన్ని పృథివీరాజుకు కట్టబెట్టడం జయచంద్రుడికి నచ్చలేదు. అతని మీద అసూయకలిగింది. పగబట్టాడు, పగదీర్చుకునే అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ సంగతి పృథివీరాజుకు తెలిసింది. దాంతో అతడు జయచంద్రుడిమీద శత్రుత్వం వహించాడు. ఇలా ఉండగా పృథివీరాజు మీద పగబూనడంలో అనిహిలరాజు భీముడు జయచంద్రుడికి తోడయాడు. కాని పృథివీరాజును జయించగల శక్తి తమకు లేదని వాళ్ళిద్దరికీ తెలుసు, అందువల్ల తురుష్క స్థానంలో గజ్నీ పట్టణాన్ని ఏలుతున్న గోరీ వంశజుల సహాయాన్ని కోరారు. గియాసుద్దీన్, శహాబుద్దీన్ అన్నదమ్ములు. శౌర్య సాహసాల్లో వాళ్ళు అసామాన్యులు. భారతీయ రాజుల ఆహ్వానాన్ని అందుకొని వాళ్ళు పొంగిపోయారు. సైన్య సమేతంగా వచ్చిన శహాబుద్దీన్ గోరీ యుద్ధానికి తలపడ్డాడే కాని పృథివీరాజు అతన్ని బంధించాడు. మొదటి తప్పిదాన్ని శహాబుద్దీన్ ప్రార్థించడం వల్ల పృథివీరాజు ఎనిమిది వేల గుర్రాలను తీసుకొని అతన్ని విడిచిపెట్టాడు. మరొకసారి కూడా ఎదిరించవచ్చిన గోరీని చెరపెట్టినప్పటికీ చాలా ధనం తీసుకుని మళ్ళీ విడిచిపెట్టాడు.

ఈ సందర్భంలో ప్రస్తావించవలసిన విషయం మరొకటి కూడా ఉంది. జయచంద్రుడికి పృథివీరాజు మీదున్న పగ పట్టరానంతగా పెరగడానికి అదొక కారణమని చెబుతారు కొందరు చారిత్రికులు. అదేమంటే జయచంద్రుడి కూతురు సంయుక్త పృథివీరాజును వరించడం; అతడు ఆమెను తీసుకుపోయి పెళ్ళి చేసుకోడం. కొమర్రాజు లక్ష్మణరావు గారి వంటివారు తమకు లభించిన ఆధారాలను బట్టి, దీన్ని వాస్తవ సంఘటనగా పరిగణించారు. పృథివీరాజంతటివాడు వావివరసలను మరిచి, కూతురి వరస అయిన సంయుక్తను వివాహం చేసుకోవడం అధర్మానికి

ఒడిగట్టడమేనని అనుకోక తప్పదు. సుబ్రహ్మణ్యశాస్త్రి గారు వీరపూజలో ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. కాని కొందరు చరిత్ర పరిశీలకులు సంయుక్తా స్వయంవర కథను కల్పిత కథగా పరిగణిస్తారు.

పృథివీరాజు వల్ల జరిగిన తప్పిదాలను మొహమాటం లేకుండా విమర్శించారు శాస్త్రి గారు. అతనిలో భోగ పరాయణత మితిమీరి రాజకార్యాలను ఉపేక్షించాడు. తాను పొందిన అనేక విజయాలకు కారణమయిన ఒక మంత్రిని చంపించాడు. తనకు ప్రీతిపాత్రమయిన ఒక ఏనుగును చంపినందుకు, తనకు కుడిభుజం లాంటి చాముండరాయణ్ణి చెరసాలలో పెట్టించాడు. హాహులీరాయడనే ఒక సేనాపతిని చాలా పరాభవించాడు. తనవాళ్ళనే పగవాళ్ళను చేసుకున్నాడు. ఆ పరిస్థితిలో భీమ, జయచంద్రులు గోరీని మళ్ళీ ఆహ్వానించారు. స్థానేశ్వర రణరంగంలో పృథివీరాజు తాతార్ఖానుకు పట్టుబడ్డాడు. ఎంత ప్రార్థించినా రాజును అతడు విడవలేదు. గోరీ, అతని కళ్ళుపీకించి, బేడీలు వేయించి చెరసాలలో పెట్టించాడు. కుతుబుద్దీన్ అనే సర్దారును రాజప్రతినిధిగా నియమించాడు. ఆతరువాత కొంత కాలానికి కన్యాకుబ్జం మీదికే దండెత్తి జయచంద్రుణ్ణి రాజ్యభ్రష్టుణ్ణి చేశాడు. చివరకు భారత సామ్రాజ్యం విచ్ఛిన్నమయిపోయింది !

పృథివీరాజు చరిత్ర ముగించిన తరువాత శ్రీపాదవారు ఇందులో ప్రస్తావించిన ఒక్కొక్క పాత్రను గురించి సునిశితమయిన విమర్శలు చేశారు.

తరువాతి కథ భీమసింహుడిది. ఈయన మేవాడు రాణా లక్ష్మణసింహునికి పినతండ్రి. మహాపరాక్రమశాలి, సుగుణవంతుడు. భీమసింహుడి భార్య పద్మినీదేవి. ఈమె అతిలోక సౌందర్యవతి. ఢిల్లీ సుల్తాను అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ సంగతి విన్నాడు. ఆమెను తన సొంతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరాడు. అందుకు ఉపాయాలు పన్నాడు. ఆమె నతడు అద్దంలో చూసే అవకాశం పొందడం, భీమసింహుణ్ని బంధించడం, చిత్తోడ్ దుర్గంమీదకి దండు నడిపించడం, అంతఃపురస్త్రీలు అగ్ని ప్రవేశం చేయడం, అల్లావుద్దీన్ హతాశుడవడం చరిత్రకారులు మనకు చెబుతూ వచ్చినవే. ఆ ఘట్టాలన్నిటినీ శ్రీపాదవారు తమ కథన నైపుణ్యంతో వివరంగా వర్ణించారు. మేవాడు వారివల్ల జరిగిన అనాలోచిత చర్యలను కొన్నిచోట్ల వ్యంగ్యంగాను కొన్నిచోట్ల సూటిగాను విమర్శించారు. చివరికి శాస్త్రిగారు ఇలా అన్నారు; " భీమ సింహాదులు వెట్టిశూర్లును వెట్టి పరాక్రమవంతులును గాని, నిర్మల శూరులును, నిర్దుష్ట పరాక్రమవంతులును

గారు. కావుననే వారి కట్టిగతి ప్రాప్తించినది. హ్రస్వదృష్టికి వారి సంఘమరణము వీర మరణముగనే తోప వచ్చును గాని రాజనీతిజ్ఞులకంత యుత్కృష్ట మరణముగా గాన్పింపదు'.

మరుసటి అధ్యాయంలో హమీరసింహుడి వృత్తాంతం వస్తుంది. మేవాడు ప్రభువైన లక్ష్మణ శివుడికి ఇద్దరు కొడుకులు. వారిలో పెద్దవాడి కొడుకు హమీరసింహుడు. ఇతడు మంచి బలవంతుడు, శౌర్య వంతుడు, సౌందర్య వంతుడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ చిత్తోడ్ దుర్గాన్ని పట్టుకొన్న కాలంలో ఇతడు తాతగారి యింట పెరుగుతున్నాడు. ఇతని శౌర్యవ్రతాపాలను రాజభక్తిని మెచ్చి పినతండ్రి అజయసింహుడు ఇతన్ని మేవాడు రాజ్యాధిపతిగా ప్రకటించాడు. కానీ రాజ్యం మాత్రం తురుష్కుల అధీనంలో ఉంది. కాబట్టి అతడు శత్రు సంహారాన్ని గురించి, రాజ్య సంపాదనను గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. విల్లమ్ములు ధరించి, యోధ జీవనం చేసే ఆటవికులను సైనికులుగా చేర్చుకున్నాడు. ఢిల్లీ రాజ్యంలోకి ప్రవేశించి ధనసంపాదన చేశాడు. ఆరావళీ పర్వత ప్రాంతంలో కేల్వాడ్ అనేచోట సైన్యాన్ని వృద్ధి చేసుకున్నాడు. పట్టణాలను, దుర్గాలను క్రమక్రమంగా ముట్టడించాడు. చిత్తోడ్ దుర్గాన్ని తప్ప తక్కిన మేవాడ రాజ్యాన్ని అంతను వశపరచుకున్నాడు.

చిత్తోడ్ దుర్గాన్ని పట్టుకున్న అల్లాఉద్దీన్ ఖిల్జీ మాలదేవుడనే రాజపుత్రుణ్ని తన ప్రతినిధిగా నియమించి ఢిల్లీ వెళ్ళిపోయాడు. ఆ తరువాత, హమీరుడు మేవాడు రాజైన సమయానికి ఢిల్లీ ప్రభువు మారిపోయాడు. మహమూన్ ఖిల్జీ ప్రభువయ్యాడు. మాలదేవుడు హమీరుణ్ణి చాలాసార్లు ఎదిరించాడు. కానీ, అతణ్ణి జయించలేక తన కూతురినిచ్చి పెళ్ళి చేశాడు. ఈ అవకాశాన్ని బట్టి హమీరుడు మాలదేవుడు లేని సమయం చూసి చిత్తోడ్ దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. మహమూద్‌ఖిల్జీకిది కోపకారణమయింది. యుద్ధానికి వచ్చాడు. క్షత్రియులకు పట్టుబడ్డాడు. చివరికి అజ్మీర్, రణదంబోర్, నాగోరు, సుయిసోపూర్ అనే ప్రాంతాలను, యాభై లక్షల రూపాయలను, నూరు ఏనుగులను హమీరుడికి సమర్పించి, ఇంకెప్పుడూ రాజపుత్రుల మీదికి దండెత్తనని మాటయిచ్చి, ఖిల్జీ విముక్తి పొందాడు.

హమీరసింహుని చరిత్రను శ్రద్ధతో చదివిన వారికి అతని అభివృద్ధి అంతా నిరవధికమైన పురుషకారం వల్లనే కలిగిందని చెప్తుదంటారు శ్రీపాదవారు.

మరొకటి సంగరాణా చరిత్ర. ఇతడు రాయమల్లుడి కొడుకు. ఇతనికి ఇద్దరు అన్నలు ఉన్నారు. ఒకడు జయమల్లుడు, మరొకడు పృథివీరాయుడు. ముగ్గురూ వివేకవంతులే కానీ, ఒకరితో ఒకరు కలహించుకుంటూ ఉండేవారు. అయితే తండ్రి జీవించి ఉండగానే పెద్దకొడుకులిద్దరూ చనిపోయారు. తండ్రి గతించిన తరువాత సంగుడే రాణా అయ్యాడు. ఇతడు మహా శూరుడు. చతురుడు కూడా. చిన్నవాడైనప్పటికీ ప్రజాపాలన చక్కగా ప్రారంభించాడు. తోటి రాజులు ఇతనితో స్నేహం చేసేవారు. అవక్రపరాక్రమవంతుడు కావడం వల్ల ఇతనికి యుద్ధమంటే ఎంతో సంతోషం. ఒక మహాసైన్యాన్ని కూర్చుకొని, శత్రు భయంకరుడయ్యాడు. ఢిల్లీ పాలకుడు మాళవదేశపు సుల్తాను ఇది గమనించాడు. వాళ్లిద్దరూ కూడబలుక్కొని ఇద్దరూ చెరొకవైపు నుంచి దండెత్తి వచ్చారు. అయినా సంగరాణా జంకలేదు. అఖండ ధైర్య సాహసాలతో వాళ్ళను ఎదిరించి, ఓడించి పారద్రోలాడు. పరాభవ ఖిన్నులయిన సుల్తానులు మళ్ళీ మళ్లీ దండెత్తుతూ, ఓడుతూ వచ్చారు. ఇలా పద్దెనిమిది సార్లు జరిగింది. దాంతో సంగరాణా ప్రతాపం దశదిశలా తెలియవచ్చింది.

ఆ సమయంలో ఢిల్లీ పాలకుడు ఇబ్రహీంలోడి. లాహోర్‌లో ఉండే సుబేదారు దౌలత్‌ఖాన్ స్వతంత్రత ప్రకటించుకోవాలని లోడితో యుద్ధం చేసి ఓడిపోయాడు. అయినా పగ చల్లారక, కాబూలుకు పోయి, తయిమూర్ వంశస్థుడైన బాబరును భారతదేశానికి తీసుకు వచ్చాడు. పానిపట్టులో ఘోర యుద్ధం జరిగింది. లోడి చనిపోయాడు. ఢిల్లీ సామ్రాజ్యం మొగలులకు స్వాధీనమయింది. ఈవిజయంతో బాబరు రాజ్యతృష్ణ మరింతగా పెరిగింది. భారతదేశాని కంతకీ చక్రవర్తిని కావాలని నిశ్చయించుకున్నాడు. మేవాడు రాజ్యం మీదికి ముందుగా గుర్రపు దండును పంపాడు. అప్పటికే జాగ్రత్తలో ఉన్న సంగరాణా, వాళ్ళను చీల్చిచెండాడాడు. దాంతో బాబరు జోరు కొంత తగ్గింది. ఇక మిత్రబేధం వల్ల కార్యం సాధించాలనుకున్నాడు.

యుద్ధం వల్ల ప్రజా క్షేమం, ప్రజా పీడ కలుగుతాయి కనుక వాటిని నివారించడానికి సంగరాణా సిసోదీ అనే రాజపుత్రుణ్ణి బాబరు దగ్గరికి రాయబారిగా పంపాడు. అతడు రాజనీతిలో చాలా సమర్థుడే, అయినప్పటికీ బాబరు ఇవ్వజూపిన

ధన లబ్ధికి ఆశపడి సంగరాణాకు ద్రోహం తలపెట్టాడు. బాబరును హఠాత్తుగా తీసుకువచ్చి, సంగరాణాకు మెడమీద కత్తిలా కూర్చోబెట్టాడు. చేసేదిలేక సంగరాణా అప్పటికి తప్పించికొని పోయాడు. మేవాడు రాజ్యంలో చాలా భాగం తురుష్కులకు చిక్కింది. అయినప్పటికీ సంగరాణా శౌర్యానికిది కళంకమని అనలేము. పరిస్థితి అలా వచ్చింది.

ఈ గ్రంథంలో చివరి అధ్యాయం రాణా ప్రతాపసింహుడి చరిత్ర. మేవాడు రాజా ఉదయసింహుడు. అతని కొడుకు ప్రతాపసింహుడు. ప్రతాపుడి తల్లి గొప్ప శౌర్యభూషితురాలు. తండ్రి తరువాత కొడుకు రాజయ్యాడన్న మాటే కాని - ఏలడానికి రాజ్యం లేదు; పోరడానికి సైన్యం లేదు; సైన్యం సమకూర్చుకోవడానికి డబ్బులేదు. మాట సాయానికో చేతసాయానికో స్నేహితులు కూడా లేరు. అతడుంటున్నది ఎక్కడ? ఆరావళి పర్వత ప్రాంతంలో పర్ణ కుటీరాల్లో. అతని పగవాడెవడు? అక్బర్ పాదుషా! అయినా శౌర్య ప్రతాపాలు అతన్ని ఊరుకుండనీయలేదు.

అక్బరు ప్రతాపసింహుణ్ణి గురించి విన్నాడు. అతడు అసహాయ శూరుడనీ ఎప్పుడైనా అతని వల్ల తనకు విపత్తు రావచ్చునని మంచిమాటలతోనే అతణ్ణి లోబరుచుకోవాలని అనుకున్నాడు. 'నువ్వు నా శరణు వేడితే నీ రాజ్యం నీకు ఇచ్చేస్తాను. చాలా బహుమతులిస్తాను. నా కొలువులో అగ్రస్థానమిచ్చి గౌరవిస్తాను' అని వర్తమానం పంపారు. ప్రతాపుడు అతని మాట తిరస్కరించాడు. ' నా వంశానికి అపఖ్యాతి తెచ్చేపని నావల్ల కాదు' అని సమాధానం పంపాడు.

అటుమీదట అతడు మిత్రరాజులను కూడగట్టుకోవడం, శత్రురాజ జనపదాలను కొల్లగొట్టి అపార ధన రాసులను కూడబెట్టడం, అదునుకనిపెట్టి దండు నడపడం వంటివి అవిశ్రాంతంగా చేస్తూ వచ్చాడు. గెలుపోటములు తక్కెడ సిబ్బులు. ఎప్పుడూ ఏవైపు మొగ్గు చూపుతాయో చెప్పలేము. అయినా ప్రతాపుడు మానధనుడు. అక్బరు కొలువులో ప్రముఖుడైన ఖానఖాన్ అనేవాడి ప్రశంసలను కూడా పొందిన వాడతడు. అటుమీదట అతని జీవిత చరిత్ర చాలా పరిణామాలకు లోనయ్యింది.

ప్రతాపుని జీవితంలో ప్రకాశించే గుణ రత్నాలలో మొదటిది ఆత్మ గౌరవం. రెండవది పురుషకారం, మూడవది ధైర్యం, నాలుగవది స్థైర్యం అంటారు సుబ్రహ్మణ్య

శాస్త్రి గారు. ఎలాంటి అంతరాయం కలిగినప్పటికీ మొదలుపెట్టిన పనిలో బ్రహ్మాస్త్రంలాగ నిరర్గళంగా పనిచేసేవాడు కాబట్టే ప్రతాపుడు, అక్బరు వంటి జిత్తులమారి శత్రువును గడగడలాడించ గలిగాడు అంటారు.

'తెలుగులో అపూర్వ రచన నా వీరపూజ' అన్న విశ్వాసం దండిగా ఉంది శాస్త్రిగారికి. 'అంతకిముందే కాదు తరువాత కూడాఅలాంటి రచన మరి పుట్టలేదు. మన వచన వాఙ్మయంలో. ఇది గర్వంలో లెక్కవుతుందా? నా శక్తి మీద కంటే, నా వీరపూజ మీద నిశ్చలయిమయిన విశ్వాసం ఉందినాకు, కనుక, అందుకు సిగ్గుపడన్నేను. ఖచ్చితంగా చెబుతాను. నా వీరపూజ విశిష్ట రచన. ' అన్నారు శ్రీపాదవారు.

(సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘ కన్వీనర్)
1-100, చైతన్యపురి, గంగా హాస్పటల్ దగ్గర,
హైదరాబాదు-500 060
ఫోన్ : (040) 24146205

తెలుగు భాషలో తెలుగు కథ

... భాషా విషయకంగా ఎంత వ్యవహార వాదియో, భాష విషయంలో అంత తెలుగు వాడు సుబ్రహ్మణ్య శాస్త్రి.

ఏ సహృదయుణ్ణయినా, తెలుగు భాషలో తెలుగు కథ వ్రాసిన ఖ్యాతి యెవరికి దక్కుతుందని అడిగితే నిర్మొహమాటంగా 'వడ్లగింజలు' వ్రాసిన సుబ్రహ్మణ్య శాస్త్రిదే ఆ ఖ్యాతి అని చెప్పి తీరతారు.

కథకులకు పాఠ్యగ్రంథం వడ్లగింజలు

- ఉషశ్రీ

(కృష్ణా పత్రిక, 1962 సెప్టెంబర్ 8)

శ్రీమహా భక్త విజయము

- డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి రచన లన్నిటిలోకీ బృహద్గ్రంథం 'శ్రీమహాభక్త విజయము'. తెలుగులో సర్వాంగ సుందరమైన భక్తుల చరిత్ర లేని లోటును గమనించి వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రుల వారు శ్రీపాద వారి చేత ఈ గ్రంథం ఏరికోరి రాయించుకున్నారు. మొదటి కూర్పు 1918లో వెలువడింది. ఉత్తరోత్తరా, దానికి పరివర్ధిత ప్రతులు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఈ నాటిదాకా తెలుగునాట అన్ని ప్రాంతాల్లోను, అన్ని వర్గాల్లోను, అన్నితరాలవాళ్ళు కళ్ళకద్దుకొని చదువుకొంటున్నది శ్రీ మహాభక్త విజయం. రాయల్ సైజులో వెయ్యిపుటల గ్రంథమిది, భాష సరళ గ్రాంథికం.

ఈ గ్రంథానికి ప్రాణభూతమయినది ఏమంటే - 'ప్రేమ'. ఇది మనకు అనుభవంలో తెలిసేదే. దగ్గరగా ఉండే వ్యక్తుల మీద - చుట్టాల మీద, స్నేహితుల మీద- మనకు ప్రేమ కలగడం సహజం. పెంచుకోనే జంతువుల మీదా. పక్షుల మీదా, పరిసరాల మీదా కూడా మనకు ప్రేమ కలుగుతూ ఉంటుంది. జంతు దశలోని సహజాతం (ఇన్‌స్టింక్ట్) మానవదశలో ప్రేమగా పరిణమిస్తోంది. ఇచ్చిపుచ్చుకోడాలు సాగిస్తోంది. ఆ ప్రేమతత్త్వమే, లౌకిక వాసనల మాలిన్యం అంటకుండా ఉదాత్తత నంది భగవంతుడిమీద నిలిచినప్పుడు దాన్ని 'భక్తి' అంటాం. రూపు దాల్చిన భక్తే 'భక్తుడు' గదా !

'అనిర్వచనీయం ప్రేమ స్వరూపమ్' అంటాడు నారద మహర్షి, భక్తిసూత్రాల్లో, అది అనుభవ వేద్యమే కాని మాటల్లో చెప్ప జాలనిది అని ఆయన అభిప్రాయం. మనలాగే, మూగవాడూ రుచిని అనుభవిస్తాడు. కాని మాటల్లో చెప్పలేడు. ప్రేమ కూడా అంతే. అది యోగ్యమయిన దేశకాలాల్లో తగినవాడిలో మాత్రమే ప్రకాశిస్తుంది. వారి వారి పూర్వసంస్కారాలు రుచులను బట్టి, అభిమానాదులను బట్టి నానా విధాలుగా ఉంటుంది.

నారదుడి గురువయిన సనత్కుమారుడి మొదలు ఇప్పటిప్పటివారి వరకు భక్తి శాస్త్రాచార్యు లందరూ ఏకమతితో చెప్పినమాట-భక్తే ముక్తికి సాధనమని. ముక్తి అన్నా, మోక్షమన్నా బంధాలన్నీ తొలిగిపోవడమని అర్థం. అంటే సర్వస్వతంత్రత పొందడం. దాన్ని మించింది ఏముంటుంది కనుక! దాన్ని పొందడానికి జ్ఞాన, యోగమార్గాలు కూడా ఉన్నప్పటికీ సర్వజన సులభమయినది భక్తిమార్గమేనని చెబుతారు. భగవంతుడి మీద సంపూర్ణ విశ్వాసం ఒక్కటి చాలు, భక్తుడు తరించడానికి ప్రధానులయిన ముగ్గురు మతాచార్యవర్యుల్లో మధ్వాచార్యులవారు, రామానుజాచార్యులవారు భక్తి మార్గాన్ని బోధించారు. ఆదిశంకర భగవత్పాదు లొక్కరే జ్ఞానమార్గానికి ప్రాధాన్యమిచ్చారు; ప్రాచుర్యం కలిగించారు. అంతమాత్రాన ఆదిశంకరులు భక్తులు కాదనలేం గదా ! వారు రచించిన అద్భుతమయిన స్తోత్రాలూ, స్తవాలూ ఇప్పటికీ ఇంటింటా మనకు వినవస్తున్నాయి. అరుణాచలేశ్వరుడి అనుగు పుత్రులయిన రమణ మహర్షిగారికి భక్తిజ్ఞానాల్లో ఒకటి ఎక్కువా, ఒకటి తక్కువా అవి అనగలమా ? పురాతనమయిన భారతీయ క్రియా యోగాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన మహామహితాత్ములు పరమహంస యోగానందగారు మహాభక్తులు కూడా కారా మరి! అయినా, శ్రీరామకృష్ణ పరమహంసగారు భగవతితో ఒకమాట అన్నారు. 'అమ్మా, ఇదుగో నువ్విచ్చిన జ్ఞానం. ఇదుగో నువ్విచ్చిన భక్తి. నీ జ్ఞానాన్ని నువ్వు తీసేసుకో; భక్తి ఒక్కటి మాత్రం నాకు ఉంచు !' ఈ విశాల భారతదేశంలోనే కాక, ప్రపంచం మొత్తంమీద జ్ఞానులకంటె భక్తులే ఎక్కువగా ఉన్నా రన్నమాట వాస్తవం. "భక్తి, జ్ఞానానికి తల్లివంటిది," అన్నారుకదా రమణులు !

భగవదనుగ్రహం మీద విశ్వాసం, భగవదనుగ్రహంవల్ల జనన మరణరూప సంసార బంధం నుంచి ముక్తి కలుగుతుందనే నిశ్చయం ఉన్నవాళ్ళు ఎవ్వరయినా సరే భక్తి మార్గంలో సాగవచ్చు. జాతి మత లింగ వర్ణ వర్గ భేదాలతో భగవంతుడికి నిమిత్తం లేదు. అనన్యభక్తి ఒక్కటే ఆయన చూసేది. కాబట్టి భక్తిసాధనకూ భగవత్ప్రాప్తికీ అందరికీ సమానాధికారముంది.

శ్రీపాదవారి ఈ విశిష్టగ్రంథంలో అన్ని విధాల వారూ ఉన్నారు. అంత్యజులని చెప్పే నందనారు, చోకామేళుడు, తిరుప్పానాళ్వారు, తిరుమంగై ఆళ్వారు మహాభక్తులే గదా ! ఆండాళు, అవ్వయ్యారు, మీరాబాయి, తరికుండ వెంకమాంబ వంటి భక్తురాళ్ళు

ఉన్నారు, ఎందరో. మొదట్లో దురాచారపరులయి తరవాత మహాభక్తులయినవాళ్ళూ ఉన్నారు. అజామీళుడు, రత్నాకరుడు, తొండరడిప్పొడియాళ్వారు, బిల్వమంగళుడు మొదలగు వాళ్ళు. అక్షరజ్ఞానం లేకపోయినా, ఏ శాస్త్రాలూ నేర్చకపోయినా కృతకృత్యులయిన మహామహులూ ఉన్నారు : కబీర్, నానక్, తుకారాం వంటివారు.

వెయ్యి పుటల వరకు పెరుగుతూ వచ్చిన శ్రీమహాభక్త విజయం 1966 నాటి కూర్పులో 185 మంది భక్తుల వృత్తాంతాలున్నాయి. ప్రథమ భాగంలో ఉన్నవారు 83 మంది 'హరిభక్తులు'. వారిలో ప్రహ్లాదుడు మొదలు రుక్మాంగదుడి వరకు పురాణప్రసిద్ధులయినవారు పన్నెండు మంది ఉన్నారు. ద్వితీయ భాగంలో సుందరమూర్తి నాయనారు మొదలు సాత్త్వికరాజు వరకు 27 మంది 'శివభక్తులు ' ఉన్నారు. తృతీయ భాగంలో పొయిగైయాళ్వారు మొదలు పుండరీకుడివరకు 15 మంది 'భగవద్భక్తులు' ఉన్నారు. వీరి చరిత్రలు రచించినవారు, విజయనగరం మహారాజావారి సంస్కృత కళాశాలలోని సంస్కృతాధ్యాపకులు మేడేపల్లి వేంకట రమణాచార్యులవారు. చతుర్థభాగం 'దేశభక్తులు'. ఇందులో, లోకమాన్య బాలగంగాధర తిలకు, మోహనదాస కరంచంద్ గాంధి - ఇద్దరే ఉన్నారు - ఈ భాగంలోనే, ' మరికొందరు విష్ణు భక్తులు ' గా 33 మంది వృత్తాంతాలు ఉన్నాయి-పులక్సుకారు మొదలుకొని శ్రీదత్తావతార మర్తాండ మాణిక్యప్రభువు వరకు. పంచమ భాగంలో కరమైతీబాయి నుంచి గిరవరుడి వరకు 27మంది భక్తుల పరిచయాలు (కొన్ని చాలా సంగ్రహంగా) ఉన్నాయి. వీటిని రచించిన వారు కుందుర్తి వేంకట నరసయ్యగారు. వీరూ, మేడేపల్లివారు రచించినవి తప్ప తక్కినవన్నీ శ్రీపాదవారి రచనలే.

ఇంతమంది భక్తుల జీవిత కథలను వరుసగా చదివినప్పుడు, వారందరిలో కనిపించే సామాన్యాంశాలను గుదిగుచ్చినప్పుడు భక్తియోగప్రవృత్తి మనకు బాగా ఎరుక అవుతుంది. భగవద్రామానుజాచార్యులవారు, భక్తియోగానికి పూర్వాంగాలుగా చెప్పిన ఏడంశాలను గుర్తుచేసుకోవడం మంచిది : 1) హితాహితాహారపదార్థ జ్ఞానం, 2) విమోహం- ఆశలేకపోవడం, 3) అభ్యానం-అంటే అనుష్ఠానం, 4) క్రియ-పరోపకారం, 5) కళ్యాణం-ఋజువర్తనం, సత్యం, దయ, అహింస, దానం, 6) అనవసాదం - సంతోషంగా ఉండటం, 7) అనుద్ధర్షం-ఉద్వేగం లేకుండా ఉండటం. ఈ పూర్వాంగాలు కనక ఉన్నట్లయితే భక్తియోగం శీఘ్రఫలకారి అవుతుందన్నది ఆచార్యుల వారి భావన. బుద్ధి భగవల్లీనం కావడానికి ఇవి తోడ్పడతాయి.

నిజానికి, భక్తికి బీజం పూజ్యపూజక భావం. సాధన ప్రథమదశలో, భగవంతుడు పూజ్యుడనీ తాను పూజకుడిననీ మనసులో ఉంటుంది. క్రమక్రమంగా సిద్ధావస్థకు చేరేసరికి అభేదస్థితి కలుగుతుంది.

భగవంతుడి మహాత్మ్యాన్ని సమగ్రంగా గ్రహించడంవల్ల ఆయన మీద, తక్కిన వాటన్నటి మీద కంటె ఎక్కువగా ప్రీతి కలుగుతుందని, సుస్థిరమవుతుందనీ అదే భక్తి అనీ అన్నారు, మధ్వాచార్యులవారు. అది అనుభూతి యోగ్యమే కాని వేరుకాదు. ఆ అనుభూతి కూడా అలౌకికమే కాని లోకసాధారణం కాదు. ఆ భక్తికీ ఆత్మానందానికీ భేదం లేదు. భక్తులు ఆనందమయులుగా కనిపించడానికి అదే కారణం. భక్తుడు భగవంతుడి మీద చూపే ప్రేమకు మూడు లక్షణాలు ఉంటాయని ప్రసిద్ధి : 1) అహంకారానికి తావులేదు; నీచభావస్పర్శ తగలదు. 2) ఆ ప్రేమ ఐకాంతికంగా ఉంటుంది. 3) భక్తుడు తనను తాను మరచి నిరంతరం ఆత్మారాముడయి ఉంటాడు. ఈలక్షణాలు ఈ గ్రంథంలోని భక్తుల చరిత్రల్లో కనిపిస్తాయి.

భక్తులు తమతమ అంతఃకరణంలోని పరిణామాన్ని బట్టి పూజ్య పదార్థాలను గ్రహిస్తారు: 1) శివకేశవాది సాకార సగుణబ్రహ్మాన్ని, 2) ఆ సాకార సగుణ బ్రహ్మకు ప్రతీకను, 3) సగుణబ్రహ్మతాలూకు అవతారమూర్తులను,4) తమ గురువును, 5) వారూ వీరూ అని కాక, జీవత్వాన్ని 6) భగవదాకారమనే విశ్వాకారాన్ని, 7) సృష్టి అంతటా అంతర్యామి అయి ఉండి దాన్ని నడిపేదే భగవత్ తత్త్వమనే ఊహతో, దాన్ని, 8) అహంకారాది ఉపాధిరహితమయిన ఆత్మే పరమాత్మ అని, దాన్ని ధ్యానిస్తారు. ఎవరు ఎలాటి పూజ్యపదార్థాన్ని గ్రహించి సాధన చేసినప్పటికీ తన జీవాత్మే పరమాత్మ అనేభావం దృఢమయి చిత్కళామాత్ర బ్రహ్మం ఎప్పుడు అనుభవసిద్ధమవుతుందో అప్పుడది పరాభక్తి అవుతుంది. పరాభక్తి పరిపూర్ణ ఆత్మానుభూతి. జ్ఞాన, కర్మ, యోగాలు మూడిటికంటె ఇదే ఉత్తమమనీ ఇదే మోక్షమనీ అంటారు కొందరు.

"నాస్తి తేషు జాతి విద్యారూపకులధన క్రియాది భేద :" (నారదభక్తి సూత్రాలు) 5:72) అంటే ఎక్కడ పుట్టినవారయినా భగవత్ప్రసన్నత్వం కలిగినట్లయితే పూజ్యులవుతారన్నమాట. పరమార్థ దృష్టికి ఒక్కటే అయినప్పటికీ భక్తి, కనీసం 11రూపాలు దాలుస్తోంది (నారదభక్తి సూత్రాలు 5:82): 1) భగవంతుడి

కళ్యాణగుణాలను అభివర్ణించడం-నారదుడూ, ఆయన శిష్యుడయిన వ్యాసుడు, మన త్యాగరాజు మొ॥వారు ఆ విధంగా తమభక్తిని వెల్లడించుకున్నారు. 2) దివ్యమంగళ విగ్రహానురాగం - బృందావన స్త్రీలకు అది గాఢంగా ఉండేది. 3) భగవత్పూజ - అంబరీష చరిత్ర దీనికి నిదర్శనంగా ఈ గ్రంథంలో కనిపిస్తుంది. 4) భగవత్ స్మరణం - ప్రహ్లాదుడి కథలో ఇది తెలుస్తుంది. 5) భగవత్సేవ - ఇందులో హనుమంతుణ్ణి మించినవారు ఎవరు ? 6) భగవంతుడి పట్ల సఖ్యభావ ప్రేమ - ఉద్ధవుడు, అర్జునుడు మొ॥ వారిది. 7) భగవంతుణ్ణి పుత్రుడిగా భావించడం - దేవకి, కౌసల్య ఇందుకు ఉదాహరణలు 8) భర్తగా భావనచేయడం - రుక్మిణి, సత్యభామ, మీరాబాయి. 9) భగవంతుడికి సర్వమూ అర్పించడం - బలిచక్రవర్తి, విభీషణుడు చేసిన దిదే. 10) భక్తుడు భగవన్మయుడయి ఉండటం -నారదుడి గురువయిన సనత్కుమారుడు, యాజ్ఞవల్క్యుడు. 11) భగవంతుణ్ణి ఎడబాసి ఉండలేకపోవడం ఇది గోపికల్లో చూస్తాం. ఈ లక్షణాలన్నిటిని ఈ గ్రంథంలోని భక్తుల చరిత్రలో ఆయా సందర్భాల్లో గమనించవచ్చు.

ఇక్కడ చెప్పుకోవలసిన విషయం మరొకటి కూడా ఉంది. అందరిలాగే భక్తుడు కూడా మానవ సమాజంలో బతుకుతున్నాడు. సమాజంలో లౌకిక వ్యవహారా లనేవి ఉండకమానవు. సుఖదుఃఖాలూ ఉంటాయి, కష్టనష్టాలూ ఉంటాయి. అభిలాషలూ ఉంటాయి, ఆరాటాలూ ఉంటాయి. సమస్యలూ ఉంటాయి, సంఘర్షణలూ ఉంటాయి. వాటి నతడు పట్టించుకోవలసిన పని లేదా అన్న శంక కొందరికి రావడం సహజం. కాని, భక్తుడయినంత మాత్రాన అతడు లోకవ్యవహారానికి పూర్తిగా విముఖుడు కావలసిన పని లేదు. ఏమంటే, అతడు ఎన్నో కొన్ని శుభకర్మలు తప్పకుండా చేస్తాడు. కాని వాటి ఫలాలను మాత్రం భగవంతుడికే అర్పిస్తాడు. అవిక అతనివి కానే కావు. అతడు నిమిత్తమాత్రుడు మాత్రమే. లోకంలో, వెలుగు నీడల్లా సుఖదుఃఖాలు ఎప్పుడూ ఉన్నాయి; ఉంటూనే ఉంటాయి. లోకదుఃఖాన్ని గురించి అతడు చింతించవలసిన పని ఉండదు. ఎందుకంటే, అతడు తన ఆత్మలో సహా ఈ లోకాన్నీ సర్వాన్నీ భగవంతుడికి అర్పించి ఉన్నాడు. లోకం భగవంతుడి కంటే వేరు కాదన్న విశ్వాసం అతనికి ఉంటుంది. కాబట్టి దాని చింతకు అతనికి అవకాశం ఉండదు. ఈ గ్రంథంలోని దేశభక్తు లిద్దరూ లోక వ్యవహారమయిన స్వాతంత్ర్య సాధనోద్యమంలో నిండా మునిగిన వారే. కాని దాన్ని ఫలాన్ని అంటినవారు మాత్రం కారు.

ప్రథమ భాగంలోని హరిభక్తుల్లో తొలి పన్నెండు మంది (ధృవుడు, కుచేలుడు, భరతుడు మొ॥వారు) మనకు పురాణ కథల ద్వారాను, కావ్యాల ద్వారాను సుపరిచితు లయినవారే. ఆ తరవాత ఉన్న గౌతమ బుద్ధుడు, శంకరాచార్యుడు చారిత్రిక పురుషులు. బమ్మెర పోతరాజు, సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి, భద్రాచల రామదాసు, వేమన్న, తరికుండ వెంకమ్మ తెలుగు వారే కదా! మాటిమాటికీ మనకు తలపుకు వచ్చేవారే కదా ! వారి వారి పలుకులు తరచుగా మననోట ఆడేవే కదా ! తక్కినవారు మన పొరుగునున్న కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ఉత్తరాన పంజాబు వరకు, పడమటి భారత ప్రాంతాల నుంచి తూర్పుసముద్రతీరం వరకు ఆయా ప్రదేశాలను పుట్టుకలతో, పాదరజంతో పావనం చేసినవారు. వారిలో భక్తురాళ్ళకూ కొరత లేదు. (స్త్రీ హృదయం ప్రధానంగా ప్రేమకలశం కాబట్టి, ఎక్కువగా లౌకిక వ్యవహారాల్లో తలమునకలుగా ఉండే పురుషుల కంటె స్త్రీలకే భగవత్ ప్రేమ సులువుగా అలవడుతుందేమో !) తరికుండ వెంకమ్మ మొదలు శీలాబాయి వరకు పన్నెండు మంది భక్తురాళ్ళ వృత్తాంతాలు మనను బాగా అలరిస్తాయి.

ద్వితీయ భాగంలోని శివభక్తుల్లో ఏడుగురు తప్ప తక్కినవారు నాయనార్లుగా ప్రసిద్ధులు. వారిలో నేత్రేశనాయనారే మన భక్త కన్నప్ప. అతని అసలుపేరు తిన్నడు. తన శివారాధనకు ఆటంకం కలిగించినందుకు కన్న తండ్రినే ఎదిరించిన మహాభక్తుడు చండీశ్వరనాయనారు; శివసాక్షాత్కారంతో బాటు చండీశ్వరపదవి పొందినవాడు. జ్ఞాన సంబంధ మూర్తి, వాగీశుడు, సద్వస్తునాయనారు, గుగ్గులు కులశనాయనారు చిరస్మరణీయులే. కారక్కాలమ్మ (కరైక్కాలమ్మ) మహామహిమాన్వితురాలు. సంగీత రత్నత్రయంలోని కాకర్ల త్యాగరాజు చరిత్ర మనను ఈ భాగంలోనే పులకింపజేస్తుంది. అంతటివాడు కూడా తన ఆరాధ్యదైవం ముందు తన వేదనను ఎంత దీనంగా వెళ్ళబోసుకున్నాడని ! " ఎందుకు పెద్దలవలె బుద్ధియ్యవు - ఎందుబోదునయ్య రామయ్య" అని అడిగాడు.

ప్రాచీన వైష్ణవాచార్య లొకరు తమిళభాషలో శ్రీవైష్ణవ గురువుల చరిత్ర రచించారు. తరవాత దాన్ని అనంతాచార్యులనేవారు 'ప్రపన్నామృత' మనే పేరుతోను, మరొకరు 'దివ్యసూరిచరిత్ర' మనే పేరుతోను సంస్కృత భాషలో అందించారు. దాన్నే మేడేపల్లివారు, 'శ్రీ విశిష్టాద్వైత గురుపరంపరా ప్రభావము' పేరుతో తేట తెలుగులో

రచించగా అది శ్రీ మహాభక్తవిజయంలో తృతీయ భాగంలో అమరింది. ఇందులోని తిరుమళిశైయాళ్వారు (భక్తిసారులు), పెరియాళ్వారు (విష్ణుచిత్తులు), ఆండాళ్ (గోదాదేవి), కులశేఖరాళ్వారు, తొండరడిప్పొడియాళ్వారు (విప్రనారాయణుడు), తిరుమంగైయాళ్వారు (పరకాలుడు), యామునాచార్యులు, ఇళైయాళ్వారు (రామానుజులు) మహాభక్తులు, మహిమాన్వితులు, ప్రాతఃస్మరణీయులు.

చతుర్థభాగంలోని 'మరికొందరు విష్ణుభక్తులు' అన్న ఉపవిభాగంలో సజ్జనకచారుకదాసు, చాంగదేవుడు, ధనాజాటుడు, మత్స్యేంద్రనాథుడు, గౌరాంగుడు (చైతన్యస్వామి), త్రైలింగస్వామి, భాస్కరానందస్వామి, రామప్రసాద్, శ్రీరూపసనాతన గోస్వాములు, పవహారిబాబా, శ్రీ దత్తావతారమర్తాండ మాణిక్యప్రభువు మొ॥వారు తరతరాలుగా, ఆధ్యాత్మిక శాస్త్రాభిమానులకూ, సాధకులకూ గొప్ప స్ఫూర్తిని ఇస్తూవస్తున్నవారు. భారతీయ మానసాకాశంలో నిత్యసంచార జ్యోతి స్వరూపులే కదా వారు! అసాధారణమయిన భారీ శరీరంతో దాదాపు మూడువందల సంవత్సరాలు జీవించిన దిగంబర యోగి శ్రీత్రైలింగస్వామివారు. రామకృష్ణ పరమహంసచేత 'సచల విశ్వనాథులు' అనిపించుకున్నవారు. తెలుగునాట పుట్టి మహాయోగులయి దేశదేశాల్లో సంచారం చేసి చివరికి 150 సంవత్సరాలు కాశీలోనే ఉండిపోయారు. అక్కడ పంచగంగా ఘట్టానికి ఒడ్డునున్న మాధవస్వామి ఆలయానికి దాపున, స్వామివారు నివసించిన చోట వారి పేరు మీద ఒక మఠం ఉంది. కాలభైరవుడి ఆలయద్వారాన్ని దాటగానే కుడివైపు గోడమీద స్వామివారి వర్ణచిత్రం ఇప్పటికీ దర్శనమిస్తోంది.

ఇటువంటి మహామహుల జీవిత చరిత్రల్లో అనేకానేక అద్భుత మహిమలు, అలౌకిక ఘటనలు తెలియవస్తూ ఉంటాయి. లౌకిక జీవుల హేతుబుద్ధికి అవి అందేవి కావు. భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు. ఆయనతో తాదాత్మ్యం చెందినవారికి ఆయన శక్తులు రావడంలో అబ్బురం లేదు. ఆయన చేయదలుచుకున్న వాటికి వారు ఉపకరణాలు అవుతారు కూడా (వీటిని గురించి స్పష్టమయిన అవగాహన ఏర్పరుచుకోదలచిన వారు శ్రీపరమహంస యోగానందగారి 'ఒకయోగి ఆత్మకథ'లో 'అలౌకిక ఘటనల నియమం' అన్న అధ్యాయం చూడవచ్చు).

ఈ గ్రంథంలోని కొన్ని వాక్యాల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ప్రసన్న శైలిని గమనించవచ్చు : " ఆంజనేయుడు స్వస్థానమునకు బోయి శ్రీరామచంద్రుని

ప్రార్థించి, ప్రత్యక్షమయిన పిమ్మట తులసీదాసు ననుగ్రహింపవలయునని వేడుకొనియెను. రాము డట్లేయని యంగీకరించెను. తులసీదాసు రాముడు సాక్షాత్కరించునని భావించి దర్శనలాలసు డై రామభజనము చేయసాగెను. ఇట్లుండగా, నొక తురుష్కరాజు తన తురుష్క సైన్యమును వెంటనిడుకొని తులసీదాసు నాశ్రమము ముందు నుండి యెటకో పోయెను. తురుష్కునితో మనకేమి పని యని తలంచి, తులసీదాసు ఆ రాజు దెసకే చూడలేదు. ఎంత భజనము చేసినను ఫలము కలుగనందులకు జాల వగచి, తులసీదాసు మఱల సమీపగ్రామమునకు బోయెను. అట నంజనాపుత్రుడు వచ్చి 'రామదర్శనమైనదా?' యనిప్రశ్నించెను. 'మీకు సంపూర్ణానుగ్రహము గలుగనిదే నా కోరిక యెట్లీడేరు' నని దాసు నిస్పృహతో పలికెను. అది విని మారుతి, 'అయ్యో ! శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించినను జూడ జాలక పోయితివి గదా ! పరమేశ్వరుడు నీ సర్వసమత్వ భావమును బరీక్షింప దలచి తురుష్క ప్రభురూపమున దర్శనమిచ్చెను. కను గొన జాలకపోయితివి గదా ! అనియెను "
(శ్రీమహాభక్త విజయము, వావిళ్ళవారు, 1966, పుటలు 117-118)

ఇంతటి ఉత్తమ గ్రంథాన్ని రచించిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ధన్యులు.

(సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘ కన్వీనర్)
1-100, చైతన్యపురి, గంగా హాస్టల్ దగ్గర,
హైదరాబాదు-500 060
ఫోన్ : (040) 24146205

ప్రాణం పోసుకుంటాయి

... శ్రీపాదవారి కథలు చదువుతూ ఉంటే ఈనాడు ఇంచుమించు అంతరించిపోతున్న తూర్పు గోదావరి బ్రాహ్మణ కుటుంబాల వలుకుబడులు, వాతావరణం మనస్సులో ప్రాణం పోసుకుంటాయి."

నా యవ్వన దశలో ఎంతో చనువుగా ఎరిగి ఉన్న దృశ్యాలెన్నో ... అన్నీను ...

- పాలగుమ్మి పద్మరాజు

నాకు తెలిసిన శ్రీపాద...

- పోతుకూచి సూర్యనారాయణ మూర్తి

ఈవేళ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారే జీవించిఉంటే ' అయ్యా' సూర్యనారాయణమూర్తి గారూ! నా గురించి బాగా తెలియని వారు మీ కిటువంటి శీర్షికతో ప్రసంగం చేయమంటే సరే! నన్ను ఎరిగిన మీరు ఎలా వప్పుకున్నారు? ' అని కచ్చితంగా నిలదీసేవారు. ఎందుకంటే ఆయన మీదా, ఆయన పేరు మీదా ఆయనకున్న ప్రత్యయం అటువంటింది. ఆయన సమకాలీనులైన మరో యిద్దరు శ్రీపాదవారు సాహిత్యరంగంలో ప్రసిద్ధులుండేవారు. 1) కవి సార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు- 2) భౌతికశాస్త్రవేత్త, విమర్శకులు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు. ఈ శ్రీపాదలు కాక, తమనే ఉద్దేశించి యీ ప్రసంగం సాగుతున్నట్లు నిస్సందేహమైన దాఖలా ఏమంటే, 'నాకు తెలిసిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు' అనాలి. ఇలా ఎందుకు చెపుతున్నానంటే, ఒకసారి ఆయన తలుపుకొట్టి ' సుబ్రహ్మణ్యం గారు' అని పిలిచి పోస్టుమేన్ ఒక ఉత్తరం యిచ్చి వెళ్ళాడు. వెళ్లిపోతున్న అతణ్ణి వెనక్కిపిలిచి ' ఏమయ్యా! నన్ను ఏమని పిలిచావు? 'అని అడిగి అతడు చెప్పినతరువాత ' చూడు, యీ ఉత్తరం మీద అడ్రసు ఏమని ఉంది ?' అంటూ అతడి చేత చివరికి క్షమార్పణ చెప్పించుకున్నారు.

ఇప్పుడు రాజమహేంద్రవరంలో త్యాగరాజ నగరంగా పిలువబడుతున్న ప్రాంతం ఆ రోజుల్లో యిన్నీసుపేట - ఆ పేటలో చల్లపల్లి వారి వీధిలో కోలవెన్నువారి యింట్లో సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఒక వాటలో అద్దెకుండేవారు, ఆయన, ఆయన భార్య సీతమ్మగారున్నూ మా అక్కగారు ప్రక్కవాటాలో ఉండడంవల్ల వారిని చూడడానికి నేను కాకినాడ నుంచి వచ్చినప్పుడల్లా ఆయనతో కించిత్ పరిచయం ఏర్పడి, సాహిత్యం పట్ల నాకున్న అభిరుచిని వ్యక్తం చేస్తూండే వాణ్ణి. మా అక్క అంటే ఆయనకు చాల

అభిమానం. 'అమ్మాయి' అని పిలుస్తూ, ఆప్యాయతతో ఎప్పుడూ పలకరిస్తూండేవారు. ఆయనకు పిల్లలు లేరు. కాని ఆడపిల్లలంటే మక్కువ ఎక్కువ. అందుకనే, ఆయన బావమరిదిగారి కూతురు చిరంజీవి బాలశ్రీని అభిమానపుత్రికగా పెంచుతుండేవారు. ఆ అమ్మాయికి స్థాయికి తగ్గట్టు వివాహం చేయాలని, ఆమెకు ఎక్కువగా చదువు అబ్బకపోవడంవల్ల, సంగీతం నేర్పించాలని ఫిడేలు ఒకటి కొన్నారు, ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే, అప్పటికి ఆయనకి షష్ఠిపూర్తి జరిగినా, ఆమెతోపాటు ఆయన కూడా ఫిడేలు పై సాధన చేస్తూ సంగీతం అభ్యసించేవారు. చుట్టుప్రక్కలవారు కించిత్ నవ్వుకుంటున్నా ఆయన ఏమీ లెక్క చేసేవారు కారు.

ప్రతి రాత్రి భోజనానంతరం అరుగుమీద పచార్లు చేస్తూండేవారు. తనలోతానే ఏదో అనుకునేవారు. ప్రక్క అరుగుమీద కూర్చునే నేను ధ్యాన్య శ్లోకా లేవో పఠించుకుంటున్నారు అనుకునేవాణ్ణి. కాని తర్వాత తెలిసింది, ఆయన మర్నాడు ఉదయం సాపు రాసే కథలో సంభాషణలో, మాటలో మనస్సులోనే ' రిహార్సల్ చేసుకునేవారని. ఆ రోజుల్లో 'బాల్‌పెన్' లు యింకారాలేదు ఊటకలాలు (Fountain Pen) ఉన్నా ఆయన కలం సిరాబుడ్డి మాత్రమే ఉపయోగించేవారు. చాపపరుచుకుని క్రిందనే కూర్చుని, ఎదురుగా కరణం డెస్క్ వంటి చిన్న స్లోపుబల్ల పై కాగితాలు పెట్టుకుని రచన సాగించేవారు. కుర్చీలు, టేబులు వంటివి ఆయన ఇంట్లోనే లేవు అప్పటికి. హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు, మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు భోజనాల తరువాత ఆ అరుగుమీద కుర్చుని శాస్త్రిగారితో ఏవేవో విషయాలు (అవి సాహిత్యానికి, రచయితలకి సంబంధించినవే ప్రధానంగా) రాత్రి 10 గంటల వరకు మాట్లాడుకునేవారు. కాని శాస్త్రిగారికి ఒక పట్టుదల ఉండేది - ఏ విషయంపైనైనా ఆయన అభిప్రాయాలకి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తులు, వైయక్తికంగా ఆయనకు శత్రువులే అన్న భావం - దీనివల్ల ఎంతో ఆత్మీయులైన చక్కని మిత్రుల్ని ఆయన దూరం చేసుకున్నారు - ముందుచెప్పిన ఆ యిరువుర్ని కూడా.

వాడుకభాషనే ఆరాధించి, దానికి పరిపుష్టిని, ప్రచారాన్ని, ఉజ్జ్వలతని సమకూర్చిన శ్రీ శాస్త్రిగారు, ' నన్నయ్య జయంతి' ఉత్సవాలు నిర్వహించేవారు. అప్పుడు రాజమండ్రిలో సభాస్థలాలు ఎక్కువగా లేవు. ఈ వీరేశలింగ పురమందిర ప్రాంతంలో ఉన్న ' తిరుపతి రాయ కాంగ్రెస్ భవనం' ఆయన సభలకు స్థలం.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ గడియారం వేంకటశాస్త్రిగారు, శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు మొదలైన ప్రఖ్యాత సాహితీవేత్తలందరిని ఆహ్వానించి, ఆతిధ్య మర్యాదలు చేసేవారు. ఆయన దగ్గర డబ్బు ఎక్కువ ఉండక పోవడంవల్ల భోజనం వగైరా ఆతిధ్యాలకు శ్రీకొల్లూరి సూర్యప్రకాశరావుగారు, శ్రీ ముక్కవిల్లి సూర్యనారాయణగారు (ఈ యిద్దరు ప్లీడర్లు), శ్రీ రావులవర్తి సూర్యనారాయణగారు (బ్యాంకు ఉద్యోగి) మొదలైన దాతల్ని అభ్యర్థించేవారు. సమయ పాలన, ప్రకటించిన విధంగా సభ జరపడం చాలా కచ్చితంగా నెరవేర్చేవారు. మనం ఈ నాడు అనుకునే 'డిసిప్లిన్' ఆయనకు స్వావలంబన.

'ఖాది, గాంధీ, హింది' అంటే ఆయనకుండే చులకన భావం, మొదట్లో చాలా అహేతుకంగా, వ్యక్తిగత వైపరీత్యంగా గోచరించినా, కొన్ని సంఘటనలు, దేశంలోని రాజకీయ పరిస్థితుల దుష్పరిణామాల దృష్ట్యా, ఆయన అభిప్రాయాలు కొంతవరకు ఆదరణీయం, ఆమోద యోగ్యమేమో ననిపిస్తుంది.

ఏ రోజానైనా వంటకాలలో కూరలు లేకపోతే ఆయన యేమీ యిబ్బంది పడేవారు కారు. వేడివేడి అన్నంలో నెయ్యి వేసుకొని, ఆవకాయ కలుపుకొని చాలా తృప్తిగా భోజనం చేసేవారు శ్రీశాస్త్రిగారు. ఆయనకు పిల్లలుకాని, సహాయకులు కాని ఎవ్వరూ లేకపోవటంవల్ల బజారునుంచి వెచ్చాల దగ్గర నుంచి అన్నీ స్వయంగా తెచ్చుకోవలసివచ్చేది.

1953 ఆగష్టు 15వ తేదీన గోదావరి వరదవల్ల యినీసుపేటలో మాయిళ్ళల్లోకి కూడా నీరు చొచ్చుకొని వచ్చింది. శాస్త్రిగారి ఆస్థి - ఆయన బీరువాలలో భద్రపరచుకున్న ఆయన రచనల ప్రతులు మాత్రమే. నేను మేడమీద వాటలో ఉంటూండే వాణ్ణి. నీరు ఎక్కువగా వస్తుందనే భయంతో ఆయన, సీతమ్మగారు, మా అమ్మా ఆయన పుస్తకాలన్నిటిని మా మేడమీద హాలులోకి తరలించి కాపాడారు. వరదబాధ తగ్గిన తరువాత ఆయన పుస్తకాలన్నిటిని మళ్లీ బీరువాలలో సర్దుకున్నారు, మాకు అపారమైన కృతజ్ఞత చూపుతూ.

చివరి రోజుల్లో ఆయన శ్రీబులుసు సీతారామశాస్త్రిగారింట్లో ఉండేవారు. 1961 ఫిబ్రవరి మొదటివారంలో మామరదలి పెళ్ళి ముగ్గుళ్ళ గ్రామంలో జరిగింది. మా అత్తవారు శ్రీపాదవారే కావడంవల్ల, బంధుత్వరీత్యా ఆయన కూడా పెళ్ళికి వచ్చారు.

భోజనాలు కొంచెం ఆలస్యమవడంవల్ల, ఆయనకు నీరసం వచ్చిందనుకున్నాను. చేతులు కడుక్కునేందుకు నూతి వరకు వెళ్ళ వలసివచ్చింది. అక్కడే ఆయన తూలిపోబోతుంటే, నేను ఆసరాగా వెళ్ళబోయాను. ఆయన 'అక్కర్లేదు' అంటూ నూతిగోడకి అనుకొని సముదాయించుకున్నారు. అప్పటికే ఆయనలో రుగ్మత ఏదో ప్రవేశించిందని ఊహించాము. తర్వాత రెండు వారాలకి ఆయన భోజనం చేసి, పట్టుపంచె విప్పి మరో పంచకట్టుకుంటూ స్పృహకోల్పోయినట్లు, తర్వాత రెండు మూడు రోజులు అలాగే విగతస్పృహులుగా ఉన్నట్లు, తర్వాత స్వర్గస్థులైనట్లు తెలిసికొని దు:ఖించాము.

'వాడుక మాటల మేటి, కథక చక్రవర్తి, వైయక్తికంగా తిక్కబ్రహ్మ, ఆత్మప్రత్యయ దురంధరుడు శ్రీశాస్త్రిగారి చివరిమాటలు ఏమో ఇప్పటికీ మనకి తెలియవు.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పోవడంవల్ల తెలుగు సాహిత్యానికి ఎంత లోటువచ్చిందో, మనమంతా ఎంత దిక్కుమాలినవాళ్ళం అయిపోయామో ఈ తరం యువతకు తెలియదు. అచ్చమైన, సుందరమైన తెలుగు భాషలోని తియ్యదనాన్నంతా తన వాడుక భాషా రచనల్లో తెలుగు వారందరికి మరిచిపోని విధంగా రుచి చూపించిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వంటి రచయిత మనకి మళ్ళీ వస్తారన్న నమ్మకం నాకు లేదు. ఇంగ్లీషు నేర్పమని నన్ను అడిగారు ఆయన. ఆంగ్లంలో ఆయనకు గురువు అని నేను చెప్పుకోగలిగే భాగ్యం నాకు లేకుండా చేసారు. ఆయన వక్తృత్వాన్ని గురించి, ఆయన రచనల గురించి చెప్పాలంటే ఇటువంటి చిన్న ప్రసంగంలో సాధ్యం కాదు, సందర్భమూకాదు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శ్రీమల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఎప్పటికీ ఆరాధ్యులే. వారి రచనలు ఎప్పటికీ రసగుళికలే!

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రిగారికి నమస్కృతులు.

అడ్వకేట్, గాంధీ పార్క్ వెనుకవీధి,
దానవాయిపేట, రాజమహేంద్రి.
ఫోన్ : 0883 - 2475808

వ్యాఖ్యానం అవసరం

- డాక్టర్ కాళీపట్నం రామారావు

గురజాడ అప్పారావు గారి తరువాత తెలుగు కథానికకు రూపుదిద్దిన తెలుగు కథకులు చాలా మందే ఉన్నారు. వారిలో అతిముఖ్యులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారూ, గుడిపాటి వెంకటాచలం గారూ, కొడవటిగంటి కుటుంబరావుగారూ. వీరు తరతరాల రచయితలకే కాక పాఠకులకు కూడా గురుస్థానీయులు కావడం వీరి ప్రత్యేకత.

తమతమ రచనలకు ప్రామాణికత ప్రయోజనాల విషయంలో ముగ్గురిదీ ఒకేబాట. రచన వెంట పాఠకుణ్ణి దౌడు తీయించడంలోనూ ముగ్గురూ సమ ఉజ్జీలే. అయితే - చలాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, కొన్ని ఘట్టాల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం, పాశ్చాత్య రచయితల భావధారా తెలిసి ఉండాలి. శ్రీపాదవారిని అర్థం చేసుకోవడానికి సంస్కృతం, తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలతో సన్నిహిత పరిచయం అవసరమవుతాయి. కుటుంబరావు గారి విషయంలో ఈ రకం అవరోధాలు చాలా తక్కువ.

శ్రీపాదవారు 1891లో పుట్టారు. చలం 1894లో పుట్టారు. కుటుంబరావు 1909లో ముగ్గురూ దాదాపు సమకాలికులే అనుకున్నా వారివారి పుట్టుక పెంపకాల నేపథ్యాల్లో తేడా లున్నాయి.

తక్కిన ఇద్దరివిలా కాకుండా శ్రీపాదవారిది నైష్ఠిక బ్రాహ్మణకుటుంబం. పండితవంశం. జ్యోతిషాది శాస్త్రాలతో ముడిపడిన కుటుంబం. అలాంటి కుటుంబంలో పుట్టిన శాస్త్రి గారు తమనాటి ఆధునికతకేసి ఎంత ముందడుగు వేసినా భాషవిషయంలో, జాతీయ సంస్కృతి పట్ల గౌరవ విషయంలో, ముఖ్యంగా తెలుగునాట గ్రామీణ సంస్కృతి పట్ల తమ ప్రేమ విషయంలో తమ భావజాలం నుండి పూర్తిగా బయటపడలేక పోయారు.

వారి అనుభవాలూ - జ్ఞాపకాలూనూ తెరిస్తే మొదటి సంపుటంలో 70 ప్రకరణాలు. ఉపక్రమణికలోనే చాలామందిని అడ్డుకునే పదాలు నన్ను ఆలోచనలో పడేసిన పదాలూ చూడండి.

తమ అనుభవాలూ జ్ఞాపకాలూ అక్షరబద్ధం చేయించడంలో వారి మీమాంస గురించి చెపుతూ 'వారందినాలు గడిచేప్పటికి స్థాయీభావం యేర్పడిపోయింది' అంటారు.

'స్థాయీభావం' అంటే? ఇది నవరసాల గురించిన చర్చలో వినపడే పదం అని నాకు జ్ఞాపకం. ఆనాడే నాకు అర్థం కానిది.

తర్వాతి పేజీలో -

'అస్థిగతమైన జ్ఞాపకాల' నీ 'దీక్షాకంకణ ధారులైన కళాతపస్వుల' నీ ప్రయోగాలొస్తాయి.

ప్రయోగ సందర్భాన్ని బట్టి వాటిని మరపురాని జ్ఞాపకాలుగానూ, పట్టుదలతో కృషి చేసే కళారాధకులనీ అర్థం చేసుకోవచ్చు. కానీ చర్మగతాలూ మాంసగతాలూ అస్తిగతాలను గూర్చిన వ్యాఖ్య సహాయంతో అస్థిగతపదం అర్థం తెలిస్తే ఆ పదప్రయోగంలోని సార్థకత లేదా విశిష్ఠత తెలుస్తుంది.

అలానే దీక్షాకంకణమంటే ఏమిటి? దాని ధారణ ఎవరు ఎప్పుడు ఎందుకు చేస్తారు? అన్న వివరాలు తెలిస్తే ఆ ప్రయోగం విశిష్టత తెలుస్తుంది.

ఆ తర్వాత వచ్చే అరడజను పేజీల్లో ఏతావతా, ప్రాప్యం, గ్రహణపరాయణత, వేత్తృత, నికషము, ప్రవర్తమానం, స్వప్నావస్థ, సుషుప్త్యావస్థ, బ్రహ్మవిద్యోపాసన, పాకృతదృష్టి ప్రతీక్ష, ప్రౌఢిమ, బాధావిప్లావితాలు, ఏవంచ, మారాకు, నవనవోన్మేషం, భౌతికదృష్టి పూచీగల, శిఖరాయమానం, కుశాగ్రసూక్ష్మం, ఆత్మప్రత్యయం లాంటి పదాలు శ్రద్ధాళువులైన పాఠకులకు అడ్డుతగులుతూంటాయి.

కొన్నింటి అర్థాలు సందర్భాన్ని బట్టి మరికొన్ని శబ్దరత్నాకరంలాంటి కోశాలను తిరగేసి ఎవరికివారు తెలుసుకోవచ్చు. మరికొన్నింటి అర్థాలకోసం మాత్రం సంస్కృతం తెలిసినవారిని అడగవలసిందే.

మూడవ అధ్యాయంలో ప్రవేశించేటప్పటికి కులవిద్యల ప్రస్తావనతో ఆ అధ్యాయం ఆరంభమవుతుంది. వేదమూ శ్రౌతమూ స్మార్తమూ జ్యోతిశ్శాస్త్రమూ

మంత్రశాస్త్రమూ, వీటి సమ్యగ్భోధకు సాహిత్య విద్యా మా కులవిద్యలు' అంటారు మొదటి వాక్యంగా.

'కులవిద్యలు' అంటే? 'మాకులవిద్యలు' అంటే? అవి వాళ్ళ కుటుంబానికి సంబంధించినవో వంశానికి సంబంధించినవో అనా? లేదా మొత్తం బ్రాహ్మణ్యానివనా?

మా ఇళ్ళల్లో రాత్రుళ్ళు అన్నంతింటూ ఉండగా తుమ్మితే పక్కనున్న పెద్దవాళ్ళు నెత్తిమీద నీళ్లుచల్లి దీవిస్తూ నువ్వెక్కడ పుట్టేవు? మీ దేవుడి పేరేమిటి? అంటూ అడుగుతారు. ఒక కుటుంబం వారైతే వెంకటరమణుడనీ వేరే కుటుంబాలవాళ్లైతే జగన్నాథస్వామి అనీ ఇలా వేర్వేరు పేర్లు చెపుతారు. అవి వారి వారి కుటుంబదైవాల పేర్లు. ఇంకొక మాటలో కులదేవతలు. ఆక్రమంలోనే కులవిద్యలు పదాన్ని అర్థం చేసుకోవాలి.

తరువాత 'యజ్ఞయాగాది వైదిక కర్మానుష్ఠానం అనూచాన సంపత్తి'ట. 'అనూచాన సంపత్తి' అంటే? తరతరాల సంపద.

విద్యను 'యిత్రిశీగా నేరుస్తా'రట. వారి నాయనగారు వారికి 'స్మార్తం' అంతా చెప్పేరట. 'శ్రౌతంలో **ఔద్గాత్రమూ దర్శపూర్ణమాసాలూ'** చెప్పారు. తర్వాత **'పరాయతం' చెప్పించారట.** 'పాదుకాంతదీక్ష' యివ్వడానికి మరికొన్నాళ్లు **పోవాలన్నారట.** ఈ చదువులన్నింటి గురించి ఎవరో వివరిస్తే గానీ బోధపడేవి కావు.

తర్వాత ఆయన విద్యలన్నీ విడిచిపెట్టేశారట. అదీ ప్రయత్నపూర్వకంగా, కొత్తదారి తొక్కారు. చాలా ముందుకిన్ని వెళ్ళిపోయారు. అయినా **'అహమస్మి'** అంటూ నలుగురిలోనూ తల యెత్తుకునే తిరగ్గలుగుతున్నారట. మేరలేని ఆత్మానందమూ అనుభవించగలుగుతున్నారట. అలా గర్వంగా చెప్పుకున్నారు.

ఎందుచేతా అంటే తెలుగులో వొక రచయిత కాగలిగినందుకుట.

తెలుగుభాషలో ఆయన చాలా రాశారు. నవలలు రాశారు. నాటకాలు రాశారు. ఎన్నో వ్యాసాలు రాశారు. విమర్శలు చేశారు. 'ప్రబుద్ధాంధ్ర' అనే సాహిత్య పత్రిక నడిపి దానిలో తన రచనలే కాక ఎందరివో ఎన్నో శ్రేష్ఠమైన రచనలు ప్రచురించారు. ఆయుర్వేదం గురించి రాశారు. ఎన్నిరాసినా ఆయనకు ఎనలేని కీర్తి తెచ్చిపెట్టినవీ, పదికాలాలు నిలిచేవీ ఆయన రాసిన కథలే.

అయితే ఆ కథలు కూడా తగు వ్యాఖ్యానాలుంటే తప్ప సొంతంగా అర్థం కావు.

ఆయన తన కథలకు పెట్టిన పేర్లను చూడండి.

'కీలెరిగిన వాత' - కీలెరిగిన వాతేఁవిటీ? వాత అంటే చురక. మా చిన్నప్పుడు ఎర్రగా కాల్చిన పొగచుట్టతోనో, కుంపట్లో కాల్చిన కుదురుతోనో కొన్నిసార్లు రోగాలను నయం చేయడానికీ, మరికొన్ని సార్లు రోగాలు రాకుండానూ వాతలు పెట్టేవారు. నేను పురుటిబిడ్డగా ఉండగా మా అమ్మమ్మ గారు నా పొత్తికడుపు మీద పెట్టించిన వాతలు ఇప్పటికీ ఉన్నాయి. కారణం అడిగితే **'అజీర్తి రాకుండా'** అంది మా అమ్మ.

అదీ 'కీలెరిగిన వాత ' కథకి ఆపేరు పెట్టడంవెనక కథ.

మరోకథ పేరు ' గూడుమారిన కొత్తరికం ' అంటే పిల్ల అత్తారింటికెళ్లిన కొత్తల్లో.

ఇంకో కథ పేరు ' ఏ-క్ష-డా లంగ రందదు ' లంగరంటే స్టీమర్లలోను బోట్లలోనూ నీట స్థిరంగా నిలపడానికి వాడే ఉపకరణం. అది భూమిని తాకాలి. కథ ఇద్దరు యువతీయువకుల ప్రేమకథ. ఇద్దరి స్వభావాలూ కలియకపోవడం వల్ల వారు విడిపోవడం.

మరికొన్ని కథలకు పెట్టినపేర్లు - శుభికే శిర ఆరోహ, కన్యాకాలే యత్నా ద్వరితా, యావజ్జీవం హోష్యామి, షట్కర్మ యుక్తా, అపిదళతి వజ్రస్య హృదయం. సంస్కృతపండితుల సహాయంతో తప్ప వీటిని అర్థం చేసుకోలేం.

ఇలాంటి తవ్వాయి వస్తే ప్రత్యక్ష శయ్య, వెలిపెడితే అల్లుడైనాడు. అరికాళ్లకింద మంటలు, తాపీమేస్త్రీ రామదీక్షితులు బి.ఎ. - ఇలాంటి పేర్లన్నీ అర్థం అయీ అవకుండా ఉంటాయి. ఆ కథలు చదవేక అవి ఎంతటి సరియైన పేర్లో గ్రహించి పాఠకులు పరమానందపడతారు. ఆయన పెట్టిన ఏ కథపేరూ పాఠకులు మరువలేరు.

వారి కథల్లోకెల్లా పేరువోసింది వడ్లగింజలు. గొప్పనాటకీయత, అపురూపమైన పాత్రచిత్రణ, అద్భుతమైన క్రమోన్మీలనం, క్షణ క్షణం పెరిగే ఉత్కంఠ, అబ్బురపరిచే మరపురాని ముగింపు , ఆనందహేలలో ముంచే భరతవాక్యం. ఎన్నిసార్లు చదివినా మళ్ళా మళ్లా చదివేలా చేస్తాయి. అయితే అన్నిసార్లు చదివినా చాలా పదాలకి అర్థం ఊహించుకోవడమే తప్ప విశదం కావు.

వ్యాఖ్యానించదగినవీ, వ్యాఖ్యానాన్ని అపేక్షించేవీ ఇందులో చాలా ఉంటాయి. ఈ కథలోనే కాదు తక్కినవాటిలో కూడా ఇన్ని కాకపోయినా ఇటువంటి ఎన్నో కొన్ని ఉంటాయి.

ఏవో భగవద్గీతకో శాకుంతలాది నాటకాలకో మహాకావ్యాలకో వ్యాఖ్యానాలు అవసరం కావచ్చు. కానీ నిన్న మొన్న పుట్టిన కథలకు కూడా వ్యాఖ్యానాలా ?

ప్రశ్న సహేతుకంగానే కనిపిస్తుంది.

కానీ -

ఈ కథలు పుట్టినకాలంలోనే కావ్యాలు సృజించగలిగిన మహానుభావులు మల్లాది రామకృష్ణశాస్త్రిగారూ మొదలైన వారెందరో కథారచనకు బాటలువేశారు. ఎందుచేతా ? వారు దేశకాలావసరాలను గుర్తించగలిగిన ద్రష్టలవడంచేత.

నాటి ద్రష్టల విశిష్టత ఎటువంటిదంటే...

ఈనాటి వారి పాఠకలోకాన్ని ముంచెత్తుతున్న స్త్రీవాద, దళితవాద, ప్రాంతీయాభిమాన మైనారిటీవాద మానవతావాదాలన్నింటికీ బీజాలనదగ్గ కథలు 1920, 30 దశకాల్లోనే రావడం. ముఖ్యంగా శ్రీపాదవారి నుండి జాలువారడం.

అయితే అవన్నీ ఆనాటి పాఠకులకోసం వారు రాసినవి. ఆ పాఠకులు తీరికవర్గాలకు, ఉన్నత కులాలకు చెందినవారు, విద్యావంతులు.

ఈనాటికి అక్షరాస్యత బాగా పెరిగింది. సమస్తకులాల నుండీ విద్యావంతులు, ఉన్నత విద్యావంతులు, కవులు, రచయితలు ఆవిర్భవిస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకునేవారి నుండి సంపన్నులదాకా పుస్తకాలు చదివే ఆసక్తి పెంచుకుంటున్నారు. ఈ కొత్తపాఠక వర్గం ఆనాటి రచనలను తమకు తాముగా అవగతం చేసుకోవడంలో ఇబ్బందులు సహజం. ఏ కాస్త ఆలోచించినా ఊహకందుతాయి.

అందుకే మల్లాది, శ్రీపాదవంటివారి రచనలకు వ్యాఖ్యలు అవసరమని నా కనిపించడం.

ఆ వ్యాఖ్యలు కూడా వీలైనంత తొందరలో సమకూర్చుకోవడం మంచిది.

ఏమంటారా ? తెలుగుభాష భవిష్యత్తు గురించి వినిపిస్తున్న హెచ్చరికలూ మనవారి భయాలూ మనందరం ఎరుగుదుం.

ఉన్న అవకాశాలను కాలం కబళించకముందే మనం తొందరపడాలి.

కథా నిలయం, గ్రామీణ బ్యాంక్ 'ఎ' కోలనీ,
సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్, శ్రీకాకుళం - 532 001
ఫోన్ : (08942) 650728, సెల్ 94405 78506

శ్రీపాద జీవితం - సాహిత్యం

సంస్కృతాంధ్ర భాషలు తప్ప ఇతర భాషాసాహిత్యాల పరిచయం ఏమీ లేకుండా, తెలుగులో ' అసలు-సిసలు ' తెలుగు కథలు వ్రాసిన ఘనత స్వర్గీయ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి దక్కుతుంది. తన తెలుగు వారే తెనుగును చిన్నచూపు చూడడం గమనించి, ఎంతో ఆవేదన చెంది తెలుగువారి సర్వతోముఖాభ్యుదయం కాంక్షించి, చిన్న కథల ద్వారా జాతీయభావ పరివర్తన సాధించదలచి తెలుగువారి కథలే వ్రాసి, తన తెలుగుజాతికి సమర్పించిన కథారచయిత శ్రీపాద. చిన్నకథలే జీవిత సర్వస్వంగా భావించి. కథారచనకే జీవితాన్ని మీదు కట్టిన గౌతమీ కథకుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి.

శాస్త్రిగారు ఖర సంవత్సర చైత్రశుద్ధ చతుర్థశీ గురువారం (23-4-1891) తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా పొలమూరు గ్రామంలో ఒక మధ్య తరగతి వైదిక పండిత కుటుంబంలో జన్మించారు. తండ్రి శ్రీలక్ష్మీపతి సోమయాజులు, తల్లి మహలక్ష్మి సోదెమ్మ. సోమయాజులు గారి పురుష సంతానంలో శాస్త్రిగారు మూడవవారు. శ్రీ లక్ష్మీపతి సోమయాజులుగారు వేదం అశీతిద్వయమూ, శ్రౌతం కాండత్రయమూ, జ్యోతిషం స్కంధత్రయమూ క్షుణ్ణంగా అభ్యసించిన పండితులు. స్మార్తంలో వారు రెండవ ఆపస్తంబులు, ధర్మశాస్త్రంలో పారంగతులు, మంత్రశాస్త్రంలో పాదుకాంత దీక్షాపరులు. .

సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి ఏడవయేట ఉపనయనం జరిగింది. మూడవ తరగతి చదువుతూండగా, కులవిద్యలు బాగా అబ్బాలనే దృష్టితో, శాస్త్రిగారిని తండ్రి బడిచదువు మాన్పించి వైదికవిద్యలో ప్రవేశపెట్టారు. మేనమామ కుమార్తె సీతమ్మతో శాస్త్రిగారికి 12వయేట వివాహం అయింది. పెళ్ళినాటికి స్మార్తం పూర్తి అయింది శాస్త్రిగారికి.

కాలాన్నిబట్టి సాహిత్యమూ,జ్యోతిషమూ, శ్రౌతంలో కొంతా తండ్రిగారివద్ద చెప్పుకున్నారు. కావ్యపాఠం పెద్దన్నగారి దగ్గర చదివేరు. పెద్దన్నగారికి శాస్త్రిగారంటే ఎంతో ప్రేమ.

శాస్త్రిగారికి ఇంగ్లీషు చదువుకోవాలనే కోరికవున్నా, స్వధర్మ భ్రంశం తటస్థిస్తుందనే భయంతో తండ్రి అంగీకరించలేదు. వారాలు చేసుకుంటూ వల్లూరు, వేట్లపాలెం గ్రామాలలో శ్రీగుంటూరి సీతారామశాస్త్రిగారి దగ్గర, శ్రీదర్భా బైరాగిశాస్త్రిగారి దగ్గర సంస్కృత కావ్యాలు, కానూరు అగ్రహారంలో శ్రీ ప్రవా పర్వతావధానులుగారి దగ్గర 'పరాయితం' చెప్పుకున్నారు. తెలుగుకావ్యాలు చదవడం, తెలుగులో కవిత్వం అల్లడం - ఈ రెండూ 'కులం చెడడం' గా తండ్రీ, చిన్నన్నగారూ పరిగణించడంతో, గురువులు నిషేధించడంతో - 'నా తెలుగు నే నెందుకు చదవక పోవాలి?' అని ఆవేదన కలిగింది శాస్త్రిగారికి.

తెలుగువారే తెలుగు గ్రంథాలను నిరసించడంతో, ఏమైనా తెలుగు గ్రంథాలు చదవాలనీ, తెలుగులో 'గజం ఎత్తు' పుస్తకాలు వ్రాయాలనీ పట్టుదల కలిగింది. తాను విన్న కథల ఆధారంగా చక్కని కథలు కల్పించాలనీ, రసవంతంగా చెప్పాలనీ కోరిక కలిగింది. వల్లూరులో సంస్కృతకావ్యాలు చదివేరోజుల్లో ఒక వృద్ధవితంతువు కోరగా 'మదనకామరాజు కథలు' చదివి వినిపించవలసి వచ్చింది. దానితో చిన్నతనంలోనే కథాభిరుచి కలిగింది. ఆ అభిరుచే తరువాత శాస్త్రిగారిని కథారచనవైపు మళ్ళించింది.

'వసుచరిత్ర' చదివి, వచనంలో ఉన్న సౌలభ్యం పద్యంలో లేదని గుర్తించారు. పదిహేనవయేట వేట్లపాలెంలో చదువుకునేటప్పుడు అరేబియన్ నైట్స్, శుకసప్తతి కథలు చదువుతూ రహస్యంగా కథలు వ్రాయసాగారు. తెలుగులో రచన చేస్తున్నందుకు గురువుగారు మందలించడంతోపాటు, మరికొన్ని కారణాల వల్ల చదువు పూర్తికాకుండానే ఇంటికి తిరిగివచ్చారు.

పెద్దన్నగారి ప్రోత్సాహంతో నన్నయభారతం చదవసాగారు. వీరేశలింగం పంతులు గారి కవుల చరిత్ర మూడవభాగం చదివేక శాస్త్రిగారికి తమ కుల విద్యల మీద నిరసనభావం పుట్టింది. పంతులుగారి ఉపన్యాసాలు చదివినమీదట అది మరింత బలపడింది. అప్పుడే ఒకరి చేతిలో ఒక ఇంగ్లీషునవలను చూసి, ఆ నవలారచయిత అటువంటి ఎన్నో నవలలు వ్రాసిన సంగతి తెలుసుకుని, "మనం గజంఎత్తు పుస్తకాలు

రచించాలి " అని దృఢంగా సంకల్పించుకున్నారు. పంచాంగరచన చేయమనేవారు తండ్రి. తెలుగులో అభ్యాసరచనలను మానిపించాలని చిన్నన్నగారు ప్రయత్నించికొద్దీ, తన కవితారచనకు ఆటంకా లేర్పడడంతో ప్రతీకారం ప్రారంభించారు శాస్త్రిగారు. వీరేశలింగంపంతులుగారి ఉపన్యాసాలు 'శుద్ధప్రచ్ఛన్న బ్రహ్మసామాజికు' నిగా మార్చివేశాయి శాస్త్రిగారిని. పెద్దలను ఎదిరించే స్వాతంత్ర్యంకాని, సత్తాకాని లేవు.

17వ యేట భార్య కాపురానికి వచ్చింది. శ్రీ మంత్రిప్రగడ భుజంగరావు పంతులుగారి 'వారకాంత ' చాటు ప్రబంధం చదివి దానిని నాటకంగా మార్చి వ్రాసి, రాయవరంలోని మిత్రులు మల్లిడి సత్తిరెడ్డిగారి సాయంతో వారి ప్రెస్‌లో ఆనాటకం 1909లో ప్రకటించారు. ముద్రితమైన శాస్త్రిగారి తొలిరచన అది. ఛందస్సు నేర్చి పద్యరచన ప్రారంభించారు. మిత్రులతో కలిసి 'కలాభివర్ధనీ పరిషత్తు ' అనే నాటకసమాజాన్ని స్థాపించి నాటకాలు ప్రదర్శించారు. కొన్ని నాటకాలలో వేషధారణ చేసి ప్రేక్షకుల అభిమానాన్ని కూడా చూరగొన్నారు. కొంతకాలం సంగీతసాధన కూడా చేశారు.

గురుముఖతః సాహిత్యవిద్య నేర్వాలని పిఠాపురం సంస్థానకవులైన శ్రీవేంకటరామకృష్ణకవుల నాశ్రయించారు. అష్టావధాన మర్మాలను అక్కడే తెలుసుకుని, తరువాత కొన్నాళ్ళు అష్టావధానాలు చేస్తూ దేశం తిరిగారు. పిఠాపురంలో గురువులు శాస్త్రిగారి దృష్టిని పద్యరచన నుంచి వచన రచనకు మళ్ళించారు. వచన రచనే శాస్త్రిగారి జీవితానికి వెలుగిచ్చింది.

1913లో రామదేవ విజయము, సాహసిక రాజపుత్రము అనే చారిత్రక నాటకాలు, 'పాణిగృహీతా శ్రవణానందశృంఖల' అనే విమర్శగ్రంథము, గీత మంజరి, మోహలేఖ, జలక్రీడ - అనే ఖండవాక్యాలు ప్రకటించారు. శాస్త్రిగారి తొలినవల 'మిథునానురాగము' (1914), 'వీరపూజ ' అనే చరిత్ర గ్రంథాన్ని మద్రాసువెళ్ళి కాశీనాథుని నాగేశ్వరరావుగారి సాయంతో 1915లో అచ్చువేయించారు. ' శ్మశాన వాటిక ' (1917), అనాథబాలిక (1924), రక్షాబంధనము (1925) మొదలైన నవలలు, 'మహాభక్త విజయము (1918), మర్యాదరామన్న కథలవంటి చిన్నచిన్న పుస్తకాలను ఇరవైకి పైగా ప్రచురించారు.

మద్రాసులో ఉండగా, ఆంధ్రపత్రికలో పనిచేసే కోటంరాజు పున్నయ్యగారి ప్రేరణతో శాస్త్రిగారు ఒక గంట వ్యవధిలో 'ఇరువుర మొక్కచోటికే పోదము' అనే తమ మొదటి చిన్నకథ వ్రాసి (1915) ఆంధ్రపత్రికలో ప్రచురించారు.

1917లో ఆయుర్వేదౌషధాలు తయారుచేసి 'గంధర్వ ఫార్మసీ ' పేరిట మందుల వ్యాపారం చేశారు. అప్పుడే ' పండిత ' బిరుదు పెట్టుకున్నారు. 1920లో కాశికీప్రెస్‌ను ప్రారంభించి (రాయవరంలో) 'ప్రబుద్ధాంధ్ర' పక్షపత్రికను సంస్కృతాంధ్ర భాషలలో ప్రచురించారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవగా ప్రెస్‌ను అమ్మివేసి 'ప్రబుద్ధాంధ్ర'ను మాసపత్రికగా మార్చి రాజమండ్రి తరలించారు. ఆపత్రిక మధ్యమధ్య నిలిచిపోతూ 1939 సెప్టెంబరువరకూ నడిచింది.

రాయవరంలో మల్లిడి సత్తిరెడ్డిగారి 'రెడ్డిరాణి' పత్రికకు కొన్నాళ్ళు సాయపడ్డారు. రాజమండ్రి చేరిన తరువాత మరొకరిపేర 'అభ్యుదయ ' మాసపత్రిక స్థాపించి రెండునెలలు తామే నడిపారు. తిరిగి 'ప్రబుద్ధాంధ్ర ' పత్రికను, గంధర్వ ఫార్మసీని కలాభివర్ధనీ పరిషత్తును రాజమండ్రిలో నడిపిస్తూ అక్కడే స్థిరపడ్డారు.

శాస్త్రిగారి ఏకపుత్రిక చిన్నవయసులోనే చనిపోయింది. ప్రబుద్ధాంధ్ర పద్యరచనలు ప్రకటించడం మానివేసి వచనరచనలే ప్రచురించింది. హిందీవల్ల తెలుక్కి జరుగుతూన్న అపకారం ' శీర్షికతో ఆనాటి హిందీ ప్రచారకుల అతిధోరణిని శాస్త్రిగారు తమ పత్రికలో తీవ్రంగా ఖండించారు. జాతీయోద్యమంలో అంతర్భాగంగా నడచిన నాటి ఖద్దరు ఉద్యమాన్ని తూర్పార బట్టారు. ' గంధర్వ ఫార్మసీ ' మందుల షాపును కూడ మూసి వేశారు. తమ బావమరది కంభంపాటి అప్పన్న శాస్త్రిగారి కుమార్తెను పెంచి, పెద్దచేసి పెండ్లిచేసి కుమార్తెలేని లోటు తీర్చుకున్నారు. కొన్నాళ్ళు శ్రీ శిష్టు సర్వశాస్త్రిగారి దగ్గర ఫిడేలు నేర్చుకున్నారు.

రాజరాజు. కలంపోటు, నిగళబంధనం, టీపార్టీ (రూపికలు) నాటక నాటికా రచయితగా శ్రీపాదవారి కీర్తిని చాటే రచనలు. గ్రాంథికవాదులైన శ్రీ విక్రమ దేవవర్మగారు. వ్యావహారికంలో వ్రాసిన శాస్త్రిగారి 'రాజరాజు ' నాటకాన్ని అంకితం పుచ్చుకున్నారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు 'రాజరాజు' నాటకం చదివి ముగ్ధులై 'భారతి పత్రికలో వ్యాసం వ్రాశారు. 'ప్రేమపాశం' (నాటకం) ఒకటి రెండు నాటికలు ఇంకా పుస్తక రూపాన రావలసిఉన్నాయి.

శాస్త్రిగారి నవలల్లో సైకలాజికల్ నవలగా ప్రసిద్ధి పొందిన 'ఆత్మబలి' పౌరాణిక నవల 'నీలా సుందరి' పలువురు ప్రముఖుల ప్రశంసలందాయి. మూడు సంపుటాలతో అసంపూర్ణంగా నిలిచిపోయిన శాస్త్రిగారి స్వీయ చరిత్రాత్మక రచన "అనుభవాలూ జ్ఞాపకాలూనూ " తెలుగులో వెలుపడిన స్వీయచరిత్రలలో సాటిలేని రచన.

శాస్త్రిగారు రెండు వైద్యగ్రంథాలు కూడ వ్రాసి ప్రకటించారు. శ్రీమధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, శ్రీబూదూరు రామానుజాలు రెడ్డిగార్లతో కలిసి 'వసంత వాచకము' లను కూడ వ్రాశారు.

వాల్మీకి రామాయణాన్ని వాడుకభాషలో యథామూలంగా మొట్టమొదట తెలుగున అనువదించిన కీర్తి శాస్త్రిగారిది. శ్రీనివాస శిరోమణిగారి 'వాల్మీకి రామాయణం' కంటె ముందే వ్రాసినా, ప్రచురణ ఆలస్యమైంది. వ్యావహారిక భారతానువాదం అసంపూర్ణంగా నిలిచిపోగా అద్దేపల్లి అండ్‌కోవారు శ్రీపురిపండా అప్పలస్వామిగారిచే పూర్తిచేయించే ప్రయత్నం చేశారు. బాలరామాయణం, శతనీతి, స్వప్నవాసవదత్తం, చాణక్య నీతిదర్పణం, చాణక్య సూత్రం - శాస్త్రి గారి సంస్కృతానువాదాలలో కొన్ని, దేవవాణి సుభాషితాలు, ప్రశ్నోత్తర మాలిక మొదలైన కొన్ని అనువాదాలు ఇంకా పుస్తక రూపంగా రావలసి ఉన్నాయి.

1932 - 37 సంవత్సరాల మధ్య 'భారతి'లో 'శాస్త్రి' పేరుతో ప్రకటించిన 'మీగడ తరకలు' (వ్యాఖ్యలు), పద్యఖండికలు, వివిధ వ్యాసాలు, విమర్శలు, 31చిన్న కథలు, మరెన్నోరచనలు సంపుటాలుగా రావలసినవి ఉన్నాయి. 'గవేషణ' అనే పేరుతో ఒక అసంపూర్ణ నవల, మరికొన్ని రచనలు, లేఖలుకూడా ఉన్నాయి.

శాస్త్రిగారు తమగ్రంథాలు తామే అచ్చు వేయించుకుంటూ దేశం తిరుగుతూ, గ్రంథ విక్రయం చేస్తూ, పత్రికా రచనలపై వచ్చే చాలీచాలని ఆదాయంతో ఆర్థికమైన ఇబ్బంది లనుభవిస్తూ జీవయాత్ర సాగించారు. 'కలాభివర్థనీ పరిషత్తు ' పక్షాన రాజమండ్రిలో నన్నయ్య శ్రీనాథాది కవుల జయంతులు, కవిపండిత సమ్మానాలు సంగీతసభలు ఎంతో వైభవంగా నిర్వహించారు. విజయవాడలో ఆంధ్ర పతాకాన్ని ఎగురవేశారు. వారి మాటలాగే వారి కార్యప్రణాళిక కూడా సూటిగా, 'నిర్మొహమాటంగా' హుందాగా వుండేది. అన్నింటా ఆయన "అతి నిక్కచ్చి మనిషి " అభిప్రాయాలలోను, ఆచరణలోను ఆయన 'అతి స్వతంత్రులు'. ఒకరి మెప్పుకోసం కాని, స్వప్రయోజనం

కోసంకాని ఆయన తన నమ్మకాలను, విశ్వాసాలను ఎన్నడూ వదులుకోలేదు. వారు ఏ రాజకీయపక్షంతోగాని సాహిత్య సంఘంతో గాని, పరిషత్తుతోగాని సంబంధం పెట్టుకోలేదు.

శాస్త్రి, వాచస్పతి, తార్కికుడు, వసంతుడు, కుమార కవిసింహుడు, భట్టాచార్యుడు. కౌశికుడు,. అనే మారుపేర్లతో పత్రికలలో కొన్ని వ్యాఖ్యలు, విమర్శలు ప్రకటించారు.

1951 ఏప్రిల్ 22న శాస్త్రిగారికి రాజమండ్రిలో షష్టిపూర్తి, 1956 ఏప్రిల్ 25వ విశాఖపట్నంలో కనకాభిషేక సన్మానం జరిగాయి. తెలుగు కథకులలో కనకాభిషేక గౌరవం పొందిన వారు ఒక్కశాస్త్రిగారే.

ఆదిలో సరళ గ్రాంథికంలో రచనలు చేసినా, గిడుగు గురజాడల వ్యావహారిక భాషా వాదంలోని సామంజస్యాన్ని గుర్తించాక జీవితాంతం సజీవమైన వాడుకభాషలోనే రచనలను సాగించి వ్యావహారిక భాషా రచనలకు శిష్టుల ఆదరాన్ని సంపాదించి పెట్టారు.

కొంతకాలం పక్షవాతంతో బాధపడి తమ డబ్బైవయేట (25-2-1961) శాస్త్రి గారు రాజమండ్రిలో కన్ను మూశారు. వారి నిర్యాణంతో తెలుగుదేశం చిత్తశుద్ధిగల రచయితను, తన రచనలతో జాతిని ప్రబుద్ధంచేసిన సంస్కారిని, ఉత్తమ కథాశిల్పిని, భాషా సంస్కారవాదిని కోల్పోయింది.

- డా॥ చామర్తి కనకయ్య (కనక్ ప్రవాసి)

"శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి చిన్నకథలు - సమగ్ర సమీక్ష" నుంచి

స్థాపన :

23-8-1994



ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల

జవహర్‌లాల్ నెహ్రూ రోడ్, రాజమహేంద్రి - 533 103

ఫోన్ : 0883 - 2422300

(ఆంధ్రకేసరి యువజన సమితి యాజమాన్యం)

ఆంధ్ర విశ్వకళా పరిషత్ అనుబంధం

ఆనరరీ చైర్మన్

గౌ॥ శ్రీ జక్కంపూడి రామమోహనరావు

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామాత్యులు

చైర్మన్

శ్రీ తుమ్మిడి రామ్‌కుమార్

సెక్రటరీ & కరస్పాండెంట్

శ్రీమతి జక్కంపూడి విజయలక్ష్మి

వైస్ -చైర్మన్

శ్రీ జె.వి.యస్.వి. పూర్ణానందరావు

జాయింట్ సెక్రటరీ

శ్రీ డి. రాజేశ్వరరావు

ట్రెజరర్

శ్రీ శిఖాకొల్లి సీతారామంజనేయులు

ఎక్స్ అఫీషియో మెంబర్స్

వ్యవస్థాపకులు, సమితి ప్రెసిడెంట్, సమితి జనరల్ సెక్రటరీ

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీ జోగినాయుడు

నేటికీ శ్రీపాద

సుబ్రహ్మణ్యశాస్త్రి సాహితీ కృషిపై సమాలోచన

విశాఖ ఆకాశవాణి ప్రసారమాలిక

డా. కోడూరి శ్రీరామమూర్తి

డా. తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి

శ్రీ రసరాజు

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

శ్రీమతి నందుల సుశీలాదేవి

డా. వాడ్రేవు వీరలక్ష్మీదేవి

శ్రీ పున్నమరాజు నాగేశ్వరరావు

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు

శ్రీ సన్నిధానం నరసింహశర్మ

డా. పోరంకి దక్షిణామూర్తి

శ్రీ పోతుకూచి సూర్యనారాయణమూర్తి

డా. కాళీపట్నం రామరావు

శ్రీ నాగసూరి వేణుగోపాల్

ప్రచురణ

ఆంధ్రకేసరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ - రాజమహేంద్రి

చైర్మన్

వై.ఎస్. నరసింహారావు

కార్యదర్శి - కోశాధికారి

వాడ్రేవు వేంకటరమణరావు